పోతన

# భాగవతము

ముసునూరు శివరామకృష్ణారావు



1



త్యాగజీవి, సహనశీలి, స్థితప్రజ్ఞుడు అయిన మా తండ్రి

కీ॥శే॥ శ్రీ పరుచూరి భావనారాయణ చౌదరిగారి జ్ఞాపకార్థం

మైనేని సత్యవతి

హంట్స్‌విల్, అలబామా, యు.ఎస్.ఎ

పోతన

# భాగవతం 1

ముసునూరు శివరామకృష్ణారావు

పీకాక్ క్లాసిక్స్ • హైదరాబాద్

పోతన భాగవతం 1

**Pothana Bhagavatham** (First Volume),
rendered into modern Telugu prose,
published by **Peacock Classics**, publication wing of **People's Trust**


**Cover Design: Chandra**
**Graphics: Suri**

Publicatoin No: 11



© : People's Trust



294.5925



IMAGE OFFSET PRINTERS, HYDERABAD-29.


**This book is not for sale. It is a gift from Sreemathi Myneni Satyavathi in memory of her father, Late Sree Paruchuri Bhavanarayana Choudhary.**


Registered Office of People s Trust: G14, Pragathi Enclave, Bhagyanagar Colony, Kukkatpally, Hyderabad-500072. Ph. 2306 3729,
Editor: 9849940791, 6541 9522



C-16079

90640

500 144

# విషయసూచిక


ముందుమాట 6

1. ప్రథమస్కంధం 10

నారాయణుని అవతారాలు, నారద-వ్యాస సంవాదం, నారదుని జన్మ వృత్తాంతం, పరీక్షిత్తు జననం, ధర్మరాజు రాజ్యపరిత్యాగం, కలిప్రవేశం, పరీక్షిత్తుకు శాపం, పరీక్షిత్తు ప్రాయోపవేశం.

2. రెండవస్కంధం 38

శుకుడు పరీక్షిత్తుకు ముక్తిమార్గం చెప్పడం, ప్రపంచం పుట్టుక, సృష్టిక్రమం, భాగవత కథ ప్రారంభం

3. మూడవస్కంధం 54

విదురుని తీర్థయాత్ర, విదుర-మైత్రేయ సంవాదం, స్వాయంభువ మనువు జననం, హిరణ్యాక్షుడు - హిరణ్యకశిపుడు, వరాహ అవతారం, కపిలావతారం, కపిలుని తత్త్వబోధ, భక్తియోగం, నరజన్మ విశేషాలు

4. నాల్గవస్కంధం 85

దక్షుని కథ, దక్షయజ్ఞ ధ్వంసం, ధ్రువుని కథ, వేనుని చరిత్ర, పృథు చక్రవర్తి చరిత్ర, ప్రచేతసుల కథ

5. ఐదవస్కంధం 21

ప్రియవ్రతుని చరిత్ర, ఋషభావతారం, భరతుని చరిత్ర, భూగోళ స్వరూపం, ఖగోళవర్ణన, నరకలోక వర్ణన

6. ఆరవస్కంధం 44

అజామిళుని కథ, వృత్రాసురుని కథ, చిత్రకేతుని కథ, దైత్యుల జననం

# ముందుమాట

**వే**దాలసారం ఈ భాగవతం. సంస్కృతమూలం వ్యాసమహర్షి రచించగా దాన్ని తెలుగులోకి తెచ్చినవారు పోతన్న, గంగన్న, సింగన్న, నారయ్యలు. 12 స్కంధాలున్న ఈ గ్రంథంలో 5వ స్కంధాన్ని గంగన్న, 6వ స్కంధాన్ని సింగన్న రచించగా 11, 12 స్కంధాలను, 10వ స్కంధంలో సగాన్ని, 2,3 స్కంధాలలో కొన్ని పద్యాలని నారయ్య వ్రాశాడు. 4వ స్కంధంలో కూడా ఇతరుల హస్తం ఉన్నది. ఇక మిగిలింది పోతన్న కృతి. భారతాన్ని కవిత్రయం పూరించినట్లే భాగవతాన్ని నలుగురు కవులు సమీకరించారు. ఇలా ఎందుకు జరిగిందీ అంటే ఏ కారణంవల్లనైతేనేం పోతన గ్రంథం శిధిలం కాగా, నష్టమైన భాగాలను ఇతరులు పూరించారని అర్థమవుతున్నది.

మన సాహిత్యం చాలావరకు శిథిలం కావడానికి కారణం, వ్రా సుడానికి వెనుకటివారు ఉపయోగించిన తాటాకులే. వర్షాలవల్ల, అగ్నిప్రమాదాలవల్ల, క్రిమికీటకాలవల్ల తాటాకు ధ్వంసం అవుతుంది. జనసామాన్యానికి అందుబాటులో లేని భాష కావడాన ఆనాటి గ్రంథాలకు ఎక్కువ ప్రతులు ఉండవు. కాలం గడిచేకొద్దీ వాటి సంఖ్య తగ్గిపోయి క్రమంగా అంతరించిపోవడానికి ఆస్కారం ఏర్పడింది. విద్యను కొద్దిమందికే పరిమితం చేసిన పాపానికి మనం పెద్దమూల్యమే చెల్లించవలసి వచ్చింది

ఇక ప్రతి ప్రతిని శ్రద్ధాసక్తులుగలవాడు శ్రమకోర్చి చేతితో ఘంటం పుచ్చుకొని తాటాకులమీద వ్రాసుకోవాలి. అలా వ్రాసుకొనేటప్పుడు కొన్ని పొరపాట్లు జరగడం సహజం. అవిగాక వ్రాసేవారి అభీష్టానుసారం కొన్ని చేర్పులు, మార్పులు కూడా జరుగుతుంటాయి గాబట్టి మనకు దొరికిన ప్రతిలో ప్రతి అక్షరం మొదట రచించిన గ్రంథకర్త వ్రాసినదే అని ఇదమిత్థంగా చెప్పలేము పోతనకు దొరికిన సంస్కృత మూలప్రతి ఏదో మనకు తెలియదు కాబట్టి ఇప్పుడున్న తెలుగు, సంస్కృత పాఠాలతో పోల్చి చూస్తే అనువాదంలో అక్కడక్కడ మూలానికి విరుద్ధంగా ఉన్నట్టు కనిపిస్తుంది. దానికి కారణం మూలప్రతిలోనే పాఠాంతరాలు ఉండడం కావచ్చు. అలాగే తెలుగు అనువాదం విషయంలో కూడా మనకు దొరికిన ప్రతులలో పాఠాంతరాలు ఉన్నాయి. ఏది యదార్థంగా పోతన రచించిన పాఠమో నిర్ణయించలేము.

వ్యాసభాగవతం ఎప్పుడు వ్రాశారు అంటే గ్రంథంలో లభించే సాక్ష్యాన్ని బట్టి చూస్తే, బౌద్ధ, జైన మతాలు బాగా ప్రజాదరణ పొంది, యజ్ఞయాగాదులలో చేసే పశుహింస అంటే ప్రజలకు రోత పుట్టి, వేదమతాన్ని నిరసించే పరిస్థితులు ఏర్పడినప్పుడు, వేదాలలో విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి, ప్రజలలో విష్ణుభక్తిని పెంపొందించడానికి ఈ రచన జరిగినట్లు కనిపిస్తున్నది. తెలుగు అనువాద విషయానికి వస్తే పోతన 15వ శతాబ్దికి

చెందినవాడుగా చాలామంది నిర్ధారించారు. అప్పటికి కాకతీయసామ్రాజ్యం అంతరించి ఆంధ్రదేశం ముక్కచెక్కలయ్యింది. నిరంతర పోరాటాలవల్ల సామాజిక, రాజకీయ, ఆర్థిక స్థితిగతులు అస్తవ్యస్తమయ్యాయి. అలాంటి అరాచక పరిస్థితుల్లో పోతన్న గ్రంథం శిథిలం కావడంలో ఆశ్చర్యం లేదు.

తెలుగులో ప్రాచీనసాహిత్యం అంతా అనువాదమే. అదీ సంస్కృతం నుంచి మాత్రమే. అయితే మూలంలో ఉన్నది ఉన్నట్టు ఎవరూ అనువాదం చేయలేదు. వారి వారి శక్తిసామర్థ్యాలు, కల్పనాశక్తి, కవితాస్ఫూర్తిని బట్టి మూలాన్ని మార్చుకుంటూ అనువదించారు. ఇదొక సంప్రదాయంగా పరిణమించడంతో మూలపాఠాన్ని మార్చగూడదనే నియమం లేకుండాపోయింది. ఎవరికి తోచినట్లు వారు మార్పులు చేసుకొంటూ పోవడం ఆనవాయితీ అయ్యింది. పోతన అనువాదం కూడా నూటికి నూరుపాళ్ళు మూలానుసారి కాదు. కొన్ని ఘట్టాలు ఆయన పెంచి వ్రాశాడు. కొన్నిచోట్ల వ్యాఖ్యానాల ఆధారంగా వివరించాడు. కొన్ని మూలవిరుద్ధ మనిపించేవి కూడా ఉన్నాయి. కాని నేను ముందే చెప్పినట్లు ఆయనకు దొరికిన మూలప్రతి అలాగే ఉందేమో చెప్పలేము కదా! సత్యభామ యుద్ధంచేసి నరకాసురవధలో కృష్ణుడికి తోడ్పడిందనే విషయం సంస్కృతభాగవత ప్రతులలో ఎక్కడా కనిపించదు కాని పోతన్న ఎక్కడనుంచో దానిని తెచ్చిపెట్టాడు.

ఇక భాషవిషయం తీసుకొంటే చాలాచోట్ల ఇంతకంటె సంస్కృతంలో చదువుకుంటే సరిపోతుంది గదా అనిపిస్తుంది. సంస్కృత పరిచయం లేనివారికోసం తెలుగులో వ్రాసేటప్పుడు వీలైనంతవరకు తెలుగుపదాలు, నుడికారం ఉండేటట్లు వ్రాయడం సమంజసం. పైగా వైష్ణవభక్తిని ప్రజలలో విస్తరింపజేయడానికి వ్రాసే భాగవతం ఎక్కువమందికి అర్థమయ్యేటట్లు వ్రాయాలని ఆశించడంలో తప్పులేదు. కాని పోతన్న రచన అందుకు విరుద్ధంగా ఉంది. ఆయన వచనరచన తెలుగేనా అని సందేహం కలిగిస్తుంది. పోతన్న కవిత్వ రామణీయకత గురించి, ఆయనకు లభించిన ప్రశస్తి గురించి నేను ప్రశ్నించడం లేదు. ప్రహ్లాదునికథ, గజేంద్రమోక్షం, రుక్మిణీకల్యాణం, బలిచక్రవర్తి కథ, కృష్ణావతారంలాంటివి ఆయన కవిత్వానికి మణిపూసలు. తెలుగు సాహిత్యానికి రత్నకిరీటాలు. అందరికీ అభిమానపాత్రమైన పద్యాలు, భక్తిపారవశ్యంతో ఆయన కూర్చినవి. వాటి అందచందాలు అందరికీ తెలిసినవే. కాని భాగవతం మొత్తం 8800 పైచిలుకు పద్యగద్యాలతో నిండివున్నది. ఇందులో అందరూ చదివి ఆనందించేది మెచ్చుకొనేది ఎంత అంటే దాదాపు 8వ వంతు మాత్రమే. తెలుగులో సాహిత్యవిమర్శ అంటే పొగడడమో లేకపోతే తెగడడమో తప్ప ఉన్నది ఉన్నట్లు చెప్పడం అరుదు. పోతన్న తనకంటె శతాబ్దాల పూర్వం వ్రాసిన భారతంలోని భాషకంటె క్లిష్టమైన సంస్కృతమయమైన భాష వాడడం తెలుగు భాషాభివృద్ధికి ఎంతవరకు తోడ్పడిందో పండితులు తులనాత్మకంగా

పరిశోధించి చెప్పాలి.

ఇక ప్రస్తుత విషయానికి వద్దాం. ఈ పుస్తకం నాటి భాగవతాన్ని నేటి భాషలో ఈ తరంవారికి అందించాలనే ఉద్దేశంతో వ్రాయడం జరిగింది. వర్ణనలు వదిలేసి, అచ్చులో 1440 పుటలున్న పోతన్న భాగవతాన్ని కుదించి, దాని సారాన్ని రెండు చిన్నపుస్తకాల రూపంలో ఆధునికపాఠకుల సౌకర్యార్థం మీ ముందుంచుతున్నాం. ఇందులో చదవడానికి, తేలిగ్గా అర్థంచేసుకొనడానికి వీలుగా విసంధి పాటించడం జరిగింది. గ్రాంథికాన్ని వదిలి వ్యావహారికాన్ని ఆశ్రయించడం కూడా అందుకే. భాగవత సందేశాన్ని తెలుసుకోవాలని ఆసక్తి ఉండి పోతన్న భాగవతాన్ని చదవలేనివారికి సులభంగా విషయం బోధపడేటట్లు వివరించడానికి చేసిన ప్రయత్నమే ఈ సంక్షిప్త ఆధునిక వచనభాగవతం పోతన భాగవతమే దీనికి ఆధారం. దీనిలో అక్కడక్కడ చెప్పిందే చెప్పినట్లు అనిపించే సందర్భాలున్నాయి. భాగవతంలో ముఖ్యపాత్రలన్నిటిద్వారా మళ్ళీ మళ్ళీ చెప్పబడింది తత్త్వజ్ఞానం. అనివార్యమైన సందర్భాలలో మాత్రమే, అది కూడా వీలైనంత తగ్గించి చెప్పాను. పాఠకులు విసుక్కోకుండా చదివి ప్రయోజనం పొందుతారని ఆశిస్తున్నాను.

అయితే ఆధునిక పాఠకునికి ఈ భాగవతంతో పనేమిటి? దీనిని ఎందుకు చదవాలి? అని కొందరికి సందేహం రావచ్చు పశువులు, పక్షులు మాదిరిగా మనిషి ఉదరపోషణతో తృప్తిచెందదు. అంటే భౌతికస్థాయిలోనే ఎల్లప్పుడూ జీవించడు. తానెవరో, ఎక్కడినుంచి వచ్చాడో, ఎక్కడికి పోతున్నాడో తెలుసుకోవాలనే జిజ్ఞాస మానవుని ఇతర జీవులనుంచి వేరుచేస్తున్నది. ఈ విశ్వం ఎలా ఏర్పడింది? జీవచైతన్యం ఎలా సంభవించింది? ఈ సృష్టికి వెనుక దాగిన సత్యం ఏమిటి? అనే ప్రశ్నలు అనాదిగా మానవుడిని అన్వేషణకు పురికొల్పుతూ రాగా వీటికి సమాధానంగా విజ్ఞానశాస్త్రం వివిధ దేశాలలో బహుముఖాలుగా విస్తరించింది. జగత్తుకు ఆధారమైన అనేక శక్తులను, సత్యాలను ఆవిష్కరించింది. ఇలా బాహ్యజగత్తును పరిశోధించి, జగన్నిర్మాణ రహస్యాలను భేదించి మన ముందుంచుతున్నవారు కొందరైతే, అందుకు భిన్నంగా లోచూపుతో సత్యాన్ని దర్శించి, తత్త్వనిరూపణ చేసే దర్శనాలను సమర్పిస్తున్నారు తత్త్వవేత్తలు వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, భాగవతం ఈ రెండో కోవకు చెందిన శాస్త్రాలు. ఇవి జ్ఞానార్జన అనేది తీరనిదాహంగా వున్నవారికి, సృష్టిరహస్యాలు తెలుసుకోవాలనే పిపాసగలవారికి మహర్షులందించిన గంగాఝరులు.

మనిషి జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు, కొన్ని ప్రశ్నలు ఎదురవుతూ, సమాధానాలు కనుక్కోమని అతడిని వెంటబడి వేధిస్తాయి. చావుపుట్టుకలు, అసమానతలు, పాపపుణ్యాలు, గుణభేదాలు, రాగద్వేషాలు మొదలైనవాటికి మూలమేమిటో తెలుసుకోవాలనే తపన కలుగుతుంది. వాటికి సమాధానమివ్వడానికి అనేక సిద్ధాంతాలు పుట్టాయి. అనేక

మతాలు వెలిశాయి ఈ అన్వేషణలో ప్రాచీన భారతీయులు సాధించిన విజయాలు సాటిలేనివని చెప్పడంలో అణుమాత్రం కూడా సందేహించనక్కర్లేదు. వారు అధిష్ఠించిన ఆలోచనా శిఖరాలను అందుకోవడానికి ప్రయత్నించడం ప్రతి భారతీయుడి ధర్మం. అందుకే అవసరం భాగవతపరనం. సృష్టి నిర్మాణ రహస్యాలు, జీవుడు, జగత్తు, ఈశ్వరుడు అంటే ఏమిటి? తెలుసుకోవాలంటే తప్పక చదవవలసిన గ్రంథం ఈ భాగవతం.

భాగవతాన్ని చదివే ముందు ఒక ముఖ్యవిషయాన్ని దృష్టిలో వుంచుకోవాలి. ఇందులోని కథలు కాలక్షేపానికి చెప్పినవి కావు. కేవలం శబ్దానికి పైపైన కనిపించే అర్థాన్ని తీసుకొంటే యథార్థ తత్త్వం బోధపడదు. నిగూఢమైన అర్థాన్ని గుప్తపరచి ఆకర్షణీయమైన కథలుగా మలచి ఇందులో చెప్పడం జరిగింది. సృష్టినిర్మాణం, జీవపరిణామం కథారూపంలో పాత్రల ద్వారా వ్యక్తం చేయడానికి, శాస్త్ర రహస్యాలను సంకేతపరచి సువ్యక్తం చేయడానికి భాగవతం ప్రయత్నిస్తుంది. ఉదాహరణకు కృష్ణునికి ఎనిమిదిమంది భార్యలు అని భాగవత కథ చెబుతుంది. దాని అర్థం ఎనిమిది లక్షణాలుగల ప్రకృతి పరమాత్మ ఆధీనంలో వుంటుంది అని చెప్పడం. ఎనిమిది లక్షణాలు ఏమిటంటే గాలి, నీరు, ఆకాశం, అగ్ని, నేల అనే పంచ మహాభూతాలు, మనస్సు, బుద్ధి, అహంకారం. అలా పైకి కనిపించే అర్థం వేరు, లోన దాగివున్న అర్థం వేరు అని గ్రహించాలి. ఈ పుస్తకం చదివితే అంతరార్థం బోధపడని మాట నిజమే. అందుకోసం వ్యాఖ్యానాలు చదవాలి. అటువంటి ఆసక్తిని రగులుకొలపడానికి ఈ పుస్తకం సాయపడుతుంది. అపార్థం చేసుకోకుండా, అభూతకల్పన అని కొట్టిపారవేయకుండా అందులో దాగివున్న మర్మాలను తెలుసుకోవడానికి ప్రయత్నించవలసిందని హెచ్చరించడానికి ఈ మాట చెప్పవలసి వచ్చింది

ఇది ఒకసారి వరుసగా చదివి పారవేయకుండా, నెమ్మదిగా చదవండి. ఆలోచించండి. మళ్ళీ మళ్ళీ చదవండి. అవగాహన చేసుకోండి శ్రద్ధ కలిగితే పోతన భాగవతకావ్యాన్ని చదవండి అందులోని శబ్దసౌందర్యం, కవితా మాధుర్యం చవిచూచి ఆనందించండి. విందులో ఆకలి పుట్టించడానికి ముందుగా త్రాగే పానీయం వంటిది ఈ వచన భాగవతం. దీన్ని ఆస్వాదించిన తర్వాత పోతన్న యిచ్చే విందుకు వెళ్ళితే అది సుఖంగా జీర్ణమవుతుంది ఈ అమృతాన్ని సేవించడానికి అందరూ అర్హులే. అందరికీ ఇదే మా ఆహ్వానం.

**- ముసునూరు శివరామకృష్ణారావు**

# ప్రథమస్కంధం

అడవులలో చెప్పుకోదగినది నైమిశారణ్యం. ఆ అడవిలో శౌనకాది మహామునులు తపస్సు చేసుకొంటున్నారు. వారొకసారి వెయ్యేళ్ళపాటు సాగే సత్రయాగాన్ని ప్రారంభించారు. ఆ విధంగా ముక్తిపొంది శ్రీహరిని చేరాలని వారి సంకల్పం. ఆ మునులలో పురాణాలు, ఇతిహాసాలు, ధర్మశాస్త్రాలు బాగా చదువుకున్నవాడు, అన్నీ తెలిసినవాడు సూతుడు అనే మహర్షి. ఆయన ఒకనాడు ప్రొద్దున్నే లేచి కాలానుగుణంగా చేయవలసిన కర్మలు చేసి విశ్రాంతిగా కూర్చున్నప్పుడు శౌనకాది మునులు ఆయనను సమీపించి, మహాత్మా! కలియుగంలో మానవులు మందబుద్ధులు, సోమరులు, అల్పాయుష్కులు, వ్యాధిపీడితులు, మంచిపనులు చేయలేరు కాబట్టి వారికి సుఖశాంతులు కలిగే మార్గమేదైనా ఉంటే చెప్పండి అన్నారు. మనశ్శాంతికి, సుఖసౌభాగ్యాలకు, సంసారబంధంనుంచి ముక్తి పొందడానికి, మృత్యువును జయించడానికి విష్ణుకథలు వినడమే మంచి ఉపాయం. ఆ హరికథలు వినాలని ఉంది. దయచేసి వినిపించండి అని ప్రార్థించారు. రోమహర్షణుని కుమారుడైన సూతునికి ఉగ్రశ్రవసుడు అని మరో పేరుకూడా ఉంది. ఆయన పురాణాలన్నిటిని వ్యాఖ్యానించి చెప్పడంలో దిట్ట.

మునుపు వేదాలనే కల్పవృక్షానికి కాచిన భాగవతమనే పండును వ్యాసమహర్షి తెచ్చి కుమారుడైన శుకుని కిచ్చాడు. ఆయన నోటిలోని అమృతంతో కలిసి అది లోకానికి అందింది. భక్తితో భాగవతం వినేటటువంటి నిర్మలహృదయులకు భగవంతుడు చిక్కుతాడు. కార్యకారణాలకు అతీతమైనది ఆత్మతత్త్వం. దానినే అధ్యాత్మం అంటారు. అట్టి అధ్యాత్మాన్ని తెలియజేసే దీపం వంటిది భాగవత పురాణం. అది సకలవేదాల సారాంశం. గాఢమైనటువంటి సంసారమనే అంధకారాన్ని పోగొట్టుకొనదలచినవారికి శుకుడు దయతో ఈ జ్యోతిని ప్రసాదించాడు. కనుక శుకుడికి, వ్యాసుడికి నమస్కరించి, నరనారాయణులకు, సరస్వతీదేవికి మ్రొక్కి సూతుడు చెప్పడం ప్రారంభించాడు.

ఎందులో కృష్ణుని ప్రసక్తి ఉంటుందో, ఏ విధంగా ఆత్మ ప్రసన్నమవుతుందో, ఏ రూపంలో హరిభక్తి కలుగుతుందో అది మానవులకు పరమధర్మం. వాసుదేవునిపై భక్తివలన వైరాగ్యం కలుగుతుంది. విజ్ఞానం లభిస్తుంది. తత్త్వజిజ్ఞాస అంటే ధర్మజిజ్ఞాస. కొందరు ధర్మమే తత్త్వమని అంటారు. ఆ తత్త్వాన్నే బ్రహ్మమని, పరమాత్మ అని, భగవంతుడని కూడా వ్యవహరిస్తారు. వేదాంతశ్రవణంవల్ల కలిగిన జ్ఞానంతో, జ్ఞాన వైరాగ్యాలతో కూడిన భక్తిచేత ఆత్మలో పరమాత్మను చూస్తారు. కృష్ణపరమాత్మ తన

కథలు విన్నవారి హృదయాలలో నివసించి వారిచేత మంచిపనులు చేయిస్తాడు. చెడు జరగకుండా చూస్తాడు. ఆ విధంగా వారిలో నిశ్చలభక్తి ఏర్పడుతుంది. భక్తివలన సత్త్వగుణం ప్రకాశిస్తుంది. రజోగుణం, తమోగుణం కారణంగా పుట్టే కామం, క్రోధం, మోహం, లోభం, మదం, మాత్సర్యం తొలగిపోయి చిత్తం నిర్మలమవుతుంది. అటువంటి మనిషి రాగద్వేషాలనే బంధనాలనుంచి విముక్తుడవుతాడు. అతనికి తత్త్వజ్ఞానం సిద్ధిస్తుంది. ఈశ్వర సాక్షాత్కారం లభిస్తుంది. అహంకారం నశిస్తుంది. సంశయాలు విచ్ఛిన్నమవుతాయి. కర్మలు నశిస్తాయి. అందుచేత తెలివిగలవారు అంతఃకరణాలను భక్తిచేత శుద్ధిచేసి భగవానునికి సమర్పిస్తారు.

మోక్షమిచ్చేది నారాయణుడు కాబట్టి అందరూ ఆయన్నే సేవించాలి వేదం, యాగం, యోగం, జ్ఞానం, తపస్సు ఇవన్నీ వాసుదేవుని అధీనంలో ఉండే ధర్మాలు. పరమేశ్వరుడు నిర్గుణుడు. కాని సత్త్వ, రజస్తమోగుణాలతో కూడిన తన మాయచేత విశ్వాన్ని సృష్టించి, గుణాల రూపంలో అందులో ప్రవేశించి ప్రకాశిస్తాడు. వేర్వేరు కట్టెలలో మంట ఉన్నా అగ్ని ఒక్కటే అయినట్లు, భగవంతుడొక్కడే అయినప్పటికి, అంతర్యామి రూపంలో సమస్త జీవరాసులలోనూ నివసిస్తాడు. దేవతలలోను, మనుష్యులలోను, పశు, పక్ష్యాది ఇతర జాతులలోను కూడా అవతరించి లోకాలను రక్షిస్తాడు. అవతారాలన్నిటికి మూలమైన శ్రీమన్నారాయణుడు వేలాది తలలతో, కళ్ళు, చెవులు, ముక్కులతో, వేలాది కరచరణాలతో, హారాలు కిరీటాలు, దండకడియాలవంటి ఆభూషణాలతో పురుషరూపం ధరించి అపార జలరాశి మధ్యన యోగనిద్రలో ఉంటాడు. పంచమహాభూతాలతో కూడిన ఆయన శరీరం పదహారు కళలతో ప్రకాశిస్తుంటుంది. శుద్ధ సత్త్వగుణంతో నిండి ఉంటుంది. అట్టి దివ్యరూపాన్ని పరమ యోగీంద్రులు దర్శించి భక్తితో పరవశిస్తారు. ఆయన బొడ్డులోని కమలంనుంచి సృష్టికర్తయైన బ్రహ్మ ఉద్భవించాడు. ఆయన అవయవస్థానాలనుంచి లోకాలన్నీ కల్పించబడ్డాయి

## నారాయణుని అవతారాలు

పరమేశ్వరుడైన శ్రీమన్నారాయణుడు 21 అవతారాలెత్తాడు. మొదట బ్రాహ్మణుడై అతికష్టమైన బ్రహ్మచర్యాన్ని ఆచరించి చూపాడు. రెండవసారి వరాహరూపమెత్తి భూమిని రసాతలంనుంచి పైకెత్తి రక్షించాడు. మూడవసారి నారదుడను దేవరుషిగా జన్మించి ముక్తికి మార్గమైన వైష్ణవతంత్రాన్ని ఉపదేశించాడు. నాల్గవసారి నరనారాయణుడనే పేరుతో పుట్టి ఘోరమైన తపస్సు చేశాడు. ఐదవ అవతారంలో కపిలుడనే సిద్ధుడుగా

జన్మించి యాసురి అనే బ్రాహ్మణుడికి సాంఖ్యశాస్త్రాన్ని బోధించాడు. అత్రిమహాముని, అనసూయలకు కుమారుడై ఆరవ అవతారంలో ఆత్మవిద్యను తెలియజేశాడు. ఆకూతి, రుచి అనువారలకు యజ్ఞుడనే పేరుతో పుట్టి ఏడవ అవతారంలో స్వాయంభువ మన్వంతరాన్ని రక్షించాడు. మేరుదేవికి నాభికి ఉరుక్రముడనే పేరుతో పుట్టి ఎనిమిదవ అవతారంలో పరమహంసమార్గాన్ని ప్రకటించాడు. తొమ్మిదవ జన్మలో పృథుచక్రవర్తియై భూమిని ఆవుగా చేసి దాని పొదుగునుంచి సమస్త వస్తువులను పిదికాడు. పదవసారి మీనావతారం దాల్చి వైవస్వత మనువును మహీరూపమైన నావ నెక్కించి ఉద్ధరించాడు సముద్రమథనకాలంలో తాబేలుగా అవతరించి మందరపర్వతాన్ని నీట మునగకుండా తనవీపున నిలిపాడు. పాలకడలి మధ్యనుంచి అమృతకలశాన్ని చేత ధరించి బయటకు వచ్చిన ధన్వంతరి నారాయణుని 12వ అవతారం. తరువాత మోహినీవేషంలో అసురులను మోహవివశులను జేసి దేవతలకు అమృతాన్ని పంచిపెట్టినది 13వ అవతారం నరసింహరూపం ధరించి హిరణ్యకశిపుని వధించినది 14వ అవతారం. కపట వామనుడై 15వ అవతారంలో బలిచక్రవర్తిని మూడడుగులు అడిగి ముల్లోకాలను ఆక్రమించాడు. 16వ అవతారంలో పరశురాముడై బ్రాహ్మణద్రోహులైన రాజులను 21సార్లు వధించి భూమిపై క్షత్రియులను రూపుమాపాడు. వ్యాసుడై 17వ అవతారంలో వేదాలను పరిష్కరించి శాఖలేర్పరచి అందరికీ అందుబాటులోకి తెచ్చాడు. దశరథ తనయుడైన శ్రీరామచంద్రునిగా జన్మించి 18వ అవతారంలో దేవకార్యాన్ని తీర్చాడు. 19వ అవతారం బలరాముడు, 20వ అవతారం శ్రీకృష్ణుడు. ఇద్దరూ యదువంశంలో పుట్టి భూమి భారాన్ని నివారించారు జినసుతుడై 21వ అవతారంలో బుద్ధుడనే పేరుతో రాక్షస సమ్మోహనం కోసం కలియుగారంభంలో జన్మిస్తాడు ఈ యుగం ముగిసి మరో యుగం వచ్చేముందు విష్ణుయశుడనే విప్రునికి కల్కి అనే పేరుతో పుట్టి దొంగలవలె దోచుకుంటున్న రాజుల మదాన్ని హరిస్తాడు.

ఒక సరస్సునుంచి వెయ్యి కాలువలు ప్రవహించినట్లు ఒకే విష్ణువునుంచి అనేకానేక అవతారాలు బహిర్గతమవుతాయి. దేవతలు, రాజులు, బ్రాహ్మణులు, మహర్షులు విష్ణువు యొక్క అంశంనుంచి వచ్చినవారే! హరి, కృష్ణుడు, బలరాముడు ఆ విష్ణురూపాలేగాని వారి మధ్య ఎటువంటి వ్యత్యాసమూ లేదు లోకాలకు రాక్షసులవల్ల బాధ కలిగినప్పుడల్లా భగవంతుడైన విష్ణువు అవతరించి కాపాడుతాడు. కవులు చమత్కారంగా హరి జన్మలెత్తాడు, కర్మలు చేశాడు అని వర్ణిస్తారేగాని నిజానికి భగవంతునికి చావుపుట్టుకలు, కర్మలు, బంధాలు లేవు. లోకాలన్నిటిని సృష్టించేది, రక్షించేది, నశింపజేసేది కూడా

ఆయనే. సమస్త జీవరాసులలోనూ ఆత్మగా ఉండి, అన్నిటిని చూస్తూ ఉండే పరమాత్మ ఆయనే

తొల్లి లోకకళ్యాణంకోసం వ్యాసుడు హరిచరిత్ర అయిన భాగవతాన్ని రచించి తన కుమారుడైన శుకునిచేత చదివించాడు. శుకుడు ఆ కథను పరీక్షిత్తు అనే రాజుకు చెప్పాడు. అదే నేనిప్పుడు మీకు చెబుతున్నాను అన్నాడు సూతుడు. అప్పుడు శౌనకుడిలా అడిగాడు.

ఎందుకోసం వ్యాసుడు భాగవతాన్ని వ్రాశాడు? శుకుడీ కథను ఎందుకు పరీక్షిత్తుకు చెప్పవలసి వచ్చింది? శుకుడు మహాయోగి, సమదర్శనుడు. మూఢుని వలె పైకి కనిపిస్తూ గోచీ కూడా లేకుండా దిగంబరంగా సంచరించేవాడు. నగ్నంగా జలక్రీడలాడుతున్న దేవతా స్త్రీలు ఒకసారి శుకుని జూచి ఏ మాత్రం సిగ్గుపడక సరస్సులో సరససల్లాపాలు ఆడి, ఆ వెనుకనే వచ్చిన వస్త్రధారి, వృద్ధుడూ అయిన వేదవ్యాసుని జూచి సిగ్గుపడి బట్టలు కప్పుకొన్నారట వ్యాసుడు ఆశ్చర్యపోయి యౌవనంలో ఉన్న నా కొడుకును చూచి సిగ్గుపడలేదు. ముసలివాడినైన నన్ను చూచి సిగ్గుపడడానికి కారణమేమిటీ అని అడిగాడు అప్పుడా కన్యలు ఇలా సమాధానమిచ్చారు. నీ కుమారునికి ఆడ-మగ అనే భేదబుద్ధిలేదు. అంతటా బ్రహ్మన్నే చూచే నిర్వికల్పుడు. ఆయనకు, నీకు చాలా అంతరం ఉంది అన్నారు. అలాంటి శుకుడు కురు, జాంగల దేశాలకు ఎలా వచ్చాడు? హస్తినాపురంలో పౌరులతనిని ఎట్లా గుర్తించారు? పిచ్చివాడి మాదిరిగా తిరిగే శుకుడికి, పరీక్షిత్ మహారాజుకు మధ్య సంవాదం ఎలా జరిగింది? ఆ మహాయోగి ఆవునుంచి పాలు తీయడానికి పట్టేంత సమయానికి మించి ఎక్కడా ఉండడని చెప్పగా విన్నాం. అలాంటివాడు ఒకేచోట ఎక్కువకాలం ఎలా ఉన్నాడు? భాగవతాన్ని ఎలా వివరించాడు? అది విన్న పరీక్షిత్తు ఎవరు? ఆయన పుట్టుపూర్వోత్తరాలు అన్నీ మాకు సవిస్తరంగా చెప్పండి. అర్జునుని మనుమడు, అభిమన్యుని పుత్రుడు అయిన పరీక్షిన్మహారాజు రాజ్యాన్ని వదిలేసి. ఆమరణ నిరాహారదీక్ష ఎందుకు చేపట్టాడు? విరక్తితో గంగ వొడ్డున జేరి మరణం కోసం ఎందుకు ఎదురుచూశాడు? అన్నీ తెలిసినవారు మీరు. అంతా మాకు తెలిసేటట్లు చెప్పండి.

అలా అడిగిన శౌనకాది మహామునులకు సూతుడు ఇలా చెబుతున్నాడు.

ద్వాపరయుగం ముగిసే సమయంలో ఉపరిచరవసువు అనే ఆయనకి సత్యవతి అనే కూతురు పుట్టింది. ఆమెను పరాశరుడు పెళ్ళి చేసుకున్నాడు. వారిద్దరికీ జన్మించినవాడే వేదవ్యాసుడు. ఆయన ఒకనాడు సరస్వతీనదిలో స్నానం చేసి బదరికాశ్రమంలో ఏకాంతంగా కూర్చుని ఆలోచించసాగాడు. ఆయనకు భూతభవిష్యత్‌వర్తమాన కాలాలలో

జరిగింది, జరగనున్నది, జరుగుతున్నది తెలుసు కాబట్టి, రాబోయే కాలంలో ధర్మాలు సంకరమైపోతాయి, మానవజాతిలో జవసత్త్వాలు సన్నగిల్లుతాయి, ధైర్యసాహసాలు, ప్రజ్ఞాపాటవాలు క్షీణిస్తాయి, ఆయువు తగ్గిపోతుంది అని గ్రహించి అన్నివర్గాల ప్రజలకు మేలుచేయాలని భావించి వేదాన్ని ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణవేదం అని నాలుగు భాగాలు చేసి, ఇతిహాస పురాణాలన్నిటిని పంచమవేదంగా చెప్పాడు ఋగ్వేదాన్ని పైలునికి, సామవేదాన్ని జైమినికి, యజుర్వేదాన్ని వైశంపాయనునికి, అధర్వవేదాన్ని సుమంతుడికి, పురాణాలు, ఇతిహాసాలు రోమహర్షుణునికి బోధించగా వారు, వారి శిష్యులకు చెప్పారు. ఆ విధంగా పరంపరాగతంగా అవి బ్రాహ్మణులలో వ్యాపించాయి. స్త్రీలకు, శూద్రులకు, బ్రాహ్మణక్షత్రియ వైశ్యజాతులలో అధములకు వేదాలు వినే అర్హత లేదు కాబట్టి, మూఢులందరికి మేలు కలగాలని భారతం వ్రాసి కూడా వ్యాసుని హృదయం సంతృప్తి చెందలేదు. ఇందుకు కారణమేమిటా అని ఆయన పరితపించాడు. హరికి, యోగులకు ఇష్టమైన భాగవతకధ చెప్పడం మరచిపోయాను. అందుకే నాకీ విచారం కలిగింది అని ఆయన గుర్తించాడు. ఆ సమయంలో ఆకాశంనుంచి నారదుడు దిగివచ్చి వ్యాసుడి ఎదుట నిలబడ్డాడు. వ్యాసుడు నారదమహర్షిని శాస్త్రోక్తంగా పూజించాడు. నారదుడు తృప్తిచెంది, నవ్వుముఖంతో ఇలా అన్నాడు - వేదవిజ్ఞానాన్నంతా జీర్ణించుకున్న మహర్షివి, కామక్రోధాది అంతఃశత్రువులను జయించినవాడివి, బ్రహ్మతత్త్వాన్ని తెలుసుకున్నవాడివి, యోగులలో శ్రేష్ఠుడవు. నీకు ఈ విచారం ఏమిటి? పామరుడివలె ఎందుకు దుఃఖిస్తున్నావు? అప్పుడు, వ్యాసుడు, ఓ నారదమునీ, బ్రహ్మమానస పుత్రుడివి. నారాయణభజనమే వృత్తిగా, హరిభక్తిని బోధిస్తూ అన్ని దిక్కులా చిట్టచివరిదాకా తిరుగుతుంటావు. సర్వజ్ఞుడివి, నీకు తెలియని ధర్మం లేదు. నామీద దయతో నాలోని లోపమేమిటో చెప్పు, అన్నాడు.

నారదుడు ఇలా అన్నాడు, వ్యాసమహర్షీ, ధర్మశాస్త్రం సంపూర్ణంగా చెప్పావు, నిజమే, కాని అందులో విష్ణుకథలెక్కడైనా ఉన్నాయా? హరిగుణాలు గానం చేయకుండా ధర్మాలు వల్లెవేస్తే లోకులు హర్షిస్తారా? హరిని స్తుతించక పోవడంవల్లనే నీకీ అరిష్టం వచ్చింది. హరి నామస్తుతి చేసే కావ్యం స్వర్ణకమలాలతో, రాజహంసలతో విరాజిల్లే సుందర మానససరోవరంలా కమనీయంగా ఉంటుంది. హరినామస్తుతిలేని కావ్యం ఎంత అర్థవంతమైనదైనా మురుగుగుంటతో సమానం. అపశబ్దాలున్నప్పటికి హరిచరిత్రను ఆలపించినవారికి పాపాలన్నీ పోతాయి కాబట్టి హరినామాన్ని భావిస్తూ, పాడుతూ, జపం చేస్తూ, వింటూ, కీర్తిస్తూ తపస్వులు, సాధువులు ధన్యులవుతుంటారు. జ్ఞానమున్నా, భక్తి

లేకపోతే అది శోభించదు. ఫలాన్ని కోరకుండా, ఈశ్వరునికి కర్మను సమర్పణ చేయకపోతే ఆ కర్మ ప్రశస్తం కాదు. భక్తిలేని జ్ఞానం, వాక్కు, కర్మకౌశలం నిరర్థకం. అందువలన నిఖిల బంధమోచనం కొరకు వాసుదేవుని లీలావిశేషాలు భక్తితో వర్ణించు. విశ్వమంతా విష్ణుమయం. విష్ణువునుంచే ఈ విశ్వం పుదుతుంది, పెరుగుతుంది, చివరికి ఆయనలోనే కలిసిపోతుంది.

## నారదుని జన్మవృత్తాంతం

నేను పూర్వకల్పంలో ఒకసారి ఒక దాసికి కొడుకుగా పుట్టాను. నా తల్లి వేదపండితుల ఇంట పనిచేసేది. ఆ ఇంటివారు నన్నొకసారి, యోగులు కొందరు వానాకాలంలో ఒకేచోట నివాసమున్నప్పుడు, వారికి సేవ చేయవలసిందిగా చెప్పి పంపారు. నేను భక్తిశ్రద్ధలతో ఆ యోగులను సేవించాను. వారికి షరిచర్యలు చేశాను. వానకు, ఎండకు ఓర్చి వారికి నిష్ఠగా పనులు చేసిపెట్టాను. వారు తినగా మిగిలిన ఎంగిలిమెతుకులు తిని, వివేకం ఉన్నప్పటికి వెర్రివెంగళప్పలా సంచరిస్తూ వారి దయకు పాత్రుడినైనాను. వారు కృష్ణుని చరిత్రలు చదువుతుంటే, వర్ణిస్తుంటే, పాడుతుంటే విని ఆనందించేవాడిని. ఆ విధంగా నాలో విష్ణుచింతన ప్రారంభమయ్యింది. ఇంద్రియాలకు కనిపించే స్థూలశరీరమూ, లోనున్న సూక్ష్మశరీరమూ మాయాకల్పితమని, నా నిజస్వరూపం బ్రహ్మమని, అది ప్రపంచానికి అతీతమైనదని తెలుసుకున్నాను. రజోగుణాన్ని, తమోగుణాన్ని, దూరంచేసే భక్తి ఆ మహాత్ముల దయవలన నాలో పుట్టింది. వారు చాతుర్మాస్యవ్రతం విరమించి మరోచోటికి వెళ్ళేటప్పుడు నాకు ఈశ్వరవిజ్ఞాన రహస్యాన్ని ఉపదేశించారు. దానివలన వాసుదేవుని మాయా మహిమ ఎలాంటిదో నాకు బోధపడింది. ఈశ్వరార్పణ బుద్ధితో కర్మలు చేస్తే, తాపత్రయాలు మనిషిని బాధించవు. ఓం వాసుదేవాయ నమః , ఓం ప్రద్యుమ్నాయ నమః, ఓం సంకర్షణాయ నమః, ఓం అనిరుద్ధాయ నమః అంటూ భక్తితో నాలుగుసార్లు నమస్కరించి భగవంతుడిని పూజిస్తే మానవుడు వివేకవంతుడవుతాడు. నేను ఆ విధంగా చేయడంవల్లనే భగవంతుడు నాకీ విజ్ఞానాన్ని ప్రసాదించాడు. కాబట్టి నీవు కూడా హరికథలు కీర్తనం చెయ్యి. అవి విన్నవారికి దుఃఖం పోతుంది. శాంతి లభిస్తుంది.

నారదుని జన్మకర్మలు విన్న వ్యాసునికి ఒక సందేహం కలిగింది. దాన్ని పోగొట్టుకొనాలనే ఉద్దేశంతో ఇలా అడిగాడు. నీకెప్పుడో పూర్వకల్పంలో, యోగివర్యులు ఉపదేశం చేయడంవల్ల బాల్యంలోనే వృద్ధునివలె వివేకవంతుడివయ్యావు, బాగుంది. కాని ఇప్పుడు

ఈ జన్మలో ఆ విజ్ఞానపు వెలుగు ఎలా ప్రసరించింది? దాసి కొడుకుగా పుట్టిన ఆ పూర్వజన్మ ఎలా అంతమయ్యింది?

నారదుడప్పుడు తన పూర్వజన్మగాథను ఇలా కొనసాగించాడు. ఈశ్వరవిజ్ఞాన రహస్యాన్ని యోగుల ద్వారా పొంది నేను, మా తల్లి దాసీగా పనిచేస్తున్న ఇంటికి తిరిగివచ్చాను. మా అమ్మ అలుపూసొలుపూ లేకుండా కష్టపడి భక్తితో పనులు చేసేది. ఒకరికి దాసీగా పనిచేస్తున్నాననే భావం లేకుండా తన కష్టసుఖాలు లెక్కచేయకుండా నడుం వంచి చాకిరి చేసేది. నన్నెంతో గారాముగా చూచేది. ప్రేమానురాగాలు పంచి ఇచ్చేది. మక్కువతో అక్కున చేర్చుకొని ముద్దాడేది. ఆ విధంగా ప్రాణసమానంగా నన్ను పెంచడంవల్ల ఆమెను విడిచి వెళ్ళలేక ఇంటివద్దే ఉండేవాడిని, అయినా మోహంలో పడలేదు. నా స్వరూపమేమిటో యోగుల ద్వారా గ్రహించాను కాబట్టి ఆ ఎరుకలోనే ఉంటూ మరో చింత లేకుండా మౌనంగా కొన్ని సంవత్సరాలు గడిపాను. ఇలా ఉంటుండగా ఒకరాత్రి మా తల్లి, ఇంటికి దూరంగా ఉన్న పశువులశాలలో ఆవుపాలు తీస్తుండగా ఒక పాము ఆమెను కాటువేసింది దాంతో విషం శరీరంలో విస్తరించి ఆమె అసువులు బాసింది. తల్లి ఆ విధంగా మరణించడం చూచి నేను వ్యాకులపడలేదు బంధం తెగిపోయింది. ఇది ఒకందుకు మంచిదే అయ్యింది అని భావించి, ఇక ఏకాగ్రతతో విష్ణుపదచింతన చేయాలనే సంకల్పంతో ఉత్తరముఖంగా బయలుదేరి వెళ్ళాను. పల్లెలు, పట్టణాలు దాటాను. అడవులు, పర్వతాలు, చెరువులు దాటివెళ్ళాను. ఒకచోట నదిలో నీరు త్రాగి, స్నానం చేసి, ఒక రావిచెట్టు దగ్గర కూర్చున్నాను. నా హృదయంలో పరమాత్మ స్వరూపంతో ఉన్న హరిని ధ్యానించాను. నా కన్నుల నుంచి ఆనందాశ్రువులు రాలాయి. శరీరం పులకరించింది. నా భావనలో ఆ దేవదేవుని మూర్తి గోచరించింది ఆనందపరవశుడినయ్యాను. అంతలో ఆ మూర్తి అదృశ్యమైంది మరల ఆ దేవుని రూపాన్ని చూడాలని ఆత్రుతతో లేచి అటూఇటూ తిరిగాను. ఒంటరిగా ఆ అడవిలో తిరుగుతున్న నాపై దయతో నా శోకాన్ని పోగొట్టేవిధంగా శ్రీహరి మధురగంభీరస్వరంతో ఇలా అన్నాడు: కుమారా, ఎందుకు దుఃఖిస్తావు. ఈ జన్మలో నన్ను చూడలేవు. కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలను జయించి కర్మను నిర్మూలనం చేసిన మునిశ్రేష్ఠులు మాత్రమే నన్ను చూడగలరు. నా దర్శనం చేసుకోవాలని నీలో పుట్టిన కోరిక ఊరికే పోదు. అది దోషాలను పోగొడుతుంది. నా సేవవలన నాపై భక్తి కలిగి వృద్ధిచెందుతుంది, జన్మజన్మలకు అది నీ మనస్సులో నిలిచిపోతుంది. ఈ జన్మ ముగిసిన తదుపరి నా భక్తుడవై పుడతావు. ఈ సృష్టి అంతమై వేయియుగాలు

గడిచిన తర్వాత మరలా సృష్టి జరుగుతుంది. నా దయవల్ల అప్పుడు ఏ దోషమూ లేకుండా గతజన్మ స్మృతితో పుట్టి, శుద్ధసాత్త్వికులలో ప్రముఖుడవై కీర్తిప్రతిష్ఠలు గడిస్తావు.

ఇలా ఆకాశమే మూర్తిగా, వేదాలే ఊపిరిగా గలిగిన ఒక మహాభూతం పలికిన పలుకులు విని నేను తలవంచి దేవుడికి నమస్కరించాను. ఈశ్వరకృపకు సంతసించాను. భగవంతుని ఆదేశం మేరకు కామక్రోధాది ఆరు దుర్గుణాలను విసర్జించి, ఆయనకు గల అనంతనామాలను స్మరించడం ఆరంభించాను. ఆయన పుణ్యకథలను తలచుకొంటూ తృప్తిగా జీవిస్తూ నిర్మలమైన చిత్తంతో ప్రపంచంపట్ల విరక్తితో భూమిపై సంచరించాను. కొంతకాలానికి మెరుపు మెరిసినట్లు మృత్యుదేవత సమీపించింది. పంచభూతాలతో కూడి, కర్మస్వరూపంగా సంక్రమించిన ఈ దేహాన్ని విడిచిపెట్టి, దేవుని దయవలన శుద్ధసత్త్వమయమైన భక్తుని దేహాన్ని పొందాను. ఆ తర్వాత ప్రళయం వచ్చి సృష్టి అంతా భగవంతునిలో లీనమైపోయింది. అనంతజలరాశి ఏర్పడింది. దాని మధ్యన శ్రీమన్నారాయణుడు పవ్వళించగా ఆయనలో నిదురపోతున్న బ్రహ్మ ఊపిరి వెంట ఆయనలో ప్రవేశించాను. ఆ విధంగా వేయి యుగాలు గడిచిపోయిన తర్వాత బ్రహ్మ నిదుర లేచాడు. లోకాలను సృష్టించేందుకు సిద్ధమయ్యాడు. అప్పుడు ఆయన శ్వాసనుంచి మరీచి మొదలగు మునులు, నేను పుట్టడం జరిగింది. నేను బ్రహ్మచారినై మూడులోకాల్లో, లోపలా బయటా నిరభ్యంతరంగా తిరుగుతున్నాను. ఈశ్వరుడిచ్చిన వీణపై సప్తస్వరాలు తనంతట తానే మ్రోగుతుండగా, నారాయణ కథాగానం చేస్తూ త్రిలోకాలు సంచరిస్తున్నాను. ఈ సంసారమనే సముద్రంలో మునిగి కర్మవాంఛలచేత వేదన పొందే మనిషిని విష్ణుగుణ గానం తెప్పలా తీరాన్ని చేరుస్తుంది. యమనియమాది యోగముల ద్వారా ఆత్మను నియంత్రించినా, కామక్రోధాదుల ప్రాబల్యంవల్ల శాంతి లభించదు. శ్రీహరి సేవవల్లనే క్రమంగా శాంతి దొరుకుతుంది. ఇందుకు ఉదాహరణగా నా జన్మకర్మ రహస్యాలన్నిటిని నీకు వివరించాను.

ఆ విధంగా చెప్పి నారదముని వ్యాసుని సెలవు తీసుకొని వీణ వాయించుకొంటూ తన దారిన తాను వెళ్ళిపోయాడు. ఎప్పుడూ వీణవాయిస్తూ, భక్తిగీతాలు పాడుతూ, లోకాలను రంజింపజేసి, మానవాళికి పాపాలు పోగొట్టి మేలు చేస్తున్న నారదునివంటి మహనీయుడు మరొకడు లేడని సూతుడు చెప్పగా, ఆ పిమ్మట వ్యాసుడు ఏం చేశాడని శౌనకుడు ప్రశ్నించాడు. అప్పుడు సూతుడు సమాధానం చెప్పాడు.

బ్రహ్మనదియైన సరస్వతి పశ్చిమతీరాన శమ్యాప్రాసమనే ప్రసిద్ధమైన ఆశ్రమం ఉంది.

ఋషులు యజ్ఞయాగాదులు చేసుకోవడానికి చాలా అనువైన స్థలమది. అక్కడ స్నానం చేసి శుచియై కూర్చున్న వ్యాసుడు నారదుని మాటలవల్ల ప్రభావితుడై మనస్సును స్థిరం చేసుకొన్నాడు. భక్తితో పరమేశ్వరుని ధ్యానించాడు. ఈశ్వరుని మాయచేత జీవుడు సంసారంలో మునిగితేలుతూ తానే కర్తనని అన్నీ చేసేది తానేనని, తానే భోక్తనని అంటే అన్నీ అనుభవించేదీ తానేనని భ్రమలో పడి వేదనకు గురి అవుతున్నాడు. ఈ బాధలనుంచి ముక్తిపొంది మనశ్శాంతి చేకూరాలంటే నారాయణభక్తి తప్ప మరొక మార్గంలేదని వ్యాసుడు నిశ్చయించాడు. ఏ పురాణం వింటే లోకశరణ్యుడైన మాధవునిపై భక్తి పుట్టి జన్మరాహిత్యానికి తోడ్పడుతుందో, అట్టి లోకకల్యాణకారకమైన భాగవతాన్ని నేర్పుతో రచించాడు. మోక్షార్థి అయిన తన కుమారుడు శుకునితో చదివించాడు. వెయ్యి వేదాలు చదివినా ముక్తికి మార్గం సులభంగా దొరకదు. కాని భాగవత పఠనంవల్ల మనిషి ముక్తి పొందడానికి యోగ్యుడవుతాడు.

ఆ విధంగా భాగవతం భూమిపై అవతరించిందని చెప్పి సూతుడు రాజర్షి అయిన పరీక్షిన్మహారాజు చరిత్రను, పాండవుల మహాప్రస్థానాన్ని, కృష్ణుని కథను చెప్పడం మొదలుపెట్టాడు.

## పరీక్షిత్తు జననం

భారతయుద్ధంలో అనేకులు వీరమరణం చెందారు. చివరికి భీముడు గదతో కొట్టగా తొడలు విరిగి దుర్యోధనుడు భూమిపై పడ్డాడు. దుర్యోధనునకు పట్టిన ఈ దుర్దశ చూచి అశ్వత్థామ కోపావేశంతో నిదురపోతున్న ద్రౌపదీపుత్రుల తలలు కోసి తెచ్చి ప్రభువైన దుర్యోధనునికి సమర్పించాడు. తన బిడ్డల మరణవార్త విన్న పాంచాలి. నిర్ఘాంతపోయింది. భోరున విలపించింది. నేలమీద పడి దొర్లింది. కన్నీరు మున్నీరుగా ఏడుస్తున్న ద్రౌపదిని అర్జునుడు లేవనెత్తి ఓదార్చాడు. ఉపశమనవాక్యాలు పలికాడు రాజపుత్రివి ఇలా ఏడ్వడం ధర్మంకాదని చెప్పాడు. దయమాలి ఈ ఘాతుకానికి పాల్పడ్డ అశ్వత్థామ తల నరికి నీ ముందు ఉంచుతాను. దాన్ని నీ పాదాలతో తొక్కి స్నానం చేసి శాంతించు అని ఊరడించాడు. కవచం ధరించి గాండీవాన్ని తీసుకొని హరి రథం తోలుతుండగా అశ్వత్థామవెంట బడ్డాడు. తనను చంపడానికి వస్తున్న విజయుడిని చూచి అశ్వత్థామ పిక్కబలం చూపి పారిపోయాడు. అలా పోయి పోయి, గుర్రాలు అలసిపోయినవని ఆగి, వెనకకు చూచి అర్జునుని చేతిలో చావు తప్పదని తెలుసుకొని ప్రాణరక్షణ కోసం బ్రహ్మశిరం అనే పేరుగల అస్త్రాన్ని ప్రయోగించాడు. ఆ అస్త్రాన్ని ప్రయోగించడమేగాని

ఉపసంహరించడం అతనికి తెలియదు. ఆ అస్త్రప్రయోగం కారణంగా ఒక మహాతేజం భూమినుంచి ఆకాశం వరకు వ్యాపించింది. వేగంగా తనవైపు వస్తున్న ఆ తేజాన్ని చూచి అర్జునుడు తన సారథి అయిన శ్రీకృష్ణుని ఇదేమిటి అని అడిగాడు. ద్రోణాచార్యుని పుత్రుడైన అశ్వత్థామ బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. ఆ బాణాగ్ని ఫలితమే ఈ తేజం అని ఆయన వివరించి, దీనిని ఎదుర్కోవాలంటే నీవుకూడా బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాలని సూచించాడు. అప్పుడు అర్జునుడు హరికి ప్రదక్షిణం చేసి తానుకూడా బ్రహ్మాస్త్రాన్ని వదిలాడు. రెండు బ్రహ్మాస్త్రాల ఫలితంగా భూనభోంతరాళాలు మంటలతో నిండిపోగా ప్రజలు ప్రళయం వచ్చిందని భయపడి హాహాకారాలు చేశారు. అప్పుడు మాధవుని అజ్ఞమేరకు ధనంజయుడు రెండు బ్రహ్మాస్త్రాలను ఉపసంహరించాడు. ద్రోణనందనుని వెంటబడి తరిమి పట్టుకొన్నాడు. త్రాళ్ళతో కట్టివేసి, రథంలో శిబిరానికి తీసుకొని వెళ్ళి చంపాలని నిశ్చయించుకున్నాడు. అప్పుడు శ్రీకృష్ణుడు కలగజేసుకొని భయపడి పారిపోయేవాడిని, మైమరచి నిద్రపోయేవాడిని, త్రాగిన మత్తులో ఉన్నవాడిని, సాధువును, జడుడిని, శరణుకోరినవాడిని, స్త్రీలను, చంపడం ధర్మంకాదని అర్జునునికి హితబోధ చేశాడు. ధర్మశాస్త్రం ప్రకారం హంతకుడైనా సరే బ్రాహ్మణునకు మరణశిక్ష లేదు. అర్జునుడు అదికూడా జ్ఞాపకం చేసుకొని, అశ్వత్థామను చంపకుండా శిబిరానికి తీసుకొనివచ్చి ద్రౌపది ముందుంచాడు. అశ్వత్థామ అపరాధి కనుక సిగ్గుపడి తలదించుకొన్నాడు. ద్రౌపది అశ్వత్థామకు నమస్కరించి ఇలా అన్నది: మా మగవారందరు మీ తండ్రివద్ద అస్త్ర శస్త్రవిద్యలు నేర్చుకున్నారు. నీవేమో కొంచెంకూడా దయలేకుండా శిష్యుల సుతులను వధించావు. ఇది న్యాయమా? బ్రాహ్మణపుటక పుట్టావు, విద్యాబుద్ధులు నేర్చావు. వీరుడిగా పేరు తెచ్చుకొన్నావు. ఇలా రాక్షసుడిలా ప్రవర్తించడం ధర్మమా? నా బిడ్డలు ఆయుధాలు పట్టి యుద్ధభూమిలోకి రాలేదే, నీకేమీ ద్రోహం చేయలేదే, అలాంటి చిన్నపిల్లలను, నిద్రపోతున్నవారిని చంపడానికి నీకు చేతులెట్లా వచ్చాయి? పుత్రశోకంతో నా మనస్సు వికలమై ఉంది. కిరీటి నిన్ను పట్టి, కట్టి, ఇక్కడకు ఈడ్చుకొని వచ్చాడని తెలుసుకొని నీ తల్లి ఎక్కడ ఎంతగా ఏడుస్తున్నదో గదా!

ఇలా అని కృష్ణార్జునులను చూచి, బ్రాహ్మణహింస వద్దంటూ, ద్రోణాచార్యులు మరణించినందుకు క్రుంగిపోయిన ఆయన భార్య ఇప్పుడీ కొడుకుని కూడా కోల్పోతే ఎంత బాధపడుతుందో ఆలోచించండని విన్నవించింది. విప్రులకు కోపం తెప్పించకూడదు. వారికి కోపంవస్తే ఆ అగ్నిలో రాజకులం అంతా సర్వనాశనమవుతుంది. అందుచేత దయచూపండి. ధర్మాన్ని పాటించండని ద్రౌపది చెప్పిన మాటలకు ధర్మరాజు సంతసించాడు.

భీముడుదప్ప పాండవులందరూ సమ్మతించారు. శ్రీకృష్ణుడు తలవూపాడు. కాని భీముడు మాత్రం కోపావేశంతో ఊగిపోయాడు. కొడుకుల బట్టి చంపెనని కోపం చెందక, విడిచిపెట్టుమని చెప్పుతున్నదీ వెర్రిబాగుల ద్రౌపది. పసిపిల్లలను పొట్టన పెట్టుకొన్న ఈ రాక్షసుడు విప్రుడని ఎవరు చెప్పారు? వీడిని మీరు చంపకపోతే నా పిడికిటి పోటుతో వీడి తలను వేయిప్రక్కలు చేస్తాను చూడండి అని అశ్వత్థామపైకి వెళ్ళబోయాడు. అప్పుడు ద్రౌపది అశ్వత్థామకు అడ్డం పోయింది. శ్రీహరి చతుర్భుజుడై, రెండు చేతులతో భీముని పట్టుకొన్నాడు. మిగిలిన రెండు చేతులతో ద్రౌపదిని ప్రక్కకునెట్టి భీమునితో ఇలా అన్నాడు. అశ్వత్థామ శిశుహంతకుడు, దురాత్మకుడు, ఆతతాయి, చంపదగినవాడు. అందులో సందేహం లేదు. కాని బ్రాహ్మణుడిని చంపకూడదని వేదాలు ఘోషిస్తున్నాయి కదా! ధర్మాన్ని పాటించడం మన కర్తవ్యం. బాగా ఆలోచించు, తొందరపడకు అని నచ్చజెప్పాడు. ద్రౌపదికి, నాకు, భీమసేనునికి సమ్మతమయ్యేది నీ ప్రతిజ్ఞకు భంగం వాటిల్లనిది అయిన ఉపాయం చెబుతాను. నేను చెప్పినట్లు చేయవలసిందని అర్జునునికి చెప్పాడు. నారాయణుని ఆజ్ఞమేరకు అర్జునుడు కత్తి పుచ్చుకొని అశ్వత్థామ శిగ కోసివేశాడు. తలవెంట్రుకలను అలంకరించిన రత్నాన్ని తీసుకున్నాడు. అతని వంటిపై కట్లు విప్పివేశాడు. తేజోవిహీనుడై సిగ్గుతో సగం చచ్చిన అశ్వత్థామ శిబిరం వదిలి తలవంచుకొని వెళ్ళిపోయాడు. చంపదగిన పని చేసినప్పటికి బ్రాహ్మణుడికి మరణశిక్ష వేయకూడదు. అతని ఆస్తిపాస్తులు తీసివేసుకోవడమో, తలగొరగడమో, ఆలయంనుంచి బహిష్కరించడమో చేయాలి.

ఆ తర్వాత పాండవులు, పుత్రులకు, మృతులైన బంధువులకు దహనక్రియాకర్మలు చేసి, ద్రౌపది, శ్రీకృష్ణుడు తోడురాగా గంగానదికి వెళ్ళి తిలోదకాలు వదిలి గంగలో స్నానం చేసి ఉండగా అక్కడికి వచ్చిన గాంధారీ, ధృతరాష్ట్రులను, కుంతిని చూచి మాధవుడు, మునీంద్రులు, బంధుమరణంవల్ల శోకిస్తున్నవారినందరిని పలకరించి ఉపశమన వాక్యాలతో వారిని శాంతింపజేశారు. నిండుసభలో పాంచాలిని కొప్పుపట్టుకొని ఈడ్చి, వస్త్రాపహరణం చేసి అవమానించిన కౌరవులను యుద్ధంలో చంపించి గోవిందుడు ధర్మరాజుకు రాజ్యాన్నిప్పించాడు. పేరుప్రఖ్యాతులు కల్పించాడు. మూడు అశ్వమేధయాగాలు చేయించాడు. ఇక పాండవులను వదిలి తనదైన ద్వారకానగరానికి బయలుదేరాడు శ్రీకృష్ణుడు. అంతలో తత్తరపడుతూ అక్కడకు వచ్చింది ఉత్తర. ఆవిడ అభిమన్యుని భార్య, అర్జునుని కోడలు, నిండుగర్భిణి. నా గర్భస్థమైన శిశువును చంపడానికి ఉగ్రరూపంలో వస్తున్న బాణాగ్నిని వారించి రక్షించడానికి నీవొక్కడివే సమర్థుడివి అని శ్రీహరిని ప్రార్థించింది. పాండవవంశ నాశంకోసం అశ్వత్థామ వదిలిన బ్రహ్మాస్త్ర ప్రభావమే ఇది

అని శ్రీకృష్ణుడు గ్రహించాడు. నిరంతరం తన సేవతప్ప మరొక చింతలేని సజ్జనులైన పాండవులపై ప్రేమతో, ద్రోణనందనుడు విడిచిన బ్రహ్మాస్త్రాన్ని అడ్డుకొనడానికి శ్రీకృష్ణుడు తన చక్రాన్ని ప్రయోగించాడు. బ్రహ్మాస్త్రం నిరర్థకమై నీరుగారిపోయింది. లోకాలన్నిటిని పుట్టించి పాలించి నశింపజేసే హరికి ఈ బాణనివారణం ఒక లెక్కలోనిది కాదు. ఆ విధంగా ఉత్తర గర్భస్థ శిశువైన పరీక్షిత్తుని శ్రీకృష్ణుడు తన చక్రాన్ని అడ్డువేసి రక్షించాడు. పాండవులు, ద్రౌపది, కుంతి సంతోషించి హరిని స్తుతించారు. పాండవమాతయైన కుంతి శ్రీకృష్ణుడికి నమస్కరిస్తూ లక్కఇంటిలో తనయులతో కూడి కాలిపోకుండా కాపాడావు, విషాహారంతిన్న భీమసేనుని రక్షించావు, ద్రౌపది మానాన్ని కాపాడావు, భీష్మద్రోణకర్ణాదులచే యుద్ధంలో చావకుండా నా బిడ్డలను రక్షించావు. అలాగే ఇప్పుడు విరాటరాజు పుత్రిక అయిన ఉత్తర గర్భాన్ని రక్షించి పాండవవంశాన్ని నిలబెట్టావు. నీవు చేసిన మేలుకు నిన్నెంత వర్ణించినా చాలదు. కంసునిచేత నానాబాధలు పడుతున్న నీ తల్లి దేవకిని కాచి రక్షించినట్లే నన్ను కూడా కౌరవులు పెట్టే బాధలనుంచి కాపాడావు. నీ గుణాలను పొగడడానికి నాకు శక్తి చాలదు అంటూ స్తుతించింది.

శ్రీ కృష్ణా, యదుభూషణా, నరసఖా, శృంగారరత్నాకరా,
లోకద్రోహి నరేంద్ర వంశదహనా, లోకేశ్వరా, దేవతా
నీక బ్రాహ్మణగోగణార్తిహరణా, నిర్వాణ సంధాయకా,
నీకున్ మ్రొక్కెద, ద్రుంపవే భవలతల్ నిత్యానుకంపానిధీ!

శ్రీకృష్ణుడు రథమెక్కి హస్తినాపురం వచ్చి కుంతీ, సుభద్రాదులనుంచి సెలవుతీసుకొని తన పురానికి బయలుదేరబోతుండగా ధర్మరాజు మరికొంతసేపు ఉండాలని ప్రార్థించాడు. బంధువధతో ధర్మరాజు శోకసంతప్తమానసుడయ్యాడు. రాజ్యంకోసం యుద్ధంచేసి తాతలు, తండ్రులు, కొడుకులు, గురువులు, సోదరులు, బ్రాహ్మణులు, బాలురు మొదలైన ఎందరి చావుకో కారణమయ్యాను. ఇంతటి పాపం చేసిన నాకు నరకం తప్పదని వేదన చెందాడు. ప్రజలను పాలించేరాజు ధర్మయుద్ధంలో శత్రువులను చంపినా పాపంలేదని శాస్త్రం చెబుతున్నది. అయినప్పటికి జ్ఞానదృష్టితో చూస్తే అది సమర్థనీయం కాదు. అసంఖ్యాకములైన చతురంగబలాల్ని చంపించాను. భర్తల్ని, బిడ్డల్ని పోగొట్టుకున్న స్త్రీలకు నావలన ఎంతో ద్రోహం జరిగింది. అశ్వమేధాది యాగాలు చేస్తే బ్రహ్మహత్యాది పాపాలు నశిస్తాయని వేదాలు చెబుతున్నాయి. కాని మురికిగా ఉన్న స్థలాన్ని బురదతోనూ, కల్లుకుండని కల్లుతోనూ శుభ్రంచేయడం ఎలా సాధ్యం కాదో అల్లాగే బుద్ధిపూర్వకంగా



90640

జీవహింస చేసే యాగాలవలన మనుష్యులకు పాపాలు పెరుగుతాయేగాని నశించవని నాకు శంకగా ఉంది అని శ్రీకృష్ణునితో మొరపెట్టుకున్నాడు. తర్వాత అంపశయ్యపై ఉన్న భీష్మ పితామహుని చూడాలనిపించింది. ధర్మరాజుతోపాటు కృష్ణార్జునులు, భీముడు, నకులసహదేవులు, పరిజనులు కూడా వెంటరాగా కురుక్షేత్రానికి వెళ్ళారు. ఆకాశంనుంచి నేలమీదపడిన దేవతలా ఉన్న గంగానందనుడైన భీష్ముని దర్శించి నమస్కరించారు. రాజర్షులు, దేవర్షులు, బ్రహ్మర్షులు అనేకులు శిష్యసమేతులై రాగా భీష్ముడు సంతసించి యథోచితంగా అందరికి స్వాగతసత్కారాలు, పూజలు చేయించాడు. వినయప్రేమసుందరులైన పాండునందనులను దగ్గర కూర్చుండబెట్టుకుని ప్రేమతో కన్నీళ్ళు నిండగా ఇలా అన్నాడు:

"భగవంతుడిని, బ్రాహ్మణులను, ధర్మాన్ని నమ్ముకొని బ్రతికిన మీకు ఎన్ని కష్టాలు వచ్చిపడినాయో తలచుకుంటే ఎంతో చిత్రంగా ఉంది. మృగశాపం వలన పాండురాజు మరణించగా, ఆ దుఃఖాన్ని దిగమ్రింగి మిమ్మల్ని కనిపెంచిన మీ తల్లి కుంతి ఎన్నడూ సుఖమంటే ఏమిటో ఎరుగదు. ధర్మతనయుడు ధర్మరాజు, దేవేంద్రుని కుమారుడు అర్జునుడు, ఆయనకు విల్లు గాండీవం. సారథి సాక్షాత్తు శ్రీహరి గదాధరుడైన వాయునందనుడు భీముడు ఆయనకు తోడు. ఇంతటి వీరులను కన్నతల్లి కుంతికి ఇన్ని ఆపదలు కలగడమేమిటో! కాలమహిమ గదా! గాలికి మేఘాలు చెల్లాచెదురై మళ్ళీ కలుస్తుంటాయి. ఈ ప్రపంచంకూడా అలాగే కాలప్రభావాన కలుస్తూ విడిపోతూ వుంటుంది. విచిత్రమైన ఈ కాలప్రభావాన్ని ఎవరూ తప్పించుకోలేరు. ఈశ్వరుడు ఎప్పుడు ఎవరికి ఏమిచేస్తాడో తెలుసుకోవడం మనిషికి సాధ్యంకాదు. కావున ఈశ్వరసంకల్పంవల్ల జరిగేదానికి చింతించనవసరం లేదు. మీరు కృష్ణుడు దేవకీపుత్రుడని, మేనత్తకొడుకని తలంచి దూతగా, సచివుడుగా, సారథిగా మీమీ పనులకు నియోగించుకొన్నప్పటికి ఆయనకేమీ లోటు రాలేదు. ఆయనకు రాగద్వేషాలు, ఉచ్చనీచాలు లేవు. సమదర్శనుడు, సర్వాత్మకుడు, సర్వేశ్వరుడు అయిన శ్రీకృష్ణపరమాత్మ భక్తవత్సలుడు. కమలములవంటి కన్నులతో, నాలుగు భుజాలతో కన్నులపండుగగా నా యెదుట నిలిచాడు. ఇది నా పుణ్యఫలం. నా భాగ్యమహిమ." అర్జునుడు విడిచిన బాణాలే శయ్యగా పడుకొని వున్న భీష్ముడు చెప్పిన ఈ మాటలు అందరూ వినయంగా విన్నారు. తర్వాత ధర్మరాజు భీష్మునిద్వారా నరజాతి ధర్మాలు, వర్ణాశ్రమధర్మాలు, ప్రవృత్తి నివృత్తి ధర్మాలు, దానధర్మాలు, రాజధర్మాలు, స్త్రీధర్మాలు, ధర్మార్థకామమోక్షాలను గురించి సంపూర్ణంగా తెలుసుకొన్నాడు. భీష్మునకు తన ఇచ్ఛానుసారం ప్రాణం వదలగల శక్తి వరంగా

లభించింది. యోగీశ్వరులు కోరుకొనే ఉత్తరాయణ పుణ్యకాలంలో ప్రాణం విడవాలని ఆయన సంకల్పించి అందుకోసం ఎదురుచూస్తున్నాడు. ఆ పుణ్యకాలం రావడంతో మరణానికి సిద్ధమయ్యాడు. మాటలు మాని మనస్సుని, దృష్టిని హరిమోముపై నిలిపాడు. బుద్ధిని పరమేశ్వరునికి సమర్పించాడు. మనసారా శ్రీకృష్ణుని స్తుతించాడు.

కుప్పించి యెగసిన గుండలంబుల కాంతి గగనభాగంబెల్ల గప్పికొనగ
నుఱికిన నోర్వక యుదరంబులోనున్న జగముల వ్రేగున జగతి గదల
జక్రంబు జేపట్టి చనుదెంచురయమున బైనున్న పచ్చని పటము జాఱ
నమ్మితి నాలావు నగుబాటు సేయక మన్నింపుమని క్రీడి మఱల దిగువ

గరికి లంఘించు సింహంబు కరణి మెఱసి
నేడు భీష్ముని జంపుదు నిన్ను గాతు
విడువుమర్జున యనుచు మద్విశిఖవృష్టి
దెరలి చనుదెంచు దేవుండు దిక్కు నాకు

ఒక సూర్యుండు సమస్త జీవులకు దానొక్కొక్కడై తోచు పో
లిక నేదేవుడు సర్వకాలము మహాలీలన్ నిజోత్పన్న జ
న్య కదంబంబుల హృత్సరోరుహములన్ నానావిధానూన రూ
పకుడై యొప్పుచునుండు నట్టి హరినే బ్రార్థింతు శుద్ధుండనై

సమస్త జీవరాశుల హృదయకుహరాలలో నివసించే పరమాత్మను ధ్యానిస్తూ తన హృదయంలో శ్రీకృష్ణమూర్తిని నిలుపుకొని భీష్ముడు తుదిశ్వాస విడిచాడు. వాసుదేవునిలో ఐక్యమయ్యాడు. భీష్మునికి ధర్మరాజు అంత్యక్రియలు జరిపించాడు. మునులందరూ తమ ఆశ్రమాలకు వెళ్ళిపోయారు. ధర్మరాజు కృష్ణునితో కలిసి హస్తినాపురం వెళ్ళి ధృతరాష్ట్రుని, గాంధారిని ఓదార్చి, వాసుదేవుని అనుజ్ఞపొంది, తాతలు తండ్రుల నుంచి సంక్రమించిన రాజ్యాన్ని స్వీకరించి ధర్మమార్గాన పాలన చేస్తున్నాడని సూతుడు చెప్పగా విని శౌనకుడిలా అడిగాడు.

బంధుజనమంతా యుద్ధంలో మరణించారనే దుఃఖంతో క్రుంగిపోయిన ధర్మరాజు రాజ్యపాలన చేయడానికి ఎలా ఒప్పుకున్నాడు?

సమాధానంగా సూతుడిలా చెప్పాడు: ఈ జగత్తు పరమేశ్వరుని అధీనంలో ఆయన ఆజ్ఞానుసారం నడుస్తుందిగాని స్వతంత్రంగా నిలువలేదు అని భీష్ముడు చేసిన బోధ,

శ్రీకృష్ణునితో జరిపిన సంభాషణల ఫలితంగా ధర్మనందనునిలో సందేహాలు తొలగిపోయి, జ్ఞానోదయం అయ్యింది. రాజ్యపాలన చేపట్టి చక్కగా నాలుగు సముద్రాలు హద్దులుగాగల భూమినంతటినీ యేలాడు.

శ్రీకృష్ణుడు చెల్లెలైన సుభద్రకోసం, చుట్టాలకోసం హస్తినాపురంలో కొన్నినెలలుండి ద్వారకానగరానికి బయలుదేరాడు. ధర్మరాజును కౌగిలించుకొని సెలవుతీసుకొన్నాడు. అలాగే తనకు నమస్కరించినవారినందరినీ కౌగిలించుకొని వీడ్కోలు చెప్పాడు. సుభద్ర, ద్రౌపది, కుంతి, ఉత్తర, గాంధారి, ధృతరాష్ట్రుడు, విదురుడు, యుధిష్ఠిరుడు, యుయుత్సుడు, కృపాచార్యుడు, నకులసహదేవులు, భీముడు, ధౌమ్యుడు, హరి రథమెక్కి పయనం కాగా శ్రీకృష్ణ వియోగాన్ని సహింపలేక కళ్ళలో నీళ్ళు క్రుక్కుకొని అదేపనిగా హరివెళ్ళిన మార్గాన్నే చూస్తూ నిలద్దారు. కొంతదూరం వెంట నడిచారు. ధర్మరాజు ఆయనక్కు తోడుగా చతురంగ బలాలను పంపాడు. తనవెంట వచ్చినవారిని వెనక్కు పంపి శ్రీకృష్ణుడు కురు, జాంగల, పాంచాల, శూరసేన, యాముక భూములు దాటి, బ్రహ్మావర్త, కురుక్షేత్ర, మత్స్య, సారస్వత, మరుధన్వ, సౌవీర, ఆభీర, విషయాలు గడచి ఆయా దేశాల ప్రజలిచ్చిన కానుకలు స్వీకరించి ఆవర్తమండలం ప్రవేశించాడు. సూర్యాస్తమయ సమయానికి ద్వారకను సమీపించాడు. తన శంఖమైన పాంచజన్యాన్ని పూరించి నగర ప్రజలకు తన రాకను ఎరుకపరిచాడు. బంధువులు, పౌరులు, గుర్రాలు, ఏనుగులు మొదలైన కానుకలతో ఎదురేగి ఆయనకు స్వాగతం పలికారు. భక్తితో స్తుతించారు. ప్రేమతో పలకరించారు. యధోచితంగా ప్రణామాలు, నమస్కారాలు చేశారు. కొందరు కౌగిలించారు. మరికొందరు కరస్పర్శ చేశారు. రాజమార్గమంతటా స్త్రీలు పువ్వులు చల్లారు. అలా వెళ్ళి వెళ్ళి హరి మొట్టమొదట తల్లిదండ్రుల నివాసాన్ని చేరుకొని దేవకి ఆదిగాగల ఏడుగురు తల్లులకు మ్రొక్కాడు. వారి ఆశీర్వాదాలు తీసుకొని 16108 సువర్ణ సౌధాలుగల తన అంతఃపురం ప్రవేశించాడు. ఒక భామ భవనంలో ముందుగా ప్రవేశిస్తే మరొక భామకు కోపం వస్తుందనే భావంతో ఆయన బహురూపియై ఒకేసారి అందరి దగ్గరకు వెళ్ళాడు. ఎవరికివారు 16108 మంది భార్యలూ కూడా శ్రీకృష్ణుడు తన ఇంటికే ముందు వచ్చాడని హర్షించారు. కృష్ణుడు వారి యోగక్షేమాల నడిగి పరామర్శించాడు. వారినందరిని ఆనందింపజేశాడు.

అంతవరకు విన్న శౌనకుడు సూతుడిని ఇలా ప్రశ్నించాడు: అశ్వత్థామ కోపంతో బ్రహ్మశిరమనే అస్త్రాన్ని ప్రయోగించగా అది ఉత్తర గర్భాన్ని కాల్చబోగా శ్రీహరి రక్షించాడని విన్నాం. ఉత్తర గర్భంలో ఉన్న బాలుడిని ఎలా కాపాడాడు? పుట్టిన తర్వాత

ఎన్నేళ్ళు బ్రతికాడు? ఏం చేశాడు? శుకుడు వచ్చి అతనికి జ్ఞానమార్గాన్ని ఎలా బోధించాడు? పరీక్షిత్తు చివరికి ఎలా చనిపోయాడు? ఇవన్నీ వివరంగా మాకు చెప్పండి.

సూతుడు మళ్ళీ చెప్పడం మొదలుపెట్టాడు: ధర్మరాజు నాలుగుదిక్కులా నాలుగు సముద్రాలు ఎల్లలుగాగల జంబూద్వీపరాజ్యాన్ని ఆర్జించాడు. మిన్నుముట్టిన కీర్తిని పొందాడు. ఏనుగులు, గుర్రాలు, స్త్రీలు, భటులు, బంగారం మొదలైన సిరిసంపదలు సంపాదించాడు. వీరసోదరులు, విప్రులు, విద్వాంసులతో కూడి వినోదించాడు. క్రతువులు ఆచరించాడు. దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేశాడు. ముకుందుని పాదపద్మాలను సేవించాడు. కామక్రోధాది అరిషడ్వర్గాన్ని జయించాడు. వైభవంగా రాజ్యాన్ని ఏలాడు. ఆకలితో అలమటించేవాడికి మంచిగంధం రాసినా తృప్తికలగనట్లు ధర్మనందనునికి సంపదలు ఎన్ని ఉన్నా సంతృప్తి కలగలేదు. చాలినంతగా భగవత్సేవ చేయలేకపోయాననే దిగులు ఆయనను పట్టుకుంది. ఇలా ఉండగా కొన్నిదినాలకు ఉత్తర గర్భంలో ఉన్న బాలునికి పదవనెల వచ్చింది. కాని గర్భంనుంచి బయటపడలేక, అశ్వత్థామ వదలిన బాణంవల్ల జనించిన అగ్నితాపానికి తట్టుకోలేక విలవిలలాడసాగాడు. ఈ సెగలనుంచి నన్ను రక్షించేవారెవరూ లేరా అని దైవాన్ని ప్రార్థించాడు. కొనవూపిరితో ఉన్న ఆ శిశువు ఆర్తనాదం విన్న పరమేశ్వరుడు వ్రేలెడంత దేహంతో ఆవిర్భవించి తన చేతిలోని గదాదండాన్ని శిశువు చుట్టూ దశదిశలా త్రిప్పి వేడిని పోగొట్టాడు. గర్భంలోని బాలుని పరితాపాన్ని నివారించాడు. తనను ఈ విధంగా కాపాడిన మహాశయుడెవ్వరో అని ఆలోచించి ఆ శిశువు తేరిపార చూచేలోగా హరి అదృశ్యమయ్యాడు. ఆ తర్వాత తారాబలం, గ్రహబలం అనుకూలంగా ఉన్న శుభఘడియలలో పాండవ వంశోద్ధారకుడైన బాలుడు జన్మించాడు. ధర్మరాజు, ధౌమ్యుడు మొదలైన పురోహితవర్గాన్ని పిలిపించి పుణ్యాహం చదివించాడు. జాతకర్మలు చేయించాడు. బ్రాహ్మణులకు గోవులు, భూములు, బంగారం, గుర్రాలు, గ్రామాలు దానంచేసి సంతృప్తికరంగా భోజనాలు పెట్టాడు. శ్రీకృష్ణుని అనుగ్రహంతో బ్రతికి బయటపడ్డ ఈ బాలుడు శత్రుసంహారం చేసి విష్ణురాతుడని ప్రసిద్ధి గడిస్తాడని బ్రాహ్మణులు ఆశీర్వదించారు. మీమనుమడు మనుపుత్రుడైన ఇక్ష్వాకుని మాదిరిగా ప్రజలను రక్షిస్తాడు. శ్రీరామచంద్రునివలె సత్యవాక్యపరిపాలకుడై బ్రహ్మజ్ఞానాన్ని పొందుతాడు. శిబిచక్రవర్తిలా దానగుణశీలుడవుతాడు. ధనంజయుడు, కార్తవీర్యుడు వంటి ధనుర్విద్యాపారంగతు డవుతాడు. కీర్తిప్రతిష్ఠల నార్జిస్తాడు. పెద్దలను ఆదరిస్తాడు. అశ్వమేధయాగాలు చేస్తాడు. పుత్రసంతానాన్ని కంటాడు. దుష్టుల్ని శిక్షిస్తాడు. నీ మనుమడు గొప్ప మానధనుడవుతాడు. ఇలా చాలాయేళ్ళు జీవించిన పిమ్మట,

పాముకాటు వలన తనకు మరణం తప్పదని, మునికుమారుని శాపఫలంగా తనకీ అకాలమృత్యువు ఆసన్నమైందని తెలుసుకొని విరాగియై ముకుందపాదారవిందాల్ని భజిస్తూ, శుకయోగీంద్రుని వలన బ్రహ్మజ్ఞానాన్ని పొంది, గంగాతీరాన శరీరాన్ని వదిలి, పైలోకాలకు వెళ్ళుతాడు. ఇలా పిల్లవాని జాతకఫలం చెప్పి బ్రాహ్మణులు వెళ్ళిపోయారు. అలా జన్మించిన పరీక్షిత్తు క్రమంగా పెరిగి పెద్దవాడయ్యాడు. ధర్మరాజుకు బంధువులను చంపిన బాధ పోలేదు. ఆ పాపం పోగొట్టుకొనడానికి అశ్వమేధయాగం చేయాలని సంకల్పించాడు. కాని ప్రజలవలన వచ్చే పన్నులు, అపరాధ రుసుములు యాగానికయ్యే ఖర్చుకు చాలవని విచారిస్తుండగా, శ్రీకృష్ణునిచేత ప్రేరేపితులైన భీమార్జునాదులు ఉత్తరదిక్కుగా వెళ్ళి భూమిలో పాతివున్న సువర్ణపాత్రలు మొదలైన ధనాన్ని తెచ్చి ఇచ్చారు. పూర్వము మరుత్తు అనే రాజు యాగం చేసి పరిత్యజించి భూమిలో నిక్షేపం చేసిన సంపద ఇప్పుడు పాండవుల యాగానికి సహాయపడింది. దాంతో వారు మూడు యాగాలు చేశారు. శ్రీకృష్ణుడు కొన్ని నెలలు హస్తినలోనే గడిపి, ధనంజయుడు తోడురాగా ద్వారకానగరానికి తిరిగి వెళ్ళాడు. ఇంతకుముందే తీర్థయాత్రకు వెళ్ళిన విదురుడు మైత్రేయమునిని కలిసి ఆయన ద్వారా బ్రహ్మజ్ఞానాన్ని పొంది కొంతకాలానికి హస్తినకు తిరిగి వచ్చాడు. ధృతరాష్ట్రుడు, పాండవులు ఆయనను కుశలమడిగి తెలుసుకొని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ధర్మరాజు విదురునికి భోజనం పెట్టి సత్కరించి, సుఖంగా విశ్రాంతి తీసుకొంటూ ఇలా అడిగాడు. మీరు ఇంతకాలం ఎక్కడ, ఎలా గడిపారు? ఏ తీర్థాలు దర్శించారు? మీవంటి భాగవతులకు తీర్థాలతో పనిలేదు గదా! మా తండ్రి చనిపోయిన తర్వాత పెదతండ్రి బిడ్డలు ఎన్నో బాధలు పెట్టినప్పుడు మీరు ప్రేమతో తండ్రిలా మమ్మల్ని కాపాడారు. విష్ణుసమానులైన మిమ్మల్ని చూస్తే తీర్థాలు సేవించిన పుణ్యం లభిస్తుంది. మీరు చూచిన, విన్న విశేషాలన్నిటిని మాకు చెప్పండి. ద్వారకకు వెళ్ళారా? శ్రీకృష్ణుడు, యాదవులు కుశలమేనా?

విదురుడు తన సమాధానంలో ప్రపంచవిషయాలన్నిటిని క్రమంగా చెప్పాడు కాని యదువంశం అంతరించిన విషయం మాత్రం చెప్పలేదు. తాను శూద్రుడైనందున శిష్టుల మరణం చెప్పగూడదనుకొన్నాడు. పైగా ఈ దుర్వార్త విని ధర్మరాజు తట్టుకోలేడని భావించాడు. విదురుడు పూర్వజన్మలో యముడు. మాండవ్యమహాముని శాపంవలన శూద్రుడుగా దాసికి జన్మించాడు. కాలగతి తెలుసుకోవడం చాలా కష్టం. పిల్లాపాపలతో సిరిసంపదలతో, సుఖభోగాలతో చల్లగా ఉన్నామనుకొన్న మనిషిని కాలసర్పం అకస్మాత్తుగా కాటువేస్తుంది. అది ఎరిగిన విదురుడు ధృతరాష్ట్రునితో ఇలా అన్నాడు:

పుట్టంధుండవు పెద్దవాడవు మహాభోగంబులా లేవు నీ
పట్టెల్లం జెడిపోయె దుస్సహ జరాభారంబుపై గప్పె నీ
చుట్టాలెల్లను బోయిరాలు మగడున్ శోకంబునన్ మగ్నులై
కట్టా! దాయల పంచనుండదగవే కౌరవ్య వంశాగ్రణీ!

ఒకప్పటి రాజభోగాలు నేడు లేవు. వయస్సు మళ్ళింది. చుట్టాలందరు యుద్ధంలో మరణించారు. పుట్టుగ్రుడ్డివి. ఆలు, మగడు ఇలా ఏడుస్తూ దాయాదుల పంచ బ్రతకవలసివచ్చింది. పాండవులను అంతమొందించడానికి వారున్న ఇంటికి నిప్పుపెట్టారు. వారి భార్యను నిండుసభలో నిలబెట్టి అవమానించారు. అడవులకు పంపారు. వారిని నానాయాతనలు పెట్టారు. బిడ్డలకు బుద్ధిచెప్పని ఈ గ్రుడ్డివాడు మాపైబడి తింటున్నాడు. వీడికి పిండం వండిపెట్టండని భీముడు నిష్ఠూరాలాడుతుంటే వారు పెట్టే తిండి తింటున్నావు. ఏమి బ్రతుకిది! ఇంక చచ్చిన నీ బిడ్డలు తిరిగివస్తారా? వెనుకటివలె బ్రతకగలవా? మనుమలతో ఆడగలవా? బ్రాహ్మణులకు దానధర్మాలు చేయగలవా? ఈ దేహం నిత్యం కాదు. ఎందుకీ మోహం అని మునివలె ఇల్లు విడిచి వెళ్ళిన నరుడికి ముక్తి లభిస్తుంది అని హితవు చెప్పాడు.

ఆ విధంగా విదురుడు ధృతరాష్ట్రునికి విరక్తి మార్గం ఉపదేశించగా అతనికి జ్ఞానోదయమయ్యింది. సంసారాన్ని త్యజించి హిమాలయాలకు వెళ్ళిపోయాడు. సాధ్వి అయిన ఆయన భార్య గాంధారి, భర్తతో పాటు తాను కూడా నిర్గమించింది. విదురుడు వారికి తోడుగా ఉన్నాడు. వారు వెళ్ళిన మరునాడు ధర్మరాజు మా పెదతండ్రి, పెదతల్లి, విదురుడు కనిపించడంలేదు, మమ్మల్ని విడిచి ఎక్కడికి పోయారో అని తల్లడిల్లుతూ సంజయుడితో చెప్పాడు. మా తండ్రి మరణించగా మమ్మల్ని చేరదీసి పెంచిన పెదతండ్రి పెద్దవాడైనాడు. పెదతల్లి పుత్రశోకంతో బాధపడుతున్నది. కపటంలేని కరుణామయులు. మా పినతండ్రి విదురుడు సౌజన్యమూర్తి, ప్రాణసఖుడు. మందబుద్ధులమైన మమ్ములను విడిచి ఎక్కడికి పోయారో ఏమో అంటూ పరితాపం చెందాడు. సంజయుడు కూడా తన ప్రభువు పోయిన జాడ తెలియక కన్నీరు పెట్టాడు. రాత్రి విదురునితో ఏవో మంతనాలు ఆడాడు. తెల్లవారి చూస్తే లేరు అని దుఃఖించాడు.

ఆ సమయంలో నారదుడు అక్కడికి వచ్చాడు. ధర్మరాజు, తమ్ములు లేచి నమస్కరించి దేవర్షిని పూజించారు. తర్వాత ధర్మనందనుడు, మహాత్మా! మా పెదతండ్రి, పెదతల్లి ఇంట్లోలేరు, ఎక్కడకు పోయారో తెలియదు, దయచేసి మీరైనా చెప్పండి, మీరు

సర్వజ్ఞులు, మీకు తెలియనిదేముంటుంది? అన్నాడు. అప్పుడు నారదమహర్షి ఇలా చెప్పాడు.

ఈ విశ్వమంతా ఈశ్వరుని వశమై ఉన్నది. ఒకరితో ఒకరిని కలిపేది, విడదీసేది ఆ పరమేశ్వరుడే. సంయోగవియోగాలు ఈశ్వరలీల. రక్షించేది, భక్షించేది, పాలించేది ఆ భగవంతుడే. పంచభూతాలతో ఏర్పడిన ఈ దేహం కాలానికి, కర్మకి, గుణాలకు అధీనమై ఉంటుంది కాబట్టి ఇంకొకరిని రక్షించే శక్తి దానికి లేదు. చేతులున్న జీవులకు నాలుగుకాళ్ళ జంతువులు ఆహారం. కాళ్ళున్న ప్రాణులకు కాళ్ళులేని మొక్కలవంటివి ఆహారం. పులివంటి పెద్దమృగాలకు అల్పజంతువులు ఆహారం. అన్ని శరీరాలలోను జీవుడున్నాడు. అందువలన జీవునికి జీవుడే జీవిక అవుతున్నది. మాయావి అయిన ఈశ్వరుడు జాతిభేదరహితుడై, భోగిగాను, భోగ్యరూపంలోను, అంతరంగంలోను, బహిరంగంగాను కూడా ప్రకాశమై వుంటాడు. కాబట్టి అనాథులు, దీనులు అయిన నా తల్లిదండ్రులు నన్ను వదిలివెళ్ళి ఏమైపోతారో ఎట్లా బ్రతుకుతారో అని నీవు విచారించనవసరం లేదు. అజ్ఞాన కారణంగా ఏర్పడిన బంధుప్రేమ నీ మనోవ్యాకులతకు దారితీసింది. దాన్ని వదిలివేయి. అఖిలాత్ముడైన విష్ణువు కాలరూపుడు. అసురులను నాశనం చేయడానికి అవతరించి దేవకార్యాన్ని తీరుస్తున్నాడు. ఎంతకాలం ఆయన ఈ భూమిపై వుంటాడో అంతకాలం మీరూ వుండండి. ఆ తర్వాత పనిలేదు. కాలం తన పని తాను చేసుకొంటూ పోతుంది. దాన్ని ఎవరూ అతిక్రమించలేరు. అనవసరంగా భ్రాంతికి గురియై మనోవ్యధ చెందకు అని చెప్పాడు.

ధృతరాష్ట్రుడు, గాంధారి, విదురుడు హిమవత్పర్వత దక్షిణభాగాన మునివనానికి వెళ్ళారు. ఆకాశగంగ ఏడుపాయలై ప్రవహించిన పుణ్యతీర్థంలో స్నానం చేసి హోమం చేసి, నిరాహారుడై మంచినీళ్ళు మాత్రమే త్రాగి ధృతరాష్ట్రుడు తపోదీక్షలో కూర్చున్నాడు. ఇకపై ఐదుదినాలకు యోగాగ్నిలో ఆయన దేహం కాలిపోతుంది. గాంధారి కూడా భర్తతోపాటు అగ్నిలో పడి బుగ్గి అయిపోతుంది. వారి మరణం చూచి చింతించి విదురుడు తీర్థయాత్రలకు వెళ్ళిపోతాడు అని చెప్పి నారదుడు స్వర్గానికి నిర్గమించాడు.

కాలం మారిపోయింది. చెడుదినాలు వచ్చాయి. దుశ్శకునాలు కనిపిస్తున్నాయి అంటూ ఒకనాడు ధర్మరాజు భీమునితో తన మనస్సులోని ఆందోళనను బహిరంగపరిచాడు. ఒక కాలంలో పండే ఓషధులు మరోకాలంలో పండటం లేదు. జనంలో క్రూరత్వం, క్రోధం, లోభం, బొంకడం పెచ్చుమీరిపోయాయి. కపట వ్యవహారాలు, స్నేహితులను మోసం చేయడం, తండ్రులపై కొడుకులు కత్తిదూయడం, భార్యలు భర్తలను ద్వేషించడం,

శిష్యులు గురువులను దూషించడం, శాస్త్రానుసారం పనులు చేయకపోవడం, న్యాయమార్గాన నడవకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. కాలగతి వింతగా వుంది.

మరొకవైపు చూస్తే కృష్ణుని దగ్గరకు అర్జునుడు వెళ్ళి ఏడునెలలయ్యింది. ఏ సందేశమూ లేదు. యాదవులు ఎలా వున్నారో ఏమో? కృష్ణుడు క్షేమంగా ఉన్నాడో లేదో? నా మనస్సు పరిపరివిధాల పోతున్నది. కలవరపడుతున్నది. ఈశ్వరేచ్ఛ ఎలాగుందో తెలియదు. తమ్ముడా, నాకన్నీ దుశ్శకునాలు కనిపిస్తున్నాయి. మనస్సంతా ఆందోళనగా వుంది. నారదుడు చెప్పినట్టు చెడుకాలం వచ్చింది. కుక్కలు నా ముందే మొరుగుతున్నాయి. నక్కలు సూర్యుని చూచి ఏడుస్తున్నాయి. గుర్రాలు కంటనీరు పెడుతున్నాయి. ఏనుగుల్లో శక్తి సన్నగిల్లింది. హోమశాలల్లో అగ్ని మండడంలేదు. ఆకాశమంతా పొగతో నిండిపోయింది. మేఘాలు రక్తాన్ని వర్షిస్తున్నాయి. ఆవులు దూడలకు పాలివ్వడం లేదు. దేవతారూపాలు కదులుతున్నాయి. కన్నీరు పెడుతున్నాయి. కాకులు అరుస్తున్నాయి. గుడ్లగూబలు పగలే కూస్తున్నాయి. ఈ భూమికి ఏ ఆపద రానున్నదో? భూమాతకు మాధవుని పాదాలు ముట్టుకునే భాగ్యం ఇక లేదేమో? యదుసింహుని వృత్తాంతం ఏమీ తెలియడం లేదు అని ధర్మరాజు భీమునితో విచారిస్తుండగా అర్జునుడు వచ్చాడు.

రావడం రావడం అర్జునుడు విలపిస్తూ అన్నగారి పాదాలపై బడి కన్నీరు గార్చాడు. ఏడుస్తున్న తమ్ముడిని చూచి ధర్మరాజు తెల్లబోయాడు. అర్జునా! ఏమైంది చెప్పు. మేనత్తలు, మామలు, తాత అందరూ సుఖమే గదా! అక్రూరుడు, ఉగ్రసేనుడు బాగున్నారా? బలరాముడు, అనిరుద్ధుడు ఎలా వున్నారు? హరికుమారులు కుశలమేగదా! భక్తవత్సలుడైన గోవిందుడు క్షేమమేనా? ఇంతకుముందు అనేక యుద్ధాలు చేశావు కాని కన్నీరు ఎన్నడూ పెట్టలేదు. ఎందుకిలా దీనంగా విలపిస్తున్నావు? ఏం జరిగిందో చెప్పవూ అని అడిగాడు.

అర్జునుడు అప్పుడు కన్నీళ్ళు తుడుచుకొని, మహానిధి పోయినట్లు నిట్టూరుస్తూ, గద్గదస్వరంతో ఇలా అన్నాడు: మన సారథి, మన సచివుడు, మన వియ్యం, మన సఖుడు, మన బాంధవుడు, మన విభుడు, గురువు, దేవర మనల్ని విడిచి వెళ్ళిపోయాడు. మత్స్యయంత్రాన్ని గొట్టి ద్రౌపదిని చేబట్టడం, ఇంద్రుడిని ఎదిర్చి ఖాండవవనాన్ని అగ్నికి సమర్పించి గాండీవాన్ని పొందడం, రాజులనెల్ల గెలవడం, ఇవన్నీ ఆ హరి దయవల్లనే సాధ్యమయ్యాయి. ద్రౌపదీ మానసంరక్షణం చేసిన ఆ మహనీయుడే మనకు శత్రుశేషం లేకుండా చేశాడు. ఆయనవల్లనే మన ప్రతిజ్ఞలన్నీ నెరవేరాయి. స్నేహితుడిగా, బంధువుగా, దాతగా, గురువుగా, మంత్రిగా, సారథిగా ఎన్నిరకాలగానో చనువిచ్చాడు, ప్రేమించాడు,

కరుణించాడు, కాపాడాడు, క్షమించాడు, కలిసిమెలిసి తిరిగాడు, అట్టి మాధవుడిని ఎట్లా మరువగలం? తన సంసారంలో ప్రేమకలహాలు వచ్చి ఆడువారు అలకబూనితే ఆ తగవులు తీర్చడానికి నన్ను పంపేవాడు. అట్టివాడు పోయినా నా ప్రాణాలింకా వున్నాయి. ఏం బ్రతుకు నాది? శ్రీకృష్ణుని మరణానంతరం ఆయన అంతఃపుర స్త్రీలను తీసుకొని నేను వస్తుంటే అడవుల్లో బోయలు దాడిచేసి వారిని చెరపట్టారు. నేను అసహాయుడినై చూస్తూ వుండిపోయాను. శ్రీకృష్ణుడు మరణించిన క్షణమే నా శక్తులన్నీ పోయాయి. అస్త్రశస్త్రాలు పనిచేయడం లేదు. నిర్వీర్యమైపోయాయి. యాదవవీరులు మునిశాపంవలన తమలో తాము కలహించి పోరాటంలో మరణించారు. చావుపుట్టుకలు, పోషణ భగవంతుడే నిర్ణయిస్తాడు. బలవంతులు బలహీనులను చంపారు. యాదవవంశం నాశనమైపోయింది. భూభారాన్ని తగ్గించడానికి వచ్చిన అచ్యుతుడు తన అవతార ధర్మాన్ని నెరవేర్చాడు.

ఆ విధంగా అన్నకు చెప్పి అర్జునుడు క్రమంగా శోకాన్ని దిగమ్రింగి, గోవిందుని చరణాలపై భక్తితో కామక్రోధాదులను జయించి కురుక్షేత్రరణరంగంలో భగవానుడు వుపదేశించిన గీతావాక్యాలను తలచుకొంటూ దినాలను గడుపుతున్నాడు. ధర్మరాజు, నారదుడు చెప్పినట్లే జరుగుతున్నదని నిశ్చలచిత్తుడై స్వర్గానికి వెళ్ళే ప్రయత్నం చేస్తున్నాడు. యదువుల నాశము, మాధవుని నిర్యాణము తెలుసుకొన్న పాండవమాత కుంతి భక్తితో భగవంతుని చింతిస్తూ ప్రాణాలు వదిలింది. ముల్లు గ్రుచ్చుకొన్నప్పుడు తెలివిగలవాడు మరొక ముల్లు సహాయంతో కాలిలోని ముల్లును తొలగించి రెండుముళ్ళనూ పారవేస్తాడు. అలాగే భగవానుడు యాదవరూప శరీరంతో వచ్చి లోకకంటకాలైన శరీరాలను సంహరించి తన శరీరాన్ని కూడా విడిచిపెట్టాడు. ఈశ్వరునికి అన్ని శరీరాలు ఒక్కటే. నటుని మాదిరిగా వేర్వేరు రూపాలు ధరించి లీలలు ప్రదర్శిస్తాడు. శ్రీకృష్ణభగవానుడు ఏ దినమైతే ఈ భూమిపై తన దేహాన్ని వదిలిపెట్టాడో ఆనాడే కలియుగం ప్రారంభమయ్యింది. కలి ప్రవేశంతో క్రూరత్వం, హింస, అసత్యాలు, కుటిలత్వం వంటి అధర్మ లక్షణాలు వ్యాప్తిచెందాయి.

## ధర్మరాజు రాజ్యపరిత్యాగం

ధర్మరాజుకు ప్రపంచంపట్ల విరక్తి కలిగింది. రాజ్యాన్ని మనుమడైన పరీక్షిత్తుకు అప్పగించాడు. శ్రీకృష్ణుని మనుమడైన వజ్రునికి మధురారాజ్యాన్ని వశం చేశాడు. ప్రాజాపత్యమనే యజ్ఞం చేసి అహంకారాన్ని త్యజించాడు. బంధనాలన్నిటిని త్రెంచుకున్నాడు.

నారచీరలు ధరించాడు. మౌనం పాటించాడు. నిరాహారదీక్ష పట్టాడు. మనస్సులో బ్రహ్మభావం నిలుపుకొని ఉత్తరదిశగా పయనమయ్యాడు. అతని తమ్ములు కూడా ప్రజల్లో పాపకర్మలు పెరగడం చూచి విరక్తులయ్యారు. భగవంతుని మదిలో నిలుపుకొని భక్తితో సేవించారు. శుద్ధాత్మలతో నారాయణుని స్థానానికి వెళ్ళారు. విదురుడు ప్రభాసతీర్థంలో హరియందు చిత్తాన్ని నిలిపి శరీరాన్ని విడిచాడు. తన అధికారస్థానమైన యమలోకానికి వెళ్ళి తిరిగి యముడిగా తన పదవిని స్వీకరించాడు. ద్రుపదుని పుత్రిక ద్రౌపది పతులకు దూరమై వాసుదేవుని కొలిచి వైకుంఠానికి వెళ్ళింది. కృష్ణుడు, పాండవులు ఆ విధంగా అవతారాలు చాలించారు.

హస్తినాపుర సింహాసనాన్ని అధిష్ఠించిన పరీక్షిత్తు విద్వాంసులైన విప్రులవద్ద విద్యలనభ్యసించి, మహాభాగవతుడై భూమిని పాలించసాగాడు. ఉత్తరుని పుత్రిక ఇరావతిని పెండ్లిచేసుకొని జనమేజయుడు మొదలైన నలుగురు కొడుకులను కన్నాడు. గంగవొడ్డున కృపాచార్యుని గురువుగా చేసుకొని మూడు అశ్వమేధయాగాలు ఆచరించాడు. భూరిగా బ్రాహ్మణులకు దానాలు చేశాడు. దిగ్విజయకాలంలో రాజచిహ్నాలతో వున్న శూద్రపురుషుడైన కలి గోమిథునాన్ని తన్నుతుండగా అడ్డుకొని దండించాడు. ఇలా సూతుడు చెబుతుంటే శౌనకుడు ఆపి, రాజురూపంలో వున్న శూద్రుడు గోవులను ఎందుకు తన్నాడు, పరీక్షిత్తు కలిని ఎలా దండించాడు? వివరంగా చెప్పవలసిందని కోరాడు. సరేనని సూతుడు మళ్ళీ చెప్పసాగాడు.

## కలి ప్రవేశం

పరీక్షిన్నరేంద్రుడు తన సైన్యరక్షణలో వున్న కురుజాంగల దేశంలో కలి ప్రవేశించాడని విని చతురంగబలాలతో, సింహధ్వజుడై రథమెక్కి దండయాత్రకు బయలుదేరాడు. ఇలావృత, రమ్యక, హిరణ్మయ, హరివర్ష, కింపురుష, భద్రాశ్వ, కేతుమాల, భారతవర్షాలను, ఉత్తర కురుదేశాలను జయించాడు. ఆయాదేశాలలో కథకులు పూర్వరాజుల వృత్తాంతాలను చెప్పగా విన్నాడు. పాండవులకు శ్రీకృష్ణుడు ఎన్ని విధాల సహాయం చేసిందీ, అశ్వత్థామ వదిలిన బ్రహ్మాస్త్రప్రభావంనుంచి తనను కాపాడిన వైనం, యాదవుల, పాండవుల స్నేహానుబంధం, వారికి కలిగిన భక్తి మొదలైన విశేషాలను ఆశ్చర్యంతో విన్నాడు. పద్మనాభుని పాదపద్మాలను భజించి పవిత్రమానసుడయ్యాడు. ఇలావుండగా ఒకచోట ఒక వృషభం ఒంటికాలిమీద తిరుగుతూ కనిపించింది. అది ధర్మదేవత. సమీపంలో ఏడుస్తున్న గోవును చూచి, భూదేవి గోరూపంలో వున్నదని గ్రహించి, ఎందుకు

ఏడుస్తున్నావని అడిగింది. భూభారాన్ని తగ్గించడానికి ఈశ్వరుడు మానవాకారం ధరించి కృష్ణుడుగా మెలగి నిత్యానందం చేసి పోగా ఇప్పుడు అనాధనయ్యానని, ఇకమీదట ఏ కష్టాలు రానున్నాయోనని భయపడి విచారిస్తున్నావా అని ప్రశ్నించింది.

అప్పుడు భూదేవి ఇలా అన్నది: ఈ లోకంలో పూర్వం నాలుగు పాదాలమీద నడిచేదానివి. ఇప్పుడు శ్రీకృష్ణుడు లేకపోవడంతో నీకు ఒంటికాలు అయ్యింది కదా! లెక్కలేనన్ని సద్గుణాలుగల చక్రి అవతారం చాలించగా ఘోరకలి ప్రేరణవలన పాపకర్ములైన ప్రజలను చూచి నేను విచారిస్తున్నాను. దేవతలకు, ఋషులకు, పితృదేవతలకు, నాకు, నీకు, బుద్ధిమంతులందరికి, గోవులకు ఇక అన్నీ బాధలే అని తలచుకొని దుఃఖిస్తున్నాను. వాసుదేవుని శ్రీచరణాల స్పర్శ ఇక లభించదని బాధపడుతున్నాను.

ఇలా సరస్వతీతీరంలో ధర్మదేవత, భూదేవి – వృషభ, ధేనురూపాలలో సంభాషించగా అక్కడికి పరీక్షిత్తు వచ్చాడు. ఆ సమయంలో రాజువేషంలో వున్న శూద్రుడొకడు రాక్షసంగా తన్ని వృషభాన్ని నేలమీద కూలద్రోయడం చూచాడు. తర్వాత అతడు గోవును కూడా తన్నడం చూచి పరీక్షిత్తు విల్లెక్కుపెట్టి ఇలా అన్నాడు: "నిన్నేమన్నా కొమ్ములతో పొడిచాయా, అడ్డుపడి త్రోసినాయా, అన్యాయంగా ఆ గోవులను ఎందుకు తన్నావు? నా రాజ్యంలో ఎప్పుడూ ఇలాంటి నేరాలు చేయరాదని తెలియదా? కృష్ణార్జునులు భూమిపై లేరని, మదమెక్కి సాధువులను బాధించే నీవు శిక్షార్హుడవు". తర్వాత వృషభరూపంలో వున్న ధర్మదేవత నుద్దేశించి, "ఎవరికివారు తమ కన్నీరు తుడుచుకోవడమేగాని అధర్మప్రవర్తనవల్ల జంతుకోటికి కలుగుతున్న బాధలను తీర్చి వాటి కన్నీటిని తుడవడానికి ఎవరూ సిద్ధంగా లేరు. నా వాడిబాణాలతో కొట్టి ఈ దుష్టుడికి బుద్ధిచెబుతాను. నిన్ను నాలుగు పాదాలమీద నడిపిస్తాను" అని ఉపశమనవాక్యాలు పలికాడు. "అడవులలో గడ్డితిని సెలయేళ్ళలో నీరు త్రాగి బ్రతికే నీకు ఈ దుర్గతి పట్టించిందెవరు? నీ కాళ్ళు విరగగొట్టినవాడు నేలపై దాగినా నింగికెగసి పారినా విడిచిపెట్టను. వాడి చేతులు నరికి పారేస్తాను" అని అభయం యిచ్చాడు. తర్వాత గోరూపంలో వున్న భూదేవితో ఇలా అన్నాడు. "శ్రీకృష్ణుడు వెళ్ళిపోయాడనే దుఃఖంతో కన్నీరు పెట్టకు. ఈ శూద్రుణ్ణి చంపుతాను. నువ్వు భయపడవద్దు. సాధుజంతువులను బాధించే దుష్టులను శిక్షించని రాజు ఇహపరాలు రెండూ కోల్పోతాడు. దుష్టులను శిక్షించడానికి, శిష్టజనులకు మేలు చేయడానికి బ్రహ్మ రాజులను సృష్టించాడు. కాబట్టి ఇది నా ధర్మం".

ఈ మాటలు ఆలకించి ధర్మదేవత ఇలా అన్నది: "మేము ఏ ప్రాణికీ దుఃఖాన్ని

కలిగించం. మావలన ఏ పురుషునికీ దుఃఖం కలుగదు. అసలు ఈ సుఖదుఃఖాలను ఇచ్చేదెవరు? యోగీశ్వరులు ఆత్మ అంటారు. దైవజ్ఞులు గ్రహదేవతలంటారు. మీమాంసకులు కర్మవల్లనే కష్టసుఖాలు ప్రాప్తిస్తాయంటారు. లోకాయతికులు స్వభావంవల్ల అలా జరుగుతుందంటారు. కాని సుఖాన్ని, దుఃఖాన్ని ఇచ్చే శక్తి వీటికి లేనేలేదు. ఎవరివల్లనో దుఃఖం వచ్చింది. వారు అధర్మంగా ప్రవర్తించారు అని విచారించనక్కరలేదు. ఈశ్వరాజ్ఞ లేనిదే ఏమీ జరగదు. మనకు ఏది లభించినా అది పరమేశ్వరుని కృపవల్లనే అని తెలుసుకోవాలి".

ఈ మాటలు విని పరీక్షిత్తు ధర్మదేవతను అభినందించాడు. "దేవమాయవలన జీవులకు చంపేదెవరో చచ్చేదెవరో సులభంగా అర్థంకాదు. నీవు ధర్మదేవతవు. పరమధర్మాన్ని చెప్పావు. కృతయుగంలో తపమూ, శౌచము, దయ, సత్యమూ ఈ నాలుగూ నీకు పాదాలని చెబుతారు. త్రేతాయుగంలో నాల్గవపాదం పోయింది. ద్వాపరయుగంలో మరో రెండు పోయాయి. ఇప్పుడీ కలియుగం అంతమయ్యేసరికి ఆ మిగిలిన పాదాన్ని కూడా విరగగొట్టాలని అధర్మం ఎదురుచూస్తున్నది. లక్ష్మీరమణుడైన శ్రీహరి భూభారాన్ని తొలగించడానికి భూమిపై పాదాలు పెట్టగా భూదేవి ఇంతకాలం ఆనందించింది ఇప్పుడు ఆ చరణస్పర్శ లేనందున, శూద్రులు భూమిని యేలబోతున్నారనే బాధతో భూదేవి ఎలా శోకిస్తున్నదో చూడు" అని ధర్మదేవతకు చెప్పాడు. ఆ విధంగా ధర్మదేవతని, భూదేవిని బుజ్జగించి అర్జునుని మనుమడైన పరీక్షిత్తు మెరుపులా తన ఖడ్గాన్ని జళిపించి కలిని రూపుమాపడానికి సిద్ధంకాగా వాడు రాజరూపాన్ని వదిలి, భయంతో చేతులు చాపి మహారాజు కాళ్ళమీద పడ్డాడు. వణుకుతూ చంపవద్దని వేడుకొన్నాడు. శరణుకోరుతున్నాను, రక్షించుమని మ్రొక్కాడు. "భయంతో శరణన్నవానిని చంపడానికి నా మనస్సు ఒప్పడం లేదు. మా వంశమర్యాదకు అది విరుద్ధం. అందువలన నీ దుష్టస్వభావాన్ని విడిచిపెట్టి దూరంగా పో. నేను పాలించే దేశాలలో నీవు వుండడానికి వీల్లేదు. అసత్యం, చౌర్యం, లోభం, దౌర్జన్యం, దురాచారం, మాయ, కలహం, కపటం, కాలుష్యం, దరిద్రం ఇటువంటివన్నీ నిన్ను ఆశ్రయించి వుంటాయి. బ్రహ్మావర్తదేశం సత్యధర్మాలకు నిలయం. ఇక్కడ హరిగురించి యాగం జరుగుతున్నది కాబట్టి నీవు తక్షణం వెళ్ళిపో" అని కలిపురుషుని పరీక్షిత్తు హెచ్చరించాడు.

"మీ ఖడ్గాన్ని చూస్తే నాకు వణుకు పుడుతున్నది. గుండెలు అవిసిపోతున్నాయి. ఎక్కడికి పోయినా మీ రూపమే నన్ను భయపెడుతుంది. ఎక్కడికని పొమ్మంటారో మీరే చెప్పండి" అన్నాడు కలి.

ప్రాణివధ, స్త్రీ, జూదం, మద్యపానం - ఈ నాలుగు స్థానాలను నీవు వుండడానికి ఇస్తున్నాను. ఇవి చాలకుంటే ధనమూలమైన అసత్యం, మదం, కామం, హింస, వైరం అనే మరో ఐదుస్థానాలు తీసుకొని ఇతర స్థలాల్లో ఎక్కడా కనిపించకుండా పొమ్మని పరీక్షిన్మహారాజు ఆదేశించాడు. ఇలా కలిని అదుపులో పెట్టి, ధర్మదేవతకు తపము, శౌచము, దయ అనే మూడు పాదాలను తిరిగి ఇచ్చి భూమాతకు అపారమైన ఆనందాన్ని కలుగజేశాడు.

శుభచరితుడైన శ్రీకృష్ణుడు నిర్యాణం చెందాక ధరిత్రి అంతటా కలి ప్రవేశించినప్పటికి పరీక్షిత్తు ఆజ్ఞమేరకు ఆ మహారాజు బ్రతికినంతకాలం అణగిమణగి వున్నాడు. కలియుగంలో పాపాలు చేస్తేనే పాపఫలాన్ని అనుభవిస్తాం కాని పుణ్యాలు చేయదలిచినా, చేస్తానన్నా చాలు సత్ఫలితం కలుగుతుంది కాబట్టి మహారాజు కలిని తుదముట్టించక వదిలివేశాడు. పెద్దలను శాస్త్రాలను లెక్కచేయకుండా మదించి తిరిగేవాళ్ళపైన, మనోబలంలేని వాళ్ళపైన కలి ప్రభావం వుంటుంది కాని ధీరులైనవారికి కలిభయం వుండదని ఆయన భావించినందున అలా చేశాడని సూతుడు చెప్పగా విన్న ఋషులు ఇలా అడిగారు. పరమభాగవతుడు పాండవపౌత్రుడు అయిన పరీక్షిత్తు శుకుని మాటలు విని నిర్మలహృదయుడై ఎలా ముక్తిపొందాడో చెప్పండి. విష్ణుచరిత్ర విన్నందువలన పుణ్యం కలుగుతుంది. కాబట్టి పరీక్షిత్తుకు శుకుడు చెప్పిన భాగవత కదని మాకు వినిపించండి అనగా సూతుడు మళ్ళీ చెప్పడం మొదలుపెట్టాడు.

మీలాంటి పెద్దలు విష్ణుకథలు చెప్పండని అడగడం, అలా చెప్పే భాగ్యం నాకు కలగడం వలన నా జన్మ సఫలమైంది. నారాయణుని కథలు వినిపించిన కులహీనుడు కూడా ఉన్నతకులాన్ని పొందుతాడు. పక్షి ఆకాశానికి ఎగిరినా ఆకాశం హద్దులు తెలుసుకోలేదు. అలాగే ఎవరి శక్తికొలది వారు హరిని గూర్చి చెప్పుతారేగాని సర్వమూ చెప్పగల సమర్థులెవరూ లేరు. నాకు తెలిసినంతవరకు మీకు ఇప్పుడు చెబుతాను.

## పరీక్షిత్తుకు శాపం

ఒకనాడు పరీక్షిన్మహారాజు వేటకోసం అడవికి వెళ్ళాడు. ఉత్సాహంతో క్రూరమృగాలను వేటాడి చంపాడు. మృగాలవెంట తిరిగి తిరిగి అలిసిపోయాడు. దాహమయ్యింది. నీటికోసం వెదికాడు. అలా వెళ్ళి వెళ్ళి ఒక తపోవనం చేరాడు. అక్కడ శమీకుడనే మహాముని తపస్సు చేసుకొంటున్నాడు. బాహ్య స్పృహలేకుండా సమాధి నిష్ఠుడై వున్నాడు. మహారాజుకు నోరు ఎండిపోయింది. ఆకలిచేత నీరసం వచ్చింది. అందువలన

మహాముని ఏ స్థితిలో వున్నాడో కూడా చూడకుండా ఆయన దగ్గరకు వెళ్ళి నాకు దప్పికగా వుంది, మంచినీళ్ళిచ్చి నా దాహాన్ని తీర్చుమని అడిగాడు. ముని మాట్లాడలేదు. ఈ బ్రాహ్మణుడికి ఇంతగర్వమా, రమ్మని చేతితో సైగ కూడా చేయలేదు. మంచినీళ్ళు ఇవ్వమంటే మాట్లాడడు. తినడానికి పళ్ళుదెచ్చి ఇవ్వడు. తపస్సు చేశానని ఇంత అహంభావమా! దప్పికగొన్నవారికి త్రాగడానికి నీరు ఇవ్వడం కనీసధర్మంగదా! అదికూడా చేయడేమిటి అని రాజుగారికి కోపం వచ్చింది. తన్ను అవమానించినట్లు భావించి లేచివెళ్ళి ఒక చచ్చిన పామును తెచ్చి శమీకుని మెడలో వేశాడు. అక్కడనుంచి పయనమై తన రాజధానికి వెళ్ళిపోయాడు.

ఆ తపోవనంలో వున్న మునికుమారులు శమీకుని కుమారుడైన శృంగి వద్దకు వెళ్ళి జరిగినదంతా చెప్పారు. రాజుగారు నీ తండ్రి మెడలో పామును వేసి వెళ్ళిపోయాడని తెలియజేశారు. శృంగికి పెద్దకోపం వచ్చింది. కందమూలాలు భక్షిస్తూ తపస్సు చేసుకొంటున్న మా తండ్రి ఎవరి జోలికీ పోడు. విష్ణుని దప్ప ప్రపంచాన్ని మరచి, సమాధిలో వున్నవాడి మెడలో పాము వేయవలసిన అవసరం ఏమిటి? మేము వెళ్ళి దానాలు ధర్మాలు అడుగలేదే? అడవుల్లో ముక్కుమూసుకొని కూర్చున్న మునీంద్రుని పట్ల ఇంతటి అపచారం చేస్తాడా? సిరిసంపదలు వుంటే నలుగురూ మెచ్చుకొనేలా తిండి తింటారు, బట్ట కడతారుగాని అడవుల్లో ఇడుమలు పడుతున్న బడుగులను అవమానిస్తారా? గోవిందుడు ఈ ప్రపంచాన్ని విడిచివెళ్ళాక శాసించే ధర్మమూర్తులు లేరని దుర్జనులు విజృంభించి సాధుజనులను బాధించడం శోచనీయం. రాజు చేసింది క్షమించరాని నేరం. అతడిని శపిస్తానంటూ శృంగి లేచి కౌశికీనదికి వెళ్ళి నీటిని ముట్టుకొని, మౌనంగా తపస్సు చేసుకొంటున్న మా తండ్రి మెడలో చచ్చిన పామును వేసిన మదాంధుడైన మహారాజు తక్షకుడనే పాముకాటుతో ఏడవనాడు మరణించుగాక అని శాపం ఇచ్చాడు.

తర్వాత తన ఆశ్రమానికి తిరిగి వచ్చాడు. తండ్రి మెడలో పామును జూచి భయపడి దానివలన తన తండ్రికి ఏ అపకారం జరుగుతుందో అని విలపించాడు. 'ఎవరన్నా వచ్చి దీన్ని తీసివేయండి అని ప్రార్థించాడు. కుమారుని రోదన విని శమీకుడు కళ్ళు తెరిచాడు. మెడలో వున్న పామును చూచి తీసి పారవేశాడు. మనం ఎవ్వరికీ ఏ కీడూ చేయమే, ఎందుకు ఏడుస్తున్నావు? ఈ పాము నా మెడలోకి ఎలా వచ్చింది? అని కుమారుని అడిగాడు. అప్పుడు శృంగి జరిగిందంతా చెప్పి తాను రాజును శపించానని వెల్లడించాడు. కొడుకు చేసిన పనికి శమీకుడు హర్షించలేదు. "అయ్యో! ఎంత పనిచేశావు? ఈ చిన్న తప్పుకు ఇంత పెద్ద శాపమా? తల్లి కడుపులో వుండగానే బ్రహ్మాస్త్రజ్వాలలకు దగ్ధం కాగా

శ్రీకృష్ణుని కరుణవల్ల బ్రతికి బయటపడ్డాడు. ఇప్పుడు చక్కగా ప్రజలను పాలిస్తున్నాడు. కృష్ణుడు లేకపోవడంవలన క్రూరులు, చోరులు ప్రబలి భూమిని బాధిస్తుండగా పరీక్షిత్తు సమబుద్ధితో న్యాయధర్మాలను కాపాడుతూ ప్రజలను రక్షిస్తున్నాడు. అటువంటి వానిని శపించావు. పాపాన్ని మూటగట్టుకొన్నావు గదా! రాజు నశిస్తే రాజ్యమేమవుతుంది. బలవంతులు బలహీనులను దోచుకొంటారు. శాంతిభద్రతలు వుండవు. దౌర్జన్యాలు, దోపిడీలు, కలహాలు పెరుగుతాయి. కులధర్మాలు, ఆశ్రమధర్మాలు, ఆచారాలు మంటకలిసిపోతాయి. భారతవంశంలో పుట్టిన పరమభాగవతుడు, అశ్వమేధయాగాలు చేసిన ఆచారపరుడు, రాజనీతిజ్ఞుడు మంచినీళ్ళకోసం మన పంచకు వస్తే అతిధిసత్కారం చేసి పంపవలసింది పోయి చావుమని శపించడం ధర్మమా?" అని వాపోయాడు. "బుద్ధి చాపల్యంతో నా కొడుకు నిరపరాధి అయిన భూపతికి శాపం ఇచ్చి పాపం చేశాడు. వీడి పాపాన్ని తొలగించు తండ్రీ" అని భగవంతుడిని ప్రార్థించాడు. కొట్టినా, తిట్టినా పడతారుకాని భాగవతులు తిరగబడరు. సాధువులు, ఇతరులు కీడు చేసినా ఆగ్రహించరు. వ్యాకులపడరు. మేలు చేసినా పొంగిపోరు. ఉబ్బితబ్బిబ్బుకారు. సుఖదుఃఖాలు ఆత్మను అంటవు గదా అని కొడుకుకు హితబోధ చేశాడు. తన శిష్యునిద్వారా పరీక్షిత్తుకు శాపం విషయం తెలియజేశాడు.

## పరీక్షిత్తు ప్రాయోపవేశం

పరీక్షిన్మహారాజు తనను మునికుమారుడు శపించాడని, తక్షకుని విషం తన ప్రాణాన్ని హరించడం తథ్యమని తెలిసి చింతించాడు. వేటకు పోవడమెందుకు, గాఢసమాధిలో వున్న మునీశ్వరుని మెడలో చచ్చినపామును ఎందుకు తెచ్చివేశాను, ఈ పాపం చేయడానికి నాకీ సాహసం ఎలా వచ్చింది అని తనలో తాను తర్కించుకొని దైవయోగం వల్లనే తనకీ దుర్బుద్ధి పుట్టిందని తనకిక చావు మూడిందని తేల్చుకొన్నాడు. జీవితం మెరుపువంటిది. ఈ రాజ్యమూ, రాజభోగాలు, ప్రాణమూ పోతేపోనీ. మునికుమారుని నిందించనవసరం లేదు. రాజుననే గర్వంతో మునిఆశ్రమానికి వెళ్ళి మునీంద్రుని అవమానిస్తే కొడుకు వూరుకొంటాడా? నాకు సరైన శాస్తే జరిగింది. గోవులకు, బ్రాహ్మణులకు, దేవతలకు కీడు చేస్తే పాపం రాకుండా వుంటుందా? అని ఆలోచించి శపించిన శృంగిపై కోపం తెచ్చుకోకుండా మనస్సును సమాధాన పరచుకొన్నాడు. ప్రపంచంపై విరక్తి కలిగింది. భూలోక స్వర్గలోక భోగాలు తుచ్ఛమైనవని భావించి రాజ్యాన్ని విసర్జించాడు. నిరశన దీక్ష చేపట్టాడు. కలిదోషాలను పోగొట్టే గంగానదిలో

దిగి, గోవిందుని పదారవిందాలను మనస్సులో నిలుపుకొని మౌనంగా మరణం కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు. పరీక్షిత్తు ఇలా ప్రాయోపవేశదీక్షలో వున్నాడని తెలుసుకొని అత్రి, విశ్వామిత్ర, భృగు, వసిష్ఠ, పరాశర, వ్యాస, భరద్వాజ, పరశురామ, దేవల, గౌతమ, మైత్రేయ, కణ్వ, కలశసంభవ, నారద, పర్వతాదులైన బ్రహ్మర్షులు, దేవర్షులు, రాజర్షులు శిష్యప్రశిష్యులతో సహా అక్కడికి వచ్చారు. వారికి పరీక్షిత్తు దండప్రణామాలు చేసి కూర్చుండబెట్టి తాను చేసిన దుష్కార్యాన్ని చెప్పి తన పాపం పోయే మార్గం చెప్పవలసిందని ప్రార్థించాడు. బ్రాహ్మణుల పాదధూళి సోకితే పుణ్యం వస్తుందంటారు. ఇప్పుడు మీ పాదధూళి నాకు సోకడంవలన నా పాపం నశించింది. ధన్యుడనయ్యాను. ఏం చేస్తే త్వరగా ముక్తి లభిస్తుందో దయచేసి చెప్పండి అని ఋషిపుంగవులను కోరాడు. మునిశాపంవలన నాకు మరణం ఎలాగూ తప్పదు. అది ఈశ్వరసంకల్పం. ఎవరూ దానిని మార్చలేరు. నేను ఎన్ని జన్మలెత్తినా హరిసేవాభాగ్యం కలిగేటట్లు నన్ను అనుగ్రహించండి. హరిభజన చేయండి. హరికథలు వినిపించండి అని వారిని ప్రార్థించాడు. గంగకు దక్షిణపుఒడ్డున దర్భాసనంపై ఉత్తరముఖంగా కూర్చుని కుమారుడైన జనమేజయునికి రాజ్యభారాన్ని అప్పగించాడు. చిత్తాన్ని హరికి అర్పించి ప్రాయోపవేశ దీక్షలో కూర్చున్న పరీక్షిత్తును పొగడుతూ దేవతలు పుష్పవర్షం కురిపించారు.

అప్పుడు ఋషులు, "మహారాజా, మీ చరిత్ర మహాచిత్రంగా వుంది. మీ తాతలు ధన్యులు, విష్ణుసాయుజ్యాన్ని కోరి మహాసామ్రాజ్య సింహాసనాన్ని త్యజించారు. నీవు నారాయణుని ధ్యానిస్తూ ప్రాయోపవేశం చేస్తున్న మహోన్నతుడవు" అని కీర్తించారు. నీవీ శరీరాన్ని వదిలేవరకు నీ మాటలే వింటూ ఇక్కడే వుంటామన్నారు. అందుకు సంతోషించి పరీక్షిత్తు, ఏడు దినాలలో ముక్తి పొందే విధానం ఏమైనా వుందేమో వేదాలు పరిశీలించి వివరించి చెప్పండని, ఋషులను వేడుకొన్నాడు. సమాధానం చెప్పడానికి ఋషులు సిద్ధమవుతుండగా అక్కడికి ఒక దిగంబర సన్యాసి వచ్చాడు. అతడే వ్యాస నందనుడైన పదహారేళ్ళ శుకమహర్షి, బ్రహ్మజ్ఞాని. అనుక్షణం ఈ విశ్వమంతటా కణకణంలోను పరబ్రహ్మమే తప్ప మరొకటి లేదనే భావన గలవాడు, బాహ్యస్పృహలేనివాడు అయిన శుకమహర్షిని చూచి అక్కడున్న ఋషులందరూ లేచి నమస్కరించారు. పరీక్షిత్తు ఆ యోగీశ్వరునికి దండప్రణామాలు చేసి, అతిథిసత్కారాలు చేసి పూజించాడు. "మహాత్మా! మీరు ఇక్కడికి రావడం నా భాగ్యం. మీ పేరు చెప్పితేనే పాపాలు నశిస్తాయి. మీ దర్శనంవల్ల నా జన్మ పావనమయ్యింది మిమ్మల్ని చూచి, మీతో మాట్లాడి, మీ కాళ్ళు కడిగి పూజించడం వల్ల ముక్తి కలుగుతుందని నా నమ్మకం. మీ పాదస్పర్శచేత పాపాలన్నీ

పటాపంచలవుతాయి. మీ దర్శనం పూరికేపోదు. అందువలన కోరిన కోర్కెలు తప్పక తీరుతాయి. రేపోమాపో దేహాన్ని వదిలే జీవికి ఏం చేస్తే ముక్తి లభిస్తుందో దయచేసి చెప్పండి" అని అవధూతశిరోమణి అయిన శుకుడిని అర్థించాడు. "ఎక్కడా ఒక్కచోట ఎక్కువసేపు వుండవు. ఆవుపాలు తీయడానికి పట్టినంత సమయానికి మించి నిలబడవు. అందువలన వుండమనడానికి నోరు రావడం లేదు. నాకు ముక్తికి దారిజూపించు తండ్రీ!" అని వేడుకొన్నాడు.

# రెండవస్కంధం

## ముక్తికి మార్గం

మంచి ప్రశ్న అడిగావు అన్నాడు శుకుడు. పగలేమో కుటుంబపోషణకోసం ధనార్జన, రాత్రి కామకేళి, నిద్ర - ఇలా కాలక్షేపం చేసే మానవులకు ఆత్మతత్త్వమేమిటో బొత్తిగా తెలియదు. పెళ్ళాం, పిల్లలు, బంధువులు, సిరిసంపదలు సత్యమనే భ్రమతో కాపురాలు చేసి చివరికి చస్తారు. నిత్యం చూస్తున్నా ఈ చావుపుట్టుకల రహస్యమేమిటో తెలుసుకోరు. మోక్షం కోరేవాడు సర్వాత్మకుడైన శ్రీహరిని సేవించాలి, పూజించాలి, ధ్యానించాలి, భావించాలి, వర్ణించాలి. జనులందరికి శుభకరమైనది సాంఖ్యయోగం. దానివలన, ధర్మనిష్ఠవలన అంత్యకాలంలో హరిచింతన అలవడి జన్మసార్థకమవుతుంది. నివృత్తిమార్గాన్ని స్వీకరించిన మునులు నిర్గుణబ్రహ్మాన్ని ఆశ్రయించి అనవరతం హరిగుణచింతనం చేస్తారు. మా తండ్రి వ్యాసుడు నాచేత భాగవతాన్ని చదివించాడు. నీవు కూడా హరిభక్తుడవు కాబట్టి దాన్ని నీకు వినిపిస్తాను. భాగవతాన్ని వింటే విష్ణుసేవాబుద్ధి విస్తరిల్లుతుంది. మోక్షంకోరేవారికి మోక్షం లభిస్తుంది. హరిభక్తిలేకుండా సంసారంలో పడి కొట్టుకొనేవాడు వెర్రివాడు. వాడికెన్నటికీ ముక్తి లభించదు. ఒక ముహూర్తంపాటు హరినామసంస్మరణ చేసినా ముక్తి లభిస్తుంది. అందుకు ఉదాహరణ ఖట్వాంగుని చరిత్ర అని పరీక్షిత్తుకు శుకుడు ఆ కథని వినిపించాడు.

ఏడుదీవులతో కూడిన ఈ భూమండలాన్ని తొల్లి ఖట్వాంగుడనే రాజు ఏలేవాడు. ఆ కాలంలో దేవతలకు, దానవులకు యుద్ధం వచ్చింది. దేవతలకు అధిపతి అయిన దేవేంద్రుడు యుద్ధంలో ఓడిపోయి ఖట్వాంగుని సహాయాన్ని కోరాడు. అతడు దేవతలకు సహాయంగా వెళ్ళి దానవులను ఓడించాడు. వారి నాయకులందరిని వధించాడు. దేవతలు సంతసించి నీకు వరమిస్తాం కోరుకోమన్నారు. నాకు వరాలేమీ వద్దు,

నేనెంతకాలం బ్రతుకుతానో చెప్పండి, అంతే చాలన్నాడు. నీకింకా ఒక ముహూర్తం మాత్రమే ఆయువు మిగిలింది అని దేవతలు చెప్పారు. అప్పుడు రాజు భూమిమీదకు దిగివచ్చి ఏనుగులను, గుర్రాలను, భార్యలను, బంధువులను, స్నేహితులను, సిరిసంపదలను వర్జించి, గాఢవైరాగ్యంతో గోవిందనామ సంకీర్తన చేశాడు. ఆ విధంగా ముహూర్తంలో అంటే రెండు ఘడియలలో ఖట్వాంగుడు కైవల్యాన్ని పొందాడు.

ఆ కథ ముగించిన తర్వాత శుకుడు పరీక్షిత్తుతో ఇలా అన్నాడు. రాజా! నీకు ఏడుదినాలకుగాని జీవితం అంతంకాదు. ఈ వారంలో సాధనచేసి పరమకల్యాణాన్ని సంపాదించవచ్చు. అంత్యకాలం దగ్గరపడిందని ఆందోళన చెందకు. భయాన్ని వదిలి, దేహాభిమానాన్ని, భార్యాపుత్రులమీద గల అనురాగాన్ని, ప్రపంచవిషయాలపై మోహాన్ని విడిచిపెట్టు. ఇల్లు వదిలి, శుచియై ఏకాంతప్రదేశంలో దర్భలు, జింకచర్మం పరచుకొన్న ఆసనంపై కూర్చో. మనస్సులో ఓంకారాన్ని స్మరిస్తూ ప్రాణాయామం చేయాలి. ఇంద్రియాలను వశపరచుకోవాలి. మనస్సును భగవంతునిపై లగ్నం చేయాలి. రజోగుణం, తమోగుణం వలన చిత్తం వికారాలు పొందకుండా చూడాలి. ఆ విధంగా ధ్యానం, ధారణ చేసినట్లయితే భక్తియోగం సిద్ధిస్తుంది.

శుకుడు చెప్పిన మాటలు విని పరీక్షిత్తు, ధారణ అంటే ఏమిటి, అది ఎలా చేస్తారు, దానివలన మనస్సు ఎలా నిర్మలమవుతుందో తెలియజేయండని కోరాడు. దానికి సమాధానంగా శుకుడు ఇలా చెప్పాడు.

అనుబంధాలను త్రెంచివేసుకొని, ఇంద్రియాలను వశపరచుకొని హరియొక్క విశాల రూపాన్ని వూహించుకొని, చిత్తాన్ని అందులో నిలపాలి. విరాట్‌పురుషుడైన హరిలో భూత భవిష్య వర్తమానమైన విశ్వమంతా కనిపిస్తుంది. నేల, నీరు, గాలి, ఆకాశం, అగ్ని అనే పంచభూతాలు, అహంకార మహత్తత్వాలచేత చుట్టుకొనబడిన శరీరంలో, ధారణకు ఆధారమైన తేజోమూర్తి ప్రకాశిస్తూ వుంటాడు. ఆ మహాపురుషునికి అరికాలు పాతాళం; పాదానికి పైభాగం, మడమలు రసాతలం; చీలమండ మహాతలం; పిక్కలు తలాతలం; మోకాళ్ళు సుతలం; తొడలు వితలాతలం; మొల మహీతలం; బొడ్డు ఆకాశం; వక్షం నక్షత్రలోకం; కంఠం మహర్లోకం; నోరు జనలోకం; నొసలు తపోలోకం; తలలు సత్యలోకం; చేతులు ఇంద్రాదులు; చెవులు దిక్కులు; శ్రవణేంద్రియం శబ్దం; ముక్కురంధ్రాలు అశ్వినీదేవతలు; ఘ్రాణేంద్రియం వాసన; ముఖం అగ్ని; కళ్ళు అంతరిక్షం; చక్షురింద్రియం సూర్యుడు; రేయింబగళ్ళు రెప్పలు; కనుబొమలు బ్రహ్మపదం; నాలుకలు జలం; జిహ్వేంద్రియం రసము; భాషణలు సకలవేదాలు; కోరలు యముడు; దంతాలు పుత్రాది

అనుబంధాలు; నగవులు మాయ; కంటిచూపులు అంతులేని సంబంధాలు; పెదవులు లజ్జ, లోభాలు; స్తనాలు ధర్మం; వెన్ను అధర్మమార్గం; మేఢ్రం ప్రజాపతి; వృషణాలు మిత్రావరుణులు; జఠరం సముద్రాలు; ఎముకలు పర్వతాలు; నాడులు నదులు; వెంట్రుకలు చెట్లు; నిశ్వాసాలు వాయువులు; కాలం గమనం; కర్మలు సంసారాలు; శిరోజాలు మేఘాలు; కట్టుబట్టలు సంధ్యలు; హృదయం ప్రకృతి; మనస్సు చంద్రుడు; చిత్తం మహత్తత్వం; అహంకారం రుద్రుడు; గుర్రాలు, ఏనుగులు, లొట్టిపిట్టలు గోళ్ళు; కటిప్రదేశం పశుమృగాదులు; విచిత్ర ఆలాపనైపుణ్యాలు పక్షులు; బుద్ధి మనువు; నివాసము పురుషుడు; స్వరవిశేషాలు గంధర్వ విద్యాధర సిద్ధ చారణ అప్సర సమూహాలు; స్మృతి ప్రహ్లాద ప్రముఖులు; వీర్యం దైత్యులు, దానవులు; ఆ విరాట్ పురుషునికి ముఖము బ్రాహ్మణులు, భుజాలు క్షత్రియులు, తొడలు వైశ్యులు, కాళ్ళు శూద్రులు, నామాలు వసువు, రుద్రుడు మొదలైన దేవతల పేర్లు, ద్రవ్యాలు హవిర్భాగాలు, కర్మలు యజ్ఞప్రయోగాలు. ఇలా సర్వవ్యాపి అయిన పరమేశ్వరుని విగ్రహంలో ముముక్షువు తన మనస్సును చేర్చాలి. విశ్వమంతా హరిమయం. విశ్వమయుడు హరి. సంశయించవలసిన పనిలేదు. హరిమయం కాని ద్రవ్యమే కాదు ఒక్క పరమాణువు కూడా లేదు. జీవులందరి హృదయాలలోనూ పరమేశ్వరుడు సాక్షిగా వుండి వారి ఆలోచనలను, చేతలను గమనిస్తుంటాడు. కాని జోక్యం చేసుకోడు. సంసారబంధం తెగిపోవాలన్నా, కైవల్యం కావాలన్నా సచ్చిదానందమూర్తి అయిన శ్రీహరిని సేవించడం తప్ప మరొక మార్గం లేదు.

హరిమయము విశ్వమంతయు
హరి విశ్వమయుండు సంశయము పనిలేదా
హరిమయముగాని ద్రవ్యము
పరమాణువు లేదు వంశపావన వింటే.

మునుపు నారాయణుని నాభికమలంనుంచి పుట్టిన బ్రహ్మకు సృష్టి ఎలా చేయాలో పాలుపోక బహుదీర్ఘకాలం హరిని గురించి తపస్సు చేశాడు. హరిరూపాన్ని ధారణ చేశాడు. అప్పుడు ఆయనకు విశ్వనిర్మాణ సామర్థ్యం కలిగింది. జీవకోటిని సృష్టించగలిగాడు. వేదాలు నిర్దేశించిన కర్మల నాచరించి స్వర్గం మొదలైన నానాలోకసుఖాలను కోరుకొనేవాడు మూర్ఖుడు. నిద్రపోయేవాడికి కలలవలన ఎంతటి సుఖం, లాభం లభిస్తాయో మనకు తెలుసు. స్వర్గాది సుఖాలు కూడా అంతే! అవేవీ శాశ్వతం కాదు. అందువలన

విద్వాంసుడు సారహీనమైన ఇహలోకభోగాలకు ఆకర్షితుడు కాడు. శరీరాన్ని నిలుపుకోడానికి ఎంత అవసరమో అంతే గ్రహించి తృప్తిపడి, సుఖాన్ని ఇచ్చేది సంసారం కాదని నిశ్చయించి దానికోసం శ్రమపడడు. పడుకోవడానికి కమనీయమైన భూమి భాగాలుండగా దూదిపరుపులెందుకు? అలాగే తినడానికి, కట్టుకోవడానికి, వుండడానికి ప్రకృతి ఇచ్చిన వస్తువులు చాలవా? ఒకరి కొలువులో వూడిగం ఎందుకు చేయాలి? అందరినీ కాపాడే ప్రభువు హరి వుండగా ఎవరినో వేడుకోవడం ఎందుకు? అని ఆలోచిస్తాడు ఆత్మజ్ఞానంగల మనిషి. వాసుదేవుని భజించి ఆ సేవానుభవంలో ఆనందం పొందుతాడు. హరిని మరిచి లౌకిక వ్యవహారాలలో మునిగి తేలుతూ ఇంద్రియసుఖాలకోసం వెంపరలాడేవాడు నరకయాతనలు అనుభవిస్తాడు. యమకింకరులు వాడిని నానారకాలైన బాధలు పెడతారు.

సంసారికి ముక్తికావాలంటే తపస్సు, యోగం మొదలైన మార్గాలు చాలా వున్నాయి. వాటన్నిటిలో భక్తిమార్గం సులభమైనది. మునుపు బ్రహ్మ వేదాలన్నిటిని పరామర్శించి, మోక్షానికి మార్గం భక్తి ఒక్కటే అని నిర్ణయించి భక్తితో జనార్దనుని సేవించాడు. ఈశ్వరుడైన హరి సకల జీవరాశులందు ఆత్మరూపంలో నివసిస్తాడు. బుద్ధి మొదలైన లక్షణాల ద్వారా కనబడుతుంటాడు. హరికథామృతాన్ని సేవించే ధన్యులు విష్ణుదేవుని పాదాలచెంతకు త్వరగా చేరుకొంటారు. మనిషి జన్మనెత్తినవారికి, మరణంకోసం ఎదురుచూచేవారికి, మహాజ్ఞానులకు చేయవలసిన విధానాన్ని శాస్త్రాలు స్పష్టంగా చెబుతున్నాయి. బ్రహ్మవర్చస్సు కోరేవాడు బ్రహ్మదేవుడిని, ఇంద్రియపాటవం కోరేవాడు ఇంద్రుడిని, సంతానం కోరేవాడు దక్షాది ప్రజాపతులను, భోజనం కోరేవాడు అదితిని, స్వర్గాన్నికోరేవాడు ఆదిత్యులను, రాజ్యాన్ని కోరేవాడు విశ్వదేవతలను, ధర్మాన్ని, అర్థాన్ని, కీర్తిని కోరేవాడు విష్ణువును, విద్యను కోరేవాడు ఉమాపతిని... ఇలా తమ తమ కోరికలను బట్టి వేర్వేరు దేవతలను భజించాలి. తత్త్వనిపుణుడు ముక్తికోరి తనలో వున్న పరమపురుషుడినే భజిస్తాడు అని శుకుడు పరీక్షిత్తుకు చెప్పాడని సూతుడు చెప్పగా శౌనకుడు విని, శుకుని పలుకులు విని పరీక్షిత్తు అప్పుడు ఏమి అడిగాడు? శుకుడు మధురమైన హరికథలు ఏమేమి చెప్పాడో? అవన్నీ వినాలని మాకు కుతూహలంగా వుంది. దయచేసి చెప్పండి, అన్నాడు.

పరీక్షిత్తుకు శుకుడు ఇలా చెప్పాడని సూతుడు శౌనకునకు మళ్ళా చెప్పడం ప్రారంభించాడు

వాసుదేవుని స్తుతించే కథలు వింటూ కాలాన్ని గడిపే పుణ్యాత్ముడిని విడిచిపెట్టి, మిగిలినవారి ఆయువును వారికి తెలియకుండానే సూర్యుడు ప్రతిదినం తీసుకొని

పోతున్నాడు. అది గ్రహించక, చిరకాలం జీవిస్తామని భావించి పెళ్లాం, పిల్లలు, ఇల్లూవాకిలి, సిరిసంపదలు, బంధుమిత్రులు, కీర్తిప్రతిష్ఠలు సుఖాన్ని ఇస్తాయని, వాటికోసం జీవితాన్ని ధారపోసేవారు చివరికి ఆయువు మూడగా, యమదూతలు వచ్చి తన్నుకుంటూ తీసుకొని పోతున్నప్పుడు, అయ్యో పుణ్యం చేయకపోతిమే అని లబోదిబో అంటూ విలపిస్తారు. అడవులలో చెట్టుచేమలు, గ్రామాల్లో పశువులు, కుక్కలు, పందులు గాలి పీలుస్తున్నాయి, తింటున్నాయి, త్రాగుతున్నాయి, సంతానోత్పత్తి చేస్తున్నాయి. గాలి పీల్చి వదిలే తోలుతిత్తులవంటివి ఈ శరీరాలు; గాడిదలు, ఒంటెలు బరువులు మోస్తున్నాయి. మనుష్యులు సంసారభారాన్ని మోస్తున్నారు. భగవంతుడిని తెలుసుకోని మనిషికి పైన చెప్పినవాటికి వ్యత్యాసం లేదు. ఆ బ్రతుకులు దండుగమారివి.

విష్ణు కీర్తనలు వినని చెవులు కొండగుహలు. హరికథలు చదవని నాలుకలు కప్పనాలుకలు. శ్రీకృష్ణుని చూడని కన్నులు నెమలి ఈకలమీద వుండే కన్నులతో సమానం. అలాగే మిగతా అవయవాలు కూడా. హరిభక్తిలేని మనిషి నడిచే శవం అనుకో అని శుకుడు చెప్పగా పరీక్షిత్తు హృదయంలో గొప్ప మార్పు వచ్చింది. సుతులను, హితులను, చుట్టాలను, భార్యను, ధనాన్ని అన్నిటినీ విడిచిపెట్టాడు. వాసుదేవునిపై మనస్సును లగ్నం చేశాడు. అతనిలో మృత్యుభయం పోయింది. సర్వాత్ముడైన వాసుదేవుని గూర్చి సర్వజ్ఞుడవైన నీవు చెప్పగా సర్వభ్రాంతులు వదిలిపోయాయి, అన్నాడు శుకునితో. నాకు హరిలీలాలక్షణాలు తెలుసుకోవాలని వుంది. ఈశ్వరుడు ఈ విశ్వాన్ని సృష్టించి, పోషించి, నశింపజేస్తాడు. అయితే భగవంతుడు మొదట ఏ శక్తుల సహాయంతో బ్రహ్మ, ఇంద్రుడు మొదలైన రూపాలను ధరించాడు? ఈశ్వరుడు ఏకత్వంలో వుండక భిన్నరూపాలుగా ఎందుకుంటాడు? అలా వుండకపోతే ఏమవుతుందట? నా అనుమానాలను తీర్చవలసిందిగా ప్రార్థిస్తున్నాను, అన్నాడు. అప్పుడు శుకుడు హరికి, వేదవ్యాసునికి వందనం చేసి ఇలా చెప్పాడు. మునుపు బ్రహ్మ ఈ ప్రశ్నలు వేసి మాధవునిద్వారా సంశయాలు పోగొట్టుకొన్నాడు. తర్వాత బ్రహ్మ నారదుడు అడిగితే చెప్పాడు. నారదుడిద్వారా ఆ జ్ఞానాన్ని నేను సంపాదించాను. నీకు నేను చెబుతాను. విను నీ సందేహాలన్నీ తీరిపోతాయి.

ఒకసారి నారదుడు బ్రహ్మ దగ్గరకు వెళ్ళి ఇలా అడిగాడు: నీకు నాలుగు ముఖాలున్నాయి. వాటిలోనుంచి వేదాలు శబ్దాలు, అర్థాలతో సహా వెలువడుతుంటాయి. దేవతలందరికీ నీవే పెద్దవి. సృష్టికర్తవి. నీకు తెలియనిది ఏమీ లేదు. తండ్రీ! నీవే నా సందేహాలు తీర్చాలి. ఈ సృష్టికి కారణం ఏమిటి? ఎవరి వివేకంతో ఈ సృష్టి ఆరంభమవుతుంది? దానికి

ఆధారం ఏమిటి? దాని నిజస్వరూపం ఎలా వుంటుంది? ఈ సృష్టికంతటికి నీవే రాజులా కనిపిస్తున్నావు. నీకంటె ఘనుడు ఇంకెవరైనా వున్నారా? ఈ ప్రపంచాన్ని నిర్మించడంవల్ల నీకేం లాభం? ఈ జీవకోటి ఎందులో పుట్టి ఎందులో లీనమవుతుంది? నామరూపాలతో గుణగణాలతో కంటికి కనిపించే విశ్వమంతా నీ అధీనంలోనే వుంది. నీకు సమానమైనవారు ఎవరూ లేరు. అత్యున్నతమైన పదవిలో వున్న నీవు ఏ ఈశ్వరుని గురించి తపస్సు చేశావు. నీకంటె ఘనుడైన ఈశ్వరుడు వుంటే ఆయన ఎలా వుంటాడు? నాకు ఇవన్నీ చెప్పండి అన్నాడు.

## ప్రపంచం పుట్టుక

అప్పుడు బ్రహ్మ వికసించిన ముఖంతో నారదునికి ఇలా చెప్పాడు: ఎంతోమంది పండితులను విరక్తులైనవారిని చూచాను గాని ఇలాంటి ప్రశ్నలు వేసినవారు లేరు. నీకు ఈ సందేహాలు రావడం ఆశ్చర్యకరం. ఎంతో మర్మమైన విషయాన్ని అడిగావు. చెబుతాను విను. కదిలేవి, కదలనివి నానారకాలైన యీ జీవరాశిని నిర్మించే నైపుణ్యంలేక నేను తొట్రుపాటు పడినప్పుడు ఈశ్వరుడు సమస్త సృష్టిని అనుసంధానం చేసే తెలివిని మహోదారంగా నాకిచ్చాడు. లేకపోతే సృష్టిచేసే శక్తి నాకెక్కడిది! సూర్యచంద్రులు, తారలు, గ్రహాలమాదిరిగా లోకాలన్నీ ఎవరి తేజస్సువల్ల ప్రకాశిస్తున్నాయో ఆ ఈశ్వరుని నేను ఎల్లప్పుడూ మ్రొక్కుతాను. మాయవలన మతిహీనులు, నన్నే లోకేశ్వరుడని మ్రొక్కుతుంటే నాకు నవ్వు వస్తుంది. దేహాలు పంచభూతాలతో నిర్మితమవుతాయి. కర్మలే జన్మకు కారణాలు. కర్మను అనుభవంలోకి తెచ్చేది కాలం. కాలం మారడానికి కారణం స్వభావం. అనుభవించేది జీవుడు. అయితే ఇవన్నీ కూడా వాసుదేవుడే. వాసుదేవుడు కానిదేదీ లేదు. దేవతలూ, నారాయణుని శరీరంలోనుంచి పుట్టినవారే. అన్నిటిలోను ఆత్మరూపంలో వుండి అన్నిటిని చూస్తుండే ఆ ఈశ్వరుని కృపవలన నేను జన్మించాను. ఆయన ప్రేరణతో విశ్వాన్ని సృష్టిస్తుంటాను. ఈశ్వరుడు అనంతుడు. ఈ లోకాలన్నిటికి, నీకు, నాకు కూడా ఆయనే అధిపతి.

ఈశ్వరునిలోని మహత్తత్వంనుంచి అహంకారం పుట్టింది. అది ద్రవ్యశక్తి అయిన తామసం, క్రియాశక్తి అయిన రాజసం, జ్ఞానశక్తి అయిన సాత్వికం అని మూడువిధాలుగా మార్పుచెందింది. అహంకారంతో తామసం కలిసి ఆకాశం పుట్టింది. ఆకాశానికి శబ్దం గుణం. ఆకాశంనుంచి వాయువు పుట్టింది. దానికి శబ్దం, స్పర్శ అనే రెండుగుణాలుంటాయి. వాయువు దేహంలో ప్రాణరూపంలో వుంటుంది. ఇంద్రియాలను, మనస్సును నడిపిస్తుంది.

శరీరంలో తేజస్సుకు, పాటవానికి కారణమవుతుంది. వాయువునుంచి తేజం పుట్టింది. శబ్ద, స్పర్శ, రూపాలు దాని గుణాలు. తేజంనుంచి శబ్ద, స్పర్శ, రూప, రసగుణాలతో జలం వచ్చింది. జలంనుంచి శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలనే గుణాలతో భూమి పుట్టింది.

అహంకారంతో సాత్వికం కలిసి చంద్రదైవతమైన మనస్సు, దిక్కులు, వాయువు, అర్కుడు, ప్రచేతస్సు, అశ్వినులు, అగ్ని, ఇంద్రుడు, ఉపేంద్రుడు, మిత్రుడు, ప్రజాపతి ఏర్పడ్డారు. అహంకారంతో రాజసం కలిసి ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు, బుద్ధి, ప్రాణం పుట్టాయి. ఇంద్రియాలు, మనస్సు, గుణాలు వేర్వేరుగా వుండే ప్రాణులు, ప్రాణంలేనివి కలిగాయి. వీటన్నిటితో కూడిన బ్రహ్మాండం వేలాది సంవత్సరాలు నీటిలో మునిగివున్నది. పరమేశ్వరుడు జీవరూపంలో బ్రహ్మాండంలో ప్రవేశించి దాన్ని పెద్దది చేశాడు. తర్వాత ఆ బ్రహ్మాండాన్ని 14 లోకాలుగా విభజించాడు. వీటిలో ఏడులోకాలు శ్రీమహావిష్ణువుకు నడుముపైన వుండటాన ఊర్ధ్వదేహమని, ఏడులోకాలు దిగువన వుండటాన అధోదేహమని అంటారు. ప్రపంచమే శరీరంగాగల భగవంతుని ముఖంనుంచి బ్రాహ్మణకులం, భుజాలనుంచి క్షత్రియకులం, తొడలనుంచి వైశ్యకులం, పాదాలనుంచి శూద్రకులం పుట్టాయని చెబుతారు. పరమేశ్వరుని మొలలో భూలోకం, బొడ్డులో భువర్లోకం, హృదయంలో సువర్లోకం, వక్షంపై మహర్లోకం, కంఠంలో జనలోకం, రొమ్ములలో తపోలోకం, తలలో సత్యలోకం వున్నాయి. నడుంక్రింద అతలం, తొడలలో వితలం, మోకాళ్ళలో సుతలం, పిక్కలలో తలాతలం, చీలమండలలో మహాతలం, పాదాలపైన రసాతలం, అరికాళ్ళలో పాతాళం వున్నాయి.

బ్రహ్మాండంలో పరమేశ్వరుడు వుంటూ లోనా బయటా కూడా తన వెలుగుతో నింపుతున్నాడు. అలాంటి అనంతశక్తిమంతుడైన జగదీశ్వరుని నాభికమలంలో నేను పుట్టి యజ్ఞం చేయాలని సంకల్పించాను. కాని యజ్ఞం చేయడానికి అవసరమైన పదార్థాలు కనిపించలేదు. అప్పుడు నిర్మలమైన ఈశ్వరరూపాన్ని బుద్ధిలో నిలిపి ఆలోచించగా ఒక ఉపాయం తట్టింది. భగవంతుడిని యజ్ఞపురుషుడిగా చేసి, ఆయన అవయవాలను యజ్ఞోపకరణాలుగా భావించుకొని మానసయజ్ఞం చేశాను. అప్పుడది చూచి బ్రాహ్మణులు యజ్ఞం చేశారు. ఆ తర్వాత మనువులు, దేవదానవులు, రాజులు, మనుష్యులు వారివారికి ఇష్టమైన దేవతల ప్రీతికొరకు యజ్ఞాలు చేయడం మొదలుపెట్టారు.

విశ్వాత్ముడు, విశ్వేశుడు, విశ్వమయుడు అయిన విష్ణువు నుంచి అధికారం పొంది చరాచర భూతసమేతమైన సృష్టిని నేను చేస్తే విష్ణువు పోషిస్తాడు, శివుడు లయం చేస్తాడు.

పుట్టించి, పోషించి, నశింపజేసే మూడు శక్తులూ హరిలోనే వున్నాయి. అన్నిటికి మూలం ఆయనే. ఈ బ్రహ్మాండానికంతకూ ఆధారం, కారణం పరబ్రహ్మమైన ఆ పరమేశ్వరుడే. పరమాత్మ ఈ జగత్తును ప్రతి కల్పంలోను సృజించి, పోషించి, నాశనం చేస్తాడు. ఆ పరమేశ్వరుని లీలావతారాలు అనంతాలు. ఆయన చేసిన కర్మలు లెక్కపెట్టడం సాధ్యం కాదు. అయినా నా శక్తికొలది వివరిస్తాను వినుమని బ్రహ్మ నారదుడికి ఇంకా ఇలా చెప్పాడు.

ఒకసారి హిరణ్యాక్షుడు తన భుజపరాక్రమంతో భూమిని చాపమాదిరిగా చుట్టి తీసుకొనిపోయాడు. అప్పుడు శ్రీమన్నారాయణుడు యజ్ఞవరాహమూర్తిగా అవతరించి ఆ రాక్షసుడిని ఎదుర్కొని పోరాడి సముద్రమధ్యంలో తన కోరలతో కుమ్మి చంపగా వాడు పర్వతంలా కూలిపడ్డాడు. మరొకసారి స్వాయంభువ మనువు కూతురైన ఆకూతికి, ప్రజాపతికి సుయజ్ఞుడనే పేరుతో శ్రీహరి జన్మించి అమరులను పుట్టించి అమరేంద్రుడై వెలసి లోకాల పీడలను పోగొట్టాడు. కర్దమ ప్రజాపతికి, దేవహూతికి కపిలుడనే పేరుతో పుట్టి సాంఖ్యయోగాన్ని తల్లికి బోధించి మోక్షమార్గాన్ని చూపాడు. అత్రిమహామునికి అనసూయయందు దత్తాత్రేయుడనే పేరుతో జన్మించాడు. ఆయన పాదధూళితో హైహయులు, యదువులు తరించారు. సుఖాలు, ఐశ్వర్యాలు, శక్తిశౌర్యాలు పొంది కీర్తిప్రతిష్ఠలను ఆర్జించారు. తర్వాత సనకావతారం వచ్చింది. అది ఎలాగంటే కల్పారంభంలో విశ్వాన్ని సృష్టించడానికి నేను తపస్సు చేస్తున్నప్పుడు నా నోటివెంట 'సన' అనే శబ్దం వచ్చింది. అందువలన సనందన, సనక, సనత్కుమార, సనత్సుజాతుడు అనే నలుగురు నా మానసపుత్రులై పుట్టారు. విష్ణువు ఒక్కడే అలా నాలుగు రూపాలు ధరించి ఆత్మతత్త్వాన్ని విశ్వవ్యాప్తం చేశాడు. తర్వాత నరనారాయణులనే పేరుతో ధర్మునకు, దాక్షాయణికి జన్మించాడు. వారిద్దరూ బదరీవనంలో తపస్సు చేస్తుండగా, తన పదవికి ముప్పు రానున్నదనే భయంతో దేవేంద్రుడు తపోభంగం చేయవలసిందని అప్సరసలను పంపాడు. వాళ్ళు నవ్వుకుంటూ, ఆడుకుంటూ, పాడుకుంటూ, తమ రూపలావణ్యాలను ప్రదర్శిస్తూ, మునులకు తపోభంగం చేయాలని శతవిధాల ప్రయత్నించారు. కాని కోపంవల్ల తపం చెడుతుందని తెలిసి నరనారాయణులు వారిని కోపించక వదిలారు. నారాయణుడు తన తొడను చీల్చి ఊర్వశిని సృష్టించాడు. రూపవిలాసవిహారాలలో అప్సరసలను తలదన్నే ఆ సుందరిని చూచి అప్సరసలు సిగ్గుతో తలదించుకొన్నారు. తపస్సును చెడగొట్టే శక్తి తమకు లేదని గ్రహించి ఊర్వశికి చెలికత్తెలై, వచ్చిన దారినే వెళ్ళిపోయారు. రుద్రుడు కోపంతో కామాన్ని జయించాడు. నరనారాయణులు కోపాన్నే జయించారు. కామక్రోధాలకు

వశం కాకుండా తపస్వులకు ఆదర్శంగా నిలిచారు. ఇక ధ్రువుడిగా అవతారమెత్తిన వైనం చెబుతాను విను.

ఉత్తానపాదుడనే రాజుకు ఇద్దరు భార్యలు. పెద్దభార్యకు ధ్రువుడు జన్మించాడు. అతడు ఒకనాడు తండ్రి వొడిలో కూర్చోబోగా, సవతితల్లి పరుషంగా దూషించి, నీకు ఆ అర్హతలేదు పొమ్మని పంపించివేసింది. ధ్రువుడు అరణ్యాలకు వెళ్ళి తపస్సు చేసి హరిని ప్రత్యక్షం చేసుకొని వరాన్ని పొందాడు. శాశ్వతమైన ధ్రువతారగా ఆకాశంలో నిలిచిపోయాడు. వేనుడనే చక్రవర్తి మరణించగా ఆయన బాహువులనుంచి నారాయణుడు పృథువుగా జన్మించి తండ్రికి నరకబాధలు లేకుండా చేశాడు. భూమిని ఆవుగా చేసి వస్తువులనన్నిటిని పిదికాడు. నాభికి మేరుదేవియందు హరి వృషభుడై జన్మించి పరమహంసలు చేరుకోవలసిన గమ్యాన్ని నిర్దేశించాడు. నేను చేసిన యజ్ఞంలో హరి హయాననుడుగా జన్మించాడు. ఆయన నాసికాపుటాలనుంచి వేదాలు పుట్టాయి. వైవస్వతమనువు కాలంలో యుగాంత సమయాన ప్రళయం వచ్చి అంతా జలమయం అయ్యింది. అప్పుడు శిథిలమైన వేదాలను కాపాడి, శాఖలేర్పరచి నాకు తెచ్చి యిచ్చాడు మత్స్యావతారం ధరించిన హరి. అంతేకాదు పెద్దనావలో మనువునెక్కించి సముద్రంలో మునిగిపోకుండా రక్షించాడు. సర్వజీవులకు ఆశ్రయమయ్యాడు.

ఒకసారి దేవతలు, రాక్షసులు అమృతంకోసం మందరపర్వతాన్ని కవ్వంగా చేసుకొని సముద్రాన్ని చిలుకుతుండగా ఆ పర్వతం నీటమునిగింది. అప్పుడు హరి తాబేలురూపంలో వచ్చి ఆ పర్వతాన్ని తన వీపున పెట్టుకొని సముద్రమథనానికి సాయపడ్డాడు. అదే కూర్మావతారం. హిరణ్యకశిపుడు దేవతలను బాధించగా నరసింహరూపంలో వచ్చి ఆ రాక్షసుడిని గోళ్ళతో చీల్చి చంపాడు. గజేంద్రుడు నీటికోసం సరస్సులో దిగగా మొసలి అతనిని పట్టుకొంటుంది. గజేంద్రుడు వెయ్యేళ్ళు మొసలితో పోరాడి అలిసిపోయాడు. నీవేగతి అని హరిని శరణువేడగా ఆదిమూలావతారంలో వచ్చి మొసలిని చంపి ఏనుగులరాజును రక్షించాడు. మరొకసారి వామనుడై వచ్చి, బలిచక్రవర్తినుంచి మూడడుగులు దానం అడిగి, ముల్లోకాలను ఆక్రమించి, ఇంద్రునకు అతని రాజ్యాన్ని తిరిగి ఇచ్చాడు. హంసావతారం ధరించి నీకు ఆత్మతత్త్వాన్ని తెలిపే భాగవతపురాణాన్ని వుపదేశించాడు. మన్వవతారంలో దుష్టులైన రాజులను దండించి, శిష్టులను పోషించి సత్యలోకంలో కీర్తిగడించాడు. సముద్రమథన సమయంలో ధన్వంతరిగా అవతరించి రోగనివారణ చేయడానికి ఆయుర్వేదాన్ని సృష్టించాడు. కంటకులైన హైహయరాజులను 21 మార్లు వధించి పరశురాముడుగా ప్రఖ్యాతి చెందాడు. ఇక శ్రీరామావతారం

చెబుతాను విను.

లోకోపకారం కోసం, హరి శ్రీరాముడై, దశరథమహారాజుకు కౌసల్యగర్భాన జన్మించాడు. భరతుడు, లక్ష్మణుడు, శత్రుఘ్నుడు ఆయనకు తమ్ములుగా పుట్టారు. శివధనుస్సు విరిచి, జనకుని కూతురైన సీతను పెళ్ళిచేసుకొన్నాడు. తండ్రిమాటను మన్నించి, రాజ్యాన్ని విడిచి అడవులకు వెళ్ళిపోయాడు. లక్ష్మణుడు, సీత తోడురాగా దండకారణ్యంలో ప్రవేశించి అక్కడ నివసించే మునులకు అభయమిచ్చాడు. వారిని పీడిస్తున్న ఖరుడనే రాక్షసుడిని చంపాడు. ఆంజనేయుడు తనకు సేవకుడు కాగా, సుగ్రీవునితో చెలిమి చేసి, వాలిని చంపి కిష్కింధకు సుగ్రీవుడిని రాజుగా చేశాడు. సీతను అపహరించిన రావణుని చంపడానికి కపిసేనతో సముద్రతీరానికెళ్ళి దారి యిమ్మని అడిగాడు. సముద్రుడు నిర్లక్ష్యంగా వూరుకొన్నాడు. అప్పుడు శ్రీరాముడు కళ్ళెర్ర చేసి కోపంతో చూడగా ఆ వేడికి సముద్రం ఇంకిపోయింది. సముద్రుడు భయపడి శ్రీరాముని శరణువేడుకొన్నాడు. రాముడు దయతో సముద్రాన్ని జలభరితం చేసి, నలునిచేత సేతువు కట్టించి, సాగరాన్ని దాటి లంకపై దండెత్తాడు. రావణుని చంపి అతని తమ్ముడైన విభీషణునికి లంకారాజ్యాన్ని అప్పగించాడు. సీతతో అయోధ్యకు తిరిగివచ్చి పట్టాభిషేకం చేసుకొన్నాడు. ధర్మాన్ని కాపాడుతూ దీర్ఘకాలం భూమిని పాలించాడు.

ఒకప్పుడు రాక్షసాంశములతో పుట్టిన రాజులు ధర్మాన్ని అతిక్రమించి భూమిని బాధించడంవలన, భూదేవి దుఃఖించి హరిని వేడుకోగా, భూభారాన్ని తగ్గించడానికి యదువంశంలో బలరాముడు, కృష్ణుడుగా అవతరించాడు. వసుదేవునికి రోహిణియందు బలరాముడు, దేవకియందు కృష్ణుడు జన్మించారు. సాక్షాత్ విష్ణువే శ్రీకృష్ణుడయ్యాడు. శిశువుగా వున్నప్పుడే, చన్నులకు విషం పూసుకొని పాలివ్వ వచ్చిన పూతన చనుబ్రాలు త్రాగి ఆ రాక్షసిని అంతం చేశాడు. మూడునెలల బాలుడుగా వున్నప్పుడు శకటాసురుని తన్ని చంపాడు. అల్లరి చేస్తున్నాడని తల్లి రోటికి త్రాడుతో కట్టగా ఆ రోటిని ఈడ్చుకొనివెళ్ళి రెండు మద్దిచెట్లను పడగొట్టాడు. నోటిలో సమస్తవిశ్వాన్ని చూపి తల్లికి ఆశ్చర్యం కలిగించాడు. యమునానదిలో కాళీయుడనే నాగరాజు వుంటూ, గోవులను, గోపాలకులను బాధిస్తుంటే శ్రీకృష్ణుడు ఆ నాగరాజు తలపై ఎక్కి తొక్కి వాని మదాన్ని హరించి నదినుంచి పారద్రోలాడు. ఒకరాత్రి గోపకులంతా నిద్రిస్తున్నప్పుడు కారుచిచ్చు వ్యాపించి అందరినీ భయభీతులను జేయగా, కృష్ణుడు వారిని కళ్ళు మూసుకోండని చెప్పి ఆ దావానలాన్ని మ్రింగివేశాడు.

మయసూనుడనే దానవుడు తన మాయాశక్తితో గోపాలకులందరిని గుహలో

బంధించినప్పుడు కృష్ణుడు వాడితో పోరాడి, చంపి గోపాలురను రక్షించాడు. ఏటేటా దేవేంద్రునికి ప్రీతిగా చేసే ఉత్సవాన్ని కృష్ణుడు మాన్పించగా, ఇంద్రుడికి కోపం వచ్చి రాళ్ళవాన కురిపించాడు. పెనుగాలులతో జడివాన, భూనభోంతరాళాలు దద్దరిల్లే ఉరుములు, మెరుపులు చూచి గోవులు, గోపాలురు భీతిచెంది కృష్ణా, రక్షించు అని మొరపెట్టుకోగా ఏడేళ్ళబాలుడైన గోవిందుడు గోవర్ధనపర్వతాన్ని తన చేతితో పైకెత్తి ఏడురోజులపాటు నిలబెట్టి వ్రేపల్లెవాసులను కాపాడాడు. సప్తసముద్రాలతో చుట్టబడిన భూమండలమంతటినీ ధరించే మాధవునికి ఇదేమంత కష్టమైన పనికాదు.

ఒకసారి శరత్కాలపు వెన్నెలలో బృందావనంలో రాసకేళి జరపాలనే ఉత్సాహంతో ఇంపుగా వేణునాదం చేశాడు. కొత్తరాగభేదాలతో, వివిధ స్వరాలతో మధురంగా గానం చేస్తే మ్రోళ్ళు చిగురించాయి. ఆ మంజులస్వరం విని గోపికలు రాగా శంఖచూడుడనే గంధర్వుడు వారిని అపహరించాడు. అప్పుడు కృష్ణుడు ఆ గంధర్వుని ఓడించి గోపికలను రక్షించాడు. దుష్టరాక్షసులనెందరినో వధించాడు. నరకుడు, కంసుడు, శిశుపాలుడు, పౌండ్రకుడు, రుక్మి, కేశి, దంతవక్త్రుడు మొదలైనవారు ఆయనచేతిలో హతమయ్యారు. క్రూరులు, దుష్టులు అయిన రాజులను భీమార్జునులద్వారా సంహరించి భూభారాన్ని తగ్గించాడు. సాధువులను రక్షించాడు. అనంతుడైన ఆ కృష్ణపరమాత్మను నేను ఎల్లప్పుడూ కొలుస్తుంటాను.

ప్రతియుగంలోను సంకుచిత భావాలుగలవారు, అల్పాయుష్కులు అయిన మనుషులకు అగమ్యంగా వుండే వేదాలను విభజించి, శాఖలుగా చేసిన మహనీయుడు వ్యాసుడు కూడా హరియొక్క అవతారమే. వేదబాహ్యులు, పాషండమతస్థులు, అబద్ధాలకోరులు, జగత్సంహారులు అయిన దైత్యులు అధర్మంగా ప్రవర్తిస్తుంటే హరి, బుద్ధుడుగా పుట్టి వారిని అంతం చేశాడు. వేదాచారాలను పాటించక, వాసుదేవుని స్తుతించక విప్రులు అసత్యవాదులు, పాషండులు అయినప్పుడు, శూద్రకులజులు రాజులై శాసించడం జరిగినప్పుడు హరి కల్కిగా జన్మిస్తాడు. అధర్మాన్ని అణచివేసి ధర్మాన్ని స్థాపిస్తాడు.

బహుశక్తిధారణుడైన భగవంతుడు తపము, బ్రహ్మ, రుషులు, నవప్రజాపతులుగా అవతరించి సృష్టిచేస్తాడు. ధర్మము, విష్ణువు, యజ్ఞాలు, మనువులు, ఇంద్రాదిదేవతలు, రాజులుగా అవతరించి లోకాలను రక్షిస్తుంటాడు. అధర్మం, రుద్రుడు, సర్పాలు, రాక్షసులుగా పుట్టి నాశనం చేస్తాడు. ఈ విధంగా పరమేశ్వరుడు, సర్వాత్మకుడు అయిన హరి విశ్వంయొక్క ఉత్పత్తి స్థితి లయాలకు కారణం అవుతున్నాడు. భగవానుని లీలావతారాలు, అద్భుతకర్మలు సంక్షేపంగా చెప్పాను. సవిస్తరంగా చెప్పాలంటే నా

తరంకాదు.

హరిమాయాబలం ఎంతటిదో ఎవ్వరూ చెప్పలేరు. నాకు, సనకసనందనాదులకే గాదు, వేయితలల ఆదిశేషునికి కూడా అది సాధ్యం కాదు. ఇతర విషయాలన్నీ వదిలి, తనను మాత్రమే పూర్తిగా నమ్మినవారిని, ఎల్లప్పుడూ తననే భజించేవారిని దేవుడు కరుణిస్తాడు. ఆయన దయవలన వారు మాయను దాటిపోతారు. సంసారంలో నిండా మునిగి, శరీరసుఖాలకై వెంపరలాడుతూ కాలాన్ని వృథాచేయకుండా మనోవాక్కాయకర్మలా భగవంతుని సేవించి తమ దేహాలను దేవునికి అర్పించిన పుణ్యాత్ములు కొందరున్నారు. సనకాది రుషులు, రుద్రుడు, ప్రహ్లాదుడు, స్వాయంభువమనువు, అతని భార్య, పుత్రులు, విశ్వామిత్రుని తండ్రి అయిన గాధి, గయుడు, ఇక్ష్వాకుడు, దిలీపుడు, మాంధాత, భీష్ముడు, యయాతి, రంతిదేవుడు, ఉద్ధవుడు, బలి, విభీషణుడు, శిబి, పార్థుడు, విదురుడు, అంబరీషుడు, పరాశరుడు, మిథిలేశ్వరుడైన జనకుడు మొదలైన మహాత్ములు నిర్మల హృదయంతో భక్తితో భగవంతుడిని సేవించి తరించారు. నారాయణుని భక్తితో సేవిస్తే వారూ వీరూ అనక ఎవ్వరైనా, అడవిజంతువులైనా, ఆకాశంలో విహరించే పక్షులైనా, స్త్రీలు, శూద్రులు, హూణులు, రాక్షసులైనా సరే తరిస్తారు. అందువలన ఈశ్వరుని ఎప్పుడూ మనస్సులో నిలుపుకోవాలి. అలా చేస్తే అవిద్య వారినుంచి దూరంగా తొలగిపోతుంది. వేదార్థాన్ని ప్రతిపాదించి, మోక్షానికి దారిచూపేందుకు భగవంతుడు రచించిన ఈ భాగవతం శాస్త్రాల్లో శ్రేష్ఠమైనది. ఈ పురాణకథను నీకు సంక్షేపంగా చెప్పాను. దీన్ని నీవు అతివిస్తారంగా రచించాలి.

హరిభక్తిలేకుండా ఉపవాసాలు, వ్రతాలు, యజ్ఞాలు, జపాలు, దానాలు, అధ్యయనాలు, సంధ్యోపాసన, శౌచం, శీలం మోక్షాన్నివ్వవు అని బ్రహ్మ నారదునికి చెప్పిన కథను శుకుడు పరీక్షిత్తుకు చెప్పాడు.

అప్పుడు పరీక్షిత్తు శుకునితో ఇలా అంటున్నాడు. మునినాథా! నారదమునికి బ్రహ్మదేవుడు చెప్పినవిధంగా మంగళకరమైన కమలాక్షుని కథలు నాకు చెప్పి ఆనందింపచేశావు. ఆద్యంత శూన్యుడు, చిన్మయాకారుడు, లక్ష్మీసమేతుడు అయిన నారాయణుని నా హృదయంలో నిలుపుకొని భక్తితో కొలుస్తూ ఈ శరీరాన్ని వదిలివేస్తాను. నాకు ఒక విషయం చెప్పండి. ఆత్మకు ఏదీ అంటదు అంటారు గదా! అయితే జీవులతో దానికి సంబంధం ఎలా కలుగుతున్నది? కర్మను బట్టి వస్తుందా, లేక కారణం లేకుండానే ఈ కలయిక జరుగుతున్నదా? పరమేశ్వరుని అనుగ్రహంవలన విధాత సృష్టిచేశాడన్నారు. బ్రహ్మ ఈశ్వరుని ఎలా ప్రత్యక్షం చేసుకొన్నాడు? వాళ్ళిద్దరికి మధ్య ఏదైనా భేదం వుందా?

దేవతలకు, పితరులకు, మనుష్యాదులకు గల ఆయుఃప్రమాణం ఎలాంటిది? ఏ కర్మలు చేసిన జీవులు ఏ లోకాలకు పోతారు? ఎటువంటి దేహాలు పొందుతారు? భూమి, పాతాళం, ఆకాశం, గ్రహనక్షత్రాదులు, సముద్రాలు, ద్వీపాలు, పర్వతాలు ఎలా ఏర్పడ్డాయి? సాధారణ ధర్మాలు, విశేషధర్మాలు, తత్త్వాలు, యోగాలు అన్నీ నాకు తెలుసుకోవాలని వుంది. సవిస్తరగా చెప్పండి అని ప్రార్థించాడు.

పరీక్షిత్తు అడిగిన ప్రశ్నలకు శుకయోగి సవివరంగా సమాధానం చెబుతున్నాడు. జీవికి దేహానికి ఈశ్వరుని మాయవలన సంబంధం ఏర్పడుతున్నది. అది ఎలాంటిదంటే కలలో మనకూ, దేహానికీ వున్న బంధంలాంటిది. హరియొక్క యోగమాయా మహత్త్వం వలన పంచభూతాలతో కూడిన ఈ శరీరంతో, ఆత్మకు సంబంధం ఏర్పడుతున్నది. దేవతలుగాను, మానవులుగాను రూపం ఎత్తి, నేను, నాది అనే అహంకార స్ఫురణతో కూడిన మాయలో పడి, శరీరంలో వచ్చే మార్పులన్నీ తనవిగా, అదిపడే కష్టసుఖాలు అన్నీ తన అనుభవాలుగా భావిస్తూ, జననమరణచక్రంలో పడి తిరుగుతుంటారు. అయితే భగవంతుని భక్తితో సేవిస్తే ముక్తి వస్తుందంటారు గదా, అది ఎలాగంటే జీవుడు ప్రకృతి, పురుషులకు అతీతమైన బ్రహ్మస్వరూపాన్ని మనస్సులో నిలుపుకొని నిష్ఠతో ధ్యానం చేస్తే సంసారమోహం విచ్ఛిన్నమవుతుంది. అహంకార మమకారాలు తొలగిపోతాయి. దేహాభిమానం నశిస్తుంది. అలా ముక్తి లభిస్తుంది. దేహం సత్యపదార్థం కాదు. నిత్యం కాదు. అవిద్యవలన, కర్మనుబట్టి మిథ్యారూపమైన దేహంతో ఆత్మకు సంబంధం ఏర్పడుతుంది. ముక్తిని సాధించే మార్గాన్ని తెలియజేయడానికి దైవభజనను కల్పించినట్లు ఈశ్వరుడు బ్రహ్మకు చెప్పాడు. బ్రహ్మచేసిన తపస్సుకు మెచ్చి ఈశ్వరుడు ప్రత్యక్షమై తన జ్ఞానానందమయమైన స్వరూపాన్ని చూపాడు. జీవునికి భగవద్భక్తి వలననే మోక్షం లభిస్తుంది. ఇందుకు ఉదాహరణగా నీకు ఒక కథ చెబుతాను విను. దానివలన నీ సంశయాలన్నీ నివృత్తి అవుతాయి.

## సృష్టి క్రమం

శ్రీమహావిష్ణువు నాభికమలంనుంచి పుట్టిన బ్రహ్మ కళ్ళు తెరిచిచూచి, తానొక పద్మంలో వున్నట్టు గ్రహించి, ఈ పద్మం ఎక్కడనుంచి పుట్టిందో తెలుసుకోవాలని కాడను పట్టుకొని దిగి నీటిలో ఎంత వెదికినా మొదలు ఎక్కడా కనబడలేదట. విసుగుపుట్టి తిరిగి పైకెక్కి తన పద్మంలో కూర్చుని సృష్టిని ఎలా నిర్మించాలీ అని ఆలోచన చేశాడు. ఎంత వూహించినా మార్గం కనబడలేదు. అలా చింతిస్తుండగా ఆ మహాజలార్ణవం మధ్యనుంచి

'తప' అనే శబ్దం రెండుసార్లు వినిపించింది. ఎవరో యీ మాట అన్నది చూద్దామని నాలుగుదిక్కులకు వెళ్ళి వెదికినా ఎవరూ కనిపించలేదు. మళ్ళీ వెనక్కు వచ్చి పద్మంలో కూర్చుని ఆలోచించాడు. నన్ను తపస్సు చేయవలసిందని భగవంతుడు ఆజ్ఞాపిస్తున్నాడు. దీని అర్థం అదే అని భావించి వేయి సంవత్సరాలు ఏకాగ్రచిత్తంతో తపస్సు చేయగా ఈశ్వరుడు ప్రత్యక్షమయ్యాడు. ఆయనతోపాటే వైకుంఠపురం కూడా కనిపించింది. సునందుడు, నందుడు, అర్హణుడు, ప్రబలుడు మొదలైన ఆయన సన్నిహితులు భక్తితో వైకుంఠనాథుని భజిస్తున్నారు. లక్ష్మీదేవి తన మృదువైన చేతులతో నారాయణుని పాదకమలాలను వత్తుతున్నది. చతుర్బాహువులతో, చిరునవ్వు మోముతో రత్నసింహాసనంపై కోటిసూర్యుల తేజస్సుతో భగవానుడు కూర్చొని వుండగా, ప్రకృతి, పురుషుడు, మహత్తు, అహంకారం అనే నాలుగు శక్తులు, కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు, మనస్సు, పంచమహాభూతాలు, పంచతన్మాత్రలు ఆయనను పరివేష్టించి వున్నాయి. బ్రహ్మదేవుడు అప్పుడు నాలుగు తలలూ వంచి నారాయణునికి నమస్కరించాడు. భక్తితో స్తుతించాడు.

శ్రీహరి సంతసించి ప్రేమతో బ్రహ్మదేహాన్ని చేతితో నిమిరాడు. కపట మునులకు ఎంతకాలానికైనా నేను కనిపించను. కాని నీ తపస్సుకు మెచ్చి వచ్చాను. నీకు ఏం కావాలో కోరుకో. వరమిస్తాను అన్నాడు. తపమంటే నా హృదయమే. తపం అనే వృక్షానికి కాచే ఫలాన్నీ నేనే. ఆ తపం ద్వారానే సృష్టి స్థితి లయాలు చేస్తుంటాను. నా భక్తికి తపమే మూలధనం. ఆ సంగతి నీవు బాగా గ్రహించావు. నీ మనస్సులో ఏముందో అడుగు ఇస్తాను అన్నాడు. అప్పుడు బ్రహ్మ, నీకు తెలియనిది ఏముంది, అయినా అడిగావు గనుక విన్నవిస్తాను అన్నాడు.

వ్యక్త, అవ్యక్త, స్థూల, సూక్ష్మరూపాలు, వివిధ శక్తులతో వర్ధిల్లే బ్రహ్మాది రూపాలు నీయంతట నీవే ధరించి లోకాలను సృష్టిస్తావు, పోషిస్తావు, సంహరిస్తావు. ఇదంతా నీ లీల. ఈ లీలను తెలుసుకోగలిగిన పరిజ్ఞానాన్ని నాకు ప్రసాదించు. నీ ఆజ్ఞ ప్రకారం జగాలను నిర్మించేటప్పుడు నాలో స్వాభిమానం, మనస్సులో మహత్తు, అహంకారం ఉదయించకుండా నన్ను అనుగ్రహించవలసింది అని అడిగాడు బ్రహ్మ.

అప్పుడు పుండరీకాక్షుడు, పరమపురుషుడు అయిన నారాయణుడు ఇలా అన్నాడు. శాస్త్రజ్ఞానాన్ని, భక్తిని, సాక్షాత్కారాన్ని ఎప్పుడూ నీ మనస్సులో వుంచుకో. నా స్వరూప, స్వభావాలు, నా అవతార కర్మలు గ్రహించగల నేర్పును, తత్త్వజ్ఞానాన్ని నీకు ప్రసాదిస్తున్నాను. సృష్టికి పూర్వం నేనొక్కడినే ఒంటరిగా వుంటాను. స్థూల, సూక్ష్మరూపాలు, అందుకు కారణమైన ప్రకృతి నాలోనే లీనమై వుంటాయి. నేను తప్ప మరొకటి లేదు. సృష్టికోటుల్లో



90640
500 044.

సృష్టివిలయంలో జగత్తు నా స్వరూపం అవుతుంది. నా మాయవలన సృష్టి జరుగుతున్నది. ఒక్కొక్కప్పుడు లేనిది వున్నట్టు భ్రాంతి కలుగుతుంది. చీకట్లో త్రాడును పాము అనుకొంటాం. ఎండలో ముత్యపుచిప్పను చూచి వెండి అనుకొంటాం. లేనిది వున్నట్టు తోచడానికి ఏ మహిమ కారణమో అదే మాయ. మహాభూతాలైన గాలి, నీరు, అగ్ని, నేల, నింగి, భౌతికమైన వస్తువులన్నిటిలోను ఏవిధంగా ప్రవేశించి వుంటున్నాయో అదే ప్రకారంగా నేను అన్నిటిలోను బలము, గుణము, స్వభావము, మనస్సు, ప్రాణం మొదలైన రూపాలలో ప్రవేశించి వుంటాను. సర్వప్రదేశాలలో సర్వకాలాలలో ఏది శాశ్వతమై నిలిచివుంటుందో అదే పరబ్రహ్మ స్వరూపం, తత్త్వం. ఏకాగ్రతతో యీ విషయాన్ని విని, అర్థంచేసుకొని, మనస్సులో నిలుపుకుంటే సృష్టికర్మలో నీకు మోహం కలుగదు, అహంకారం పొడసూపదు అని చెప్పి ఆదిదేవుడు తన లోకంతో సహా అంతర్థానం అయ్యాడు.

వైకుంఠనాథుడు అలా అదృశ్యమైపోగా, బ్రహ్మ పుండరీకాక్షుని తన హృదయంలో ప్రతిష్ఠించుకొని, ఆనందంతో అంజలి ఘటించి, పరమేశ్వరప్రసాదమైన పరిజ్ఞానంతో సమస్త ప్రపంచాన్ని సృష్టించాడు. తర్వాత ధర్మప్రవర్తకుడై లోకకల్యాణంకోసం యమ, నియమాలను - విధి, నిషేధాలను ఏర్పరచాడు. చేయవలసినవి, చేయగూడనివి లోకానికి తెలియజేశాడు.

అప్పుడు బ్రహ్మకు ప్రియపుత్రుడైన నారదుడు తండ్రివద్దకు వచ్చాడు. తండ్రికి శుశ్రూష చేసి సంతోషపెట్టాడు. తర్వాత నీవు నన్నడిగినట్లే ఆయన కూడా తండ్రిని అడగగా, హరి తనకు తెలిపిన భాగవతాన్ని బ్రహ్మ నారదునికి చెప్పాడు. నారదుడు వ్యాసునికి చెప్పగా ఆయన నాకు చెప్పాడు. దాన్ని నేను నీకు చెబుతున్నానని శుకుడు పరీక్షిత్తుతో అన్నాడు. విరాట్పురుషుని వల్ల ఈ లోకాలు ఏ విధంగా పుట్టినవని మొదలుపెట్టి అనేక ప్రశ్నలు అడిగావు. అన్నింటికి సమాధానం దొరికేటట్లుగా మహాభాగవతాన్ని చెబుతాను. సావధానంగా వింటే నీ సంశయాలన్నీ తొలగిపోతాయని శుకుడు చెప్పడం మొదలుపెట్టాడు.

## భాగవతకథ ప్రారంభం

భాగవతం మహాపురాణం. దానిలో పది లక్షణాలు వుంటాయి. అవి ఇవి: సర్గం, విసర్గం, స్థానం, పోషణం, ఊతులు, మన్వంతరాలు, ఈశ్వరకథలు, నిరోధం, ముక్తి, ఆశ్రయం. మహత్తు, అహంకారం, పంచభూతాలు, జ్ఞానేంద్రియ కర్మేంద్రియాలు, పంచతన్మాత్రలు అన్నీ కలిసి భగవంతుడిలో వుండడాన్ని సర్గమంటారు. విరాట్పురుషునివలన

విష్ణువు జనించి చరాచర భూత సృష్టి చేయడం విసర్గమంటారు. లోకానికి కీడు చేస్తున్న దుష్టపాలకులను సంహరించి న్యాయాన్ని ధర్మాన్ని ప్రతిష్ఠించిన వైకుంతనాధుని విజయమే స్థానం. హరి భక్తజనులను ఉద్ధరించడమే పోషణం. ఊతులంటే కర్మవాసనలు. విష్ణుదేవుని కృపాకటాక్షాలకు పాత్రులై లోకాలను పాలించిన మహితాత్ముల ధర్మప్రవర్తన విస్తారంగా చెప్పేవి మన్వంతరాలు. విష్ణువుయొక్క అవతారాలు, లీలలు వర్ణించేవి ఈశ్వరకధలు. పరమాత్మ యోగనిద్రలో వున్నవేళ జీవులన్నీ తమ తేజం నశించగా ఎటువంటి స్థితిగతులు పొందుతాయో వివరించేది నిరోధం. దానినే అవాంతరప్రళయం అని కూడా అంటారు. జీవుడు దేహాభిమానాన్ని విడిచి ఆత్మజ్ఞానాన్ని పొంది, కర్మలను వాసనలను దగ్ధంచేసి హరిరూపం పొందడమే ముక్తి. ఉత్పత్తి, స్థితి, లయాలు ఎక్కడ జరుగుతాయో దాన్ని ఆశ్రయమంటారు. అదే పరమాత్మ. పరబ్రహ్మ అన్నా కూడా అదే!

ప్రత్యక్షానుభవం కొరకు ఆత్మను మూడు భాగాలుగా విభజిస్తారు: 1) ఆధ్యాత్మికం, 2) ఆధిదైవికం, 3) ఆధిభౌతికం. కళ్ళు మొదలైన ఇంద్రియాలలో సంచరించేది ఆధ్యాత్మికం. ద్రష్ట అయిన జీవుడే ఆధిదైవికుడు. ఎవరితో ఈ విభాగం కలుగుతున్నదో, ఎవరు ఇంద్రియాలకు నాధుడో అతడే ఆధిభౌతికుడు, విరాట్ పురుషుడు. ద్రష్ట, దృక్కు దృశ్యం ఎవరిలో ఐక్యమవుతాయో అతడే పరమాత్మ. ఆ పరమపురుషుడు తన లీలార్థం జగత్ సృష్టి చేయదలచి బ్రహ్మాండాన్ని చీల్చి మొదట శుద్ధమైన జలాన్ని సృష్టించాడు. ఏకార్ణవమైన జలరాశిలో సుఖంగా శయనించాడు. ఏకంగా వున్న పరమేశ్వరుడు అనేకం కావాలనుకొన్నాడు. అధిదైవం, అధ్యాత్మకం, అధిభూతం అనే పేర్లతో తన హిరణ్మయ విగ్రహాన్ని మూడుగా చేశాడు. ఆ మహాపురుషుని అంతరాకాశం నుంచి తేజం, అహంకారం వెలువడ్డాయి. ఆయనలోని సూక్ష్మరూప క్రియాశక్తినుంచి ప్రాణం పుట్టింది. జీవికి తోడుగా ప్రాణాలుంటాయి. ఆకలిదప్పులుంటాయి. పరమేశ్వరుని ముఖంనుంచి దవడలు, నాలుక పుట్టాయి. నాలుకద్వారా రుచులన్నీ పుట్టాయి. మాట్లాడాలనే కోరికగల నోటినుంచి వాగింద్రియం వచ్చింది. దానికి దేవత అగ్ని. ఆ రెంటివలన మాటలు వచ్చాయి. వాయువువలన ముక్కు పుట్టింది. తేజం వలన కన్నులు ఏర్పడ్డాయి. శబ్దాన్ని గ్రహించే చెవులను ఆ దేవుడే పుట్టించాడు. ఆయననుంచి చర్మం పుట్టింది. దానినుంచి వెంట్రుకలు పుట్టాయి. వాయువువలన చేతులు పుట్టాయి. ఈశ్వరునినుంచి పాదాలు, జననేంద్రియాలు, మలద్వారం, నాభి, ప్రేగులు, పొట్ట, నాడులు ఏర్పడ్డాయి. మాయాచింతన నుంచి హృదయం ఉద్భవించింది. కామసంకల్పాదులకు అది స్థానం. తర్వాత సప్తధాతువులు, సప్తప్రాణాలు, ఇంద్రియాలు, గుణాలు, మనస్సు, బుద్ధి పుట్టాయి. ఇవన్నీ

కలిసి సర్వేశ్వరుని స్థూలవిగ్రహం అవుతుంది. ఆయనకు తేజోమయమైన విలక్షణమైన సూక్ష్మరూపం కూడా వుంది. అది నిత్యం, ఆద్యంతశూన్యం. ఆలోచనాశక్తికి అందదు. నోటితో వర్ణించడం సాధ్యం కాదు. కంటికి కనిపించదు. వర్ణించడానికి వీలైన నామరూపాలు కలిగి కర్మలు చేసే ఈశ్వరుడిని నారాయణుడు అంటారు. ప్రజాపతులను, రుషులను, పితృదేవతలను ఆయనే సృజిస్తాడు. దేవతలు, దానవులు, మానవులు, పశుపక్షిమృగాదులు, జలచరాలు, వృక్షాలు మొదలైన అన్ని జాతుల ప్రాణుల్లోనూ పుట్టి ఆకాశంలో, నీటిలో, భూమిపైనా సంచరిస్తాడు. సత్వ రజ స్తమోగుణాలను బట్టి సురులు, అసురులు, నరులు, జంతువులుగా భిన్నరూపాలు ఏర్పడతాయి.

ఆ పరమాత్మ బ్రహ్మరూపంలో విశ్వాన్ని సృష్టిచేస్తాడు. విష్ణురూపంలో పోషిస్తాడు. రుద్రుడై నాశనం చేస్తాడు. హరినుంచి ఆకాశం. ఆకాశంనుంచి వాయువు. వాయువునుంచి అగ్ని, అగ్నినుంచి జలం, నీటినుంచి నేల పుట్టగా, భూమినుంచి ప్రజలు పుట్టారు. అన్నిటికి మూలం ఆదినారాయణుడే అని శుకుడు పరీక్షిత్తుకు చెప్పినట్లు సూతుడు మహర్షులకు తెలియజేయగా విని శౌనకుడు ఇలా అడిగాడు. విదురుడు బంధుమిత్రులను విడిచి, పుణ్యక్షేత్రాలను, తీర్థాలను దర్శించి, తిరిగివచ్చి మైత్రేయునివద్ద అధ్యాత్మ విద్య నేర్చుకొన్నాడని విన్నాం. అదంతా మాకు తెలియజేయవలసిందిగా కోరుతున్నాం.

అప్పుడు సూతుడు, మీరు నన్నడిగినట్లే పరీక్షిత్తు శుకుడిని అడిగాడు, శుకుడు చెప్పినదే నేను మీకు చెబుతాను వినండి, అన్నాడు.

# మూడవస్కంధం

యుద్ధంలో కౌరవులను ఓడించి పాండవులు రాజ్యం చేస్తున్నారు. విదురుడు అడవులకు వెళ్ళిపోయాడు. అక్కడ తపస్సు చేసుకొంటున్న మైత్రేయుని దగ్గరకు వెళ్ళి ఆయన పాదాలకు తన నుదురు తాకేటట్లు సాష్టాంగ నమస్కారం చేశాడు. మునివర్యా, నాకొక సందేహం అన్నాడు. పాండవులకు దూతగా హస్తినాపురం వెళ్ళిన శ్రీకృష్ణుడు, దుర్యోధనుని మందిరానికి వెళ్ళకుండా మాయింటికి అతిథిగ్గా రావడానికి కారణమేమిటి అని అడిగాడు.

ఈ మాటలు విన్న పరీక్షిత్తు, విదురుడు మైత్రేయుడిని అడిగిన రహస్యాలేమిటి? ముని ఏమి చెప్పాడు? విదురుడు ఎక్కడెక్కడికి వెళ్ళాడు? ఏమి చూచాడో అన్నీ నాకు వివరంగా తెలియజేయండని శుకమహర్షిని అడిగాడు అప్పుడు శుకుడు మళ్ళీ చెప్పడం మొదలుపెట్టాడు.

ధృతరాష్ట్రునికి నూర్గురు కొడుకులు. సుయోధనుడు అందరికంటె పెద్దవాడు. వారందరిని గారాబంగా గాంధారీ, ధృతరాష్ట్రులు పెంచుకొంటుండగా, పాండురాజు మరణంవలన అనాథలైన ఆయన కుమారులు పాండవులు పెదనాన్న అయిన ధృతరాష్ట్రుని పంచన చేరారు. పాండవుల పట్ల అసూయాద్వేషాలు పెంచుకొన్న దుర్యోధనుడు, అతని తమ్ములు వారిని అంతమొందించడానికి బహుధా ప్రయత్నం చేశారు. ఒకసారి విషాన్నం పెట్టారు. మరొకసారి త్రాళ్ళతో కట్టి గంగానదిలో త్రోశారు. లక్కయింటిలో నిద్రపోతుంటే ఇంటికి నిప్పు పెట్టారు. జూదం పేరుతో ఓడించి రాజ్యం నుంచి వెళ్ళగొట్టారు. వారి భార్య ద్రౌపదిని జుట్టుపట్టుకొని ఈడ్చి రాజసభలో నిలబెట్టి, కట్టుకొన్న చీరను లాగి అవమానించారు. ఇంతటి దారుణాలు జరుగుతున్నా ధృతరాష్ట్రుడు తన పుత్రులను వారించలేదు. వనవాసం, అజ్ఞాతవాసం చేసి పాండవులు తిరిగివచ్చి తమ భాగం తమ కివ్వవలసిందిగా కోరారు. ఇవ్వం పొమ్మన్నాడు సుయోధనుడు. కనీసం ఐదు వూళ్ళన్నా ఇవ్వండని పాండవులంటే ఐదు వూళ్ళు కాదు, సూదిమొన మోపినంత స్థలం కూడా ఇచ్చేది లేదని దుర్యోధనుడు తెగవేసి చెప్పాడు. అప్పుడు ధర్మరాజు పంపగా శ్రీకృష్ణుడు మధ్యవర్తిత్వం చేయడానికి ధృతరాష్ట్రుని వద్దకు వచ్చాడు. భీష్ముడు, ద్రోణుడు, కృపాచార్యుడు వివిధదేశాల రాజులు వున్న సభలో కొలువుదీర్చి కూర్చున్న ధృతరాష్ట్రుడితో శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు.

మహారాజా, కౌరవులు, పాండవులు అన్నదమ్ముల బిడ్డలు. వారిని సమదృష్టితో చూచి, రాజ్యాన్ని పంచి యిస్తే ఉభయులకూ మేలు జరుగుతుంది.

కృష్ణుని ధర్మబోధ వారి చెవికెక్కలేదు. రాయబారం విఫలమయ్యింది. అప్పుడు కృష్ణుడు నీతిమంతుడైన విదురుని పిలిపించాడు. విదురుడు వచ్చి విషయం తెలుసుకొని ధృతరాష్ట్రుడితో ఇలా అన్నాడు.

కౌరవేశ్వరా! పాండురాజు నీ తమ్ముడు. ఆయన కొడుకులను రక్షించడం న్యాయం, ధర్మం. దానివల్ల మీ వంశానికి సుఖశాంతులు లభిస్తాయి. శత్రువులను జయించి సామ్రాజ్యాన్ని సుస్థిరం చేసుకోగలుగుతారు. అందువలన పాండురాజు భాగాన్ని ఆయన కొడుకులకు పంచి ఇవ్వడం మంచిది. ఇన్ని మాటలెందుకు? భీముడు నీ కొడుకుల పేరు చెబితేనే మండిపడతాడు. నీ కుమారులకు అతని వలన చావు తప్పదని ఇదివరకే చెప్పాను గదా! భీష్మ ద్రోణ కృపాచార్యుల పరాక్రమం, నీ పుత్రుల శౌర్యం, కర్ణుని ప్రేలాపనలు నిజమని నమ్మి మోసపోకు. అనంతుడు అచ్యుతుడు అయిన మురారి పాండవులకు ఇష్టసఖుడు, బంధువు, గురువు, ప్రేమతో వారికి ఎప్పుడూ తోడునీడగా వుంటాడు. కాబట్టి

వారివైపు కన్నెత్తి చూడడం ఎవరికీ సాధ్యం కాదు. అందుకని నా మాట విని, పాండవులను కష్టపెట్టక, రాజ్యభాగం ఇచ్చి, వంశాన్ని, బంధువర్గాన్ని, కుమారులను కాపాడు. అలాగాక సుయోధనుడి మాట విన్నావంటే కులనాశం, బంధునాశం తప్పదు. ఒక్కడికోసం వంశనాశం చేసుకోవడం సమంజసం కాదు.

ఈ మాటలు వింటున్న దుర్యోధనుడు కోపావేశంతో లేచి, దాసీపుత్రుని ధర్మం చెప్పండని మీరు పిలవడమేమిటి? పిలిచారు గదా అని వచ్చి ఈ విధంగా ప్రేలడం ఏమిటి? ఇతడిని ఇక్కడినుంచి వెంటనే బయటకు పంపండి అని అరిచాడు.

## విదురుని తీర్థయాత్ర

దుర్యోధనుడు తనను దూషించి అవమానించగా విదురుడు మనస్తాపం చెందాడు. మారు-మాటాడక, అన్నిటినీ విసర్జించి, అడవులకు వెళ్ళిపోయాడు. కూరలు, కాయలు, నీళ్ళు, ఆహారంగా చేసుకొని, అవధూతగా మారి భారతవర్షంలోగల పుణ్యక్షేత్రాలను, తీర్థాలను దర్శిస్తూ ప్రభాసతీర్థానికి వచ్చినపుడు అక్కడ ధర్మరాజు రాజ్యాధిపతి అయ్యాడని, యుద్ధంలో కౌరవులందరూ నాశనమయ్యారని తెలుసుకొని విచారించాడు. అక్కడినుంచి వెళ్ళిపోయాడు. నదులలో స్నానం చేస్తూ పుణ్యభూములను దర్శిస్తూ మత్స్య, కురు, జాంగల భూములు దాటి యమునాతీరానికి వచ్చాడు. అక్కడ భక్తశిఖామణి, శాంతమూర్తి, సద్గుణసంపన్నుడు అయిన ఉద్ధవుని చూచాడు. ప్రేమతో కౌగిలించుకొని, కుశలప్రశ్నలు వేశాడు. కుంతీపుత్రులు క్షేమమేనా అని అడిగాడు. బలరాముడు, శ్రీకృష్ణుడు బాగున్నారా అన్నాడు. రుక్మిణి కొడుకు ప్రద్యుమ్నుడు, ఉగ్రసేన మహారాజు, జాంబవతీ తనయుడైన సాంబుడు, అనిరుద్ధుడు, సాత్యకి, అక్రూరుడు, దేవకీమాత సుఖమేగదా అని అడిగాడు. ధర్మరాజు, ఆయన తమ్ములు, కుంతి, ధృతరాష్ట్రుడు కుశలమేనా అన్నాడు.

ఉద్ధవుడు కంటతడిబెట్టాడు. కృష్ణుడు అవతారం చాలించాడని చెప్పలేక చెప్పలేక చెప్పాడు. కృష్ణుడు చేసిన పనులన్నీ జ్ఞాపకం చేసుకొన్నాడు. కంసుడిని చంపి, అతని తండ్రి ఉగ్రసేనునికి మళ్ళీ రాజ్యం అప్పగించి, భృత్యభావంతో రాజసేవ చేశాడు. తనను చంపడానికి వచ్చిన రాక్షసి పూతనను వైకుంఠానికి పంపించాడు అని చెప్పగా విదురుడు రాక్షసులకు పరమపదాన్ని ఎట్లా ఇచ్చాడని ప్రశ్నించాడు. హరితో పోరినా, హరిని చూస్తూ ప్రాణం విడిచారు కాబట్టి వారందరికి మోక్షం లభించిందని ఉద్ధవుడు సమాధానమిచ్చాడు. కృష్ణుడు ఎలా పుట్టింది, పెరిగింది, ఆయన చరిత్ర అంతా చెబుతాను వినుమని ఇలా చెప్పసాగాడు.

బ్రహ్మదేవుని ప్రార్ధన మేరకు, భూభారాన్ని తగ్గించడానికి దేవకీ వసుదేవులకు శ్రీకృష్ణుడు జన్మించాడు. కంసుడు చంపుతాడనే భయంతో వసుదేవుడు అర్ధరాత్రి ఆ పిల్లవాడిని తీసుకొని నందుడుండే పల్లెకు వెళ్ళి అయన భార్య యశోద ప్రక్కలో పడుకోబెట్టి తిరిగి వెళ్ళాడు. హరి అని ఎవ్వరికీ తెలియకుండా పదకొండు సంవత్సరాలు శ్రీకృష్ణుడు వ్రేపల్లెలో పెరిగాడు. గోపాలురతో కలిసి గోవులను కాచాడు. ఆవులను మేపుతూ మురళి వాయించి అందరినీ ఆనందింపజేశాడు. పిల్లలు బొమ్మలను చేసి విరగ్గొట్టినట్లు కంసుడు పంపిన రాక్షసులందరినీ చీల్చి చెండాడాడు. యమునానదిలో తిష్ఠవేసి అందరినీ భయపెడుతున్న కాళీయుడనే నాగరాజును శిక్షించి వెడలగొట్టాడు. గోవర్ధనపర్వతాన్ని ఎత్తి, ఇంద్రుడు కురిపించే రాళ్ళ వర్షాన్నుంచి వ్రేపల్లెవాసులను, వారి మందలను కాపాడి, ఇంద్రుని గర్వభంగం చేశాడు. బృందావనంలో రాసకేళి సలిపి గోపికలను ఆనందింపజేశాడు.

అన్న అయిన బలరామునితో కలిసి మథురానగరానికి వెళ్ళి కంసుని వధించి, తల్లిదండ్రులను చెరనుంచి తప్పించాడు. సాందీపని గురుకులావాసంలో వేదాలు, వేదాంగాలు, 64 విద్యలు నేర్చుకొన్నాడు. చచ్చిన గురుపుత్రుని బ్రతికించి గురుదక్షిణగా ఇచ్చాడు. విదర్భరాజైన భీష్మకుని కూతురు రుక్మిణిని, స్వయంవరానికి వచ్చిన రాజులందరిని ఓడించి, తెచ్చి వివాహం చేసుకొన్నాడు. సత్యభామ కోరికపై స్వర్గానికి వెళ్ళి దేవేంద్రుని జయించి పారిజాత వృక్షాన్ని తెచ్చి యిచ్చాడు. భూదేవి కుమారుడైన నరకాసురుని వధించి, అతడు బంధించి చెరలలో పెట్టిన 16వేల నూర్గురు కన్యలకు విముక్తి కలిగించాడు. వారి కోరికపై అందరినీ పెళ్ళి చేసుకున్నాడు. వారికి ఒక్కొక్కరికి పదిమంది చొప్పున కొడుకులను ప్రసాదించాడు. బాణ, శంబర, ముర, పల్వల, దంతవక్త్రాది రాక్షసులను, కాలయవన, సాల్వ, మగధ భూపాలాది రాజులను సంహరించాడు.

కౌరవులకు, పాండవులకు మధ్య జరిగిన ఘోరసంగ్రామంలో ఆయన పాండవుల పక్షాన నిలబడ్డా స్వయంగా యుద్ధం చేయలేదు. కురుక్షేత్రంలో ఉభయపక్షాల సైనికబలాలు నశించాయి. భీష్మ, ద్రోణులచేత, భీమార్జునులచేత భూమిపైగల రాజులందరిని 18 అక్షౌహిణీబలాలతోడ మట్టుపెట్టించాడు యాదవులను ఎవరూ జయించలేరు కాబట్టి వారిలో వారికి వైరం కల్పించి పోట్లాడుకొని చచ్చేటట్లు చేశాడు. ఆ విధంగా భూభారాన్ని తగ్గించాడు ధర్మరాజును రాజ్యాధిపతిని చేసి ఆయనచేత మూడు అశ్వమేధ యాగాలు చేయించాడు. ఉత్తర గర్భంలో ఉన్న పరీక్షిత్తును రక్షించి వంశం నాశం కాకుండా కాపాడాడు.

ఒకసారి యాదవులు, మునులను పరిహాసం చేయగా వారు శపించారు. ఆ తర్వాత కొన్ని నెలలకు యాదవులందరూ ప్రభాసతీర్థానికి వెళ్ళి స్నానాలు చేసి, దేవతలకు మునులకు పితరులకు తర్పణలు చేసి, బ్రాహ్మణులకు దక్షిణలు ఇచ్చారు. గోదానం, భూదానం మొదలైన దానాలన్నీ చేసి, తిని, త్రాగి, ఆ మత్తులో ఒకరినొకరు పరిహాసం చేసుకొంటూ ఉద్రేకపడి క్రోధావేశంలో ఒకరినొకరు చంపుకొంటూ అంతా మరణించారు. శ్రీకృష్ణుడు ఇదంతా చూచి నదికి వెళ్ళి స్నానం చేసి ఒక చెట్టు మొదట కూర్చున్నాడు. నన్ను బదరీవనానికి పొమ్మని ఆనతిచ్చాడు. కాని హరివియోగాన్ని భరించలేక నేను తిరిగి వచ్చాను. ఆ సమయానికి మైత్రేయుడు అక్కడికి వచ్చాడు. శ్రీకృష్ణుడు నాతో ఇలా అన్నాడు.

పూర్వజన్మలో వసువుగా బుట్టి మనస్సులో మరో కోరిక అంటూ ఏదీలేకుండా నా పాదాలనే భక్తితో సేవించావు. అందువలన నేను నీ హృదయంలోనే వుంటూ అన్నీ చూస్తుంటాను. ఆత్మారాముడినైన నన్ను ఎవరూ చూడలేరు, తెలుసుకోలేరు. నీ పూర్వజన్మసుకృతం వలన నీకు నా దర్శనభాగ్యం కలిగింది. నీకు మరోజన్మ వుండదు. ముక్తి లభిస్తుంది. పద్మకల్పంలో పద్మసంభవుడైన బ్రహ్మకు నా మహత్త్వం తెలియజేశాను. శాశ్వతసౌఖ్యాన్నిచ్చేది, జననమరణ సంసారచక్రంనుంచి విముక్తి కలిగించేది అయిన ఆ దివ్యజ్ఞానాన్ని నీకూ అందిస్తాను. అనగా నా శరీరం పులకించింది. ఆనందబాష్పాలు జాలువారాయి. శ్రీకృష్ణునికి నమస్కరించి, నీ పాదపద్మాలను నిరంతరం ధ్యానించడం తప్ప నాకు మరొక కోరిక ఏదీ లేదన్నాను. పుట్టుకేలేని నీవు ఈ విధంగా పుట్టడమేమిటి, సృష్టి స్థితి లయకారకుడవైన నీవు శత్రువులకు భయపడి, ద్వారకలో దుర్గం నిర్మించుకొని వుండడమేమిటి అని అనుకొంటూ వుంటాను. ఆత్మారాముడిగా అందరి హృదయాలలో వుండే నీవు కొందరు సుందరీమణులను కోరి వరించడం చిత్రంగా వుంది. బ్రహ్మదేవునికి నీవు కరుణించిన విజ్ఞానాన్ని గ్రహించే శక్తి నాకు వుందనుకొంటే అలాగే చెప్పు, వింటాను, అని భగవంతుడైన శ్రీకృష్ణుని బహువిధాల ప్రస్తుతించాను. ప్రసన్నుడైన ముకుందుడు నాకు పరతత్త్వాన్ని బోధించాడు. అప్పటినుంచి హరినే ధ్యానిస్తూ, పుణ్యక్షేత్ర దర్శనం చేసుకొంటూ తీర్థయాత్రలు చేస్తున్నాను. అలా హరి ఆదేశించినట్లు బదరీవనానికి వెళుతున్నాను అని ఉద్ధవుడు చెప్పగా విదురుడు, నీకు కృష్ణుడు వుపదేశించిన అధ్యాత్మ తత్త్వరహస్యాలను దయచేసి నాకు కూడా చెప్పి నన్ను ధన్యుడిని చేయవలసిందని ప్రార్థించాడు. అప్పుడు ఉద్ధవుడు, సాక్షాత్ విష్ణుసమానుడైన మైత్రేయుడున్నాడు, ఆ మునివరుని దగ్గరకు వెళ్ళితే నీకు కావలసిన తత్త్వజ్ఞానాన్ని బోధిస్తాడని చెప్పాడు. తర్వాత యమునానదిని దాటి బదరికాశ్రమానికి వెళ్ళాడు. విదురుడు కూడా యమునానదిని దాటి

పుణ్యక్షేత్రాలు, తీర్థాలు దర్శించుకొంటూ గంగానదీతీరానికి చేరాడు. గంగలో స్నానం చేశాడు. పావన గంగాతీరంలోనే మైత్రేయుడు కనిపించాడు.

## విదుర-మైత్రేయ సంవాదం

విదురుడు మైత్రేయుని పాదాలకు నమస్కరించి ఇలా అడిగాడు. మునీంద్రా! లోకంలో మనుష్యులందరికి సుఖం కావాలి. మనస్సు కోరిన విధంగా ఆ సుఖాలకోసం అనేక కర్మలు చేస్తారు.కాని వారి పనులన్నీ నిష్ఫలమవుతున్నాయి. కర్మలు దుఃఖానికి కారణమవుతున్నాయి. బంధాలను పెంచుతున్నాయి. సంసారచక్రంలో పడి నలిగే జీవికి అన్నీ కష్టాలే. అయినా కోరికలు తీరవు. ఆశలు చావవు. చేసిన పుణ్యపాపకర్మలను బట్టి మళ్ళీ మళ్ళీ పుడుతూ చస్తూ నిష్కృతి కనిపించక సంచరించే మూఢ మానవులను రక్షించడానికే మీలాంటి పుణ్యాత్ములు లోకంలో తిరుగుతుంటారు. నన్ను కాపాడాలని మీకనిపిస్తే నా మనవి వినండి.

త్రిగుణాత్మకమైన మాయను తన అదుపులో పెట్టుకొన్న భగవంతుడు స్వతంత్రుడై ఏయే అవతారాలు ఎత్తి ఏయే కర్మలు చేశాడు? నిష్క్రియుడగు ఈశ్వరుడు మొదట ప్రపంచాన్ని ఏ విధంగా కల్పించాడు? ఈ విశ్వాన్నంతా తన హృదయాకాశంలో పెట్టుకొని సంకల్పరహితుడై యోగమాయలో ఎలా వున్నాడు? జనాలకు వివిధ కర్మలు, నామరూపాలు ఎలా ఏర్పరిచాడు? ఇవన్నీ సవిస్తరంగా వివరించండి. యోగీశ్వరులకే ఈశ్వరుడైన పుండరీకాక్షుని చరిత్ర వింటేగాని సంసారబంధాలు తెగవు. హరిస్మరణమే జీవులకు అన్ని సుఖాలను ఇస్తుంది. శ్రీహరి నామాన్ని, కథలను వినడానికి ఇష్టపడనివారు ఇహలోకంలో సుఖపడరు. నరకానికి పోతారు. హరిని ఒక్క నిమిషమైనా ధ్యానించని నరుడికి ఆయువు తగ్గిపోతుంది. కాబట్టి శ్రీహరిచరిత్రను నాకు వినిపించండని విదురుడు అడిగాడు.

మైత్రేయుడు చెప్పడం ప్రారంభించాడు. కృష్ణుని కథ వినాలంటున్నావు నీకు శుభమవుతుంది. నీవు పూర్వజన్మలో యముడవు. మాండవ్యముని శాపంవల్ల శూద్రస్త్రీ గర్భాన జన్మించావు. పరమజ్ఞానివి. నారాయణునకు ప్రియమైనవాడివి. అందుకే కృష్ణుడు నిర్యాణం చెందేముందు అధ్యాత్మవిజ్ఞానాన్ని నాకు ఉపదేశించి, తర్వాత నీకు తెలియజేయవలసిందిగా ఆజ్ఞాపించాడు. అదంతా నీకు చెబుతాను. సావధానంగా విను.

ఈశ్వరుని యోగమాయనుంచి ఈ విశ్వం ఎలా పుట్టి, పెరిగి, నశిస్తుందో తెలుపుతాను. విష్ణుని మహత్త్వాన్ని వర్ణిస్తాను. సృష్టికి పూర్వం అంతటిని తనలోనే

ఇముడ్చుకొని వున్న పరమాత్మకు విశ్వాన్ని నిర్మించాలనే వాంఛ కలిగింది. కార్యకారణరూపమైన భగవంతుని మాయాశక్తినే అవిద్య అని కూడా అంటారు. దానిలో ఆత్మాంశగల పురుషాకృతి శక్తిని నిలిపి ఈశ్వరుడు విశ్వాన్ని సృష్టించాడు. మాయనుంచే మహత్తత్త్వం, మహత్తునుంచి అహంకారతత్త్వం ఉత్పన్నమయ్యాయి. అహంకారం మూడువిధాలు - సాత్త్వికాహంకారం, రాజసిక అహంకారం, తామసిక అహంకారం. సాత్త్వికాహంకారం నుంచి మనస్సు, దేవతాగణాలు పుట్టాయి. రాజసిక అహంకారంనుంచి జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు ఏర్పడ్డాయి. తామసిక అహంకారంనుంచి శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు ఉదయించాయి. శబ్దంనుంచి ఆకాశం, ఆకాశంనుంచి వాయువు, వాయువునుంచి తేజం, తేజంనుంచి నీరు పుట్టాయి. నీటినుంచి భూమి వచ్చింది. ఆకాశానికి శబ్దం గుణం, గాలికి శబ్ద, స్పర్శలు గుణాలు, తేజానికి శబ్ద, స్పర్శ, రూపాలు గుణాలు, నీటికి శబ్ద, స్పర్శ, రూప, రసములు గుణాలు. భూమికి శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు గుణాలు. ఈ తత్త్వాలన్నీ ఐక్యతలేనందున ప్రపంచాన్ని సృష్టించలేక భగవంతుడిని ప్రార్థించాయి. అప్పుడు ఈశ్వరుడు ప్రకృతిలో తన బలాన్ని నిలిపి, 27 తత్త్వాలలోను ఒక్కసారిగా ప్రవేశించి విశ్వనిర్మాణ కౌశలాన్ని చూపుతూ అన్యోన్యత్వం కల్పించాడు. ఆ తత్త్వసముదాయం దైవశక్తిచేత ప్రేరితమై ఐక్యతను సాధించి విరాట్ విగ్రహంగా పరిణామం చెందింది. ఆ విరాట్ పురుషుడు నీళ్ళలో వెలసిన పద్మంలోని అండంలో వేయి సంవత్సరాలున్న తర్వాత ఆయనకు చైతన్యం వచ్చింది. కర్మశక్తి, ప్రాణశక్తి, ఆత్మశక్తి కలిగినాయి. ఆ విధంగా ప్రపంచం ఆ మహాపురుషుని గర్భంలో ప్రాణికోటితో కలిసి అభివ్యక్తం అయ్యింది.

ఆ విరాట్ పురుషుని తలనుంచి స్వర్గం, కాళ్ళనుంచి భూమి, బొడ్డునుంచి ఆకాశం ఏర్పడ్డాయి. సత్త్వగుణం పరిణామం చెంది దేవతలై స్వర్గాన్ని ఆక్రమించారు. రజోగుణం నుంచి మనుష్యులు, పశువులు మొదలైన జీవరాశి వచ్చి భూమిపై నిలిచారు. తామసగుణంవలన రుద్రుని వెంట వుండే భూతగణాలు పుట్టి, నేలకు నింగికి మధ్యగల స్థలాన్ని పొందారు. వేదాలు, బ్రాహ్మణులు ఆయన ముఖంనుంచి రావడంవలన బ్రాహ్మణుడు అన్ని వర్ణాలకు గురువు, ముఖ్యుడు అయ్యాడు. బ్రాహ్మణులు మొదలైనవారిని దొంగల బాధనుంచి కాపాడడానికి పురుషోత్తముని చేతులనుంచి క్షత్రియులు సంభవించారు. వ్యవసాయం, గోరక్షణ, వాణిజ్యాది కర్మలను చేసే వైశ్యజాతి ఆయన తొడలనుంచి పుట్టింది. సేవకధర్మంగల శూద్రజాతి ఆయన పాదాలనుంచి పుట్టింది. హరిమహిమ ఆయన బొడ్డులోని కమలంనుంచి పుట్టిన చతుర్ముఖ బ్రహ్మకే పూర్తిగా తెలియదు. ఇక

మనుష్యుల సంగతి చెప్పడం ఎందుకు అన్నాడు మైత్రేయుడు.

అప్పుడు విదురుడు ఆయన మాటకు అడ్డువచ్చి, మహాత్మా! ఈశ్వరుడు నిర్గుణుడు గదా, ఈ లోకాలను కల్పించి పోషించి నశింపజేయడం సగుణుడై ఎలా చేశాడు అని అడిగాడు. ఒక్కడే దేవుడు జీవరూపంలో సమస్త శరీరాలలో నివసిస్తున్నప్పుడు జీవునికి కష్టాలు ఎలా కలుగుతున్నాయి? పరమపురుషుడు ప్రకృతితో ఎలా కలిశాడు? నా సంశయాలు మీరే తొలగించాలి అన్నాడు.

అప్పుడు మైత్రేయుడు ఇలా చెప్పాడు. చెరువులో చంద్రుడిని చూస్తాం. నీరు కదిలితే చంద్రబింబంకూడా కదులుతున్నట్లు తోస్తుంది గదా! కాని ఆకాశంలో చంద్రునిపై ఈ కదలిక ప్రభావం వుండదు. అలాగే ఈశ్వరుడు అన్ని శరీరాలలో వుండినప్పటికి ఆ శరీరాలు చేసే కర్మలు ఆయనని అంటవు, బంధించవు. జీవునకు అవిద్యవలన కర్మబంధనాలు సంప్రాప్తమవుతున్నాయి. ఇంద్రియాలను నిగ్రహించి, భక్తితో భగవంతుడిని సేవిస్తూ, నిర్మల హృదయంతో హరిని ధ్యానించితే ఆపదలన్నీ తొలగిపోతాయి.

విదురుడు తలవంచి మైత్రేయునికి నమస్కరించి వినయంగా ఇలా అన్నాడు. మునీంద్రా! నీ మాటలవలన నా సంశయాలు తొలగిపోయాయి. శరీరధారి అయిన జీవునికి కర్మబంధమెలా వచ్చిందో తెలిసింది. జీవుడు పరాధీనుడు. మాయామోహములకు వశుడై కష్టాలు అనుభవిస్తాడు. అతని దుఃఖాలకు మూలహేతువు అవిద్య. నారాయణ భజన సమస్త దుఃఖనివారణం. నారాయణభక్తి అవిద్యను అంతం చేస్తుంది విరాట్‌పురుషుని ఆవిర్భావం, ఆయననుంచి సృష్టి ఎలా జరిగిందీ చెప్పావు. బాగానే వుంది. మరి ప్రజలు ఎలా పుట్టారు? కొడుకులు, మనుమలతో వంశాలు పెరిగి లోకాన్ని ఎలా నింపారు? ప్రజాపతుల పుట్టుక, మనువుల చరిత్ర, భూమిపైనా, క్రిందావున్న లోకాలు, అక్కడ వుండే జీవుల గురించి నాకు తెలుసుకోవాలని వుంది. వర్ణాశ్రమధర్మాలగురించి, యోగమహిమలు, సాంఖ్యయోగం, జ్ఞానమార్గాలు, తపం, దానం, వాటి ఫలితాలు, జీవుడు, బ్రహ్మ గోవిందునిలో ఎలా ఐక్యం అవుతారు మొదలైన విషయాలన్నీ చెప్పండి.

మైత్రేయుడు చెప్పసాగాడు. హరినుంచి సృష్టినిర్మాణశక్తిని పొందిన బ్రహ్మ 14 లోకాలను నిర్మించాడు. తర్వాత దేవతలను, నరులను, జంతువులను, వివిధ స్థావరాలను సృష్టించాడు. ఈ సృష్టి అంతా ఈశ్వరుని లీల. అన్ని లోకాల్లోనూ ఈశ్వరుడు వుంటాడు. అన్ని లోకాలు ఈశ్వరునిలో వుంటాయి. విశ్వానికి కారణము, కార్యమూ కూడా ఆయనే. ఆ పురుషోత్తముని మాయవలన విశ్వం పుడుతుంది, పెరుగుతుంది, నశిస్తుంది.

సృష్టి తొమ్మిది విధాలు. కాలం, ద్రవ్యం, గుణం ప్రకృతితో కలిసి మార్పు చెందగా

మొదట మహత్తత్త్వం ఏర్పడుతుంది. దానినుంచి అహంకారతత్త్వం ఉత్పన్నమవుతుంది. దీనిలో ద్రవ్యం, జ్ఞానం, క్రియ అనే మూడు లక్షణాలుంటాయి. పంచమహాభూతాలు మూడవ సృష్టి . శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు అనే పంచతన్మాత్రల శక్తులు వీటిలో ఇమిడి వుంటాయి. పంచజ్ఞానేంద్రియాలు, పంచ కర్మేంద్రియాలు పుట్టడం నాల్గవ సృష్టి. సాత్త్విక అహంకారంనుంచి మనస్సు పుడుతుంది. ఇది ఐదవది. జీవులకు బుద్ధితో సంబంధం లేని విశేషాలను కల్పించే తామస సృష్టి ఆరవది. ఈ ఆరింటిని ప్రాకృతసర్గాలు అంటారు. మిగిలిన మూడు వైకృతసర్గాలు. పూతలేకుండా కాయలు కాచే రావి, మర్రి, జమ్మి, మేడి, పనస వంటి చెట్లు, పూత, పంటా వుండే వరి, పెసలు, యవలు వంటి మొక్కలు, మాలతి, మల్లిక వంటి పైకి ప్రాకే లతలు, పొదలు, గుబుర్లుగా పెరిగే ద్రాక్షవంటి తీగజాతులు, వెదురుజాతికి చెందిన చెట్లు, చక్కగా పూచి కాయలు కాచే మామిడివంటి చెట్లు, అవ్యక్తచైతన్యం కలిగి పైకి పెరిగేవి, తమస్సుతో కూడిన స్థావరాలు ఏడవసర్గం. ఎనిమిదవ సర్గం జంతువులు. ఇవి 28 రకాలు. రెండు గిట్టలు గలవి, ఒకే గిట్టగలవి, ఐదుగోళ్ళుగల 12 భూచరాలు, జలచరాలు, ఆకాశంలో తిరిగే పక్షులు. తొమ్మిదవ సర్గం మానవులు. రజోగుణప్రేరితులు, కార్యకరణదక్షులు, దుః ఖంలోను సుఖాన్ని కోరే మనుష్యులు పుట్టారు. ఇంకా ఎనిమిది రకాలైన దేవసర్గం కూడా వుంది: 1) విబుధులు, 2) సురలు, 3) పితరులు, 4) గంధర్వులు, అప్సరసలు, 5) యక్షులు, రాక్షసులు, 6) భూతాలు, ప్రేతాలు, పిశాచాలు, 7) సిద్ధులు, చారణులు, విద్యాధరులు, 8) కిన్నరులు, కింపురుషులు.

ఇక కాలలక్షణం వివరిస్తాను. గాలికి లేచి సూర్యకిరణ ప్రసారంలో కనిపించే రేణువులో ఆరవవంతు పరమాణువు. దానిని ఎంతసేపటిలో సూర్యుడు దాటుతాడో అది సూక్ష్మకాలం. సూర్యుడు 12 రాశులను దాటి వెళ్ళేందుకు ఎంతకాలం పడుతుందో అది మహత్కాలం. కాలాన్ని కొలిచే విధానం చెబుతాను. రెండు పరమాణువులు ఒక అణువు. మూడు అణువులు ఒక త్రసరేణువు. మూడు త్రసరేణువులు ఒక త్రుటి. నూరు త్రుటులు ఒక వేధ. మూడు వేధలు ఒక లవం. మూడు లవాలు ఒక నిమేషం. మూడు నిమేషాలు ఒక క్షణం. ఐదు క్షణాలు ఒక కాష్ఠ. పది కాష్ఠలు ఒక లఘువు. 15 లఘువులు ఒక నాడిక, రెండు నాడికలు ఒక ముహూర్తం. మూడు ముహూర్తాలు ఒక ప్రహరంగిలేక యామం. నాలుగు యామాలు ఒక పగలు. రాత్రి కూడా అంతే. .ఒక పగలు, రాత్రి కలిసి దినం. 15 దినాలు ఒకపక్షం. శుక్ల, కృష్ణపక్షాలు రెండూ కలిసి ఒక మాసం. అది పితృదేవతలకు ఒక దినం. ఆరుమాసాలు ఉత్తరాయణం, ఆరుమాసాలు దక్షిణాయనం,

12 మాసాలు కలిసి ఒక సంవత్సరం. అట్టి నూరు సంవత్సరాలు మానవులకు ఆయుర్దాయం.

ఇక కాలగతిని గూర్చి చెబుతాను. విను. యుగాలు నాలుగు – కృత, త్రేత, ద్వాపర, కలి అని వాటికి పేర్లు. కృతయుగ కాల పరిమాణం నాలుగువేల దివ్యవర్షాలు. ఒక యుగం ముగిసి మరొకయుగం రావడానికి మధ్యకాలాన్ని సంధ్య అంటారు. కృతయుగానికి సంధ్యాకాలం 800 సంవత్సరాలు. తర్వాత త్రేతాయుగ కాలపరిమాణం మూడువేల దివ్య సంవత్సరాలు. దాని సంధ్యాకాలం 600 సంవత్సరాలు. ద్వాపరయుగం రెండువేల దివ్య సంవత్సరాలు. దాని సంధ్యాకాలం 400 సంవత్సరాలు. చివరిది కలియుగం వేయి దివ్య సంవత్సరాలు. దాని సంధ్య 200 యేళ్ళు. సంధ్యాకాలం ముగిసేనాటికి ధర్మం తగ్గిపోతుంటుంది. ధర్మదేవత కృతయుగంలో నాలుగుపాదాలతో, త్రేతలో మూడు పాదాలతో, ద్వాపరలో రెండుకాళ్ళతో, కలియుగాన ఒంటికాలితో నడుస్తుంది. అందువలన ఒక్కొక్కయుగం గడిచేకొద్దీ అధర్మం ప్రబలుతుంది. బ్రాహ్మణులకు దుర్బుద్ధులు పుడతాయి. పాపకర్మలు చేస్తారు.

చక్రంలో ఆకులమాదిరిగా ఈ నాలుగు యుగాలు మళ్ళీ మళ్ళీ ఒకదాని తర్వాత మరొకటి వస్తుంటాయి. అలాంటి చతుర్యుగాలు వేయి గడిస్తే సత్యలోకంలో వున్న బ్రహ్మకు ఒక పగలు. ఇంకొక వేయి గడిస్తే రాత్రి. బ్రహ్మ నిద్రపోతే లోకాలన్నీ నశిస్తాయి. మేలుకొంటే మరల పుడతాయి. ఒక్కొక్క బ్రహ్మదినంలో 14మంది మనువులు ఉద్భవిస్తారు. ఒక్కొక్క మనువు కాలం 71 యుగాలు. మనువులు, సురలు, మునులు, సప్తర్షులు భగవంతుని అంశతో పుట్టి లోకాలను పాలిస్తారు. హరి పితరుల రూపంలోను, దేవతల రూపంలోనే గాక మానవరూపంలోను, జంతురూపంలోనూ కూడా జన్మించి స్వయంశక్తితో లోకాలను పాలిస్తాడు.

బ్రహ్మదేవుడు పగలు గడిచాక పడుకొని నిద్రపోతాడు. రాత్రి అవుతుంది. చీకటి వ్యాపిస్తుంది. సూర్యుడు చంద్రుడు కూడా లేకుండా పోతారు. అప్పుడు సర్వాత్ముడైన హరి శక్తిరూపంలో వెలుగుతాడు. ఆ వెలుగునుంచి పుట్టిన అగ్ని మూడులోకాలను దహించగా ఆ అగ్నిజ్వాలలనుంచి వచ్చిన వేడికి తట్టుకోలేక మహర్లోకవాసులు జనలోకానికి వెళతారు. ఆ ప్రళయవేళ పెనుగాలులు వీచి, సముద్రాలు పొంగి మూడులోకాలను ముంచుతాయి. ఏకార్ణవమైన ఆ జలరాశిపైన శ్రీహరి శేషశయనుడై యోగనిద్రలో వుంటాడు. భూమితో సహా లోకాలన్నీ ఆయన కడుపులో వుంటాయి. మనిషికి నూరు సంవత్సరాలు ఆయువు అయినట్లే బ్రహ్మకు కూడా నూరేళ్ళే. ఇందులో మొదటిసగాన్ని

పూర్వార్ధమని, రెండో సగాన్ని పరార్ధమని అంటారు. ఇప్పుడు నడుస్తున్న కాలం ద్వితీయపరార్ధం. బ్రహ్మ బ్రతికివుండే కాలాన్ని బ్రహ్మకల్పం అంటారు. ద్వితీయ పరార్ధంలో హరి సూకరాకారం (పంది) దాల్చినపుడు దాన్ని వరాహకల్పం అని పిలుస్తారు. ప్రస్తుతం నడుస్తున్నది వరాహకల్పమే. 105 కోట్ల యోజనాల విస్తీర్ణం గల ఈ బ్రహ్మాండమంతటా హరి పరమాణు రూపంలో నివసిస్తాడు. ఆయనలోనే అండరూపంలో లోకాలు పుడుతూ, గిట్టుతూ వుంటాయి. పరమేశ్వరుడు అనంతుడు, ఆద్యుడు, అక్షరుడు, అప్రమేయుడు. అఖిలకారణాలకు ఆదికారణుడు. అట్టి పరమపురుషుని వర్ణించడం బ్రహ్మాదులకు కూడా శక్యం కాదు.

కాలరూపంలో వున్న హరి మహిమలు చెప్పాను. ఇప్పుడు సృష్టి మహిమ వినిపిస్తాను అని మైత్రేయుడు విదురునికి ఇంకా ఇలా చెప్పాడు.

ఐదు లక్షణాలుగల అవిద్యతో, బ్రహ్మ ప్రాణులన్నిటిని సృష్టించాడు. నేను, నాది అనే అహం, దేహం అంటే అభిమానం, ఇలాంటి బుద్ధిని కలిగించే మోహం మొదటిది. సంభోగం, శరీరాన్ని అలంకరించుకోవడం, అనుభవించాలనే కోర్కెలన్నీ కలిసిన దాన్ని మహామోహం అంటారు. ఇది రెండవది. కోర్కెలకు అడ్డువస్తే కలిగే కోపమే తామిస్రమని చెప్పే మూడవ లక్షణం. చావు వచ్చినప్పుడు తానొక్కడినే చస్తున్నాననుకొనేది నాల్గవ లక్షణమైన అంధతామిస్రం. ఉన్నది లేదు, లేనిది వున్నది అనుకొనే భ్రమ, చిత్రవిభ్రమం అనే ఐదవ లక్షణం. అవిద్యతో కూడిన ఈ పాపులను సృష్టించానేమిటీ అని బ్రహ్మ పశ్చాత్తాపపడి, భగవంతుడిని ధ్యానించి, పవిత్రహృదయంతో, జితేంద్రియులైన సనక, సనందన, సనత్కుమార, సనత్సుజాతులను మునులను సృష్టించాడు. వారు సత్త్వగుణ సంపన్నులు, బుద్ధిశాలురు, హరిభక్తులు. వాళ్ళను చూచి బ్రహ్మ, మీరంతా పిల్లల్ని కని ప్రపంచాన్ని వృద్ధిచేయాలని ఆదేశించగా, వాళ్ళు నారాయణుని సేవిస్తూ మోక్షం పొందాలనుకొనేవాళ్ళం, మాకు పెళ్ళిళ్ళు, పిల్లలు ఏమిటీ అని ఆయన మాటలను తిరస్కరించారు. దాంతో వచ్చిన కోపాన్ని నిగ్రహించుకొన్నప్పటికి, బ్రహ్మ కనుబొమలమధ్యనుంచి క్రోధస్వరూపంతో నీలలోహితుడు (శివుడు) ఉద్భవించాడు.

నలుపు, ఎరుపు కలిసిన రంగుతో ఆక్రందన చేస్తూ పుట్టిన నీలలోహితుడు, నాపేరు ఏమిటి, నేనెక్కడుండాలి అని బ్రహ్మను అడిగాడు. రోదనం చేస్తూ పుట్టావు గాబట్టి రుద్రుడే నీ పేరు అన్నాడు బ్రహ్మ. నీవు వుండడానికి 11 స్థలాలు వున్నాయన్నాడు. అవి ఏవంటే సూర్యుడు, చంద్రుడు, నిప్పు, నీరు, గాలి, ఆకాశం, భూమి, ప్రాణం, వేడి, హృదయం, ఇంద్రియాలు. పేర్లుకూడా 11 వుంటాయి - మన్యు, మను, మహాకాల, మహత్, శివ,

రుతధ్వజ, ఉరురేతసుడు, భవుడు, కాలుడు, వామదేవుడు, ధృతవ్రతుడు. రుద్రునికి 11 మందిని భార్యలుగా ఇచ్చాడు బ్రహ్మ. వారిపేర్లు ధీ, వృత్తి, అశనా, ఉమా, నియుత్, సర్పి, ఇలా, అంబికా, ఇలావతీ, సుదా, దీక్ష. ఈ భార్యలతో కలిసి ఇంతకుముందు చెప్పిన చోట్ల నివసిస్తూ సంతానాన్ని కనవలసిందని బ్రహ్మ ఆదేశించగా రుద్రుడు రుద్రగణాల్ని సృజించాడు. వాళ్ళు విశ్వాన్ని మ్రింగి కూర్చున్నారు. ఆ ఉపద్రవాన్ని తొలగించడానికి బ్రహ్మ జోక్యం చేసుకొని, మీ సృష్టి యిక చాలు, వెళ్ళి తపస్సు చేసుకోండి అని ఆజ్ఞాపించాడు. తర్వాత ప్రపంచాన్ని జనంతో నింపడానికి పదిమంది బుద్ధిమంతులను సృజించాడు. బ్రహ్మ బొటనవ్రేలునుంచి దక్షుడు, తొడనుంచి నారదుడు, బొడ్డునుంచి పులహుడు, చెవులనుంచి పులస్త్యుడు, చర్మంనుంచి భృగువు, చేతినుంచి క్రతువు, ముక్కునుంచి అంగిరసుడు, ప్రాణంనుంచి వసిష్ఠుడు, మనస్సునుంచి మరీచి, కన్నులనుంచి అత్రి పుట్టారు. బ్రహ్మ కుడిరొమ్మునుంచి ధర్మం, వెన్నునుంచి మృత్యువు, అధర్మం, ఆత్మనుంచి మన్మథుడు, కనుబొమలనుంచి క్రోధం, పెదవులనుంచి లోభం, నోటినుంచి సరస్వతి, పురుషాంగం నుంచి సముద్రాలు, ముడ్డినుంచి నిరుతి, నీడవలన కర్దముడు పుట్టారు

బ్రహ్మ తననోటినుంచి పుట్టిన భారతి సౌందర్యం చూచి మోహావేశుడయ్యాడు. కూతురనే సంకోచం కూడా లేకుండా ఆమెను పొందగోరాడు ఇది చూచిన మరీచి మొదలైన మునులు ఇది ధర్మం కాదన్నారు. వావివరుసలు పాటించాలన్నారు. క్షణిక సుఖం కోసం ఇంత పాపం చేస్తావా? కామంచేత అంధుడివయ్యావా? అని ప్రశ్నిస్తూ కఠోరంగా మాట్లాడగా బ్రహ్మ సిగ్గుతో తలదించుకొన్నాడు వెంటనే దేహాన్ని వదిలివేశాడు. దిక్కులు ఆ శరీరాన్ని స్వీకరించాయి బ్రహ్మ మరొక శరీరాన్ని ధరించి సృష్టి చేయబోతే వెనుకటి నేర్పు వ్యక్తం కాలేదు. ఇదేమి ఇలా జరిగింది అని ఆలోచిస్తుండగా నాలుగు ముఖాలనుంచి వేదాలు వెలువడ్డాయి. యాగాలు, కర్మలు, తంత్రాలు, నడవళ్ళు, ఆశ్రమధర్మాలు అన్నీ ఆయన ముఖాలనుంచి ప్రకటితమయ్యాయి. అనగా విని విదురుడు, అలాగైతే ఏ ముఖంనుంచి ఏ సృష్టి జరిగిందో చెప్పండని మైత్రేయుడిని అడిగాడు. అప్పుడు మైత్రేయుడు ఇలా చెప్పాడు.

## స్వాయంభువుని జననం

ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వవేదం, యజ్ఞకర్మలు, ఉపవేదాలైన ధనుర్వేదం, ఆయుర్వేదం, గాంధర్వవేదం, శిల్పశాస్త్రమైన స్థాపత్యం, తూర్పుముఖాలనుంచి పుట్టగా, ఇతిహాసపురాణాలు సర్వముఖాలనుంచి వచ్చాయి. అలాగే విద్య, దానం,

తపస్సు, సత్యం, ఆశ్రమధర్మాలు, ధర్మం, అర్థం, కామం, మోక్షం, ఆత్మజ్ఞానం మొదలైనవన్నీ వెలువడ్డాయి. తర్వాత దైవసంకల్పంవలన బ్రహ్మదేహం రెండుగా చీలింది. ఒక భాగం స్వాయంభువ మనువు కాగా రెండవభాగం ఆయన భార్య శతరూప అయ్యింది. వారివలన ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు అనే ఇద్దరు కుమారులు, ఆకూతి, దేవహూతి, ప్రసూతి అను ముగ్గురు కుమార్తెలు సంభవించారు. ఆకూతిని రుచిరుడికి, దేవహూతిని కర్దముడికి, ప్రసూతిని దక్షునికి ఇచ్చి పెళ్ళిచేశారు. వారి సంతతి చేత లోకం అంతా నిండిపోయింది.

చాలా సంతోషం అన్నాడు విదురుడు. అయితే బ్రహ్మ శరీరాన్ని చీల్చుకొని వచ్చిన స్వాయంభువ మనువు మానవజాతికి తొలిచక్రవర్తి అన్నమాట. ఆ మహారాజు చరిత్ర అందరికీ శుభాన్ని, సుఖాన్ని కలిగిస్తుంది. విన్నవారి జన్మ ధన్యమవుతుంది. కాబట్టి నాకు వివరంగా చెప్పండి అని విదురుడు అడిగాడు. మైత్రేయుడు చెప్పడం కొనసాగించాడు.

స్వాయంభువుడు, తన భార్య శతరూపతో కలిసి బ్రహ్మదేవునికి తలవంచి మ్రొక్కి చేతులు జోడించి, తండ్రీ! మేం ఏం చేయాలో చెప్పండి, ఏ పనిచేస్తే మీకు సంతోషం కలుగుతుందో అలాంటి పరిచర్యలు చేసి మంచి పేరు తెచ్చుకొంటాం అన్నాడు. కొడుకు మాటలకు ఆనందించి బ్రహ్మ ఇలా అన్నాడు. తండ్రి ఆజ్ఞ తలదాల్చి, ఏ పనిచెబితే ఆ పని తన శక్తినంతా వుపయోగించి వెంటనే చేయడం, మాధవుని పాదారవిందాలను సేవించడం, ప్రజలను చక్కగా పరిపాలించడం, తండ్రికి కొడుకు పరిచర్య చేయడంతో సమానమే! కాబట్టి హరిని గురించి భక్తితో యజ్ఞాలు చేసి విష్ణుని సంతుష్టిపరిస్తే లోకాలకు మేలు జరుగుతుంది. యజ్ఞాలు చేసి శుభాలు పొందు. నీవు, నీ కుమారులు ఈ భూమిని చక్కగా పాలించండి. సజ్జనులను రక్షించండి. ధర్మం తప్పకుండా జీవించండి.

బ్రహ్మ మాటలకు స్వాయంభువుడు, అలాగే చేస్తాం. మాకు వుండడానికి చోటు చూపించండి, అని తండ్రిని అడిగాడు. జీవరాశికి ఆధారభూతమైన భూమి అంతా ఇప్పుడు నీట మునిగివుంది. కాబట్టి భూమిని నీటినుంచి పైకిదెచ్చే ఉపాయం ఆలోచించి చెప్పండి అన్నాడు. బ్రహ్మ ఆలోచించడం మొదలుపెట్టాడు. పూర్వం సృష్టి ప్రారంభంలో లోకాలను నిర్మించేటప్పుడు మొదట నీటిని సృష్టించి తర్వాత భూమిని పుట్టించగా, ఆ భూమి నీటిలో మునిగి రసాతలానికి వెళ్ళిపోయింది. ఇప్పుడీ భూమిని పైకి తీసుకొనిరావడం ఎలా అని చింతిస్తూ, లక్ష్మీనారాయణుని మనస్సులో నిలిపి ధ్యానించగా బ్రహ్మ ముక్కురంధ్రాలనుంచి యజ్ఞవరాహమూర్తి బొటనవ్రేలంత దేహంతో వెలువడి, క్షణంలోపల ఆకాశమంత ఎత్తుకు ఎదిగిపోయాడు.

మరీచి మొదలైన మునులు, మనువు, ఆయన కుమారులు, బ్రహ్మ ముక్కురంధ్రాలలోని వెంట్రుకలు బయటికి వచ్చి బొటనవ్రేలంత వరాహరూపం ధరించడం, ఆ వెంటనే ఏనుగంతై, పర్వతమంతై ఆకాశమంత ఎత్తుకు ఎదగడం మహావిచిత్రంగా వుంది, అని ఆశ్చర్యపోయి చూచారు. తన మనస్సులోని చింతను పోగొట్టడానికి శ్రీహరి ఈ రూపంలో వచ్చాడని బ్రహ్మదేవుడు సంతోషించాడు. అప్పుడు సూకరాకారంలో వున్న భగవంతుడు మేఘంలా గర్జించాడు. ఆ ధ్వని విని జనలోక, తపలోక, సత్యలోక నివాసులైన మునులు ఈశ్వరుని స్తుతించారు. యజ్ఞవరాహం సముద్రమంతా రొచ్చు రొచ్చుగా త్రొక్కి కలచివేసింది. 14 లోకాలు కదిలిపోయేటట్లు కోరలతో చిమ్మింది. ఏడు సముద్రాలను కాళ్ళతో త్రొక్కి బురదమయం చేసింది. కళ్ళలోనుంచి అగ్నివర్షం కురిపించింది.

నీటిలో మునిగిన భూమి రసాతలం వరకు వెళ్ళిపోగా దానిని పైకి తేవడానికి వరాహమూర్తి సముద్రగర్భాన్ని కెలుకుతుండగా బాధపడిన సముద్రుడు, తరంగాలనే చేతులు పైకెత్తి రక్షించు, రక్షించు, యజ్ఞవరాహా అని ఆక్రోశించాడు. వరాహమూర్తి తన కాలి గిట్టలతో నీళ్ళను చీల్చుకుంటూ రసాతలం ప్రవేశించి భూమి దగ్గరకు చేరగా అక్కడ ఒక మహోగ్రాకారుడైన రాక్షసుడు కనిపించాడు. వాడు వరాహమూర్తిని చూచి రుసరుస లాడుతూ రోషంతో గద విసిరాడు. వరాహమూర్తి ఆ గదను తప్పించుకొని తన కోరలతో కుమ్మి ఆ రాక్షసుడిని సంహరించాడు. కోరపైనే భూమిని ఎత్తి పట్టుకొని పైకి వచ్చాడు. ఆ విధంగా ధరణిని ఉద్ధరించిన దివ్యమూర్తిని బ్రహ్మాదులు ఘనంగా ప్రస్తుతించారు. భూమిని నీటిమీద నిలిపి యజ్ఞవరాహమూర్తి అదృశ్యమయ్యాడు.

ఇది విన్న విదురుడు మైత్రేయునితో ఇలా అన్నాడు. శ్రీహరి యజ్ఞవరాహరూపంతో వచ్చి హిరణ్యాక్షుడనే రాక్షసుని చంపి భూమిని రక్షించాడని చెప్పావు. కోరపై భూమిని ఎలా ధరించాడు? హిరణ్యాక్షునితో వైరం ఎందుకు వచ్చింది? ఆ రాక్షసుని ఎలా చంపాడు, మొదలైన వివరాలన్నీ దయచేసి చెప్పండి. మైత్రేయుడు సమాధానం చెబుతూ, ఈ కథను ధ్రువుడు అడగ్గా మొదట నారదుడు చెప్పాడు, తర్వాత బ్రహ్మ దేవతలకు తెలిపాడు, నేను నీకు వినిపిస్తాను, శ్రద్ధగా విను అన్నాడు.

## హిరణ్యాక్షుడు - హిరణ్యకశిపుడు

దక్షప్రజాపతి కూతురైన దితి ఒకనాటి సాయంసంధ్యవేళ భర్త అయిన కశ్యపుని దగ్గరకు వచ్చి తన కామవాంఛను తీర్చవలసిందిగా కోరింది. సంతానవాంఛతో వచ్చిన భార్య మనసులోని కోర్కెను తీర్చడం భర్త కర్తవ్యం. కాని ఇది సంధ్యాసమయం.

సంభోగానికిది సమయం కాదు. శాస్త్రవిరుద్ధం, ధర్మం తప్పడం ఎందుకు ఒక ముహూర్తం ఆగు అన్నాడు కశ్యపుడు. దితి ఆయన మాట వినిపించుకోలేదు. తన పట్టు విడువలేదు. భర్తను కౌగిలించుకొని నిర్బంధం చేయగా, కశ్యపుడు ఈశ్వరునికి నమస్కరించి, ఆమె కోర్కెను తీర్చాడు. దితి గర్భం ధరించింది. సమయంకాని సమయంలో, సిగ్గూ భయం లేకుండా, ధర్మాధర్మాలు విచారించకుండా, కామం తీర్చుకోవడం మహాపాపం. దాని ఫలితంగా రుద్రుని అనుచరులైన భద్రుడు, అనుభద్రుడు అనేవారు ఇద్దరు నీ కడుపున పుడతారు. వారు బలగర్వాలతో మదమత్తులై సజ్జనులను హింసిస్తూ, భూమిని పీడిస్తారు. వారి పాపకర్మలు భరించలేక సాధువులు హరిని శరణుజొచ్చి రక్షించాలని అభ్యర్థిస్తారు. వారిద్దరు హరిచేతిలో హతమవుతారు అని కశ్యపుడు తన దివ్యదృష్టితో భవిష్యత్తును దర్శించి భార్యకు చెబుతాడు.

అది విన్న దితి భయపడింది. మనస్సు వ్యాకులం అయ్యింది. తామసంతో మంచివారికి కీడుచేస్తే ఆయువు, సంపద నశిస్తాయి. శత్రువుల చేతిలో చావు తప్పదు. అది సత్యమే. కాని నీ కుమారులు బ్రాహ్మణుల కోపానికి గురియై భస్మం కాకుండా హరిచేతిలో మృతిచెందడం మంచిదే గదా అన్నది భర్తతో. అప్పుడు కశ్యపుడు నీవు చేసిన పాపకర్మకు ఇది ఫలితం, అనుభవించక తప్పదు మనోవ్యధను మరచిపోయి మాధవుని భక్తితో సేవించు. నీకు పుట్టే కొడుకులు హిరణ్యాక్షుడు, హిరణ్యకశిపుడు అని పిలువబడతారు. అందులో హిరణ్యకశిపునికి అతిధార్మికుడు, పుణ్యమూర్తి, భక్తశ్రేష్ఠుడైన ప్రహ్లాదుడు జన్మిస్తాడు. అతని కీర్తి బ్రహ్మాండమంతా వ్యాపిస్తుంది అన్నాడు.

కొడుకులు హరిచే హతులవుతారని, మనుమడు పరమభాగవతోత్తముడు అవుతాడని తెలుసుకొని దితి కొంత విచారం, కొంత సంతోషం పొందింది పుట్టబోయే బిడ్డల భవిష్యత్తును గురించి చింతిస్తూ దితి అలా నూరేళ్ళు గర్భం ధరించింది. ఆ తర్వాత ఆమె గర్భంనుంచి ఒక గొప్పతేజం వెలువడి భూమిని, ఆకాశాన్ని నింపింది సూర్యచంద్రులను కూడా కప్పివేసిన ఆ మహాతేజాన్ని చూచి దేవతలు బెదిరిపోయారు బ్రహ్మదేవుని వద్దకు వెళ్ళి మొరపెట్టుకున్నారు. దితి గర్భంనుంచి వెలువడిన తేజం దిక్కులన్నిటిని ఆక్రమించి భయపెడుతున్నది. నీవే రక్షించాలి అని ప్రార్థించారు.

అప్పుడు బ్రహ్మ, దేవతలతో ఇలా చెప్పాడు. మీకు పూర్వులైన సనకసనందనాదులు లోకాలన్నిటా సంచరిస్తూ ఒకనాడు లక్ష్మీనారాయణుని భక్తితో సేవించాలనే కోరిక పుట్టి వైకుంఠానికి వెళ్ళారు. శ్రీహరి మందిరంలో ఆరువాకిళ్ళు దాటి వెళ్ళుతుండగా ఏడవ వాకిలి వద్ద ఇద్దరు ద్వారపాలకులు వారిని అడ్డగించారు. సనకసనందనాదులకు కోపం

వచ్చింది జయవిజయులనే ఆ ద్వారపాలకులను శపించారు. భూలోకంలో పుట్టి కామ, క్రోధ, లోభాలనే శత్రువులచేత బాధలు పడండి. మీరు చేసిన అపరాధానికి ఇదే శిక్ష అన్నారు. జయవిజయులు ఉలిక్కిపడ్డారు. చేసిన పనికి విచారించారు. మునీశ్వరుల పాదాలమీద పడి మ్రొక్కి మీరు విధించిన శిక్ష అనుభవిస్తాం. దయచేసి ఒక సహాయం చేయండి. మేము ఎక్కడ పుట్టినా శ్రీహరి నామాన్ని మరిచిపోకుండా వుండేటట్లు చేయండి ఆ విధంగా చేస్తే మా జన్మలు తరిస్తాయి అని ప్రార్థించారు.

ఆ కలకలం విని శ్రీహరి లోపలినుంచి అక్కడకు వచ్చాడు. ఆయన వెంట లక్ష్మికూడా వచ్చింది. శ్రీహరి సుందరరూపాన్ని మునీశ్వరులు రెప్పవాల్చక అదేపనిగా చూచారు. భక్తితో ఆయన పాదాలకు అభివందనం చేశారు. తర్వాత స్తుతించారు. మిమ్మల్ని చూడడానికి వచ్చాం. అడ్డువచ్చిన మీ సేవకులను కోపంతో శపించి పాపం చేశాం. మా నేరాన్ని క్షమించి మమ్మల్ని కాపాడండి అని వేడుకొన్నారు. అప్పుడు గోవిందుడు మీరు నా సేవకులు చేసిన అపరాధానికి తగిన శిక్షే వేశారు, సేవకులు అపరాధం చేస్తే యజమాని కూడా బాధ్యత వహించాలి కాబట్టి నన్ను క్షమించండి అన్నాడు. భూలోకంలో జన్మించి జయవిజయులు అచిరకాలంలోనే వైకుంఠానికి తిరిగి రావడానికి అనుమతించాలని ఆ మునులను కోరాడు. భగవంతుని వినయమర్యాదలకు మునులు ఉబ్బితబ్బిబ్బయ్యారు. మమ్మల్ని శపించినా సరే, రక్షించినా సరే మాకు సమ్మతమే. మమ్మల్ని ఆజ్ఞాపించండి అని వేడుకొన్నారు.

అప్పుడు భగవంతుడు మునులతో ఇలా అన్నాడు. జయవిజయులు భూమిమీద అసురజాతిలో జన్మించి లోకకంటకులవుతారు. నాతో విరోధం పెట్టుకొంటారు. నన్ను ఎదిరించి పోరాడి నా చేతిలో చస్తారు. మరణానంతరం నా దగ్గరకే వస్తారు. శత్రుభావంతోనైనా నన్ను మనస్సులో తలచుకొనేవారు, నా ముఖం చూస్తూ మరణించినవారు నాతో వైకుంఠంలోనే వుంటారు. అందువలన మీరు ఎక్కువగా బాధపడవద్దు అని చెప్పగా మునులు ఆనందంతో కన్నీళ్ళు పెట్టారు. వినయంగా మ్రొక్కారు. భక్తితో ప్రస్తుతించారు. ఆ తర్వాత సెలవు తీసుకొని తమ నివాసస్థలానికి వెళ్ళిపోయారు.

శ్రీహరి జయవిజయులవైపు తిరిగి, నేను ఎంత బలవంతుడినైనా బ్రాహ్మణశాపాన్ని నివారించలేను, మీరు రాక్షసజాతిలో పుట్టి నాతో శత్రుత్వం పెట్టుకొని, ఎప్పుడూ నన్నే తలచుకొంటూ, నా చేతిలో చచ్చి, మళ్ళీ ఇక్కడికే వస్తారు అని చెప్పి పంపించాడు. తర్వాత లక్ష్మీదేవితో కూడి తన అంతఃపురానికి వెళ్ళిపోయాడు.

జయవిజయులు భూమిమీద పడ్డారు. వారే ఇప్పుడు దితి గర్భంలో వున్నారు. వారి

తేజమే మీరిప్పుడు చూసి భయపడుతున్నారని బ్రహ్మ చెప్పి దేవతలను శాంతపరచి, భగవంతుడు మీకు మేలు చేస్తాడని ఆశీర్వదించి పంపించాడు.

## వరాహ అవతారం

దితి లోకకంటకులైన ఇద్దరు కుమారులను ప్రసవించింది. వారి పుట్టుకతో భూమి కంపించింది. పర్వతాలు కదిలిపోయాయి. సముద్రాలు అల్లకల్లోలం అయ్యాయి. నక్షత్రాలు రాలిపడ్డాయి. ఉరుములు, పిడుగుపాట్లతో ఆకాశం దద్దరిల్లింది. నెత్తురు వాన కురిసింది. సూర్యగ్రహణం అకాలంగా వచ్చి చీకట్లు క్రమ్ముకొన్నాయి. సమస్త ప్రాణికోటి భయంతో వణికిపోయింది. కశ్యపుడు కొడుకులను చూడ్డానికి వచ్చాడు. పెద్దవాడికి హిరణ్యాక్షుడని, చిన్నవాడికి హిరణ్యకశిపుడని పేర్లు పెట్టాడు. తర్వాత తన ఆశ్రమానికి వెళ్ళిపోయాడు.

కశ్యపుని కొడుకులు పెరిగి పెద్దవారయ్యారు. హిరణ్యకశిపుడు తన భుజబలంతో లోకపాలకులందరినీ జయించి సుఖంగా తృప్తిగా వున్నాడు. హిరణ్యాక్షుడు గదను ధరించి తనను ఎదుర్కొని పోరాడగలిగిన వారికోసం భూలోకం అంతా వెదికి విఫలుడయ్యాడు. స్వర్గలోకంపై దండెత్తాడు. దేవతలు తలా ఒక దిక్కుకు పారిపోయారు. అప్పుడా రాక్షసుడు సముద్రంలో ప్రవేశించాడు. అక్కడ అతని తేజాన్ని చూచి భయపడిన వరుణుని బలగాలు పిక్కబలం చూపాయి. అతడు విడిచే గాలికి సముద్రం అల్లకల్లోలం అయిపోతున్నది. అప్పుడు గదతో మోది సాగరాన్ని శాంతింపజేశాడు. ఆ సముద్రం మధ్యలో తిష్ఠవేసి అనేక సంవత్సరాలు వినోదాలతో కాలక్షేపం చేశాడు. తర్వాత పాతాళాన్ని పరిపాలిస్తున్న వరుణుడి దగ్గరకు వెళ్ళి యుద్ధానికి రమ్మని పిలిచాడు. సముద్రానికి అధిపతి అయిన వరుణుడు జంకి, సమరానికి ఇది సమయం కాదని, కోపాన్ని దిగమ్రింగి, అయ్యా, నీ ధాటిని తట్టుకోగలిగినవారు ఎవ్వరూ లేరు, నిన్ను ఎదిరించగల శూరుడు ఆ ముకుందుడొక్కడే, ఆయన వైకుంఠంలో వున్నాడు, అక్కడికి పోతే నీ కోరిక తీరుతుంది అని చెప్పాడు.

హిరణ్యాక్షుడు, అలాగా, ఆయన అంత మొనగాడా, అదీచూస్తాను, అంటూ వైకుంఠానికి బయలుదేరాడు. అలా వెళుతుండగా, నారదముని ఎదురయ్యాడు. ఎక్కడికి పోతున్నావని అడిగాడు. శ్రీహరితో యుద్ధం చేయడానికి పోతున్నా, అతడిని చంపి మా రాక్షసజాతికి సంతోషం కలిగిస్తానని హిరణ్యాక్షుడు చెప్పాడు. అప్పుడు నారదుడు, అయ్యో ఇప్పుడక్కడ ఆ మహాపురుషుడు లేడే, ఎలా మరి? అన్నాడు. అయితే మహామునీ, ఆ

మాయావి ఎక్కడ దాక్కున్నాడో నీవే చెప్పాలి అన్నాడు హిరణ్యాక్షుడు. వరాహరూపంలో రసాతలంలో వున్నాడు. వెళ్ళగలిగితే వెళ్ళు. నీ కోరిక ప్రకారం ఆయనతో పోరాడవచ్చు, అని నారదుడు సమాధానం ఇచ్చాడు. వెంటనే హిరణ్యాక్షుడు బ్రహ్మాండం అంతా నిండిన తేజంతో, ముల్లోకాలను భయపెట్టే రూపంతో, కళ్ళవెంట నిప్పులు కురిపిస్తూ రసాతలానికి వెళ్ళాడు. అక్కడ ఆ నీళ్ళమధ్య సూకరాకారంలో వున్న శ్రీహరిని చూచాడు. యజ్ఞవరాహమూర్తి తల ఎత్తి తీక్షణంగా చూసేసరికి ఆ రాక్షసుని తేజం అంతా క్షణంలో మాయమైపోయింది.

భూమిని తన కోరకొమ్ముతో పైకెత్తి, కళ్ళనుంచి నిప్పులు కురిపిస్తూ తన కెదురుగా వస్తున వరాహాన్ని చూచి, హిరణ్యాక్షుడు అడవిలో తిరిగే పంది సముద్రంలోకి ఎలా వచ్చింది అని ఆశ్చర్యపోయి ఇలా అన్నాడు. రసాతలంలో మునిగివున్న ఈ భూమి నా సొంతం. దీనిని నీవెలా తీసుకొని పోతావు? మర్యాదగా విడిచిపెట్టు. లేకపోతే నీ ప్రాణాలు తీస్తాను. మాయావిలా మారువేషంలో వచ్చి నా భూమిని దొంగిలిస్తావా? నా పరాక్రమం సంగతి నీకు తెలియదేమో! నా గదతో నీ వొళ్ళు ముక్కలు ముక్కలు చేస్తాను. నీ గతి చూచి దేవతాగణాలు కూడా నశిస్తాయి.

రాక్షసుని మాటలు విన్న హరి తన కోపాన్ని తనలోనే అణచుకొని తన కోరలకాంతి ఆకాశం నిండగా భూదేవిని తీసుకొని సముద్రంపైకి వచ్చాడు. నీకు సిగ్గులేదా? పిరికిపందలా పారిపోతావేం అని హిరణ్యాక్షుడు వెంటబడ్డాడు. పుండరీకాక్షుడు భూమిని నీటిమీద దించాడు తన బలాన్ని దానికి ఆధారంగా పెట్టాడు. జూలు విదిలించి గదను చేత్తో తీసుకుని కోపంతో సమరానికి సిద్ధమయ్యాడు. దానవుడు బాణాలతో హరిని బాధించసాగాడు. అయినా నవ్వుతూ హరి ఇలా అన్నాడు. నేను అడవిలో తిరిగే పంది ననుకొంటున్నావు గదా! అలాగే అడవిమృగంలా నీలాంటి కుక్కల్ని చంపుతాను. కాచుకో. బలం వుంటే నాతో పోరాడు. నీ కోర్కెలు తీరుస్తాను. ఈ మాటలకు మరింత కోపం వచ్చి, దానవుడు గదనెత్తి హరిని కొట్టబోగా, హరి ఆ గదను పట్టుకొని ముక్కలు చేశాడు. దైత్యుడు మరొక గదను తీసుకొని వేయగా హరి దాన్ని త్రిప్పి వాడి గుండెలదిరేటట్లు కొట్టాడు. వాడు తెప్పరిల్లి మళ్ళీ దాడిచేశాడు. అలా ఇద్దరూ మదించిన ఏనుగుల్లా, పెద్దపులుల్లా, వృషభాల్లా, కలియబడి పోరాడారు. ఇద్దరి శరీరాలు రక్తంతో తడిశాయి. ఆ పోరు చూడ్డానికి బ్రహ్మ, మునీంద్రులతోను, సిద్ధసాధ్య దేవగణాలతోను అక్కడికి వచ్చి వరాహమూర్తితో ఇలా అన్నాడు.

పరమాత్మా. లోకాలన్నిటిని బాధపెడుతున్న ఈ దుర్మార్గుడిని వెంటనే చంపక ఎందుకిలా ఉపేక్షిస్తున్నావు? భూదేవికి వీడిని బలి ఇవ్వు. శుభం అవుతుంది. పైగా ఈ

ముహూర్తంలో ఈ రాక్షసుని వధించకపోతే, సంధ్యాసమయం రానున్నది, అప్పుడు వీడిబలం ఇంకా పెరిగి, చంపడం సాధ్యం కాదు

ఈ మాటలు విని హరి తన గదనెత్తి రాక్షసుని దవడలపై కొట్టగా వాడు తప్పుకొని భీకరమైన గదను తెచ్చి చిత్రవిచిత్రంగా త్రిప్పి హరిచేతిలోని గదను సముద్రంలో పారవేశాడు. నిరాయుధుడైనవానిని కొట్టగూడదనే సమరధర్మం పాటించి నిలిచి చూస్తున్నాడు. అప్పుడు హరి మనస్సులో చక్రాన్ని తలుచుకోగా అది వేగంగా వచ్చి ఆయన కుడిచేతిని అలంకరించింది. చక్రాయుధాన్ని ధరించి శ్రీహరి రాక్షసునిపైకి రాగా అతడు గదతో కొట్టాడు. హరి కాలితో తన్ని ఆ గదను విసిరివేశాడు. అప్పుడు దైత్యుడు శూలాన్ని విసిరాడు. చక్రి తన చక్రాయుధంతో ఆ శూలాన్ని ఖండించాడు. రాక్షసునికి రోషం వచ్చి పిడికిలితో గుద్ది హరిని నొప్పించాడు. అంతేగాదు, తన మాయామహిమలతో గాలిదుమారాన్ని సృష్టించి భూమండలాన్ని దుమ్ము, ధూళితో నింపాడు. మేఘాలనుంచి మలమూత్రాలు, రక్తమాంసాలు, రాళ్ళురప్పలు కురిపించాడు. భయంకరమైన కోరలు, నాలుకలు, ఎర్రటికళ్ళు, విరబోసుకొన్న జుట్టుతో భూతాలు, పిశాచాలు వచ్చి అంతరిక్షంలో నిలిచాయి. అప్పుడు శ్రీహరి తన చక్రాన్ని ప్రయోగించగా దాని కాంతి భూగోళమంతటా వ్యాపించి రాక్షసుని మాయను అణచివేసింది ఆ తర్వాత హిరణ్యాక్షుడు ముష్టియుద్ధం చేశాడు. శ్రీహరి చేతిదెబ్బలకు నెత్తురు కక్కుతూ నేలమీద పడి చివరికి అతడు ప్రాణాలు విడిచాడు. బ్రహ్మా మునులు, దేవతలు సంతోషించి, హరికి నమస్కరించి, ఇక జగతికి క్షేమం, శుభం అన్నారు. వరాహమూర్తి తిరిగి వైకుంఠానికి వెళ్ళిపోయాడు ఈ కథను బ్రహ్మ దేవతలకు చెప్పిన విధంగా, మైత్రేయుడు విదురునికి చెప్పాడు అని శుకయోగి పరీక్షిత్తుకు తెలిపినట్లు సూతుడు శౌనకాది మునులకు వివరించాడు. సూతుడు మళ్ళీ మహర్షులకు చెప్పడం మొదలుపెట్టాడు.

పరీక్షిత్తు శుకయోగి ద్వారా హిరణ్యాక్షుడు ఏ విధంగా హతమయ్యిందీ విని కొన్ని ప్రశ్నలు వేశాడు. ఆ రాక్షసుని నుంచి రక్షించబడిన వసుంధర ఏ విధంగా సమస్థితి పొందింది? స్వాయంభువ మనువు జంతుసృష్టికి ఎన్ని మార్గాలు కల్పించాడు? విదురుడు మైత్రేయుని ఇంకా ఏమేమి అడిగాడు? అవన్నీ నాకు తెలియజేయండి అనగా శుకయోగి చెబుతున్నాడు.

విదురుడు మైత్రేయుని ఇలా అడిగాడు. బ్రహ్మ ముందుగా ప్రజాపతులను పుట్టించిన తర్వాత ఏమి సృష్టించాలని ఆలోచించాడు? మరీచ్యాది ప్రజాపతులు బ్రహ్మ ఆదేశం మేరకు ప్రపంచాన్ని అంతా ఎట్లా సృష్టించారు? భార్యాసమేతులై ఏమి పుట్టించారు?

స్త్రీలు లేకుండా ఏమి సృజించారు? మైత్రేయుడు ఇలా చెప్పాడు.

మాయతో కూడిన పరమాత్మనుంచి గుణత్రయం పుట్టగా దానినుంచి మహత్తత్త్వం వచ్చింది. మహత్తత్త్వం రజస్సుతో కలిసి అహంకారం అవుతుంది. త్రిగుణాత్మకమైన అహంకారంనుంచి పంచతన్మాత్రలు, వాటినుంచి పంచభూతాలు ఆవిర్భవించగా, అవి సృష్టికి కారణమయ్యాయి. ప్రపంచాన్ని సృష్టించే సామర్థ్యం లేక అవి అన్నీ కలిసి హిరణ్మయమైన అండాన్ని కల్పించాయి. అది నీటిలో పెరుగుతూ వుంది. నారాయణుని బొడ్డు తామరనుంచి పుట్టిన బ్రహ్మ ప్రపంచాన్ని సృష్టించాడు. ఐదురకాలైన మోహాలే రూపంగాగల అవిద్యను పుట్టించి, అది తనకు తమోమయమైన దేహమని విరక్తి చెంది ఆ శరీరాన్ని వదిలివేశాడు. అది రాత్రిగా మారి ఆకలిదప్పులకు నిలయం అయ్యింది. దానినుంచి యక్షులు, రాక్షసులు జన్మించారు. వారికి ఆకలివేసి బ్రహ్మనే తినడానికి ప్రయత్నించగా, బ్రహ్మ మీరు నా బిడ్డలు, నన్ను హింసింపవద్దు అంటూ "మా మా జక్షత రక్షత" అనే శబ్దాలు పలికాడు. అందువలన వారికి యక్షులు, రాక్షసులు అనే పేరు వచ్చింది.

తర్వాత బ్రహ్మ, తేజోమయమైన శరీరాన్ని ధరించి సత్త్వగుణప్రదానులైన దేవతలను సృష్టించి ఆ శరీరాన్ని విడిచి పెట్టగా అది పగలుగా మారి దేవతలకు ఆశ్రయం అయ్యింది. బ్రహ్మ మొలనుంచి అసురులు పుట్టారు. వారు అతికాముకులు కావడాన బ్రహ్మతోనే పొందుగోరి వెంటబడగా ఆయన పారిపోయి నారాయణుని పాదాలమీద పడి, రక్షించు మహాప్రభో అని ఆర్తనాదం చేశాడు. పద్మసంభవా, ఈ శరీరాన్ని వదిలివేయి, అన్నాడు పుండరీకాక్షుడు బ్రహ్మ అట్లాగే శరీరాన్ని వదలగా దానినుంచి సంధ్యారూపంతో ఒక అందాలభామ ఉద్భవించింది. దానవులు మోహితులై సంధ్య వెంటబడ్డారు దానిని కౌగిలించి, ఆహా, ఏమి దీని సౌందర్యం, సౌకుమార్యం, సౌభాగ్యం; ఇంతటి సుందరిని ఎక్కడా చూడలేదే, అని ఆశ్చర్యపోయారు. దీని అందానికి,ముగ్ధులమై, మోహించి వెంటబడినా మనపై దీనికి మక్కువ లేదు, ఎందుచేతనో అని మథనపడ్డారు. అరటిస్తంభాల్లాంటి తొడలుగల ఓ అందాలసుందరీ, ఏ వూరు ఏం పేరు, ఏ కులం, ఎవ్వరి కూతురివి, ఇక్కడ ఏకాంతంగా ఎందుకు తిరుగుతున్నావు? మాకు చెప్పవూ! నీ రూపలావణ్యాలు చూచి, మోహంలో పడ్డాం. మా కోర్కె తీర్చవూ అంటూ వేడుకొన్నారు. అనురాగంతో ఆవిడను ఆలింగనం చేసుకొన్నారు బ్రహ్మదేవుడు తనకు ఆపద తప్పినందుకు సంతోషించి, తన కొత్తశరీరాన్ని వాసన చూడగా అప్పుడు గంధర్వులు, అప్సరసలు పుట్టారు. అతడు వెంటనే ఆ శరీరాన్ని వదిలివేశాడు. అది వెన్నెల కాగా దాన్ని

గంధర్వులు, అప్సరసలు స్వీకరించారు. తర్వాత కునుకు, ఉన్మాదం, నిద్రారూపాలైన శరీరాలు దాల్చి పిశాచులు, గుహ్యకులు, సిద్ధులు అనే భూతగణాలను పుట్టించగా వారు జుట్టు విరబోసుకొని దిగంబరులై ఎదుట నిలిచారు. బ్రహ్మ ఈసారి కూడా తన శరీరాలను వదిలివేయగా వారు వాటిని గ్రహించారు. అప్పుడు అదృశ్యదేహంతో పితృ, సాధ్య గణాలను పుట్టించాడు. తిరోధానశక్తివలన సిద్ధులను, విద్యాధరులను కల్పించాడు. తనకు ప్రతిబింబమైన శరీరాన కిన్నరులను, కింపురుషులను సృజించాడు. ఆయన కాళ్ళు చేతులనుంచి రాలిన వెంట్రుకలు పాములయ్యాయి. ఆయన మనస్సునుంచి మనువులను సృష్టించాడు. వారికి పురుషరూపమైన తన దేహాన్నిచ్చాడు. రుషివేషధరుడై, యోగసమాధియుక్తుడై రుషిగణాలను పుట్టించి తన శరీరంలోని అంశాలను వారికి ఇచ్చాడని మైత్రేయుడు చెప్పగా విదురుడు ఇలా అడిగాడు.

స్వాయంభువ మనువు వంశంలో స్త్రీపురుష సంగమం ద్వారా జనాభా వృద్ధి అయ్యిందని చెప్పావు బాగానే వుంది. మనువు పుత్రులైన ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు భూమండలాన్ని ధర్మమార్గం తప్పకుండా ఎలా పరిపాలించారు? మనువు కూతురు దేవహూతిని కర్దముడు పెళ్ళిచేసుకోవడం ఎలా జరిగింది?

## కపిలావతారం

మైత్రేయుడు మళ్ళీ చెప్పడం మొదలుపెట్టాడు. కృతయుగంలో మునినాథుడైన కర్దముడు ప్రజలను సృష్టించడానికి బ్రహ్మచేత నియమింపబడి, సరస్వతీనదీతీరంలో పదివేల దివ్య సంవత్సరాలు తపంచేస్తూ, ఒకనాడు జపసమాధిలో వుండి ఏకాగ్రచిత్తుడై లక్ష్మీనారాయణుని ధ్యానించగా, అంతరిక్షంలో ఆ దేవదేవుడు ప్రత్యక్షమయ్యాడు. కర్దముడు హరికి సాష్టాంగదండప్రణామాలు ఆచరించాడు మనసారా స్తుతించాడు. కామధేనువు వంటి భార్య కోసం కల్పవృక్షం వంటి నిన్ను ఆశ్రయించాను. అనుగ్రహించు తండ్రీ అని మ్రొక్కాడు అప్పుడు శ్రీహరి ఇలా అన్నాడు. స్వాయంభువ మనువు, భార్య శతరూపతో తన కూతురిని వెంటబెట్టుకొని నీ వద్దకు వచ్చి, తన కుమార్తెను నీకిచ్చి పెళ్ళిచేస్తాడు. ఆ విధంగా నీ కోరిక నెరవేరుతుంది. నీకు తొమ్మిదిమంది కూతుళ్ళు పుడతారు.. వారికి మునీంద్రులవలన పుత్రసంతానం కలుగుతుంది. నేను పుత్రుడుగా పుట్టి జ్ఞానబోధ చేస్తాను అని చెప్పి హరి అంతర్ధానమయ్యాడు. కర్దముడు బిందు సరోవరానికి వెళ్ళి లక్ష్మీనారాయణుడిపై మనస్సు నిలిపి భక్తితో సేవిస్తున్నాడు.

ఒకనాడు స్వాయంభువుడు భార్యను కూతురిని తీసుకొని, కూతురికి తగిన వరుడిని

వెదుక్కుంటూ తిరిగి, తిరిగి బిందుసరోవరానికి వచ్చాడు. అక్కడ సుందరమైన ఆశ్రమాన్ని చూచి లోపలికి వచ్చి చూడగా తపస్వియైన కర్దముడు కనిపించాడు. ఆయన కాళ్ళకు దణ్ణం పెట్టాడు. కర్దముడు మనువుకు అతిథిమర్యాదలన్నీ చేశాడు. ఏ పనిమీద వచ్చారని అడిగాడు. అప్పుడు మనువు తన కూతురిని చూపిస్తూ, ఈ అమ్మాయి నా కుమార్తె దేవహూతి, ఎందరిని చూచినా ఇష్టపడక నిన్నే చేసుకుంటానని పట్టుపట్టింది, మా అమ్మాయిని స్వీకరించవలసిందని అభ్యర్థించాడు. కర్దముడు, ఈ కన్యారత్నం గుణంలోను, రూపంలోను, ప్రవర్తనలోను నాకు సమఉజ్జీగా వుంది, తప్పకుండా పెళ్ళిచేసుకుంటాను కాని, సంతానం కలిగే వరకే సంసారం చేస్తాను, అదీ నా నియమం, ఆ తర్వాత దేవుని ఆజ్ఞ శిరసావహించి సన్యాసినవుతాను, అని సమాధానమిచ్చాడు. స్వాయంభువుడు భార్య మనస్సును, కూతురు మనస్సును తెలుసుకొని తన అంగీకారం తెలియజేసి కర్దముడికి దేవహూతినిచ్చి పెళ్ళిచేశాడు. వధూవరులకు వస్త్రాలు, ఆభరణాలు కానుకలుగా ఇచ్చారు. కూతురుకు అప్పగింతలు చెప్పి, తల్లీ, పోయి వస్తామని చెప్పి మనువు, భార్యతో కలసి రథమెక్కి తన నగరానికి వెళ్ళిపోయాడు. నిత్యమూ భక్తితో హరిని సేవిస్తూ, వర్ణాశ్రమధర్మాలను నిలుపుతూ, సర్వప్రాణులూ సుఖసంతోషాలతో వర్ధిల్లేవిధంగా 71 యుగాలు ఆ మనువు ఈ మహీమండలాన్ని పరిపాలించాడు.

తల్లిదండ్రులు తనను కర్దముని ఆశ్రమంలో విడిచివెళ్ళాక దేవహూతి తన పతికి భక్తితాత్పర్యాలతో శుశ్రూష చేస్తూ భర్త మనస్సులోని కోరికల కనుగుణంగా నడుచుకొంటూ పతినే దైవంగా భావించి సేవించింది. శ్రద్ధానురాగాలతో తనకు సేవలు చేస్తూ కృశించిన భార్యను జూచి కర్దముడు నా యోగశక్తిచేత రాజులకు కూడా లభించని దివ్యభోగాలను, దివ్యదృష్టిని నీకు ఇస్తున్నాను, అనుభవించి ఆనందించు అన్నాడు. మహాత్మా, నీ యోగమాయాశక్తి అమోఘమని నాకు తెలుసు. సంతానం కలిగేవరకు సంసారం చేస్తానన్నావు. కాని మనమిద్దరం ఇంతవరకు ఒకటి కాలేదు. సంయోగవాంఛతో నా శరీరం కృశిస్తున్నప్పుడు అన్నపానాదులతో నాకు సుఖం ఎలా కలుగుతుంది? కాబట్టి శృంగారకేళికి అనువైన వాతావరణాన్ని కల్పించి నా మనస్సులోని కోరికను తీర్చి సంతోషపెట్టే విధంగా అనుగ్రహించు అని దేవహూతి భర్తకు విన్నవించింది.

అప్పుడు కర్దముడు ఒక గొప్ప దివ్యవిమానాన్ని కల్పించాడు. అందులో సమస్తభోగాలు అనుభవించడానికి వీలైన పడకగదులు, క్రీడా మందిరాలు, ఉద్యానవనాలు, వజ్రాలు, రత్నాలు, మణులు తాపిన ఆసనాలు, గోడలు, ద్వారాలు, స్తంభాలు వున్నాయి పూలతోటలు, ఫలవృక్షాలు, పక్షులూ వున్నాయి. ఎంతో సుందరంగా, రమణీయంగా

వుంది ఆ విమానం. అది చూచి భార్య సంతోషించలేదు. దేవహూతీ, మంగళకరమైన సరోవరంలో స్నానం చేసి యీ విమానం ఎక్కావంటే నీ మనస్సులోని కోరిక నెరవేరుతుంది అని ప్రేమతో బుజ్జగించాడు కర్దముడు. అప్పుడు ఆవిడ భర్త కోరికమేరకు బిందుసరోవరంలో ప్రవేశించి స్నానం చేస్తున్నప్పుడు ఆ నీటిలో వేలకొలది సుందరకన్యలు కనిపించి, మేం నీకు సేవచేయడానికి సిద్ధంగా వున్నామని ఆమెను సమీపించి స్నానం చేయించారు. తెల్లనివస్త్రాలతో అలంకరించారు. షడ్రసోపేతమైన భోజనం పెట్టారు. కర్పూరనీరాజనం ఇచ్చారు. అందమైన ఆసనంపై కూర్చోబెట్టి చేతికి అద్దం ఇచ్చారు. దేవహూతి అద్దంలో తన ముఖం చూచుకొని, భర్తని మనస్సులో తలచుకోగానే ఆయన తన ఎదుట నిలిచాడు. ఆమె భర్తయొక్క అద్భుతమాయాశక్తిని చూచి ఆశ్చర్యపోయింది. దేవహూతి పెళ్ళికి ముందు ఎలా వుందో అలా అందంగా కనిపించేసరికి కర్దముడు ఆనందించాడు. భార్యతోను, వేలకన్యకలతోను విమానం ఎక్కిన కర్దముడు తారాగణం మధ్య రోహిణీ నక్షత్రంతో కలిసిన చంద్రుడిలా ప్రకాశించాడు.

ఆ దివ్య విమానంలో విహరిస్తూ వారు మేరుపర్వతానికి వెళ్ళారు. అక్కడ ఉద్యానవనాలను, పూలతోటలను, సరోవరాలను చూశారు. వాయువేగంతో సమస్త భూభాగాన్ని చుట్టివచ్చారు. తర్వాత తమ నివాసానికి తిరిగివచ్చారు. కామకేళిని కోరుతున్న భార్యతో శృంగారక్రీడలు జరుపుతూ కోరినన్ని భోగాలు అనుభవిస్తూ కర్దముడు, దేవహూతి సంవత్సరాలను గంటలుగా గడిపివేశారు. సరససంభాషణలతో, కౌగిలింతలతో, ప్రేమ కురిపించే చూపులతో కాలం ఎలా గడిచిందో తెలియకుండా అన్యోన్యంగా అలా నూరేళ్ళు గడిపినాక మునీశ్వరుని దయవలన ఆమెకు గర్భం వచ్చింది. తొమ్మిదిమంది ఆడపిల్లలను కని సంతసించింది. ఇక సన్యసిస్తానన్నాడు భర్త. సంతాపం చెందింది భార్య. వీరికి నేను పెళ్ళిళ్ళు ఎలా జేస్తాను? వాళ్ళ భర్తలను వాళ్ళే వెదికి తెచ్చుకొంటారా? అని తన బాధను వ్యక్తం చేసి ఈ అమ్మాయిలకు తగిన వరులను తెచ్చి పెళ్ళిళ్ళు చేసి వెళ్ళండి అని భర్తని వేడింది. అంతేగాదు, కామక్రీడలలో కాలం వూరికే గడిపాను. పరమార్థం తెలుసుకోలేక పోయాను ఇహసుఖాలమీద విరక్తి కలుగుతున్నది. ముక్తికి మార్గం చెప్పే కొడుకుని నాకు ప్రసాదించు అని భర్తని ప్రార్థించింది. కర్దముడు మెత్తబడ్డాడు. భార్యను ఓదార్చాడు. అచిరకాలంలోనే భగవంతుడు కరుణించి నీకు బిడ్డడవుతాడని చెప్పి, శ్రద్ధాభక్తులతో, నియమనిష్ఠలతో, వ్రతకల్పాలతో భగవంతుడిని పూజించి సంతుష్టుడిని చేయవలసిందని తెలియజేశాడు. దేవహూతి సంతోషించింది. అనంతుడు, భగవంతుడు, విష్ణువు అయిన హరిని అర్చన చేసింది కొన్ని సంవత్సరాలు

గడిచాక ఆమె గర్భందాల్చి పుత్రుడిని కన్నది. దేవతలు పూలవాన కురిపించారు. ఆకాశాన వాద్యాలు మ్రోగినయి.

దేవహూతికి తత్త్వబోధ చేయడం కోసం ఆమె గర్భాన ఉదయించిన పరబ్రహ్మ స్వరూపుడైన నారాయణుని దర్శించడం కోసం మరీచి ప్రభృత మునిగణసమేతంగా చతుర్ముఖుడైన బ్రహ్మ వచ్చి కర్దమ, దేవహూతులతో ఇలా అన్నాడు. భక్తితో, పరిశుద్ధ హృదయంతో విష్ణుపూజ చేసినందుకు మీకు ఫలం దక్కింది భగవానుడు మీ యింట జన్మించాడు. మీ జన్మ ధన్యమయ్యింది. మీ కుమార్తెలను సద్గుణశీలురైన, సదాచార సంపన్నులైన మునీశ్వరులకిచ్చి పెండ్లి చేయండి వారివలన జనాభా బహువిధాల అభివృద్ధి చెందుతుంది. ఇక ఈ పుత్రుడు కపిలుడనే పేరుతో ప్రసిద్ధుడై సాంఖ్యయోగాన్ని ప్రబోధిస్తాడు. తల్లికి తత్త్వబోధచేసి సంశయాలన్నీ పోగొడతాడు. అని చెప్పి మరీచాది మునులను అక్కడ విడిచి తన పుత్రులైన నారద, సనకాదులతో బ్రహ్మ తన లోకానికి వెళ్ళాడు. కర్దముడు బ్రహ్మ చెప్పినట్లు కూతుళ్ళను మునులకిచ్చి పెళ్ళిళ్ళు చేశాడు. మరీచికి కళను, అత్రికి అనసూయను, అంగిరసునకు శ్రద్ధను, పులస్త్యునికి హవిర్భువును, పులహునకు గతిని, క్రతువునకు క్రియను, భృగువునకు ఖ్యాతిని, వసిష్ఠునకు అరుంధతిని, అధర్వునకు శాంతిని ఇచ్చాడు. కర్దమునిచేత మర్యాదలు పొంది, కానుకలు స్వీకరించి, అతని అనుమతి తీసుకొని మునులు తమ భార్యలతో వారి ఆశ్రమాలకు వెళ్ళిపోయారు.

కర్దముడు తన యింట వెలసిన విష్ణుమూర్తి అవతారమైన కపిలునికి వందనం చేసి బహువిధాల స్తోత్రం చేశాడు. నీ ఆశ్రితులను రక్షించడానికి అనుగుణమైన మానవరూపాలను ధరించే పరమేశ్వరుడవు. నాకు పుత్రుడుగా జన్మించడంవలన నా ఋణాలన్నీ తీరిపోయినవి, ఇక నేను తపస్సు చేసుకొంటానని చెప్పాడు. కపిలుడు తండ్రితో ఇలా అన్నాడు. నిష్ఠతో సకలకర్మలను త్యజించు. మోహం వదిలిపెట్టు. వికారరహితుడవై సన్యసించు. భక్తితో నన్ను భజించు మోక్షం లభిస్తుంది కర్దముడు కపిలునికి వందనం చేసి అడవికి వెళ్ళి తపస్సు చేశాడు. అహంకార మమకారాలను విడిచి, పరబ్రహ్మనే మదిలో నిలిపి, సమస్త ప్రపంచాన్ని వాసుదేవమయంగా తలస్తూ భక్తియోగం ద్వారా పరమపదాన్ని పొందాడు.

## కపిలుని తత్త్వబోధ

కర్దముడు అడవికి వెళ్ళిన తర్వాత కపిలుడు తల్లిమీద ప్రేమతో బిందుసరంలోనే నివసిస్తుండగా ఒకనాడు దేవహూతి కుమారుని ఇలా అడిగింది. ఇంద్రియాలవలన కలుగుతున్న మోహమనే అజ్ఞానం ఎలా పోతుంది? అజ్ఞానమనే అంధకారంలో మునిగిన

ప్రపంచానికి జ్ఞానజ్యోతివి నీవు. నాలోని మోహమనే చీకటిని పారద్రోలగలిగినవారు నీవుగాక ఇంకెవరున్నారు? నిన్ను శరణు కోరుతున్నాను. నన్ను కాపాడు అని వేడింది. తల్లి మాటలు విని, చిరునవ్వుతో, శాంతంగా కపిలుడు సమాధానమిచ్చాడు.

జీవుని చిత్తం సత్త్వం, రజస్సు, తమస్సు అనే మూడు గుణాలతో కలిసి వర్తించడంవల్ల సంసారబంధంలో చిక్కుకొంటుంది. ఆ గుణాలను త్యజించి, నారాయణుని యందు మనస్సును లగ్నం చేస్తే అదే చిత్తం మోక్షకారణం అవుతుంది. అహంకారం, మమకారం దేహాభిమానం వలన కామక్రోధ మోహలోభ మదమాత్సర్యాలు పుట్టి చిత్తం కలుషిత అవుతుంటుంది. వాటిని విసర్జించి మనస్సును పరిశుద్ధం చేసుకుంటే, జ్ఞానం, వైరాగ్యం, భక్తి అనే గుణాలతో చిత్తాన్ని నింపితే ప్రకృతికంటె వేరైన పరమపురుషుని చూడగలుగుతారు. ఇంద్రియాలద్వారా లభించే విషయాలు, సుఖాలు నిత్యం కావు, సత్యం కావు. అందువలన వాటితో సంబంధం పెంచుకొన్నవాడు సంసారబంధంలో చిక్కుకొనిపోతాడు. ఇంద్రియాలను నిగ్రహించి నిత్యము, శాశ్వతము, సత్యమూ అయిన పరమాత్మతో సంబంధం పెంచుకొంటే అదే మోక్షానికి దారిచూపుతుంది. అన్ని బంధాలను త్రెంచుకొన్న భగవద్భక్తులతో స్నేహం కోరదగినది. దానివలన సకలదోషాలు పోతాయి. సత్సంగంవలన భగవంతుని కథలు వినడం, గుణాలు తెలుసుకోవడం సాధ్యమవుతుంది. దానివలన మోక్షమంటే శ్రద్ధ, దేవునిపై భక్తి, ప్రపంచసుఖాలపై విరక్తి కలుగుతుంది. వైరాగ్యంవలన జ్ఞానంవస్తుంది. భక్తి కుదురుతుంది. అలాంటి మనిషి భగవంతుడినే తన హృదయంలో ప్రతిష్ఠించుకొంటాడు.

అని కపిలుడు చెప్పగా దేవహూతి, ఏ భక్తి సంసారబంధాలను, పాపాలను నాశనం చేసి, ముక్తిని త్వరగా ఇస్తుందో చెప్పవలసిందని అడిగింది. అదీగాక సాంఖ్యయోగాన్ని, దాని అంగాల్ని, దానికి సంబంధించిన తత్త్వాన్ని సాకల్యంగా మందబుద్ధినైన నాకు తేటతెల్లం అయ్యేటట్లు చెప్పాలని కోరింది.

కపిలుడు తల్లికి ఇలా చెప్పాడు. అమ్మా, భగవత్సేవ, కోరికలు లేకుండా సహజస్వభావంగా జరిగినప్పుడు అది ముక్తికంటె శ్రేష్ఠం అవుతుంది. మళ్ళీ మళ్ళీ జన్మ ఎత్తకుండా పుట్టుకకు కారణమైన బీజాన్ని నాశనం చేస్తుంది. కొందరు మహాత్ములు సర్వకర్మలను భగవంతునికి అర్పించి, ఇంద్రియాలను మనస్సును భగవంతునిపైనే లగ్నం చేసి, మోక్షాన్ని కూడా మదిలో కోరకుండా జీవిస్తారు. అలా ఏ కోరికా లేకుండా, ఏ కారణమూ లేకుండా అనుక్షణం భగవద్భక్తిలో లీనమైనవారికి అన్ని శక్తులు వస్తాయి. మోక్షం దానంతట అదే వస్తుంది. ఇదీ భక్తియోగం. ఇక తత్త్వలక్షణం చెబుతాను.

ప్రకృతి, పురుషుల సమ్మేళనమే ఈ ప్రపంచం. ప్రకృతి సృష్టికి బీజం. అవ్యక్తం. దానినే ప్రధానం అంటారు. సత్త్వగుణం, రజోగుణం, తమోగుణం ప్రకృతికున్న మూడు గుణాలు. 24 తత్త్వాలతో ప్రకృతి ఏర్పడుతుంది. అవి పంచమహాభూతాలు (గాలి, నీరు, నేల, నింగి, తేజస్సు), పంచతన్మాత్రలు (శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు), పంచ జ్ఞానేంద్రియాలు (కళ్ళు, ముక్కు, చెవులు, నాలిక, చర్మం), పంచ కర్మేంద్రియాలు (కాళ్ళు, చేతులు, నోరు, ముడ్డి, జననాంగం), మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం అనే అంతః కరణ చతుష్టయం. కాలం అనేది 25వ తత్త్వం.

పురుషుడనగా పరమాత్మ. మొదలులేనివాడు. త్రిగుణరహితుడు. ప్రకృతికున్న గుణాలు పురుషుడికి లేవు. ఈ పురుషుడు తన వినోదం కోసం ప్రకృతిలో ప్రవేశించగా నామరూపాలు, త్రిగుణాలతో కూడిన సృష్టి వ్యక్తం అవుతుంది. ప్రకృతితో కలిసిన పురుషుడినే జీవుడంటారు. జీవుడు ప్రకృతిగుణాల్ని తనవిగా జేసుకొని, తానే అన్ని పనులు చేస్తున్నాను, అన్నిటికి తానే కర్తననే భావంతో సంసారపాశాలలో బంధించబడుతున్నాడు. పరాధీనుడవుతున్నాడు. సత్త్వరజస్తమోగుణమయమైన ప్రకృతివలన ఏర్పడిన శరీరంలో వుంటున్న పురుషుడు త్రిగుణరహితుడు, నిర్వికారుడు. సుఖదుః ఖాలు, రాగద్వేషాలు పురుషుడిని ప్రభావితం చేయవు. నీటిలో చందమామ ప్రతిబింబంలా ఆత్మ వుంటుంది. నీరు కదిలితే ప్రతిబింబం చెదురుతుంది కాని చందమామ చెదరదుగదా! అలాగే శరీరంలోని ఆత్మకు ఏదీ అంటదు. అందువలన మోక్షం కోరేవాడు. ప్రపంచంపట్ల విరక్తి చెంది, మనస్సును, ఇంద్రియాలను వశం చేసుకొని భక్తియోగాన్ని అవలంబించాలి. ఆత్మజ్ఞానం వలన విష్ణుస్వరూపం అవగతమవుతుంది. నీటిలోను, నేలమీద పడుతున్న సూర్యకాంతిని బట్టి ఆకాశంలో సూర్యుడున్నాడని గ్రహించినట్టు మనస్సు, బుద్ధి, అహంకారముల ప్రకాశంచేత ఆత్మస్వరూపం బోధపడుతుంది. సర్వభూతాలలోను అంతరాత్మగా వున్న ఆ పరమాత్మ ఆత్మజ్ఞానులకు కనిపిస్తుంది.

అని చెప్పగా విని దేవహూతి ఇలా అడిగింది. నేలకు వాసన, నీటికి రుచి ఎలాగో అలా ప్రకృతికి ఆత్మకు అవినాభావసంబంధం వుంటుంది గదా! మరి ప్రకృతి తనకు తాను ఆత్మను విడిచి ఎలా పోతుంది? తత్త్వబోధచేత మృత్యుభయం ఎలా పోతుంది? చచ్చి మళ్ళా పుట్టకుండా వుండాలంటే ఏం చేయాలి? అన్నీ వివరంగా చెప్పు తండ్రీ అనగా కపిలుడు ఇలా వివరించాడు.

తల్లీ, స్వధర్మాన్ని అనుష్ఠిస్తూ, అంతఃకరణాన్ని నిర్మలం చేసి, భక్తివైరాగ్యాలతో చిత్తాన్ని ఏకాగ్రం చేస్తే, ఆ తపస్సువల్ల కలిగే వేడికి ప్రకృతి కాలిపోతుంది. కట్టెలో వున్న నిప్పు

కట్టెనే కాల్చినట్లు జ్ఞానాగ్ని ప్రకృతిని దగ్ధంచేస్తుంది. కలలో మనకు కనిపించే కష్టసుఖాలు మెలకువరాగానే కల్ల అని తెలిపోయినట్లు కర్మసాక్షి అయిన ఆత్మకు ఏ బాధలూ వుండవు. అధ్యాత్మజ్ఞానంలో ఆసక్తిగలవాడు క్రమంగా వైరాగ్యభావాన్ని పొంది, అనేక జన్మలు ఎత్తి, గురువులదగ్గర ఉపదేశం పొంది ప్రబుద్ధుడై, సంశయాలన్నీ పోగొట్టుకొని, కర్మలను, వాసనలను నశింపజేసుకొని ముక్తిపొందుతాడు. మృత్యువును జయిస్తాడు. ఏ యోగవిధానంవల్ల మనస్సు నిర్మలమవుతుందో ఇప్పుడు చెబుతాను విను.

శక్తికొలది స్వధర్మాచరణ, శాస్త్రాలు నిషేధించిన పనులు చేయకపోవడం, లభించినదానితో తృప్తిచెందడం, భగవద్భక్తులకు సేవచేయడం, శుద్ధమైన ఆహారాన్ని మితంగా భుజించడం, అహింస, సత్యం, ఇతరుల సొత్తును దొంగిలించకపోవడం, బ్రహ్మచర్యం, శాస్త్రాలు చదువుకోవడం, తపస్సు, ఈశ్వరార్చన, మౌనం, ఇంద్రియనిగ్రహం, ప్రాణాయామం, ధారణ, ధ్యానం, దానధర్మాలు, వ్రతాలు చేయడం మొదలైనవి మనస్సులోని మలినాలను తొలగించి అంతఃకరణ శుద్ధికి తోడ్పడతాయి అలా పరిశుద్ధమైన హృదయంలో సర్వేశ్వరుని ప్రతిష్ఠించి ధ్యానం చేయాలి. శరీరం శాశ్వతంగా నిలిచేదిగాదు, నశించిపోయేదని గ్రహించి దేహాభిమానాన్ని వదిలివేయాలి. అన్ని జీవరాశులలోను తానున్నానని, తనలో అన్ని జీవరాశులూ వున్నాయని, దేహాలు భిన్నరూపాలుగా వున్నా అంతటా ఆత్మ ఒక్కటే నిండివున్నదని భావిస్తూ భిన్నత్వంలో ఏకత్వం చూడాలి ఇలా యోగాన్ని సాధనచేస్తే జీవన్ముక్తి లభిస్తుంది. అని కపిలుడు ఉపదేశించగా తల్లి అయిన దేవహూతి, ప్రకృతి పురుషుల లక్షణాలు, వివిధతత్త్వాలగురించి చక్కగా చెప్పావు, ఇక సాంఖ్యయోగప్రకారంగా తత్త్వవిశ్లేషణ ఎలా చేసి నిరూపిస్తారో చెప్పు, భక్తియోగమహాత్మ్యం వివరంగా తెలియబరచు అని అడిగింది. అప్పుడు కపిలుడు ఇలా చెప్పాడు.

## భక్తియోగం

భక్తి మూడు విధాలు, తామసభక్తి, రాజసభక్తి, సాత్త్వికభక్తి. తామసభక్తుడికి ఆడంబరాలు ఎక్కువ, హింసాత్మక కర్మలు చేస్తాడు. ఇతరులను చూచి అసూయ చెందుతాడు అందరినీ సమానంగా చూడడు ఇలాంటి గుణాలతో భక్తిని చూపడం తామసభక్తి అవుతుంది. ఇక రాజసభక్తుడు కీర్తిప్రతిష్ఠలకోసం, ఐశ్వర్యంకోసం పూజలు చేస్తాడు. ఇతరులతో పోటీపడి గొప్పకోసం కర్మలు చేస్తాడు. సాత్త్విక భక్తుడు పాపపరిహారం కోసం భగవంతుడిని కొలవాలనే భావనతో, నిర్మలహృదయంతో, భక్తితో ఎవుడిని

ఆరాధిస్తాడు. అన్ని కర్మలు భగవంతునికి అర్పిస్తూ, అందరికీ సహాయకారిగా, జనహితాన్ని కాంక్షిస్తూ బ్రతుకుతాడు. నిష్కామభక్తి శ్రేష్ఠమైనది. ఏదీ కోరకుండా ఈశ్వరుని ప్రేమించి పూజించాలి. సత్త్వ, రజ స్తమోగుణాలను వర్జించినవాడు దేవునితో సమానం అవుతాడు. దైవానుగ్రహం పొందాలనుకొనేవారు దేవాలయాలను దర్శించి, దేవుడిని పూజించి, స్తుతించి, వందనం చేయాలి. ఈశ్వరుని ధ్యానించాలి. సజ్జనుల పట్ల అభిమానం, హీనులపట్ల దయ, సమానులతో స్నేహం, యోగాభ్యాసం చేత ఆధ్యాత్మిక ఆధిభౌతిక విషయాలు తెలుసుకోవడం, అహంకారాన్ని వదిలివేసి, భగవద్భక్తులకు సేవచేయడం, అలా మనస్సును పరిశుద్ధం చేసుకొన్నవాడు దైవాన్ని పొందుతాడు. సర్వజీవరాశులలోను దేవుడున్నాడనే విషయం మరిచి భేదభావంతో చూచేవాడు, రాగద్వేషాలతో వ్యవహరించేవాడు శాంతిసుఖాలను పొందలేడు. అలాంటివారు చేసే అర్చన నాకు సంతోషం కలిగించదు అని భగవానుడైన కపిలుడు తల్లికి వివరించి ఇంకా ఇలా చెప్పాడు.

ప్రాణంలేని వాటికంటె ప్రాణం వున్నవి శ్రేష్టం. ప్రాణం, స్పర్శజ్ఞానం వున్న చెట్లకంటె, రుచి జ్ఞానం గలిగిన ప్రాణులు, వాటికంటె వాసన చూడగల ప్రాణులు, తుమ్మెదల వంటివి శ్రేష్ఠం. వాటికంటె శబ్దాన్ని వినగలవి, వాటికంటె రూపాన్ని తెలుసుకోగల జీవులు, వాటికంటె ఎక్కువ కాళ్ళున్నవి, వాటికంటె నాలుగుకాళ్ళవి ఉత్తమం కాగా అన్నిటికంటె రెండుకాళ్ళున్న మనుష్యులు ఉత్తమోత్తమం. మనుష్యులలో నాలుగు వర్ణాలు వున్నాయి. ఈ నాలుగు వర్ణాలలో బ్రాహ్మణులు ఉత్తములు. వారికంటె వేదవేత్తలు, వారికంటె వేదార్థం తెలిసినవారు, వారికంటె శాస్త్రసంశయాలు తీర్చగల మీమాంసకులు, వారికంటె ధర్మవిజ్ఞాన నిపుణులు, వారికంటె అన్నిబంధాలు త్రెంచుకొన్నవారు, వారికంటె సద్ధర్మపరులు ఉత్తములు కాగా సకలకర్మలను భగవంతునికి అర్పించి, సమదృష్టితో, భూతదయతో జీవించే పుణ్యాత్ముడు ఉత్తమోత్తముడు. అలాంటివాడిని చూచి సమస్త జీవరాశులు ఆనందిస్తాయి. ప్రాణులన్నిటిలోను ఈశ్వరుడు జీవరూపంలో ప్రవేశించి వుంటాడు. భక్తిద్వారాగాని, యోగంద్వారాకాని పరమేశ్వరుని చేరవచ్చు. కాలం కూడా భగవంతుని రూపమే. సకలభూతాలు కాలంలో పుట్టి కాలంలో కలిసిపోతున్నాయి. కాలాన్ని చూచి భూతాలన్నీ భయపడతాయి. దేవుని భయంచేతనే గాలి వీస్తుంది. సూర్యుడు వెలుగుతున్నాడు. ఇంద్రుడు వర్షిస్తున్నాడు. నక్షత్రాలు ప్రకాశిస్తున్నాయి. చంద్రుడు వెన్నెల కాస్తున్నాడు. పూవులు పూస్తున్నాయి. కాయలు కాస్తున్నాయి. నదులు ప్రవహిస్తున్నాయి. అగ్ని మండుతున్నది. సముద్రాలు హద్దుమీరడం లేదు. తల్లిదండ్రులు బిడ్డల్ని కంటున్నారు. యముడు ప్రాణాలు హరిస్తున్నాడు. చరాచరాత్మకమైన సకల

ప్రపంచం దైవాధీనం అయివుంటుంది.

అన్ని లోకాలకు అధిపతి, ప్రభువు అయిన ఆ ఈశ్వరుని పరాక్రమం తెలుసుకొనే సామర్థ్యం ఎవ్వరికీ లేదు. గాలి దెబ్బ ఎలాంటిదో మేఘానికేం తెలుస్తుంది? లోకంలో ప్రాణులు సుఖం కోసం తంటాలుపడి దుఃఖాన్ని తెచ్చుకొంటారు. ఇళ్ళు వాకిళ్ళు, పొలాలు స్థలాలు, పశువులు, సిరిసంపదలు, పెళ్ళాం పిల్లలు, బంధువులు ఇలా లోకంలో వున్న వస్తువులు అన్నీ అనిత్యాలు, అసత్యాలు అయినా వాటినే నిజమని నమ్మి మూర్ఖుడు చస్తూ పుడుతూ, రకరకాల దేహాలు ధరిస్తూ, తానున్న దేహమే పరమసుఖంగా భావిస్తూ దాన్ని వదలడానికి ఇష్టపడడు. ఇంద్రియలోలుడై, సుఖాలనే ఎండమావుల వెంటబడి, దుఃఖాలనే కొనితెచ్చుకొంటుంటాడు. పరులను బాధిస్తూ తన వాళ్ళను పోషిస్తూ జీవితాన్ని గడిపిన సంసారి, చివరికి కుటుంబాన్ని పోషించే సామర్థ్యం సన్నగిల్లాక, క్రియాహీనుడై వృధా ప్రయత్నాలు చేస్తుంటే తనవారే అనాదరిస్తారు. అశక్తుడు అని అసహ్యించుకొంటారు. రైతు పనికిరాని ముసలి ఎద్దును ఈసడించుకొన్నట్టుగా అతడిని ఏవగించుకొంటారు. ముసలితనంలో రూపం వికృతమై, శరీరం శిధిలమై, రోగాల పాలవుతాడు. చావు దగ్గరపడగానే యమదూతలు వచ్చి మెడకు త్రాడు బిగించి ఈడ్చుకుపోతారు. 99వేల యోజనాల దూరం వున్న యమపురికి పోయే మార్గంలో జీవుడు ఆకలిదప్పులచేత, వేడిచేతనే గాక యమకింకరులచేత అనేక బాధలకు గురి అవుతాడు. యమపురిని చేరడానికి సామాన్యదోషికి రెండు ముహూర్తాలు, మహాపాపికి మూడు ముహూర్తాలు పడుతుంది. అక్కడ కత్తులతో కోస్తారు, మంటల్లో తోస్తారు, పాములచేత కరిపిస్తారు, ఏనుగులచేత త్రొక్కిస్తారు, సలసల కాగే నూనెలో వేయిస్తారు, కండలు కోసి తినిపిస్తారు, ఆ విధంగా పాపులను చిత్రహింసలు పెడతారు. రౌరవాది నరకాల్లో నానాబాధలు అనుభవించి చేసిన పాపాలకు శిక్ష అనుభవించి మళ్ళీ నరజన్మ పొందుతాడు.

## నరజన్మ విశేషాలు

పూర్వజన్మలో చేసిన పుణ్యపాపాలను బట్టి జీవుడు మళ్ళీ జన్మ ఎత్తడానికిగాను దేహాన్ని పొందడంకోసం పురుషుని వీర్యకణాలలో చేరి స్త్రీగర్భంలో ప్రవేశిస్తాడు. ఒక రాత్రిలో అండంతో కలిసి, ఐదురాత్రులలో బుడగగా మారి, పదిదినాల తర్వాత మాంసపుముద్దగా అవుతాడు. ఒకనెలలో తల, రెండునెలలకు కాళ్ళు, చేతులు ఏర్పడతాయి. మూడునెలలకు గోళ్ళు, వెంట్రుకలు, చర్మం, ఎముకలు, లింగవిభజన కనిపిస్తాయి. ఐదవనెలలో

ఆకలిదప్పులు కలుగుతాయి. ఆరవనెలలో తల్లి కడుపులో కుడివైపున తిరగడం, తల్లి తినే అన్నపానాదుల సారాన్ని గ్రహించడం జరుగుతుంది. మలమూత్రాలతో నిండిన పొట్టలో తిరుగుతూ, క్రిములవల్ల బాధలు పడుతూ, మూర్ఛలు పోతూ, అలా అలా పెరుగుతాడు. తల్లి తిన్న ఉప్పుకారాలు, వేడిపదార్థాలు, పులుపు మొదలైనవాటివల్ల బిడ్డ శరీరం బాధపడుతుంది. లోపల మావిచేత కప్పబడి, బయట ప్రేగులచేత బద్ధుడై, అవయవాలను కదిలించలేక, పొట్టలో తలపెట్టుకొని, పంజరంలో పిట్టమాదిరి అవస్థపడుతూ, పూర్వజన్మలో చేసిన పాపాలను తలచుకొని దుఃఖిస్తాడు. ఏడవ మాసంలో జ్ఞానంతో పాటు చేష్టలు కూడా వస్తాయి. ఇక కడుపులో తిరుగుతూ గర్భవాసపు చెరలో చిక్కినందుకు శోకిస్తూ చేతులు జోడించి భగవంతుని దీనంగా ప్రార్థిస్తాడు. గర్భనరక వేదన పోగొట్టి శాంతిని ఇవ్వవలసిందని వేడుకొంటాడు.

అని కపిలుడు చెప్పగా తల్లి అయిన దేవహూతి ఇలా అడిగింది. దేవుని మాయచేత జీవుడు సంసారవ్యామోహంలో పడుతున్నాడు. హరిని మరచి దేహాభిమానంతో ఇంద్రియసుఖాలకోసం వెంపరలాడుతున్నాడు. అటువంటివాడికి దేవుని దయ లభించకపోతే భక్తిధ్యానాలు దర్శన పూజాదులు చేయాలనే బుద్ధి ఎలా కలుగుతుంది? దానికి కపిలుడు ఇలా సమాధానం చెబుతున్నాడు. అమ్మా, సంసారంలో పడిన జీవికి ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవికమైన బాధలు కలుగుతాయి. అంటే మానసికమైనవి, ఇతరులవలన, జంతువులు, క్రిమికీటకాలవలన శరీరానికి వచ్చేవి, ప్రకృతి ఉపద్రవాలు, తదితర ప్రమాదాలవల్ల కలిగే బాధలు – వీటినే తాపత్రయం అంటారు. ఆ బాధల నివారణ కొరకు దైవసహాయం కోరుతూ ప్రాణులు పరమాత్మునికి ప్రణమిల్లుతాయి. కష్టాలే భగవంతుడిని జ్ఞాపకం చేస్తాయి. దైవానుగ్రహం కొరకు ప్రార్థించే బుద్ధి అలా కలుగుతుంది. కడుపులో వున్న బిడ్డ గర్భనరకంనుంచి విముక్తికోసం భగవంతుడికి చేతులెత్తి మ్రొక్కి, పొరపాటుచేశాను, ఆత్మను మరచి దేహాన్ని ప్రేమించి మాయామోహాలలో పడి సంసారచక్రంలో పుడుతూ చస్తూ తిరుగుతున్నాను, ఇక బుద్ధివచ్చింది, తండ్రీ, నన్ను బయటికి పంపు, ఇక నిన్నే తలచుకొంటూ మాయలో పడక నీ పదాలనే ధ్యానిస్తూ ముక్తిపథంలో నడుస్తానని దీనవదనంతో ప్రార్థన చేస్తాడు. అలా నవమాసాలు గడిచాక, పదవమాసంలో తలక్రిందుగా బయటకు వచ్చి ఊపిరిపీల్చి ఏడుస్తాడు. జ్ఞానహీనుడు, నిస్సహాయుడు అయిన బాలుడు తన బాధలు చెప్పుకోలేడు. ఇతరుల సహాయంతో పెరుగుతాడు. ఆ పెరగడంలో అనేక కష్టాలు పడతాడు. అనుభవాలు గడిస్తాడు. యుక్తవయస్సు వచ్చాక పెళ్ళి, పెళ్ళాం, పిల్లలు, బంధువులు, సంసారపోషణ,

ఇంద్రియసుఖాలు అతడిని ఉక్కిరిబిక్కిరి చేసి అజ్ఞాన అంధకారంలోకి నెట్టివేస్తాయి. స్త్రీ సౌందర్యం పురుషులకు మోహం కలిగిస్తుంది. అందువలన స్త్రీలకు దూరంగా వుండాలి. యోగమార్గంలో నడవాలి. భగవంతుడిని ప్రేమించి పూజించేవారు స్త్రీసంగమం నరకానికి మార్గమని గుర్తిస్తారు.

పెళ్ళాం, పిల్లలు, ఇళ్ళు, ఆస్తులు, బంధుమిత్రులు ...వైనవాటికి కారణం ఈ శరీరమే. అట్టి శరీరంలో వున్న జీవుడు ఈ సంసారంలో వుండి చేసిన పాపపుణ్యకర్మలకు అనుగుణమైన ఫలితాన్ని మరోజన్మ ఎత్తి అనుభవించక తప్పదు. పురుషరూపంలో వున్న జీవుడు స్త్రీవ్యామోహంలో పడి అదేపనిగా రమించేవాడు స్త్రీగా జన్మిస్తాడు. స్త్రీరూపంలో వున్న జీవుడు, పురుషుడే తన ఆత్మబంధ కారణమైన మృత్యువు అని గ్రహించాలి. కాబట్టి జన్మమరణ రహస్యజ్ఞానం తెలుసుకొని లోకంతో బంధాలు త్రెంచుకొని, దేహాభిమానాన్ని వదిలి దేహసంబంధంగా ఏర్పడిన సంసారంపైన ఆసక్తిమాని, జీవించి, తరించాలి. కోరికలతో పూజలు వ్రతాలు చేసేవారు చంద్రలోకానికి పోతారు. పుణ్యఫలాన్ని అనుభవించి మళ్ళీ భూమిమీద పుడతారు. అహంకార మమకారాలను వదిలి, లోకసంబంధాలు, సుఖాలు విడిచిపెట్టి దేవదేవుని ఎల్లప్పుడు భజిస్తూ జీవించేవారు తిరిగి జన్మ ఎత్తరు. ఈశ్వర సాన్నిధ్యంలో సుఖంగా వుంటారు. అందువలన సర్వభూతముల హృదయపద్మాలలో నివసించే సర్వేశ్వరుని శరణు వేడుకో. పురుషోత్తముని సహృదయంతో భజించు. పునర్జన్మలేని ముక్తి లభిస్తుంది అని కపిలుడు తల్లికి బోధించాడు. దేవహూతి తనయుని రూపంలో వున్న దైవానికి సాష్టాంగదండప్రణామాలు చేసింది. నా పూర్వజన్మ సుకృతంవల్ల నా కడుపున పుట్టావు. నాకు జ్ఞానాన్ని ఉపదేశించి మోక్షానికి మార్గం చూపావు. నీ మహిమలు పొగడాలంటే నాకు మాటలు రావు. శ్రీమహావిష్ణువైన నీకు వందనాలు సమర్పిస్తున్నానని స్తుతించింది. అలా తల్లికి ఆత్మజ్ఞానాన్ని బోధించి కపిలుడు వెళ్ళిపోయాక, దేవహూతి పెనిమిటిని, కుమారుని తలచుకొని వారు లేనందుకు కొంత బాధపడింది. తర్వాత కర్దముని ఆశ్రమాన్ని విడిచిపెట్టి, సరస్వతీనదిలోను, బిందుసరోవరంలోను పుణ్యస్నానాలు చేసి, తపస్సు చేసింది. నారాయణుని ధ్యానం చేసింది. కుమారుడైన కపిలుడు చెప్పినట్లు వైరాగ్యంతో భక్తియోగాన్ని అనుసరించి క్రమంగా శరీరం క్షీణించగా, పరమపదం పొంది శ్రీహరిలో కలిసింది. ఆ తల్లి మోక్షాన్ని పొందిన స్థలం సిద్ధిపదం అనే పేరుతో ప్రసిద్ధిపొందింది. కపిలుడు యోగాన్ని అవలంబించి సముద్రంలో కలిసిపోయాడని మైత్రేయుడు విదురునికి చెప్పాడని శుకయోగి పరీక్షిత్తుకు తెలియజేశాడు.

# నాల్గవస్కంధం

స్వాయంభువ మనువుకు శతరూప వలన ముగ్గురు కూతుళ్ళు, ఇద్దరు కొడుకులు పుట్టారని చెప్పుకున్నాం గదా, అందులో రెండవ కూతురైన దేవహూతి చరిత్ర ఇంతవరకు విన్నావు, అని మైత్రేయుడు విదురునికి ఇంకా ఇలా చెప్పాడు. మనువు తన పెద్దకూతురైన ఆకూతిని రుచి అనే పేరుగల ప్రజాపతికిచ్చి వివాహం చేశాడు. రుచి బ్రహ్మతేజం కలవాడు, సర్వగుణసంపన్నుడు. వారికి శ్రీమహావిష్ణువు మగబిడ్డగాను, ఆదిలక్ష్మి ఆడబిడ్డగాను కవలలై జన్మించారు. అబ్బాయికి యజ్ఞుడని, అమ్మాయికి దక్షిణ అని పేరు పెట్టారు. స్వాయంభువుడు మనుమడిని తన దగ్గరకు తెచ్చి పెంచాడు. ఆడపిల్ల తల్లిదగ్గర పెరుగుతున్నది దక్షిణ యజ్ఞుడిని పతిగా వరించింది. వారిరువురికి పెళ్ళి అయ్యింది. వారు ఆదిదంపతులైన లక్ష్మీనారాయణులు గాబట్టి ఆ పెళ్ళికి ఎవరూ అభ్యంతరం చెప్పలేదు. ఆ కవలలకు 12మంది దేవతలు కొడుకులుగా పుట్టారు. వారిపేర్లు తోషుడు, ప్రతోషుడు, సంతోషుడు, భద్రుడు, శాంతి, నిడస్పతి, నిధ్మడు, కవి, విభుడు, వహ్ని, సుదేవుడు, రోచనుడు. వీరు తుషితులనే దేవగణంగా ప్రసిద్ధిచెందారు.

## దక్షుని కథ

మనువు మూడవకూతురు ప్రసూతిని బ్రహ్మపుత్రుడైన దక్షప్రజాపతికిచ్చి పెళ్ళిచేశారు. వారిద్దరికి పుట్టిన సంతానం నుంచి క్రమంగా ముల్లోకాలు జనంతో నిండిపోయాయి. దేవహూతికి పుట్టిన తొమ్మిదిమంది కన్యలను ఋషులకిచ్చి పెళ్ళిళ్ళు చేశారని ఇంతకుమునుపే చెప్పాను. వారికి జన్మించిన సంతానాన్ని గురించి ఇప్పుడు చెబుతాను విను మరీచికి, కళకు కశ్యపుడు అనే కొడుకు, పూర్ణిమ అనే కూతురు పుట్టగా వారికి పుట్టిన పిల్లలు, వారి పిల్లలు లోకాలను నింపివేశారు. పూర్ణిమ మరుసటి జన్మలో గంగ అనే పేరుతో పుట్టి దేవకుల్య అనే కూతురిని, విరజుడనే కొడుకుని కన్నది. అత్రిమహాముని, అనసూయలకు బ్రహ్మ విష్ణు మహేశ్వరుల అంశలతో ముగ్గురు కొడుకులు పుట్టారు అని మైత్రేయుడు చెప్పగా, విదురుడు, బ్రహ్మ విష్ణు మహేశ్వరులు అనసూయా గర్భమందు ఎందుకు జన్మించారు? అని అడిగాడు మైత్రేయుడు మళ్ళీ చెప్పసాగాడు.

అత్రిమహాముని భార్యాసమేతంగా తపస్సు చేసుకొనడానికి ఋక్షపర్వత సానువులలోని అరణ్యానికి వెళ్ళాడు. అక్కడ గాలిని బంధించి ఒంటికాలిపై నిలిచి వందేళ్ళు తపస్సు చేశాడు. జగదీశ్వరా, నువ్వే నాకు శరణు. నీతో సమానమైన సంతానాన్ని నాకివ్వు అని

ప్రార్థించాడు. ఆయన తపస్సుకి ముల్లోకాలు కాగిపోవడంతో బ్రహ్మ విష్ణు మహేశ్వరులు దివినుంచి భువికి దిగివచ్చారు. అత్రి ఆశ్రమానికి వచ్చి ఆయన చేసిన వందన, స్తుతి, మర్యాదలను స్వీకరించారు. అత్రి, అయ్యలారా! నేను ఒక్కడిని ప్రార్థిస్తే మీరు ముగ్గురూ వచ్చారు. నాకేమీ అర్థం కావడం లేదు. అదీగాక సంతానం కోసం నానావిధ పూజలు చేసి నా మనస్సులో నిలుపుకొన్నది ఒక్క దేవుడి రూపమే, అని చెప్పగా ఆ త్రిమూర్తులు, మేము ముగ్గురంగా వున్నా యదార్థానికి ఒక్కరమే, నీ మనస్సులోని కోరిక నెరవేరుతుంది, మా ముగ్గురి అంశలతో కొడుకులు పుట్టి నీ కీర్తిని ముల్లోకాల్లోనూ వ్యాపింపజేస్తారు, అని వరమిచ్చి తమ లోకాలకు వెళ్ళిపోయారు. ఆ తర్వాత అత్రి అనసూయలకు బ్రహ్మ అంశాన అమృతాంశుడు, విష్ణుకళతో దత్తుడు, శివుని అంశతో దుర్వాసుడు జన్మించారు.

అంగిరసుడనే మునికి శ్రద్ధయందు నల్గురు కూతుళ్ళు పుట్టారు. వారిపేర్లు సినీవాలి, కుహూ, రాకా, సుమతి. ఇద్దరు కొడుకులు కూడా జన్మించారు. వారు సుచథ్యుడు, బృహస్పతి అని ప్రసిద్ధికెక్కారు. పులస్త్యుడు హవిర్భుక్కుయందు కన్న కొడుకు అగస్త్యుడు. అగస్త్యుని తర్వాత విశ్వవసుడనే కొడుకు పుట్టాడు. విశ్వవసునికి ఇలబిల అనే భార్యవలన కుబేరుడు, కైకసి అనే రెండవభార్యవలన రావణ, కుంభకర్ణ, విభీషణులు పుట్టారు. పులహునకు గతి అనే భార్యవలన కర్మశ్రేష్ఠుడు, వరీయాంసుడు, సహిష్ణుడు అనే ముగ్గురు కొడుకులు కలిగారు. క్రతువుకు క్రియ అనే భార్యవలన బ్రహ్మతేజంతో వెలుగుతున్న 60 వేలమంది వాలఖిల్యులు ఉదయించారు. వసిష్ఠునికి ఊర్జయందు చిత్రకేతుడు, సురోచి, విరజుడు, మిత్రుడు, ఉల్బణుడు, వసుభృద్యానుడు, ద్యుమంతుడు అనే పేర్లుగల సప్తరుషులు జన్మించారు. మరొక భార్యవలన శక్తి మొదలైనవారు పుట్టారు. అధర్వునకు చిత్తి అనేదానివలన గుర్రపుతలగల దథ్యంచుడు అనే కొడుకు పుట్టాడు. భృగువుకు ఖ్యాతివలన ధాత, విధాత అనే కుమారులు, శ్రీ అనే కుమార్తె కలిగారు. అనాధాతృ, విధాతృలు మేరువనే వాని కూతురులైన యాయతి, నియతులనే భార్యలవలన మృకండుడు, ప్రాణుడు అనే కొడుకులను కన్నారు. మృకండునకు మార్కండేయుడు, ప్రాణునకు వేదశిరుండను ముని పుట్టారు. భృగువునకు ఉశయందు కవి అనువాడు పుట్టాడు. ఇలా కర్దముని తొమ్మిదిమంది కూతుళ్ళ సంతానపరంపరచేత లోకాలన్నీ నిండిపోయాయి. ఇక దక్షప్రజాపతి ఏ విధంగా వంశాభివృద్ధి చేసిందీ చెబుతాను, విను.

మనువు మూడవకూతురు ప్రసూతిని దక్షప్రజాపతికిచ్చి పెళ్ళిచేశారని చెప్పుకున్నాం గదా! వారికి 16 మంది ఆడపిల్లలు పుట్టారు. వీరిలో శ్రద్ధ, మైత్రి, దయ, శాంతి, తుష్టి, పుష్టి, క్రియ, ఉన్నతి, బుద్ధి, మేధ, తితిక్ష, హ్రీ, మూర్తి అనే పేర్లుగల 13 మందిని

ధర్మరాజునకు, స్వాహాదేవిని అగ్నిదేవునకు, స్వధను పితృదేవతలకు, సతి అనే చివరిదాన్ని అభవునకు ఇచ్చి పెళ్ళి చేశారు. ధర్ముని భార్యలలో శ్రద్ధవలన శృతం, మైత్రివలన ప్రసాదం, దయవలన అభయం, శాంతివలన సుఖం, తుష్టివలన ముదం, పుష్టివలన స్మయం, క్రియవలన యోగం, ఉన్నతివలన దర్పం, బుద్ధివలన అర్థం, మేధవలన స్మృతి, తితిక్షవలన క్షేమం, హ్రీవలన ప్రశ్రయం, మూర్తివలన నరనారాయణులను రుషులు ఇద్దరు సంభవించారు.

నరనారాయణులు పుట్టినప్పుడు ప్రకృతి పులకించింది. అన్ని లోకాలు ఆనందమయమయ్యాయి. దేవతలు పూలవాన కురిపించారు. దేవ దుందుభులు మ్రోగాయి. గంధర్వులు, కిన్నరులు గానం చేయగా అప్సరసలు నాట్యం చేశారు. బ్రహ్మాది దేవతలు వచ్చి వారిని స్తుతించారు. తర్వాత వారిద్దరు గంధమాదన పర్వతానికి వెళ్ళిపోయారు. నరనారాయణులే అర్జునుడు, కృష్ణుడుగా కురు, యదువంశాలలో జన్మించారు.

అగ్నిదేవునికి, స్వాహాదేవికి పావకుడు, పవమానుడు, శుచి అనే ముగ్గురు కొడుకులు కలిగారు. వారివలన అగ్నులు పుట్టాయి. స్వధకు వయున, ధారిణి అనే కూతుళ్ళు పుట్టి జ్ఞానవిజ్ఞానపారగలై బ్రహ్మనిష్ఠలయ్యారు. దక్షప్రజాపతి కడగొట్టు కుమార్తె సతీదేవిని సదాశివునికి ఇచ్చి పెళ్ళిచేశారని చెప్పాను గదా. ఆమెకు పిల్లలు కలగలేదు. తన భర్తతో విరోధించి, అవమానించినందుకు తండ్రిపై కోపంతో సతీదేవి యోగమార్గాన ప్రాణం విడిచింది అని మైత్రేయుడు చెప్పగా విదురునికి ఆ కథ వినాలని ఆసక్తి కలిగింది. మామాఅల్లుళ్ళ మధ్య తగాదా ఎందుకు వచ్చింది? సతీదేవి ప్రాణాలు ఎందుకు విడిచింది. అంతా వివరంగా చెప్పండని విదురుడు కోరగా మైత్రేయుడు ఇలా చెప్పాడు.

## దక్షయజ్ఞ ధ్వంసం

పూర్వం ఒకప్పుడు ప్రజాపతులు తలపెట్టిన ఒక యజ్ఞానికి బ్రహ్మదేవుడు, యోగులు, రుషులు, దేవతలు, మునులు, అగ్నిదేవుడు, సదాశివుడు ప్రభృతులు వచ్చి కూర్చొని వుండగా, దక్షప్రజాపతి అక్కడకు రావడంతో శివుడు, బ్రహ్మ తప్ప అందరూ లేచి నిలబడ్డారు. దక్షుడు బ్రహ్మకు మ్రొక్కి, సభ్యులు భక్తితో చేసిన పూజలందుకొని తన అర్హతకు తగిన ఆసనం మీద కూర్చొని చుట్టూ కలయజూచాడు. అల్లుడైన శివుడు ఆసనం దిగి తనకు మర్యాద చేయలేదని మండిపడ్డాడు. సభ్యులారా! ఇతడిని చూడండి, వట్టి నిష్ప్రయోజకుడు. మర్యాదా మట్టూ తెలియనివాడు అని శివుడిని చూపుతూ, ఈ

సిగ్గులేనివాడు సావిత్రీసమానురాలైన సాధ్వి, నా కూతురును పెళ్ళాడి గొప్పవాడినయ్యాననే గర్వంతో లేచి నిలబడి అభివందనం చేయకపోతే పోనీగాని నోరు తెరిచి పలకరించడానికి ఏంపోయింది అని దెప్పిపొడిచాడు. ఇతనికి పనీపాటా ఏమీ లేదు. మానమర్యాదలు లేనేలేవు. పిచ్చివాడు. మొండిమొలతో, భూతప్రేతాలను వెంటవేసుకొని శ్మశానాల్లో తిరుగుతుంటాడు. ఎముకలు మెళ్ళో వేసుకొని బూడిద పూసుకొని శుచీశుభ్రతా లేకుండా తిరిగేవాడికి శివుడనే పేరు ఎలా వచ్చిందో? అశివుడు అంటే బాగుంటుంది గదా! నా కర్మకొద్దీ నా కూతురును ఈయనకు కట్టబెట్టి గొంతుకోశాను అని నోటికి వచ్చినట్లు తిట్టి, యజ్ఞసమయంలో దేవతలందరికి లభించే హవిర్భాగం ఇతనికి దొరకకుండుగాక అని శపించాడు. ఆ విధంగా రుద్రునికి శాపం యిచ్చి దక్షుడు తన యింటికి వెళ్ళిపోయాడు.

అప్పుడు శివుని అనుచరులలో ముఖ్యుడైన నందికేశ్వరుడు దక్షుని మాటలు విని, శాపం యివ్వడం చూచి కోపంతో ఊగిపోయాడు. ఈ దక్షునికి వివేకం నశించింది. ఇతడు చేసిన అపరాధం క్షమించరానిది. ఈ మూర్ఖుడు ఆత్మతత్త్వం మరిచి పశుప్రాయుడు, స్త్రీకాముకుడు అవుతాడు. తొందరలోనే ఇతనికి మేకముఖం వస్తుంది. ఇతడిని అనుసరించేవారు సంసారకూపంలో పడి చస్తూ పుడుతూ వుంటారు. శివుని ద్వేషించే బ్రాహ్మణులు వేదపఠనంవల్ల మనస్సులు కలతచెంతగా కర్మలపై ఆసక్తితో బ్రతుకుతారు. ఏది తినాలో ఏది తినగూడదో ఆలోచించక పొట్టబోసుకొనడానికి చదువులు, తపాలు, వ్రతాలు చేస్తూ యాచకులై తిరుగుతారని శపించాడు.

నందికేశ్వరుని శాపం విన్న భృగుమహామునికి కోపం వచ్చింది. ఆయన లేచి, శివుడిని పూజించేవారు, వారిని అనుసరించేవారు శాస్త్రవిరోధులై పాషండులవుతారని శాపం ఇచ్చాడు. ఇలా ఒకరినొకరు శపించుకొన్నా భగవంతుని దయవలన ఎవరికీ హాని కలగలేదు. కలతచెందిన శివుడు తన అనుచరులతో కలిసి అక్కడనుంచి వెళ్ళిపోయాడు. హరిని పూజిస్తూ ప్రజాపతులు వెయ్యేళ్ళు ప్రయాగలో యజ్ఞం చేశారు. తర్వాత త్రివేణీసంగమంలో స్నానంచేసి అందరూ తమ తమ నెలవులకు వెళ్ళిపోయారు.

దక్షునికి, అల్లునికి మధ్య విరోధం నానాటికి పెరిగిపోయింది. రుద్రుడు లేకుండా యాగం చేయకూడదని శాస్త్రం చెబుతున్నా లెక్కచేయకుండా దక్షుడు వాజపేయ యాగం రుద్రుని ఆహ్వానించకుండానే చేశాడు. తర్వాత బృహస్పతి యజ్ఞం చేయడానికి ఉపక్రమించాడు. దానిని చూడ్డానికి దేవతలు, మహర్షులు, మునులు, ప్రజాపతులు వచ్చి దక్షుడిని ఆశీర్వదించి ఆయనచేత సన్మానాలు పొందారు. ఆకాశంలో వచ్చేవారు పోయేవారు తన తండ్రి యజ్ఞాన్ని గురించి గొప్పగా చెప్పుకుంటున్న మాటలు సతీదేవి

చెవుల్లో పడ్డాయి. ఆమె బయటకు వచ్చి చూస్తే గంధర్వులు, కిన్నరులు మొదలైనవారు జంట జంటలుగా ఆకాశమార్గాన పోవడం కనిపించింది. తర్వాత భర్త దగ్గరకు వెళ్ళి, మీ మామగారు యజ్ఞం చేస్తున్నారని అందరూ అక్కడికి పోతున్నారు, మనం కూడా వెళ్ళితే బాగుంటుంది అనిపిస్తున్నది, ఏమంటారు, అని అడిగింది. పైగా మా అక్కలు, బావలు కూడా వస్తారు. అందరినీ చూడవచ్చు. మా అమ్మను కూడా చూడాలని వుంది. మనల్ని పిలవలేదు గదా అంటారేమో? తండ్రివద్దకు, గురువువద్దకు, రాజువద్దకు సజ్జనులు పిలవకపోయినా వెళ్తారు. అందువల్ల నా కోర్కె తీర్చి అనుగ్రహించవలసిందని భర్తను వేడుకొంది

ఈ మాటలు విని శివుడు నవ్వుకొన్నాడు. బ్రహ్మయజ్ఞంలో దక్షుడు తనకు చేసిన అవమానాన్ని గుర్తుచేసుకొన్నాడు. భార్యతో ఇలా అన్నాడు. దేవీ, బంధువులు పిలవకపోయినా సంతోషంగా వెళ్తారు అన్నమాట సత్యమే. నేను కాదనడం లేదు. పొగరెక్కి, నోటికి వచ్చినట్టు కూసేవారు కాకపోతే వెళ్ళవచ్చు. విద్య, ధనం, వయస్సు, రూపం, కులం వినయం అవి వున్నవారికి భూషణాలు కాగా, దుష్టస్వభావంగల వారికి మదమెక్కించి వివేకభ్రష్టులను చేస్తాయి. మహాత్ముల మాహాత్మ్యం గర్విష్ఠులు, మూఢులు చూడలేరు. కాబట్టి అలాంటి కుటిలబుద్ధిగలవారి ఇళ్ళకు బంధువులమని చెప్పి బుద్ధిమంతులు పోవడం మంచిది కాదు. శత్రువు వేసిన బాణాలతో గాయపడినవాడు కూడా దుఃఖాన్ని మరచిపోయి నిద్రపోతాడుగాని బంధువులచేత మాటపడ్డవాడు కృంగి కృశిస్తాడు. కంటికి కూరుకులేకుండా కుమిలిపోతాడు. దక్షప్రజాపతికి ముద్దుల కూతురువైనా, నా భార్యవు గాబట్టి నిన్నతడు ఆదరించడు. బ్రహ్మలు చేసిన యజ్ఞంలో అకారణంగా నన్ను దూషించి పరాభవించిన సంగతి నీకు తెలిసిందే. ప్రాజ్ఞులు పరిపూర్ణుడైన పరమపురుషుడు ఆ నారాయణునికి దప్ప ఎవరికీ నమస్కరించరు. కాబట్టి దేహాభిమాని, అహంకారి అయిన మీ తండ్రికి నేను అభివాదం చేయలేదు. ఆ కారణంగా అతడు నాతో విరోధం పెట్టుకొన్నాడు. ఇప్పుడు నా మాట పెడచెవినిబెట్టి నీవు వెళ్ళితే పుట్టింట్లో నీకు పరాభవం జరుగుతుంది. అయినవాళ్ళ మధ్య అవమానం చావుతో సమానం. ఆపైన నీ యిష్టం అని ఎటూ చెప్పలేక భవుడు వూరుకొన్నాడు.

సతీదేవి చాలా బాధపడింది. ఆమెకు మనస్సు పుట్టింటిపై మళ్ళింది. కన్నీళ్ళు తుడుచుకొని, ఎలాగైనా వెళ్ళాలనే నిశ్చయించుకొని లేచి బయలుదేరింది. గబగబ అడుగులు వేసుకొంటూ సాగిపోయింది. ఆమెవెంట నందికేశ్వరుని నాయకత్వంలో రుద్రుని అనుచరులు, యక్షులు సతీదేవి ధరించే ఆభరణాలు, అలంకారసామగ్రి,

దుస్తులు తీసుకొని బయలుదేరి వెళ్ళి ఆమెను ఎద్దుపై కూర్చోబెట్టి యజ్ఞభూమికి తీసుకొనిపోయారు. యజ్ఞశాలలో ప్రవేశించిన సతీదేవిని తల్లి, అన్నలు తప్ప అక్కడ వున్నవారెవరూ పలుకరించలేదు. దక్షుడికి ఎక్కడ కోపం వస్తుందో అని వారంతా భయపడ్డారు. తండ్రి ఆదరించలేదనే బాధ ఒకవైపు, తన భర్తను ఆహ్వానించలేదనే బాధ మరొకవైపు తోడుకాగా, రుద్రుడు లేకుండా యజ్ఞం చేస్తున్నారనే రోషంతో ఆమెకు పట్టరాని కోపం వచ్చింది. ఇదంతా చూచి ఆవేశపరులైన భూతగణాలు దక్షుని చంపేస్తామని ముందుకు దూకారు. సతీదేవి వారిని వారించి తండ్రివైపు తిరిగి ఇలా అంది.

జీవులందరూ ప్రేమించే ఈశ్వరునికి ఒకరంటే ఇష్టం, మరొకరంటే అయిష్టం అంటూ వుండదు. ఆయనకంటె అధికులూ లేరు. అసూయాద్వేషాలులేని రుద్రునితో నువ్వు తప్ప ఎవరూ ఇలా దురుసుగా ప్రవర్తించరు నీలాంటివారికి ఇతరులలోని సుగుణాలు దుర్గుణాలుగా కనిపిస్తాయి. దేహాన్ని ఆత్మగా భావించే మందమతులు మహాత్ములను నిందించడం ఆశ్చర్యం కాదు. శివ అనే రెండక్షరాలను తలచినా, పలికినా పాపాలు పోతాయి. అలాంటి దేవునికే ద్రోహం చేశావు. నిన్నేమనాలి ఇంకా. ఎవరి పాదపద్మాలు కొలిస్తే కోరిన కోరికలు నెరవేరుతాయో అలాంటివాడిని తూలనాడడం నీకు తగదు. బ్రహ్మ ప్రభృతులు శివుని పాదధూళిని శిరస్సుపై ధరిస్తారే, అలాంటివాడిని ఎముకలు, భస్మం ధరించి శ్మశానాలలో పిశాచాలతో తిరిగే అమంగళుడని అనడానికి నీకు నోరు ఎలా వచ్చిందయ్యా? ధర్మపాలన చేసే ఆ భర్గుని తిట్టినవాని నాలుకను తెగ్గోయాలి. అలా చేయలేకపోతే తానైనా చావాలి. రెండూ సాధ్యం కాకపోతే చెవులు మూసుకొని దూరంగా తొలగిపోవాలి అంటున్నారు ధర్మనిర్ణేతలు. తెలియక తినరానిదేదైనా తిన్నప్పుడు దాన్ని కక్కివేసి మనిషి పవిత్రుడవుతాడు. దుష్టాత్ముడవై ఈశ్వరుని నిందించిన నీ కూతురునని చెప్పుకొని బ్రతకలేను. నీనుంచి వచ్చిన ఈ తుచ్ఛమైన శరీరాన్ని వదిలివేసి పవిత్రనవుతాను. అని తండ్రికి చెప్పి సతీదేవి యోగమార్గాన అగ్నిని సృష్టించి అందులో దగ్ధమైపోయింది. అదిచూచి అక్కడ వున్న దేవతలు, మానవులు దక్షుడిని తీవ్రపదజాలంతో విమర్శించారు. కూతురు ఆ విధంగా ప్రాణత్యాగం చేస్తుంటే చూస్తూ కూర్చునే తండ్రి ఎక్కడైనా వుంటాడా అని ముక్కుమీద వేలేసుకొన్నారు. రుద్రుని అనుచరులు కోపావేశంతో గదలు ధరించి, కత్తులు దూసి దక్షుని చంపడానికి లేచారు. ఈ కలకలమంతా చూచి భృగుమహాముని అభిచారహోమం చేయగా అందులోనుంచి ఋభుదేవతలు పుట్టుకొచ్చారు. బ్రహ్మతేజంతో వారు కొరవులు పట్టుకొని రుద్రగణాలపై దాడిచేసి తరిమికొట్టారు.

అవమానితురాలైన తన సతి ప్రాణం విడిచిందని, తన ప్రమథగణాలు రుభుదేవతల చేతిలో ఓడిపోయి పారిపోయాయని నారదుని ద్వారా తెలుసుకొన్న భవుడు ఉగ్రుడయ్యాడు. వికటాట్టహాసం చేశాడు. సింహంలా గర్జించాడు. వీరావేశంతో తన తలలోని ఒక జటను పెరికి భూమిమధ్యకు విసిరివేశాడు. ఆ జటలోనుంచి దీర్ఘశరీరంతో, అగ్నిజ్వాలలవంటి వెంట్రుకలతో, కోరలతో, మెళ్ళో పుర్రెలు, ఎముకల దండలు ధరించి, మహాభయంకర స్వరూపంతో వీరభద్రుడు మరో రుద్రునిలా ఉదయించాడు. వేయిచేతులు జోడించి వినయంగా మ్రొక్కి, ఏం చేయాలో ఆజ్ఞాపించు తండ్రీ అని శివుడిని అడిగాడు. నా సేనలన్నిటికి నాయకత్వం వహించి దక్షుని యజ్ఞభూమికి వెళ్ళి యజ్ఞాన్ని ధ్వంసం చేయి. దక్షుడిని సంహరించు, బ్రాహ్మణతేజం అజేయమంటావా, నా అంశతో పుట్టిన నీకు అది అసాధ్యం కాదు అని శివుడు ఆనతిచ్చాడు. వీరభద్రుడు రుద్రునికి ప్రదక్షిణం చేసి, శూలాన్ని ధరించి, సైన్యసమేతంగా యజ్ఞభూమికి వెళ్ళాడు. ఆ కలకలం విని దక్షుడు, దేవతలు, ఇతర జనులు హడలెత్తిపోయారు. అక్కడున్న బ్రాహ్మణస్త్రీలు దక్షుని పాపం పండింది, కూతురిని పొట్టబెట్టుకొనడమే గాక జగత్ సంహారకారకుడైన రుద్రునికి కోపం తెప్పించి, కొరివితో తలగోక్కున్నాడు అని తలా ఒక మాటా అన్నారు. ఇంతలో రుద్రుని అనుచరులు యజ్ఞశాలను అతలాకుతలం చేశారు. విరిగేవాటిని విరగ్గొట్టారు. కాలేవాటిని తగులబెట్టారు హోమాగ్నులను ఆర్పివేశారు. హోమకుండాలలో మూత్రవిసర్జన చేశారు. అక్కడున్నవారిని కొట్టారు. రుద్రగణంలో మణిమంతుడనేవాడు భృగువును, వీరభద్రుడు దక్షుని, చండీశుడు పూషుని, నందీశ్వరుడు భగుని పట్టుకొన్నారు. దక్షుడు శివుని తిడుతుంటే కన్నుగీటి నవ్విన భగుని కళ్ళు పీకేసారు. పరిహాసం చేసిన పూషుని పండ్లు రాలగొట్టారు. మీసాలు దువ్వి గడ్డాలు సవరించిన భృగుమహాముని గడ్డాలు, మీసాలు పీకేశారు. వీరభద్రుడు దక్షుడిని నేలపై పడవేసి రొమ్ముపై తన్ని, కత్తితో పొడిచాడు. ఎన్నిచోట్ల పొడిచినా చావనందున, తలకోసి అగ్నిలో వేసి కాల్చివేశాడు. అక్కడున్న బ్రాహ్మణులు హాహాకారం చేశారు. భోరున విలపించారు. అలా దక్షుని యాగం విధ్వంసం గావించి వీరభద్రుడు అనుచరులతో తిరిగి కైలాసానికి వెళ్ళిపోయాడు.

శివుని గణాలచేతిలో వళ్ళంతా తూట్లుపడి హూనం కాగా గాయపడిన దేవతాగణాలు తమ బాధలు చెప్పుకోడానికి బ్రహ్మదగ్గరకు వెళ్ళారు. దక్షుని యజ్ఞానికి పట్టనున్న గతి ముందే ఎరిగిన బ్రహ్మ, నారాయణుడు అక్కడకు వెళ్ళలేదు. దేవతల విన్నపం ఆలకించిన బ్రహ్మ, ఈశ్వరుడు లేకుండా యజ్ఞం చేయబోయి భంగపాటు చెందారు. భర్గుని శక్తిసామర్థ్యాలు ఇప్పుడైనా అర్థమయ్యాయా, మీ బుద్ధికి ఎందుకిలా గ్రహణం పట్టింది

అని వారిని మందలించాడు. భక్తినిష్ఠలతో భవుని పాదాలు పట్టుకొని శరణం కోరండి. ఆయన దయదలిస్తే మీరు సంకల్పించిన యజ్ఞం మళ్ళీ నిర్వహించగలుగుతారు. ఆయన దగ్గరకు వెళ్ళడానికి భయపడుతున్నాం, ఎలా వెళ్ళాలో తెలియడం లేదు, అన్నారు దేవతలు. ఈశ్వరుడు స్వతంత్రుడు. ఆయన బలపరాక్రమాలు, స్వరూప స్వభావాలు, నాకు, మీకు, ఇంద్రుడికి, దేహధారులెవ్వరికీ కూడా తెలియవు. కాబట్టి నేను మీకు తోడుగా వస్తాను. అందరం కలిసి ఆయన దగ్గరకు పోదాం, అన్నాడు బ్రహ్మ. ఆ విధంగా బ్రహ్మ, దేవ పితృగణ ప్రజాపతులతో కలిసి కైలాసానికి వెళ్ళారు. అక్కడ సౌగంధికవన సమీపంలో ఒక పెద్ద వటవృక్షం చూశారు నూరు యోజనాల పొడవున్న ఆ చెట్టు 75 యోజనాలు విస్తరించి తరగని నీడతో ఆకులు, కొమ్మలతో అలరారుతున్నది. ఆ వృక్షం మొదట్లో శివుడు కూర్చుని వున్నాడు. నారదునితో సంభాషిస్తున్నాడు. చంద్రమౌళిని చూచి ప్రజాపతులు మునులు భక్తితో పాదాభివందనం చేశారు. బ్రహ్మను చూచి హరుడు సంతోషంతో అభివందనం చేశాడు. రుద్రగణాలు, సిద్ధులు, మహర్షులు కూడా బ్రహ్మకు నమస్కారం చేశారు. బ్రహ్మ అప్పుడు శివుని స్తుతించి, నీవు మాయామోహాలను దగ్గరకు రానివ్వని సర్వజ్ఞుడవు. మాయచేత మోహితులై కర్మలు చేసేవారు పొరపాట్లు చేస్తే క్షమించి, వారిని కాపాడాలి అని ప్రార్థించాడు. దక్షుని యజ్ఞం అర్థాంతరంగా ముగిసింది. యజ్ఞభాగానికి అర్హుడవైన నీకు భాగస్వామ్యం లేకుండా చేయడాన అది నాశనమయ్యింది. జరిగిన తప్పుకు క్షమించవలసిందని, మళ్ళీ యజ్ఞాన్ని ప్రారంభించి దక్షునికి ప్రాణదానం చేయాలని వేడుకొంటున్నాం. అలాగే భగునికి నేత్రాలు, భృగువుకు గడ్డాలు మీసాలు, పూషునికి దంతాలు దయచేయించాలి. కాళ్ళుచేతులు విరిగిన దేవతలకు రుత్విక్కులకు, గాయపడినవారందరికి తిరిగి ఆరోగ్యాన్ని, పోయిన అవయవాల్ని ప్రసాదించాలి, అని బ్రహ్మాదులు వినయంగా అర్థించారు.

అప్పుడు శివుడు సంతృప్తిచెంది, పామరులు చేసే అపరాధదోషాలు మనస్సులో పెట్టుకోను, అయినా బలంతో మదించి, గర్వంతో విర్రవీగేవారిని దండించి బలహీనులను రక్షించడం ధర్మం కాబట్టి దుష్టులను వారి అపరాధం కొలది దండిస్తాను అన్నాడు. తలకాలిపోయిన దక్షునికి మేకముఖం వస్తుంది. దేవతలకు పోయిన అవయవాలు తిరిగి వస్తాయి. భృగువుకు మేకపోతు గడ్డం వస్తుంది అని శివుడు ఆనతిచ్చాడు. అందరూ సంతోషించారు. తర్వాత దేవతలు, రుషులు, బ్రహ్మ, శివుడు అంతా కలసి దక్షయజ్ఞ వాటికకు వెళ్ళారు. దక్షుడు మేకతలతో నిద్రమేల్కొన్నట్లుగా లేచాడు. లేచి ముందున్న శివుని చూచి, వెనుకటిదంతా మరచి, నిర్మలహృదయంతో ఈశ్వరుని స్తుతించాడు.

మరణించిన కూతురును తలచుకొని దుఃఖించాడు. తర్వాత తమాయించుకొని, దేవా నేను అపరాధం చేశాను నీవు దండించావు కాని ఇది దండనం కాదు. నన్ను రక్షించావనే నేను భావిస్తున్నానని చెప్పి, బ్రహ్మ అనుమతితో మళ్ళా యజ్ఞం ప్రారంభించాడు. ప్రమధగణాలు చేసిన దోషాలు పోవడానికి బ్రాహ్మణులు విష్ణుదేవతా ప్రీతిగా కర్మలు చేయగా సర్వేశ్వరుడు ప్రసన్నుడై ప్రత్యక్షమయ్యాడు. నారాయణుని చూచి బ్రహ్మ, ఇంద్రుడు, శివుడు, దేవతలు మున్నగువారంతా లేచి భక్తితో నమస్కరించారు. వేరువేరుగా స్తుతించారు దక్షుని యజ్ఞం నిర్విఘ్నంగా కొనసాగింది.

తృప్తిచెందిన హరి దక్షునితో ఇలా అన్నాడు. నేను, బ్రహ్మ, శివుడు ఈ లోకాలకు కారణభూతులం నేను ఈశ్వరుడను. గుణమయమైన మాయలో ప్రవేశించి సృష్టి, స్థితి, విలయాలకు కారణమైన పనులు చేస్తూ ఆయా పనులకు తగినట్లు బ్రహ్మ అని, రుద్రుడని పేర్లు ధరిస్తాను. బ్రహ్మ, శివుడు, భూతగణాలు అన్నీ నాలోనివే. వాటిని నా కంటె వేరైనవని భావించేవాడు మూఢుడు. మనిషి ఒక్కడే. కాని కాళ్ళు, చేతులు మిగతా అవయవాలు దేనిపని అది చేస్తున్నా అవి వేరుకాదు, మనిషిలోని భాగాలే అని ఎలా గుర్తిస్తారో అలాగే నేను ఒక్కడినేనని, త్రిమూర్తులు వేరు వేరుగా లేరని భావించేవాడు కృతార్థుడవుతాడు.

అది విని దక్షుడు విష్ణుని పదకమలాలను భక్తితో పూజించాడు. యజ్ఞానికి వచ్చినవారంతా దక్షుని ఆశీర్వదించి ఎవరి ఇళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయారు. సతీదేవి హిమవంతునకు మేనకయందు పుట్టి, రుద్రుని వరించి భర్తను చేరింది. బృహస్పతి తన శిష్యుడైన ఉద్ధవునకు ఈ కథ చెప్పగా అతడు తనకు చెప్పాడని మైత్రేయుడు విదురునికి వినిపించాడు. మైత్రేయుడు ఇంకా ఇలా చెప్పాడు. బ్రహ్మ సంతానమైన సనకాదులు, నారదుడు, హంసుడు, అరుణి, రుభుడు, యతి, బ్రహ్మనిష్ఠాగరిష్ఠులై సంసారవిముఖులైనందున వారి వంశాలు అభివృద్ధికాలేదు ఇక ప్రతిసర్గం సంగ్రహంగా చెబుతాను. అధర్మునకు మృషయను భార్యయందు దంభుడు, మాయ పుట్టారు. అధర్మసంతానమైన వారిద్దరు దాంపత్యం చేయగా వారికి లోభుడు, నికృతి పుట్టారు. వారిద్దరి కలయికవలన క్రోధుడు, హింస పుట్టారు. వారికి కలి, దురుక్తి పుట్టి దంపతులయ్యారు. వారికి భయ, మృత్యువులనే జంట పుట్టారు. ఆ ఇద్దరికి యాతన, నిరయం (నరకం) అనే సంతానం కలిగింది. వీరంతా సంసారకారణమైన అధర్మవృక్షానికి శాఖలయ్యారు. శ్రేయస్సు కోరే ఏ మానవుడు కూడా వీరిని అనుసరించకూడదు.

# ధ్రువుని కథ

స్వాయంభువ మనువుకు ముగ్గురు కూతుళ్ళు, ఇద్దరు కుమారులని లోగడ చెప్పుకొన్నాం గదా. వారిలో కూతుళ్ళను గురించి, వారి పెళ్ళిళ్ళను గురించి కూడా చెప్పాను. ఇప్పుడు ఆయన కుమారులైన ప్రియవ్రతుడు, ఉత్తానపాదుల గురించి చెబుతాను. ఉత్తానపాదుడికి ఇద్దరు భార్యలు - సునీతి, సురుచి వారిపేర్లు. సునీతికి ధ్రువుడు, సురుచికి ఉత్తముడు జన్మించారు. ఉత్తానపాదుడికి సురుచి అంటే ఎక్కువ ఇష్టం. ఒకనాడు ఉత్తముడిని వళ్ళో కూర్చోబెట్టుకొని సురుచితో ముచ్చటలాడుతుండగా ధ్రువుడు అక్కడకొచ్చి తాను కూడా తండ్రి ఒడిలోకి ఎక్కాలని చూచాడు. కాని తండ్రి వాడిని నిర్లక్ష్యం చేశాడు. అప్పుడు సురుచి ధ్రువునితో, నీకు తండ్రి తొడపైకెక్కాలని కోరిక వుంటే నా గర్భాన పుట్టవలసింది, ఇప్పుడు నీకా అదృష్టం లేదని సవతికొడుకును ఈసడించింది. హరిని ఆశ్రయించు, ఆయన నా కడుపున పుట్టేలా వరం ఇస్తాడు. అప్పుడు నీ కోరిక నెరవేరుతుంది అని దెప్పిపొడిచింది. ఈ మాటలు ఈటెల్లాగా తన హృదయాన్ని తూట్లు పొడిచి బాధించగా ధ్రువుడు ఏడుస్తూ తల్లి అయిన సునీతి దగ్గరకు పోయాడు.

సునీతి జరిగినదంతా పరిచారికలవలన తెలుసుకొని ఏడుస్తున్న కొడుకుని ఓదార్చింది. కన్నీళ్ళు తుడిచి వళ్ళో కూర్చోబెట్టుకొని ముద్దాడింది. తన దుర్గతికి నిట్టూర్చింది. కొడుకుతో, ఎందుకేడుస్తావు నాయనా, మనం వెనకజన్మలో చేసుకొన్న పాపఫలితం ఇది, మీ తండ్రి నన్ను భార్యగా చూడకపోతే పోనీ, కనీసం దాసిగా కూడా చూడడం లేదు, అలాంటి తల్లి కడుపున పుట్టిన నీకు ఇంతకంటె మర్యాద ఏం జరుగుతుంది? సురుచి చెప్పింది నిజమే. తండ్రి ప్రేమ పొందాలంటే నీకు శ్రీహరి పాదాలే శరణ్యం. ఆమె చెప్పినట్లు హరిని ఆశ్రయించు, అని కుమారుడిని అనునయించింది. ఏకాగ్రచిత్తంతో ఆ పరమేశ్వరుని సేవించు. నీ దుఃఖం పోగొట్టగలవాడు ఆయనొక్కడే అని హితవు చెప్పింది.

తల్లి వాక్యాలు విని ధ్రువుడు ఇల్లు విడిచి బయలుదేరాడు. నారదుడు ఈ విషయం తెలుసుకొని అక్కడకు వచ్చాడు. అబ్బాయీ, సిరిసంపదలతో తులతూగే రాజమందిరం వదిలి ఒంటరిగా ఎక్కడకు పోతున్నావు అని అడిగాడు. సవతితల్లి సూటీపోటీ మాటలకు నా మనస్సు కలతచెందింది. నా హృదయం గాయపడింది. భగవంతుని ధ్యానించి నా మనోవ్యధను పోగొట్టుకొంటాను, అని ధ్రువుడు సమాధానమిచ్చాడు. అప్పుడు నారదుడు ఇలా అన్నాడు, బాబూ, నీవు చిన్నవాడివి. ఆటపాటలతో కాలక్షేపం చేయవలసిన వయస్సు నీది. మానావమానాలను మనస్సులో పెట్టుకోరాదు. సుఖదుఃఖాలు అనేవి

మనం చేసుకొన్న కర్మఫలితంగా ప్రాప్తిస్తాయి. కాబట్టి దైవవశాన వచ్చినవని తెలుసుకొన్నవాడు దుఃఖించక, ప్రాప్తించినదానితో తృప్తిచెందుతాడు. నీవు తల్లి చెప్పినట్లు దైవానుగ్రహం పొందడానికి తపస్సుచేస్తానంటావా, అది నీకు సాధ్యమయ్యే పనిగాదు. యోగీంద్రులు అనేక జన్మలలో ఎన్నో మార్గాలలో సాధన చేసి కూడా భగవంతుడిని పొందలేకపోయారు. అందుచేత ఈ వృథా ప్రయత్నం మానుకో. ఈ మాటలు ధ్రువుడి నిశ్చయాన్ని మార్చలేకపోయాయి క్షత్రియుడు అవమానాన్ని సహించలేడు. మహాత్మా, మీకు తెలియందేముంది? నా మనస్సుకిక శాంతి లేదు. నాకు దైవాన్ని చేరుకొనే మార్గం చూపి పుణ్యం కట్టుకోండని ధ్రువుడు నారదుని ప్రార్థించాడు. నారదుడప్పుడు, కుమారా, దైవప్రేరణవల్లే నీకీ బుద్ధిపుట్టింది, ఇక అప్రమత్తుడవై సదా హరిధ్యానంలో వుండు. మోక్షప్రాప్తికి హరిపాదాలను ఆశ్రయించి భజించడమొకటే మార్గం, అన్నాడు. యమునాతీరంలో మధువనం అనే పుణ్యస్థలం వుంది. అక్కడికి వెళ్ళు. నదిలో స్నానం చేయి. నారాయణునకు నమస్కరించు. యమనియమాలను పాటించు. ప్రాణాయామం చేయి. ఇంద్రియచాపల్యాన్ని వదిలిపెట్టు. స్థిరచిత్తంతో పురుషోత్తముడైన హరిని భజించు, పూజించు, సేవించు. ద్వాదశాక్షరమంత్రాన్ని పఠించు. మనోవాక్కాయకర్మలచేత భక్తియుక్తంగా పూజిస్తే ఆ సర్వేశ్వరుడు నీవు కోరింది యిస్తాడు అని ధ్రువునికి చెప్పగా ధ్రువుడు నారదునికి ప్రదక్షిణపూర్వకంగా నమస్కరించి మధువనానికి వెళ్ళిపోయాడు.

నారదుడు ఉత్తానపాదుడి దగ్గరకు వెళ్ళి రాజుచేత మర్యాదలు పొంది కుశలప్రశ్నలు వేశాడు. రాజా, నీవేదో బాధపడుతున్నట్లు కనిపిస్తున్నావు, కారణమేమిటి అని అడిగాడు. మునివరా, నా ఐదేళ్ళ కొడుకు నన్ను విడిచిపెట్టి వెళ్ళాడు. అడవుల్లో ఆకలిదప్పులకు ఎంత అల్లాడుతున్నాడో? లేక ఏ క్రూరమృగమైనా వాడిని తినివేసిందో అని బాధపడుతున్నానని రాజు చెప్పాడు. పిల్లవాడిని ఒళ్ళోకి తీసుకోకుండా అనాదరించాను. అవమానం భరించలేక వాడు అడవులకు పోయాడు అని తండ్రి వాపోయాడు. అప్పుడు నారదుడు, భూవరా, నీ కుమారుడిని గురించి విచారించవద్దు. ఆ బాలుడిని ఆర్తత్రాణపరాయణుడైన శ్రీమన్నారాయణుడే రక్షిస్తున్నాడు. జగన్నాథుని సేవించి నీ కుమారుడు లోకంలో ఏ రాజుకూ అందని ఉన్నతపదవిని సాధిస్తాడు. నీకు కీర్తిని తెస్తాడు. తిరిగి నీ వద్దకు వస్తాడు, అని ఉత్తానపాదుని ఊరడించాడు. అలా చెప్పి నారదుడు తన దారిన పోయాడు. ఉత్తానపాదుడు నారదుని మాటలు నమ్మి కుమారుని కోసం ఎదురుచూస్తూ పాలనా వ్యవహారాలు పట్టించుకోకుండా కాలం గడపసాగాడు.

ధ్రువుడు మధువనానికి చేరాడు.యమునలో స్నానంచేసి పవిత్రుడై సర్వేశ్వరుని

ధ్యానం చేయసాగాడు. మూడు దినాలకొకసారి రేగుపండ్లు, వెలగపండ్లు తిని దేహపోషణ చేసేవాడు. ఒక మాసం అలా హరిని భజించిన తర్వాత ఆరేసి దినాలకొకసారి ఆకులు, ఎండుగడ్డి తిని బ్రతికాడు. రెండవమాసం విష్ణు సమారాధన చేసిన తర్వాత తొమ్మిది దినాలకొకసారి కేవలం నీళ్ళు మాత్రమే త్రాగి, మూడవమాసంలో మాధవుని అర్చించి 12 దినాలకొకసారి గాలి మాత్రమే భక్షించి, నాల్గవమాసంలో పుండరీకాక్షుని సేవించి, అప్పటినుంచి శ్వాసకూడా నిలిపివేసి ఒంటికాలిపై నిలిచి పరమాత్ముని చింతిస్తూ ఐదవమాసం గడిపాడు. పురుషోత్తముని తన హృదయపద్మంలో నిలిపి, ప్రపంచాన్ని పూర్తిగా మరచి, ఏకాగ్రతతో ధ్రువుడు తపస్సు చేయగా ముల్లోకాలు కంపించాయి. తర్వాత బొటనవ్రేలిపై నిలిచి తపస్సు చేయగా భూమి సగం వంగింది. ఆ తర్వాత కొంతకాలానికి ఈశ్వరుడే చలించగా లోకాలన్నీ కదిలాయి. అప్పుడు లోకపాలకులందరూ భయపడి నారాయణునివద్దకు పరుగెత్తారు. చేతులు జోడించి ఇలాంటి ఆపద మున్నెన్నడూ రాలేదు, ఈ విపత్తునుంచి మమ్మల్ని కాపాడండని ప్రార్థించారు. అప్పుడు ఈశ్వరుడు వారికిలా చెప్పాడు. ఉత్తానపాదుని కుమారుడు తన చిత్తాన్ని నాలో ఐక్యం చేసి తపం చేస్తుండడం వల్ల మీకు ఊపిరి ఆడడం లేదు. ఆ తపస్సును నిలిపివేసేటట్లు చేస్తాను. మీరు భయపడక మీ నివాసాలకు తిరిగివెళ్ళండి అని ఆనతివ్వగా వారు ఈశ్వరునికి ప్రణామం చేసి వెళ్ళిపోయారు. తర్వాత హరి గరుడవాహనం ఎక్కి ధ్రువుని చూడ్డానికి మధువనం వెళ్ళాడు. ధ్రువుడు తన హృదయంలో నిలుపుకొన్న మూర్తి అదృశ్యమై పూర్ణరూపంలో తన ఎదుట నిలిచేసరికి ఆశ్చర్యానందాలతో కళ్ళవెంట నీరు కారగా శరీరం పులకరించగా తన్మయుడై భగవంతునికి మ్రొక్కి, స్తోత్రం చేయబోగా నోటమాట రాలేదు. ధ్రువుని ఉద్దేశం తెలుసుకొన్న హరి తన శంఖాన్ని అతని చెక్కిలికి అంటించగా ధ్రువుడు బహువిధాలుగా భగవంతుడిని స్తుతించాడు. అప్పుడు ఆ సర్వేశ్వరుడు, రాజకుమారా, నీ హృదయంలో నీవు ఏమి కోరుకొంటున్నావో నాకు తెలుసు. అది పొందరానిదైనా నీకు ఇస్తున్నాను అన్నాడు. అది ఎట్లాంటిదంటే గుంజకు కట్టిన గోవు తిరిగినట్లుగా, గ్రహనక్షత్ర తారాగణ జ్యోతిశ్చక్రం చుట్టూ నక్షత్రరూపాలైన ధర్మాగ్ని కశ్యపశక్రులు, సప్తర్షులు, తారకాసమేతులై తిరుగుతుండే శాశ్వతమైన ధ్రువస్థానం. 26 వేల సంవత్సరాల తర్వాత ఆ పదం నీకు లభిస్తుంది. ఈలోపల మీ తండ్రి అడవులకు పోగా, ఆ రాజ్యాన్ని నీవు ధర్మమార్గంలో పాలిస్తావు. మీ అన్న ఉత్తముడు వేటకోసం అడవుల్లోకి పోయి ప్రాణాలు పోగొట్టుకొంటాడు. అతనికోసం అతని తల్లి సురుచి అడవికి పోయి వెదుకుతూ మంటల్లో చిక్కుకొని కాలిపోతుంది. నీవు యజ్ఞయాగాలు చేసి,

సత్యమైన సుఖాలను అనుభవించి, అంత్యకాలంలో నన్నే తలచుకొంటూ శరీరాన్ని వదలి సప్తర్షిమండలంకంటె ఉన్నతమైన స్థానాన్ని పొందుతావు అని ధ్రువునికి చెప్పి గరుడగమనుడు వైకుంఠానికి వెళ్ళిపోయాడు.

అలా ధ్రువుడు తన మనస్సులోని కోరికలన్నిటిని సాధించినా తృప్తిచెందలేదని మైత్రేయుడు చెప్పగా, పెక్కు జన్మలకుగాని పొందరాని పదం ఒక్క జన్మలోనే పొంది కూడా ధ్రువుడు ఎందుకు తృప్తిచెందలేదని విదురుడు ప్రశ్నించాడు. దానికి సమాధానంగా మైత్రేయుడు ఇలా చెప్పాడు.

సవతితల్లి మాటలచేత గాయపడిన ధ్రువుని మనస్సులో తనకు జరిగిన అవమానం, తనకు కావలసిన ఉన్నతస్థానం స్థిరంగా నాటుకొని పోవడంవలన అతడు ప్రత్యక్షమైన భగవంతుడిని మోక్షం అడుగకపోతినే అని బాధపడ్డాడు. ఆరుమాసాలు తపస్సుచేసి పరమేశ్వరుని ప్రత్యక్షం చేసుకొన్నాను. మహాత్ములు, జితేంద్రియులు, యోగీశ్వరులు కూడా అనేక జన్మలు తపస్సుచేసిగాని సాధించలేని దైవదర్శనం నాకు లభించినా జన్మరాహిత్యం కలిగే ముక్తి కోరకుండా అశాశ్వతమైన కోర్కికలు కోరిన నావంటి దరిద్రుడు మరొకడు వుంటాడా? దేవతలు అసూయచేత నా బుద్ధిని భ్రష్టు పట్టించారు కాబోలు, నారదుడు చెప్పినట్టే జరిగింది అని ధ్రువుడు ఎంతో చింతించాడు. తర్వాత తన పురానికి బయలుదేరాడు.

కుమారుడు దైవసాక్షాత్కారం పొంది తిరిగి వస్తున్నాడని చారుల ద్వారా ఉత్తానపాదుడు తెలుసుకొన్నాడు. ముందు నమ్మలేకపోయాడు. కాని తర్వాత నారదుడు చెప్పిన మాటలు గుర్తు తెచ్చుకొని సంతోషించాడు. బ్రాహ్మణులు, కులపెద్దలు, బంధువులు, అమాత్యులను, భార్యలను, కొడుకును వెంటబెట్టుకొని మంగళవాయిద్యాలతో ధ్రువునికి స్వాగతం ఇవ్వడానికి నగరం వెలుపలికి వచ్చాడు. అక్కడ ధ్రువుడిని చూచి రథం దిగి కుమారుడిని ప్రేమతో ఆప్యాయంగా కౌగిలించుకొన్నాడు. మొగం నివిరాడు, తలను ముద్దాడాడు. చెక్కిళ్ళను గడ్డాన్ని పుణికాడు. ఆనందబాష్పాలతో తడిపి తనయుడిని ఆశీర్వదించాడు. ధ్రువుడు తండ్రి పాదాలపైన తలపెట్టి అభివాదనం చేశాడు. అలాగే తల్లులకు కూడా మ్రొక్కాడు. సవతితల్లి సురుచి పిల్లవాడిని పైకెత్తి నవ్వు ముఖంతో ఆలింగనం చేసుకొంది. సుఖంగా జీవించు అని ఆశీర్వదించింది. తర్వాత ఉత్తముడు కూడా సోదరుని కౌగిలించుకొని ఆనందబాష్పాలు కురిపించాడు. కన్నతల్లి సునీతి గాఢాలింగనంతో మక్కువదీర ముద్దాడింది. అక్కడికి వచ్చినవారంతా ధ్రువుడిని, అతని తల్లిని బహుధా ప్రశంసించారు. ఉత్తానపాదుడు కొడుకులిద్దరిని ఏనుగునెక్కించి రాజమార్గంగుండా తన

మందిరానికి తీసుకొనివచ్చాడు. దారిపొడవునా ధ్రువునిపై పువ్వులు, అక్షతలు, పవిత్రజలాలు చల్లి పౌరులు సత్కరించారు.

కొంతకాలానికి ధ్రువుడు యౌవన పరిపూర్ణుడు కాగా ఉత్తానపాదుడతనికి పట్టాభిషేకం చేసి రాజ్యాన్ని అప్పగించి తపస్సు చేసుకోవడానికి అడవులకు వెళ్ళిపోయాడు. ధ్రువుడు శుంశుమార ప్రజాపతి కూతురైన భ్రమిని వివాహం చేసుకొని ఇద్దరు కొడుకులను, వాయుపుత్రి అయిన ఇలను పెండ్లాడి ఒక కొడుకును, ఒక కూతురును కన్నాడు. సోదరుడైన ఉత్తముడికి పెండ్లికాలేదు. ఒకనాడు అతడు హిమాలయప్రాంతంలో వేటకోసం వెళ్ళగా ఒక యక్షుడు అతడిని చంపాడు. అతని తల్లి సురుచి కొడుకు కోసం వెదుక్కొంటూ అడవికి వెళ్ళి అక్కడ చెలరేగిన మంటలలో చిక్కుకొని చచ్చిపోయింది

ధ్రువుడు తన సోదరుడైన ఉత్తముని యక్షులు చంపారని విని వ్యాకులత చెందాడు, శోకించాడు. కోపంతో యక్షులపై దండెత్తాడు. చిత్రరథమెక్కి యక్షుల రాజధాని అయిన అలకాపురం చేరి సమరశంఖారావం చేశాడు. యక్షభటులు 13వేలమంది రణానికి సిద్ధమై వచ్చి ధ్రువుడిని ఎదుర్కొన్నారు. పరాక్రమశాలి అయిన ధ్రువుడు వాడిబాణాలు వేసి వారిని నొప్పించాడు. అప్పుడు యక్షులంతా ధ్రువుడిని చుట్టుముట్టి వివిధమైన ఆయుధాలతో అతడిని బాధించారు. ధ్రువుడు త్వరలోనే కోలుకొని భయంకరంగా యుద్ధం చేశాడు. బాణాల వర్షం కురిపించాడు. పెనుగాలికి మేఘాలు చెదిరిపోయినట్లు యక్షులు ఛిన్నాభిన్నమయ్యారు. తర్వాత వారు మాయలు ప్రయోగించి ధ్రువునికి ఏమీ కన్పించకుండా చేశారు. సముద్రఘోషవంటి శబ్దం వినపడ్డింది. ఆకాశమంతా కారుమేఘాలు క్రమ్మగా ఉరుములు మెరుపులతో వాతావరణం భయంకరంగా గోచరించింది. ఆకాశంనుంచి రాక్షసమాయవలన మలమూత్రాలు, రక్తమాంసాలు, పాములు, చక్రాలు, గదలు, శూలాలు ధ్రువునిపై వర్షించాయి. ఏనుగులు, సింహాలు, పులులు మందలు మందలుగా ఎదురొచ్చాయి. పర్వతాలు మునిగేటంత ఎత్తు అలలతో సముద్రం కనిపించింది. యక్షులు అలా అనేక భయంకరమైన అసుర మాయలు సృష్టించారు. దిగ్భ్రాంతి చెందిన ధ్రువుని కాపాడడం కోసం మునులు వచ్చి ఆ పరమేశ్వరుని కృపవల్ల నీ శత్రుమూకలు నశించుగాక అని ఆశీర్వదించారు. అప్పుడు ధ్రువుడు హరిని ప్రార్థించి నారాయణాస్త్రం సంధించగా మాయాంధకారం తొలగిపోయింది. వేలాది బాణాలు శత్రుమూకలను చెండాడాయి. ఎడతెరిపిలేకుండా బాణవర్షం కురవడంతో నిరపరాధులు, పుణ్యజనులు కూడా క్షతగాత్రులయ్యారు. లెక్కలేనంతమంది వికలాంగులయ్యారు. చాలామంది చనిపోయారు. దారుణమారణకాండతో రణరంగమంతా బీభత్సంగా

తయారయ్యింది.

అప్పుడు ధ్రువుని తాతగారైన స్వాయంభువుడు రుషిగణాల సమేతంగా అక్కడికి వచ్చి ధ్రువుని చూచి, వత్సా, నిరపరాధులను, పుణ్యజనులను వధించడం తగదు. కారణం లేని కోపం మంచిది కాదు. నీ సోదరుని చంపినందుకు పగబట్టి ప్రతీకారవాంఛతో ఇలా యుద్ధానికి ఒడిగట్టావు. ఒక్కడికోసం ఇంతమందిని చంపడం న్యాయం కాదు. మనుకుల ధర్మానికే ఇది విరుద్ధం. కాబట్టి ఈ మారణకాండ నిలిపివేయవలసిందని హితవు చెప్పాడు. ఇంకా ఇలా అన్నాడు.

"కుమారా, దేహాభిమానంతో పశుప్రాయులై భూతహింస చేయడం హరిభక్తులైన సాధువులకు తగదు. సర్వభూతాలలో ఆత్మరూపుడై వెలిగే ఆ పరమాత్ముని సేవించి భగవంతుని సాక్షాత్కరించుకొన్న పరమభాగవతోత్తముడవు ఈ పాపకర్మ చేయడానికి ఎందుకు పూనుకొన్నావు? చావు పుట్టుకలకు దైవమే కారణం. నీ సోదరుని చంపినవారు యక్షులని ఎందుకనుకొంటున్నావు? కోపం వచ్చినవానికి బుద్ధి నశిస్తుంది. అందువలన ఆవేశంలో చేసే పనులు తనకు, పరులకు కూడా హాని చేస్తాయి. నీ సోదరుని చంపారని వీళ్ళందరినీ ఈ విధంగా చంపినందుకు యక్షుల అధిపతి అయిన కుబేరునికి కోపం వచ్చింది. అతడిని స్తుతించి ప్రసన్నుడిగా చేసుకో. నీకు శుభం జరుగుతుంది."

స్వాయంభువుడు ఆ విధంగా ధ్రువునికి బోధించి, దీవించి రుషులతో కూడి వెళ్ళిపోయాడు. తాతగారి మాటలు శిరసావహించి ధ్రువుడు వైరాన్ని వదిలివేసి పోరు విరమించాడు. కోపాన్ని త్యజించి శాంతుడయ్యాడు. యక్షులకు అభయమిచ్చాడు. అప్పుడు యక్షుల అధిపతి కుబేరుడు అక్కడికి వచ్చి మీ పితామహుని ఆదేశంమేరకు యుద్ధవిరమణ చేసి విరోధాన్ని త్రెంచివేసినందుకు నిన్ను అభినందిస్తున్నాను అన్నాడు. నీ సోదరుడిని చంపింది యక్షులు కారు. ఈ యక్షగణాల్ని వధించింది నీవూ కావు. చావుపుట్టుకలకు కాలమే కర్త. కాలపురుషుడైన భగవంతుడిని సేవించు. నీకు శుభం అవుతుంది. నీవు పద్మనాభుని పాదారవిందాలను భక్తితో పూజిస్తావని నాకు తెలుసు. నీకేం కావాలో కోరుకో, వరమిస్తాను అన్నాడు. ఏ హరిస్మరణం చేత అజ్ఞానం నశిస్తుందో అట్టి హరిస్మరణం ఎల్లప్పుడూ నాలో స్థిరంగా నిలిచేలా అనుగ్రహించండి అని ధ్రువుడు అడగ్గా కుబేరుడు తథాస్తు, నీవు కోరినట్లే జరుగుతుంది అని వరమిచ్చి అదృశ్యమయ్యాడు. ధ్రువుడు తన పురానికి తిరిగివచ్చాడు.

ధర్మాన్ని రక్షిస్తూ దీనులను కాపాడుతూ కన్నతండ్రిలా ప్రజలను పాలిస్తూ ధ్రువుడు కీర్తిప్రతిష్ఠలను ఆర్జించాడు. యజ్ఞాలు చేసి బ్రాహ్మణులకు భూరి దక్షిణ లిచ్చాడు.

పురుషోత్తముడిని సదా భక్తితో పూజిస్తూ, సర్వభూతాలను సమానంగా ప్రేమిస్తూ అటు దైవాన్ని ఇటు ప్రజలను సంతోషపెట్టాడు. ఇలా 26వేల సంవత్సరాలు రాజ్యం చేసిన తర్వాత కొడుక్కి పట్టంగట్టి విరక్తుడై అడవులకు వెళ్ళిపోయాడు. విశాలానదిలో మంగళస్నానం చేసి బదరికావనంలో పద్మాసనంలో కూర్చుని కళ్ళుమూసుకొని శ్వాసను బంధించి భగవంతుడిని ధ్యానిస్తూ తపస్సుచేయసాగాడు. ఆ విధంగా తననుతాను మరచియున్న సమయంలో ఆకాశంనుంచి ఒక విమానం వచ్చి ఆయనవద్ద దిగింది. అందులోనుంచి చతుర్భుజులైన ఇద్దరు కిరీటాలు, గదలు, హారాలు, కుండలాలు ధరించిన యువకులు బయటకురాగా ధ్రువుడు లేచి భగవంతుని దూతలుగా వారిని భావించి దండప్రణామాలతో సత్కరించాడు. హరిసన్నిధిలో వుండే సునందుడు, నందుడు అనే పేర్లుగల ఆ ఇద్దరూ ధ్రువుని భక్తి మర్యాదలకు సంతసించి శుభమస్తు అని దీవించారు. రాజా, దేవదేవుని ఆజ్ఞానుసారం ఆయన సన్నిధికి నిన్ను తీసుకొని వెళ్ళడానికి వచ్చామని చెప్పారు. దేనిచుట్టూ సూర్య, చంద్ర, గ్రహ, నక్షత్ర, తారాగణాలు ప్రదక్షిణంగా తిరుగుతుంటాయో, దేన్ని నీ పితరులుగాని, అన్యులుగాని సాధించలేరో అట్టి దుర్జయమైన విష్ణుపదం నీకు లభించబోతున్నది. శ్రీహరి నీకోసం పంపిన ఈ దివ్యవిమానాన్ని ఎక్కవలసిందని అర్థించారు. ధ్రువుడు ఆ మధురవాక్యాలు వీనులకు విందు చేయగా, ఆనందంతో మంగళస్నానం చేసి, మునులకు వందనం చేసి, వారి ఆశీర్వాదాలు పొంది, విమానానికి ప్రదక్షిణ చేసి, సునంద, నందులకు నమస్కరించి హిరణ్మయరూపం ధరించి విమానాన్ని ఎక్కాడు. దేవతలు మంగళవాద్యాలు మ్రోయించి పూలవాన కురిపించారు. కిన్నరులు, గంధర్వులు మధురగానం చేశారు. ధ్రువుడికి తల్లి జ్ఞాపకం వచ్చింది. దిక్కులేని తల్లిని వదిలి దేవలోకానికి ఎలా పోయేదని చింతిస్తుండగా, సునంద నందులు తమకు ముందు వెళ్ళుతున్న విమానంలో వున్న తల్లిని చూపించారు. ధ్రువుడు సంతుష్టుడయ్యాడు. ఆ విమానం అలా అలా గ్రహమండలాన్ని దాటి, సప్తముని మండలాన్ని దాటి ఆవలవున్న హరిపదాన్ని చేర్చింది. ఆ విధంగా ధ్రువుడు విష్ణులోక నివాసాన్ని పొంది త్రిలోకచూడామణియై ప్రకాశించాడు.

అని చెప్పి మైత్రేయుడు, ధ్రువుని చరిత్రను శ్రద్ధతో ఉదయం, సాయంత్రం, అమావాస్య, పూర్ణిమ, ద్వాదశి తిథులందు, ఆదివారం, శ్రవణనక్షత్రాన సాయంసంధ్యలోను, సంక్రమణ సమయంలోను, అరిష్టం వచ్చినప్పుడు భక్తితో విన్న సజ్జనునికి కష్టాలన్నీ పోయి, భగవద్భక్తి కలుగుతుందని, వినిపించేవారికి దేవతానుగ్రహం లభిస్తుందని విదురునికి తెలియచేశాడు. అలా పరీక్షిత్తుకు శుకుడు ఎరిగించాదని సూతుడు శౌనకాది

మునులకు చెప్పాడు.

ధ్రువుని తదనంతరం అతని కుమారుడు ఉత్కలుడు జ్ఞానియై చెవిటి, మూగవానిలా, పిచ్చివానిలా వ్యవహరిస్తూ, రాజ్యాన్నిపరిపాలించడానికి ఇష్టపడనందున కులపెద్దలు, మంత్రులు అతని తమ్ముడైన వత్సరునికి పట్టం కట్టారు. వత్సరుని భార్య సర్వర్ధి. వారికి ఆరుగురు కొడుకులు పుట్టారు. అందులో పుష్పార్ణుడనేవానికి ఇద్దరు భార్యలు. వారిపేర్లు ప్రభ, దోష. ప్రభకు ప్రాతఃకాలం, మధ్యాహ్నం, సాయంకాలం అనే ముగ్గురు కొడుకులు, దోషకు ప్రదోష, నిశీథ, వేకువ అను కొడుకులు పుట్టారు. వేకువకు పుష్కరిణి అను భార్యయందు సర్వతేజుడనే కొడుకు పుట్టాడు. వానికి ఆకూతి అనే భార్యవలన చక్షువు అనే మనువు జన్మించాడు. వానికి నడ్వల అనే భార్యయందు పురువు, కుత్సుడు, త్రితుండు, ద్యుమ్నుడు, సత్యవంతుడు, రుతుడు, వ్రతుడు, అగ్నిష్టోముడు, అతిరాత్రుడు, ప్రద్యుమ్నుడు, శిబి, ఉల్ముకుడు అనే పన్నెండుమంది పుత్రులు కలిగారు. అందులో ఉల్ముకునికి పుష్కరిణి యందు అంగుడు, సుమనసుడు, ఖ్యాతి, క్రతువు, అంగిరసుడు, గయుడు అనే ఆరుగురు కుమారులు కలిగారు. అందులో అంగునికి సునీథ అనే ధర్మపత్నివలన వేనుడనే పుత్ర... ...ంచాడు. వేనుడు దుర్మార్గుడైనందున అంగుడు దుఃఖించి ఊరువిడిచి వెళ్ళిపోయాడు. దుష్టుడైన వేనుని మునులు శపించగా వాడు ప్రాణాలు విడిచాడు. అప్పుడు లోకం అరాజకమయ్యింది. శాంతిభద్రతలకు ముప్పు వాటిల్లింది. మునులు ఇదంతా చూచి వేనుని కుడిభుజాన్ని మథించగా నారాయణాంశతో పృథుడు జన్మించాడు అని మైత్రేయుడు చెప్పగా విదురుడు ఇలా అడిగాడు.

## వేనుని చరిత్ర

సాధువు, సజ్జనుడు అయిన అంగరాజుకు దుష్టసంతానం ఎలా కలిగింది? ఆ రాజు ఎందుకు రాజ్యాన్ని విడిచి వెళ్ళాడు? ధర్మకోవిదులైన మునులు వేనుడు ఏ పాపం చేశాడని శపించారు? పొరపాట్లు ఎన్నిచేసినా, పాలించే రాజును చంపకూడదు గదా!

నీకు వేనుని చరిత్ర వివరంగా చెబుతాను, విను, అని మైత్రేయుడు చెప్ప నారంభించాడు. అంగరాజు రాజరుషి. ఆయన అశ్వమేధయాగం చేశాడు. రుత్విక్కులు ఆవాహనం చేసినప్పటికి దేవతలు తమ హవిర్భాగం అందుకొనడానికి రాలేదు. ఎందుకిలా జరిగింది అని రుత్విక్కులు రాజును అడిగారు. అంగరాజు సదస్యులను తాను చేసిన అపరాధమేమిటో చెప్పండని అడిగాడు. అప్పుడా సదస్యులు రాజా, ఇది నీవిప్పుడు చేసిన తప్పుకాదు, పూర్వజన్మలో చేసిన పాపం అన్నారు. అందువలన నీకు సంతానం



90640

కలగలేదు. ఆ కారణంచేత దేవతలు యజ్ఞభాగాన్ని స్వీకరించలేదు. పుత్రకామేష్టి చేసి కొడుకుని కంటే దేవతలు నీ ఆహ్వానాన్ని మన్నిస్తారని వారు సూచించారు. వారు చెప్పినట్లే అంగుడు సంతానం కోసం యజ్ఞం చేశాడు. హోమగుండం నుంచి ఒక పురుషుడు బంగారుపాత్రలో పాయసం తీసుకొని ఉద్భవించాడు. రాజు ఆ పాత్రను గ్రహించి, వాసన చూచి భార్యకు ఇచ్చాడు. భార్య ఆ పాయసాన్ని తిని, భర్తతో సంగమించి, తక్షణమే గర్భం దాల్చి కుమారుని కన్నది. అతడే వేనుడు.

వేనుడు బాల్యంనుంచే పశువులను బాధించడం, జంతువులను చంపడం వంటి క్రూరకృత్యాలు చేసేవాడు. తండ్రి మందలించేవాడు. దండించేవాడు. అయినా వేనుని దుష్టచర్యలు ఆగిపోలేదు. అతడు పెరిగేకొద్దీ దుర్మార్గాలు కూడా పెరుగుతున్నాయి. తండ్రి కొడుకు దుష్ప్రవర్తన చూచి కుమిలిపోయాడు. సంస్కరించలేక శోకించాడు. ఇలాంటి పుత్రుడు వుండే కంటె పిల్లలు లేకపోవడమే ఉత్తమం అని భావించాడు. ఇక ఏమీ చేయలేక నిస్పృహ చెంది ఇంటిని, ఇల్లాలిని విడిచి రాత్రిపూట ఎటో వెళ్ళిపోయాడు. ఆ సంగతి అందరికీ తెలిసింది. ఎంత వెదికినా ఫలితం లేకపోయింది. అతడు ఇక తిరిగిరాడని నిశ్చయించుకొని, రాజులేని రాజ్యంలో అరాజకం ప్రబలుతున్నందున వేనుడికి పట్టాభిషేకం చేశారు.

రాజసింహాసనం, అధికారం అతడిని ఇంకా మదోన్మత్తుని చేయగా, మంచివారిని అవమానిస్తూ నిరంకుశంగా వ్యవహరిస్తూ పరిపాలన చేయసాగాడు. వేనుని రాజ్యంలో ధర్మానికి, నీతికి, న్యాయానికి నిలువ నీడలేకుండా పోగా అతడిని రాజుని చేసిన మునులే ఆందోళన చెందారు. పాముకు పాలుపోసి పెంచినట్లయ్యిందనుకొన్నారు. చివరిప్రయత్నంగా మంచిమాటలు చెప్పిచూద్దాం. వింటాడా సరే. లేకపోతే శాపాగ్నిలో దగ్ధం చేద్దాం అని నిర్ణయించుకొని మునులందరూ వేనుని దగ్గరకు వెళ్ళి, ఆశీర్వదించి, అతివినయంగా ఇలా చెప్పారు. రాజా, మా విన్నపం ఆలకించు. మనో వాక్కాయకర్మలవలన ధర్మాన్ని ఆచరిస్తే లోకంలో శోకం వుండదు. ధర్మమే నిన్నూ, ప్రజలనూ కాపాడుతుంది. ధర్మం నాశనం అయితే రాజుకు ఐశ్వర్యం నిలువదు. దుష్టులవలన దొంగలవలన బాధలు పడకుండా ప్రజలను రక్షిస్తూ, న్యాయమైన పన్నులు రాబట్టి పాలించే రాజు ఇహలోక పరలోకసౌఖ్యాలను పొందుతాడు. సర్వేశ్వరుడు యజ్ఞయాగాదులవల్ల ప్రీతిచెందుతాడు. దానివల్ల రాజుకు ప్రజకు క్షేమం కలుగుతుంది. నీ రాజ్యంలో యజ్ఞాలు చేయవలసిందిగా ఆదేశించు. దేవతలు తృప్తిచెంది నీ కోరికలు నెరవేరుస్తారు. దేవతలను తిరస్కరించగూడదు. వేదాల్లో చెప్పినట్లుగా ధర్మకార్యాలు చేయి అని చెప్పగా వేనుడు, మునులారా, మీరు

అధర్మాన్ని ధర్మం అంటున్నారు. మీకు మతి తప్పినట్లుంది. భూపాలుని రూపంలో వున్న ఈశ్వరుడిని నన్ను భజింపక మీకు ఇహపరసౌఖ్యాలు ఎలా వస్తాయి అని సమాధానమిచ్చి ఇంకా ఇలా అన్నాడు. పృధ్వీపతినైన నాలోనే బ్రహ్మ విష్ణు మహేశ్వరులు, సూర్యచంద్రులు, పంచభూతాలు, దేవతలు అందరూ నివసిస్తారు. అందువలన పూజించడానికి నా కంటె ఎక్కువ అర్హతగలవాడు మరొకడు లేడు. నన్నే భజించండి. ఆరాధించి నైవేద్యాలు అర్పించండి, అని ఆజ్ఞాపించాడు. మునులు ఈ మాటలు విని, ఈ పాపి ఇంకా బ్రతికి వుంటే లోకాలన్నీ భస్మం అవుతాయి. వీడు సింహాసనానికి అర్హుడు కాడు, ఎవరి అనుగ్రహంతో ఐశ్వర్యాన్ని పొంది రాజయ్యాడో ఆ శ్రీహరినే నిందిస్తున్నాడు. ఇలాంటి నీతిమాలినవానిని, ధర్మద్రోహిని బ్రతకనివ్వగూడదు అని ఆలోచించి, కోపంతో హుంకారం చేయగా వేనుడు మరణించాడు. తల్లి సునీథ శోకించి, యోగశక్తితో కుమారుని శరీరాన్ని కాపాడి వుంచింది.

ఒకనాడు మునివరులు సరస్వతీనదిలో స్నానం చేసి, నదీతీరంలో అగ్నిహోత్రాలు వెలిగించి, నియమానుసారం చేయవలసిన కర్మలు చేసి సత్పురుషుల కథలు చెప్పుకొంటూ వినోదిస్తుండగా భయంకరమైన అపశకునాలు కనిపించాయి. దిక్కులన్నీ దుమ్ముతో నిండిపోయాయి. ఇదే అదనని దొంగలు విజృంభించి జనాన్ని దోచుకొన్నారు. రాజు లేకపోవడంవల్ల అరాజకం ప్రబలింది. దౌర్జన్యాలు, హింసాకాండ పెచ్చుమీరిపోయాయి. సమదర్శనుడు, శాంతుడు, ఆలోచనాపరుడైన బ్రాహ్మణుడు అక్రమాలు, అన్యాయాలు జరుగుతుంటే, జనం బాధలు పడుతుంటే ఉపేక్షించి ఊరకుండరాదు. అలా ఊరకుంటే అతని తపస్సంతా వ్యర్థమైపోతుంది. కాబట్టి ఏం చేయాలి అని మునులు ఆలోచించి సింహాసనంపై ఎవరినన్నా కూర్చోబెట్టాలని నిశ్చయించారు. అంగుని వంశం మంచిది కాబట్టి దానినే పునరుద్ధరించాలనుకొన్నారు. కాని వేనునికి పిల్లలు లేనందున వేనుని కళేబరాన్ని తెచ్చి ఆ శవం యొక్క తొడలను మథించగా నల్లటి వళ్ళు, ఎఱ్ఱటికళ్ళు, రాగిజుట్టు, చప్పిడిముక్కుగల ఒక పొట్టివాడు ఉద్భవించాడు. మునులు వాడిని 'నిషీద' అనగా వాడు నిషాదుడు (బోయవాడు) అయ్యాడు. అతని వంశస్థులు కొండకోనలలో నివసించసాగారు. అప్పుడు మునులు ఆ శవంయొక్క భుజాలను మథించగా అందులోనుంచి ఒక జంట ఉద్భవించింది. లోకరక్షణార్థం నారాయణాంశతో పుట్టిన ఒక పురుషుడు, లక్ష్మీకళతో ఒక స్త్రీ అయిన ఆ జంటకు పృథువు, అర్చి .అని పేర్లు పెట్టారు.

# పృథుచక్రవర్తి చరిత్ర

పృథువు, అర్చి జన్మించగా ఆకాశాన్నుంచి అమరులు పూలవాన కురిపించారు. అమరావతిలో అప్సరసలు ఆనందంతో నృత్యం చేశారు. కిన్నరులు పాటలు పాడారు. దుందుభులు మ్రోగాయి. బ్రహ్మ, గరుడ గంధర్వ కిన్నర గణాలతో చూడ్డానికి వచ్చాడు. పిల్లవాని చేతులు, పాదాల్లోని రేఖలు పరిశీలించి వారంతా ఆశ్చర్యపోయారు. ఇతడు నారాయణాంశతో పుట్టాడని, ఆడపిల్ల లక్ష్మీకళతో పుట్టిందని వెల్లడించారు వాళ్ళిద్దరూ ఒకరినొకరు ప్రేమించుకొని పెళ్ళిచేసుకొన్నారు బ్రాహ్మణులు పృథువుకు పట్టాభిషేకం చేసి రాజ్యాన్ని అప్పగించారు. దేవతలు ఛత్రం, చామరం, ఆసనం, రాజదండం, కవచం మొదలైన రాజలాంఛనాలు, ఆభరణాలు బహూకరించారు. వందిమాగధులు స్తోత్రపాఠాలు చదివారు. అప్పుడు పృథుచక్రవర్తి, మీరు చెప్పిన గుణాలు నాలో లేవు, ఊరికే పొగడకండి, ఆత్మస్తుతి, పరనింద పనికిరాదు, భగవంతుడొక్కడే మీ స్తోత్రాలకు అర్హుడు అని వారించాడు.

అలా బ్రాహ్మణులచేత పట్టాభిషిక్తుడైన పృథువు రాజ్యపాలన చేస్తుండగా భూమి సారహీనమై, పంటలు పండనందున ప్రజలు ఆకలిబాధచేత అల్లాడజొచ్చారు. ఆకలితో నకనకలాడుతూ బక్కచిక్కిన ప్రజలు చక్రవర్తికి మొరపెట్టుకొన్నారు. మాకింత అన్నం పెట్టి కాపాడు ప్రభో అని వేడుకొన్నారు. చక్రవర్తికి కోపం వచ్చింది. ధనువు తీసుకొని బాణాన్ని ఎక్కుపెట్టాడు. ఆయన కోపాన్ని చూచి భూమి కంపించింది. గోరూపం ధరించి పరుగెత్త నారంభించింది. చక్రవర్తి వెంటబడి తరిమాడు. ఇక ఎటూ పోలేక భయంతో వణుకుతూ భూదేవి దైన్యంగా, మహాత్మా, నీవు ధర్మప్రభుడవు, భూతదయాపరుడవు, దీనబాంధవుడవు, నిష్కారణంగా, ఏ పాపం చేయని నన్ను చంపడానికి ఇలా ఎందుకు వెన్నంటి తరుముతున్నావు? తప్పుచేసినా స్త్రీలను చంపకూడదని గదా ధర్మజ్ఞులు చెబుతుంటారు, అని ప్రార్థించింది. పైగా నేను దృఢశరీరంతో ఈ జనావళినంతా మోస్తున్నాను. నీట మునుగకుండా కాపాడుతున్నాను. నీవిప్పుడు నన్ను చంపితే ఈ ప్రజల గతి ఏమవుతుంది? అని ప్రశ్నించింది.

అప్పుడు పృథుచక్రవర్తి అవనితో ఇలా అన్నాడు. నీవు నా ఆజ్ఞను ఉల్లంఘిస్తున్నావు. యజ్ఞాలలో నీ భాగం నీకు ముట్టజెప్పినా అనుభవిస్తున్నావే కాని ధాన్యాదికాలను పెంపుచేయడం లేదు. గోరూపం ధరించి ఎప్పుడూ గడ్డి మేస్తూ తిరుగుతున్నావే గాని పాలు ఇవ్వడం లేదు. పూర్వం బ్రహ్మ ఓషధీబీజాలను నీయందుంచాడు. వాటిని నీ

దేహంలోనే దాచిపెట్టుకొని ప్రజలకు లేకుండా చేసిన మూఢురాలివి. దుష్టురాలివై అపరాధం చేశావు ప్రజల కడుపు మాడుస్తున్నావు. నిన్నిప్పుడు నా బాణాలతో కొట్టి చంపి నీ మాంసంతో ప్రజల ఆకలి దీరుస్తాను. భూతదయలేక ప్రాణులను బాధించేవారు ఆడైనా మగైనా నపుంసకుడైనా సరే చంపడంలో తప్పులేదు, పాపం రాదు. కాబట్టి నిన్నిప్పుడు చంపి ముక్కలు ముక్కలు చేసి ప్రాణికోటికి సమర్పిస్తాను, అని భీషణాకారంతో యముడిలా మీదకు వస్తున్న చక్రవర్తిని భూదేవి ఇలా ప్రార్థించింది.

మహాప్రభూ! నువ్వు పరమాత్మవి, పరమపురుషుడవు. మాయను ధరించి ఈ విధంగా నానావిధ దేహాలలో ప్రత్యక్షమవుతుంటావు. సకలజీవకోటికి ఆధారభూతంగా నీవే నన్ను నిర్మించావు నా యందు నాలగురకాల భూతసృష్టి చేశావు ఇప్పుడు నీవే ఆయుధాన్ని ధరించి నన్ను చంపపూనుకొన్నావు. నేనింక ఎవరిని శరణువేడుకోగలను? నీటిలో మునిగి రసాతలంలో వున్న నన్ను ఆదివరాహరూపధారివై నీటిపైకి తెచ్చి నిలబెట్టావు. నాలో వున్న నిఖిల ప్రజావళిని రక్షించడానికి పృథుచక్రవర్తి రూపంలో వచ్చావు. ఇప్పుడు పాలకోసం ఉగ్రరూపంతో నన్ను చంపబోవడం విచిత్రంగా వుంది. మహాత్మా, నాకు అభయమివ్వు. క్రోధాన్ని ఉపశమించి కరుణించు. నీకు నమస్కరిస్తున్నాను అని పృథుని నుతించి ప్రాధేయపడింది. తర్వాత నాదొక విన్నపం వినవలసిందని ఇలా చెప్పింది. తేనెటీగలు పూవుకు హాని కలుగకుండా దానిలోని మకరందాన్ని తీసుకొంటున్నట్టుగా పురుషుడు సారాంశాన్ని గ్రహించాలి. మునీశ్వరులు, తత్త్వమెరిగినవారు ఐహికాముష్మిక ఫలప్రాప్తికోసం, అంటే ఈ లోకంలోను పరలోకంలోను సుఖాలను పొందడానికి సేద్యం, హోమం వంటివి చేయాలని చెప్పారు. విద్వాంసుడైనా సరే వీటిని ఆచరించందే ఫలం చేకూరదు.

మునుపు బ్రహ్మచేత సృష్టింపబడ్డ ఓషధులను దుష్టబుద్ధులు, చంచలమనస్కులు, దుర్మార్గులు తినివేస్తుంటే నేనుకాని, పాలించే ప్రభువులుకాని అడ్డుకొని మాన్పించలేదు. అందువలన చోరబాధలు ఎక్కువై నేను కృశించిపోయాను. యజ్ఞయాగాదులు చేసేవారు లేకపోవడంతో నాకు ఆదరణ లభించక, లోకమంతా దొంగలమయం కావడం చూచి, యజ్ఞసిద్ధికోసం ఓషధులను నేనే మ్రింగి జీర్ణంచేసుకొన్నాను. వాటిని తిరిగి పొందడానికి ఒక ఉపాయం వుంది. నాకొక దూడను, పాలుపితికేవాడిని, పాలపాత్రను చూపించినట్లయితే ప్రాణుల కోరికమేరకు వారికి బలాన్నిచ్చే పాలు, అన్నం మొదలైనవాటినన్నిటిని ఇస్తాను భూమి హెచ్చుతగ్గులుగా వున్నందున వర్షపునీరు అంతటా వ్యాపించడం లేదు. కాబట్టి భూతలాన్ని సమస్థాయిలో వుండేటట్లు చేయండి అని భూదేవి చెప్పగా పృథుచక్రవర్తి

అందుకు సంతోషంతో సమ్మతించాడు. మనువును దూడగా చేసి, తన అరచేతినే పాత్రను చేసి, పృథువు సకల ఔషధులను పితికాడు. అదేవిధంగా మిగిలినవారు కూడా తమ తమ కోర్కెలను తీర్చుకొన్నారు. రుషులు బృహస్పతిని దూడను చేసి ఛందోమయ క్షీరాన్ని, దేవతలు ఇంద్రుని దూడను చేసి బంగారుపాత్రలో తేజం, బలం, వీర్యం ఇచ్చే పాలను, దైత్యులు, దానవులు ప్రహ్లాదుని దూడగా చేసి ఇనుపపాత్రలో రకరకాల మద్యాన్నిచ్చే పాలను, అప్సరసలు, గంధర్వులు విశ్వావసును దూడగా చేసి సంగీతక్షీరాన్ని పిదికారు. పితృదేవతలు గవ్యాన్ని, సిద్ధులు అణిమాది సిద్ధి అనే క్షీరాన్ని పిదకగా సర్పాలు, నాగులు విషరూపక్షీరాన్ని, పశువులు తృణమనే క్షీరాన్ని, ఈ విధంగా సమస్త చరాచరవర్గం భిన్నరూపాలైన తమ ఆహారాలను పితికారు. తర్వాత పృథుచక్రవర్తి తన బాణాలచేత మహోన్నత పర్వతశ్రేణుల్ని పొడిపొడిగా చూర్ణంచేసి భూమండలాన్ని సమతలం చేశాడు. ప్రజలకు తండ్రిగా, జీవనప్రదాతగా పాలించాడు. గ్రామాలు, పట్టణాలు, కోటలు, పేటలు నిర్మించాడు. ప్రజలు సుఖశాంతులతో మనుగడ సాగించారు.

రాజర్షి అయిన పృథు చక్రవర్తి అశ్వమేధ యాగాలు ఒక నూరు చేయాలని దీక్ష పూనాడు. బ్రహ్మావర్తంలోని సరస్వతీ నదీతీరంలో మనుక్షేత్రంలో యాగం చేసినట్లయితే విశేష ఫలం లభిస్తుందని తలచి అక్కడ వరుసగా యాగాలు చేయనారంభించాడు. అందుకోసం భూమి సమస్త పదార్థాలను ఇచ్చింది. చెట్లు చెరకురసం, ద్రాక్షరసం, పాలు, పెరుగు, నెయ్యి, మజ్జిగ, పానకం మొదలైనవాటిని వర్షించగా అవి నదులై పారాయి. సముద్రాలు రత్నాలను ఇచ్చాయి. పర్వతాలు తినేవి, త్రాగేవి, నాకేవి, పీల్చేవి అనే భేదం గల నాలుగు రకాల ఆహారపదార్థాలను కురిపించాయి. లోకపాల సమేతంగా సకలజనులు కానుకలు తెచ్చి ఇచ్చారు. అలా వైభవంగా 99 అశ్వమేధ యాగాలు చేసి నూరవయాగం మొదలుపెట్టగా అది సహించలేక అమరేంద్రుడు యాగాశ్వాన్ని దొంగిలించి తీసుకొని పోయాడు. అప్పుడు పృథుని పుత్రుడు విల్లంబులతో దేవేంద్రుని వెంటబడ్డాడు. ఇంద్రుడు మారువేషంలో వున్నాడు. ఒళ్ళంతా బూడిద పూసుకొన్నాడు. తలనిండా జడలు, మెళ్ళో ఎముకల దండ, చూడ్డానికి శివుడిలా పవిత్రంగా కనిపించేసరికి అతడిని చంపడం ధర్మంకాదేమో అనే సందేహం కలిగింది. పృథుని పుత్రుడు ఇంద్రునిపై బాణం వేయలేకపోయాడు. అప్పుడు అత్రిముని ఇతడు యజ్ఞహంత ఇతడిని జయించు అని చెప్పగా వీరుడైన పృథుకుమారుడు ఏనుగుపై లంఘించే సింహంలా ఇంద్రునిపై విరుచుకుపడగా అతడు అశ్వాన్ని విడిచిపెట్టి అదృశ్యమయ్యాడు. యజ్ఞాశ్వాన్ని తీసుకొని కుమారుడు, తండ్రి యజ్ఞం చేస్తున్న పుణ్యభూమికి తిరిగివచ్చాడు. అక్కడున్న రుషులు

అతని శౌర్యాన్ని మెచ్చుకొని జితాశ్వుడనే పేరు పెట్టారు.

ఇంద్రుడు యజ్ఞాశ్వాన్ని హరించడానికి వేసుకొని విసర్జించిన అమంగళకరమైన మాయారూపాల్ని మూఢజనులు సొంతం చేసుకొన్నారు. నగ్నవేషాలు ధరించినవారు జైనులు, కాషాయవస్త్రాలు ధరించినవారు బౌద్ధులు, జటలు, అస్థికలు, బూడిద ధరించినవారు కాపాలికులు అయ్యారు. ఈ వృత్తాంతాన్ని తెలుసుకొన్న పృథుచక్రవర్తి ఆగ్రహోదగ్రుడై విల్లంబులు తీసుకొని ఇంద్రునిమీద బాణం వేయడానికి ఉద్యుక్తుడు కాగా, రుత్విక్కులు యజ్ఞం చేయడానికి దీక్షపూని కూర్చున్నవాడు యజ్ఞపశువును దప్ప ఎవరినీ హింసించగూడదు, చంపకూడదని హితవు చెప్పారు. అయితే ఇంద్రుడిని శిక్షించడానికి ఒక ఉపాయం చెబుతాం విను. వీర్యవంతాలైన మంత్రాలచేత ఆహ్వానిస్తే అతడు ఇక్కడికి వస్తాడు. అప్పుడు పట్టుకొని హోమాగ్నికి ఆహుతిగా వేల్చినట్లయితే అతని వీర్యం తగ్గిపోయి భ్రష్టుడవుతాడు అని చెప్పి రుత్విక్కులు స్రుక్కులు చేతబట్టి హోమం చేస్తుండగా బ్రహ్మ అక్కడకు వచ్చాడు.యజ్ఞంలో మీరు ఆవాహన చేసే దేవతలందరికీ అధిపతి, భగవంతుని అంశ అయిన ఇంద్రుడిని చంపడం ధర్మ వ్యతిరేకం, యజ్ఞాన్ని చెడగొట్టాలని అతడు ప్రయత్నిస్తున్నా చూస్తుండాలే గాని ప్రతీకారచర్యలకు పూనుకోకూడదు. ఈ పృథువుకు 99 యాగాలు చేసిన ఫలం లభిస్తుంది అని అక్కడున్నవారితో చెప్పాడు.

తర్వాత బ్రహ్మ పృథుచక్రవర్తితో ఇలా అన్నాడు. మానవేశ్వరా! మోక్షధర్మం ఎరిగిన నీకు ఈ యాగాలు ఇక చాలు. దేవేంద్రునిపై కోపాన్ని మరిచిపో. మీ ఇద్దరికి శుభం అవుతుంది. నూరవ యజ్ఞం విఫలమవడం దైవనిర్ణయంగా భావించి శాంతం వహించు. ప్రతీకారవాంఛతో మనస్సును కలుషితం చేసి పాడుచేసుకోకు. దానివల్ల అజ్ఞానంలో పడతావు. నీ యజ్ఞాన్ని చెడగొట్టడానికి ఇంద్రుడు పాషండధర్మాలను కల్పించి ప్రజల మనస్సులను పెడత్రోవ పట్టిస్తున్నాడు. దానివల్ల ధర్మం నశిస్తుంది. కాబట్టి యజ్ఞాన్ని విరమించాలి. వేనుడు చేసిన అపరాధాలవలన నశించిన ధర్మాలను పునరుద్ధరించడానికి నారాయణాంశతో జన్మించావు. అది గుర్తుకు తెచ్చుకో. దేనికోసం పుట్టావో ఆ లక్ష్యాన్ని మరువకు. ధర్మాన్ని కాపాడడం నీ కర్తవ్యం అని ఉపదేశించగా పృథుచక్రవర్తి అందుకు సమ్మతించి దేవేంద్రునితో వైరం విడనాడి స్నేహితుడయ్యాడు. అప్పుడు బ్రాహ్మణులు దక్షిణలు పొంది చక్రవర్తిని దీవించారు. దేవతలు వరాలిచ్చారు. జనాలు సంతోషం ప్రకటించారు.

ఆ సమయంలో యజ్ఞభోక్త, యజ్ఞవిభుడు, భగవంతుడు అయిన సర్వేశ్వరుడు ఇంద్రునితో కలిసి అక్కడకు వచ్చి పృథువుతో ఇలా అన్నాడు. అశ్వమేధయాగాన్ని భంగం

చేసినందుకు ఇంద్రుడు క్షమాపణ కోరుతున్నాడు కాబట్టి అతడిని క్షమించు. సత్పురుషులు దేహాభిమానులు కారు కాబట్టి వారు ఇతరులకు హాని తలపెట్టరు. అదీగాక ఈ శరీరం అవిద్య, కామ, కర్మలవలన ఏర్పడుతున్నదని తెలిసిన జ్ఞాని దేహాభిమానాన్ని త్యజిస్తాడు. దేహంవల్ల వచ్చిన ఇల్లు, భార్య, పిల్లలు బంధుమిత్రుల పట్ల మమకారం పెంచుకోడు. స్వధర్మాన్ని అనుష్టిస్తూ కోర్కెలన్నిటిని విడిచిపెట్టి, శ్రద్ధతో నన్ను భజించునట్టివాని మనస్సు క్రమంగా ప్రసన్నమవుతుంది. అట్లా ప్రసన్నమనస్కుడై త్రిగుణాల ప్రభావానికి లోనుగాక సమదర్శనుడైనవాడు నాదైన సమవస్థారూపమైన శాంతిని పొందుతాడు. దాన్నే కైవల్యపదం అంటారు. అందువలన సుఖదుఃఖాలలో సమచిత్తుడవై లోకాన్ని పాలించు, ధర్మాన్ని రక్షించు. రాజులకు ప్రజలను రక్షించడమే పరమధర్మం. ప్రజలు చేసే పుణ్యంలో ఆరవవంతు పాలకునికి లభిస్తుంది. అదేవిధంగా ప్రజలను కాపాడని రాజు తన పుణ్యాన్ని ప్రజల కిచ్చి వారుచేసే పాపాలఫలాన్ని అనుభవిస్తాడు. కాబట్టి సాంప్రదాయికంగా వస్తున్న ధర్మాన్ని చేపట్టి అర్ధకామాల్ని అనుభవించు. కాని ధర్మార్థకామాలపై మోహం పెంచుకోవద్దు. యోగం, తపం, యజ్ఞం - వీటివల్ల సులభంగా లభించని నేను సమచిత్తులైన సజ్జనుల హృదయాలలో నివసిస్తాను. నీవు ఇంద్రియాలను వశపరచుకొన్న సద్గుణశాలివి. అందుకనే నీకు ప్రత్యక్షమయ్యాను. నీకేం కావాలో కోరుకో, వరం ఇస్తాను, అన్నాడు శ్రీమన్నారాయణుడు.

పృధుచక్రవర్తి అమృతసమానమైన ఆ మృదుమధుర వాక్యాలు పరమాత్మ నోటి వెంట విని ఆనందపరవశుడయ్యాడు క్షమించుమని కోరుతూ తన పాదాలకు వినయంతోను, సిగ్గుతోను మ్రొక్కుతున్న సురేంద్రుని పైకి లేవనెత్తి అక్కున చేర్చుకొన్నాడు అతడితో విరోధం మరచిపోయి ప్రేమతో పలకరించాడు. తర్వాత విష్ణుమూర్తిని భక్తిశ్రద్ధలతో అర్చించాడు. దేవా, సత్పురుషుడు ప్రాపంచిక సుఖాలకోసం నిన్ను వరం ఎలా కోరుతాడు? నీ కీర్తిని విని ఆనందించలేని మోక్షమైనా నాకక్కరలేదు. అందువలన నీ ఘనకీర్తిని వినడానికి పదివేల చెవులు ఇవ్వు అదే నా మనస్సులోని కోరిక. ఇంతకుమించి నాకే వరమూ వద్దు అని విన్నవించగా నారాయణుడు సంతుష్టి చెందాడు. రాజా, నీకు దైవానుగ్రహంవలన సద్బుద్ధి కలిగింది. దానివలన నీకు అచంచలమైన భక్తి కలిగి మాయను దాటడానికి సహాయపడుతుంది అప్రమత్తుడవై నేను ఆదేశించినట్లు పనులు చేసినట్లయితే సకలశుభాలు ప్రాప్తిస్తాయి అని ఆశీర్వదించి, పృధువుచేత సత్కారాలు పొంది అచ్యుతుడు వైకుంఠసదనానికి వెళ్ళిపోయాడు. చక్రవర్తి తన పురానికి తిరిగివచ్చాడు.

గంగాయమునల మధ్య నివసిస్తూ, ప్రారబ్ధకర్మను అనుభవిస్తూ, సర్వదేశాల్లోనూ తన

ఆజ్ఞ చెల్లుతుండగా, సప్తద్వీపాలతో కూడిన భూమండలాన్ని పృథుచక్రవర్తి పరిపాలించి కీర్తిప్రతిష్ఠలను ఆర్జించాడు. కొంతకాలం తర్వాత దీక్షపూని దీర్ఘయాగం చేశాడు. రాజరుషులు, దేవరుషులు, పితరులు, బ్రహ్మరుషులు వచ్చి పూజలందుకొన్నారు. చక్రవర్తి సభామధ్యంలో చుక్కలలో చంద్రుడిలా నిలబడి ఇలా ఉపన్యసించాడు. లోకంలో ధర్మబద్ధంగా ప్రజలను పాలించడానికి, వర్ణాశ్రమధర్మాలు నిలబెట్టడానికి బ్రహ్మ నన్ను నియోగించాడు. ప్రజలు ధర్మబద్ధంగా జీవించేలా రాజు శాసించాలి. అలాచేయక కేవలం ధనాపేక్షతో పన్నులు సేకరించే రాజుకు ప్రజల పాపాలు సంక్రమిస్తాయి. ప్రజలు అసూయారహితులై, చేసే పనులన్నిటిని వాసుదేవునికి అర్పిస్తూ ధర్మాన్ని ఆచరించాలి. ఇదే నేను మీనుంచి కోరేది. అదే నాకు సంతోషదాయకం. అని చక్రవర్తి చెప్పగా, వాసుదేవార్పణబుద్ధితో ధర్మాలను ఆచరించాలి అని చెబుతున్నావు, బాగానే వుంది కాని, యధార్థానికి వాసుదేవుడనే వాడొకడు వున్నాడా అని సభాసదులు ప్రశ్నించారు. యజ్ఞాధిపతి అయిన అఖిలేశ్వరుడున్నాడని కొన్ని మతాలు అంగీకరిస్తున్నాయి. అయితే కొందరు లేడంటున్నారు గదా అంటారేమో చెబుతాను వినండి అని చక్రవర్తి ఇలా అన్నాడు.

ఆ మహానుభావుడు జగన్నిర్మాత. జగత్తు మనకు కనిపిస్తున్నది గదా! చిత్రవిచిత్రమైన ఈ ప్రపంచసృష్టి, దాన్ని నడిపించే నిపుణత వాసుదేవుడు లేకుండా సాధ్యమవుతుందా? కర్తఅయిన ఈశ్వరుడు లేడు, కర్మవలన అంతా పుడుతున్నదంటారా? ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు, ధ్రువుడు, మాతాత అంగరాజు మరియు వినుతికెక్కిన పృథ్వీపతులు, బ్రహ్మ, శివుడు, ప్రహ్లాదుడు, బలిచక్రవర్తి ప్రభృతులకు వారి వారికి తగినట్టు స్వర్గాన్ని, మోక్షాన్ని ఇచ్చిన ఘనత ఆ విష్ణువుది కాదా? హీనులు, దురాత్ములు, ధర్మవిదూరులు అయిన వేనుని వంటి వారికి తప్ప తక్కినవారికి వారు కోరిన కోర్కెలు ఆ ప్రభువే గదా ఇస్తున్నది. జ్ఞానులందరికి ఇది అనుభవైకవేద్యం. అందువలన వాసుదేవుడు లేడనుట పొసగదు. నారాయణుడు జగత్తుకు ఆధారం. ఆ ఈశ్వరునికి సమమైనవారు, అధికులైనవారుగాని లేరు. ఆయన అద్వితీయుడు. కర్మవలన ప్రపంచం పుడుతుంది, పెరుగుతుంది, నశిస్తుంది అంటే అది అసాధ్యం. ఎందుకంటే కర్మ, బుద్ధి చలనంలేని జడపదార్థాలు. ప్రపంచాన్ని కల్పించే సామర్థ్యం వాటికి లేదు. ఈ జగత్తుకు కారణం, కార్యం కూడా ఆ విష్ణువే. అందువలన మీరందరు నిర్మలహృదయంతో, మనోవాక్కాయ కర్మలా, ఆ దేవదేవుని పాదపద్మాలు పూజించి మీకు కావలసిన వాటిని పొందండి.

అలాగే ధర్మపరులు, జితేంద్రియులు అయిన బ్రాహ్మణోత్తముల సేవచేసినట్లయితే

ఉత్తమగుణాలు అలవడుతాయి. జ్ఞానం వస్తుంది. అంతఃకరణం శుద్ధి అవుతుంది. కైవల్యం ప్రాప్తిస్తుంది. కాబట్టి బ్రాహ్మణులను పూజించాలి. సేవించాలి, అర్చించాలి. అద్దంలో విశ్వమంతా ప్రతిబింబించినట్లు వేదపారాయణులైన బ్రాహ్మణులలో వేదం ప్రతిఫలిస్తుంది. అట్టివారి పాదధూళి తలదాల్చినట్లయితే సర్వపాపాలు పోతాయి. సద్గుణాలు పట్టుబడతాయి. అందువలన విప్రుల కాలి ధూళిని నేనూ నా కిరీటంలో ధరిస్తాను అని పలికిన పృధుచక్రవర్తిని చూచి పితరులు, దేవతలు, బ్రాహ్మణులు, సత్పురుషులు సంతుష్టులై అభినందనలు తెలిపారు. మహారాజా! నీవలన, ఎన్నో ఘోరపాపాలు చేసిన వేనుడు నరకాన్నుంచి బయటపడ్డాడు. పుత్రుడిద్వారా లోకాన్ని జయిస్తారని చెప్పిన వేదవాక్యం నీ పట్ల నిజమయ్యింది. పరమభాగవతుడైన ప్రహ్లాదుని గన్నందున హిరణ్యకశిపుడు నారాయణునితో వైరం పెట్టుకొన్నా నరకానికి పోలేదు. పరమపావనమైనది నీ చరిత్ర అని పృధువును పొగిడి ఆశీర్వదించారు. ఆ మహాపురుషుడిని ఈశ్వరసమానుడవని నమస్కరించారు.

ఆ సమయాన బాలసూర్యుల్లా ప్రకాశిస్తూ సనకాది మహామునులు ఆకాశమార్గాన నెమ్మదిగా అక్కడకు వచ్చారు. పృథువు, సభాసదులందరితో కలిసి లేచి నిలబడి వారికి వందన ప్రణామాలు చేశారు. వారికి తగిన ఆసనాలిచ్చి, శాస్త్రానుసారం పూజించి, వారి కాళ్ళు కడిగిన నీళ్ళు తలమీద చల్లుకొన్నాడు. ఏ పూర్వపుణ్యఫలమో మీ దర్శనభాగ్యం కలిగింది. నేను ధన్యుడనయ్యాను. మీరు ఆత్మస్వరూపులు. అందువలన కుశలప్రశ్నలకు తావులేదు. ఈ సంసారంలో వున్నవారికి వేగంగా క్షేమం కలగాలంటే ఏం చేయాలో దయచేసి చెప్పండి. భక్తులను అనుగ్రహించడం కోసం ఈశ్వరుడు ఈ లోకంలో మీవంటి సిద్ధుల రూపంలో సంచరిస్తుంటాడు అని చెప్పగా సనత్కుమారుడు ఇలా అన్నాడు.

విశ్వశ్రేయస్సు, సర్వభూతహితం, ధర్మరక్షణకోరే నీవు సాధుశ్రేష్ఠులు అడిగే ప్రశ్ననే అడిగావు. నీకు మోక్షసాధనకు మార్గం చెబుతాను విను. నారాయణుని పాదధ్యానం వలన నీ బుద్ధి ఇప్పటికే పరిణతి చెంది పరమాత్మయందు ఆసక్తి, ప్రపంచంపట్ల వైరాగ్యం కలిగాయి. ఆత్మకాని వస్తువుల పట్ల అనురాగం లేకపోవడం, నిర్గుణబ్రహ్మ అయిన ఆత్మపట్ల అపేక్ష - ఈ రెండూజనుల క్షేమానికి శాస్త్రాలు నిర్ణయించిన మార్గాలు. ఈ రెండు భక్తియోగంవల్ల నరుడికి సిద్ధిస్తాయి. ఆ యోగాగ్నిలో చిత్తాన్ని దహింపచేయాలి. మనస్సు గనుక నశిస్తే భేదదృష్టి అనేది వుండదు. అంతటా పరమాత్మనే దర్శిస్తాడు. ఈశ్వరుడు అంతర్యామి రూపంలో అంతటా, అన్నిటా ప్రకాశిస్తున్నాడు కాబట్టి యీ విశ్వమంతా నారాయణుని స్వరూపంగా గ్రహించు. ఈశ్వరుని, హృదయంలో నిలుపుకొని,

భక్తితో సేవించు.

ఈ విధంగా యోగివల్లభుడైన సనత్కుమారుడు పృధుచక్రవర్తికి బ్రహ్మతత్త్వాన్ని, మోక్షమార్గాన్ని బోధించాడు. అప్పుడా చక్రవర్తి మునీశ్వరుడికి కృతజ్ఞతాభివందనలు తెలియజేశాడు. భగవంతుని అనుగ్రహం వలన మీరు ఇక్కడికి వచ్చి నాకు తత్త్వజ్ఞానాన్ని ఉపదేశించారు. వేదాంతవేద్యులై భగవద్భక్తిని ఉపదేశించే మీ వంటి పుణ్యాత్ములకు ఇవ్వదగిన గురుదక్షిణ ఏముంటుంది? అంజలి ఘటించడం మినహా నేను మీకు చేయగలిగినదేమీ లేదు అని చెప్పగా సనకాదులు సంతసించి ఆకాశమార్గాన తిరిగి తమ నివాసాలకు వెళ్ళిపోయారు. తదనంతరం పృథువు కర్మలను, ధర్మాలను బ్రహ్మార్పణబుద్ధితో చేస్తూ, అహంకార, మమకారాలను విసర్జించి, ప్రపంచసుఖాలపట్ల నిరాసక్తుడై జీవించాడు. అధ్యాత్మయోగనిష్ఠుడయ్యాడు. అతనికి ఐదుగురు పుత్రులు జన్మించారు - వారు, విజితాశ్వుడు, ధూమ్రకేశుడు, హర్యశ్వుడు, ద్రవిణుడు, వృకుడు. వయస్సు మళ్ళగానే రాజ్యాన్ని కొడుకుల కప్పగించి భార్యతో సహా తపోవనానికి వెళ్ళిపోయాడు. అడవుల్లో కందమూలాలు, ఫలాలు తింటూ బహుకాలం ఉగ్రతపస్సు చేశాడు. ఆ తర్వాత ఆకులు, గడ్డిపోచలు తిని కొంతకాలం, ఆ తర్వాత కేవలం నీరు మాత్రమే త్రాగి కొంతకాలం, ఆ తర్వాత కేవలం గాలిమీదనే బ్రతుకుతూ తపం ఆచరించాడు. మండువేసవిలో పంచాగ్నుల మధ్యనిలబడి, వానాకాలంలో వస్త్రమే లేక ఆరుబయట నిలిచి, చలి వణికించే కాలంలో గొంతువరకు నీళ్ళలో నిలబడి, శిశిరంలో నేలమీద పడుకొని కఠోర తపస్సు గావించాడు. ఆ తపంవలన ఆయన చేసిన కర్మఫలాలన్నీ నశించాయి. కామక్రోధాది అరిషడ్వర్గాలను జయించాడు. బంధనాలన్నిటిని త్రెంచుకొన్నాడు. ఇంద్రియాలను వశపరచుకొన్నాడు. సనత్కుమారుడు చెప్పినట్లు యోగనిష్ఠతో సర్వేశ్వరుని భజించాడు. జ్ఞానవైరాగ్యాలచేత బ్రహ్మనిష్ఠుడై శరీరాన్ని వదలి ముక్తిపొందాడు.

పృధుని భార్య అర్చి సుకుమారి, మహాపతివ్రత. భర్తకు చేదోడువాదోడుగా వుంటూ ఆయనకు పరిచర్యలు చేసి చిక్కిపోయింది. భర్తమరణంతో దిక్కుతోచక విలపించింది. భర్తకు అంత్యక్రియలు చేయడానికి పూనుకొని చితిని తయారుచేసింది. నదిలో స్నానం చేసి, పతికి ఉదకదానక్రియలు చేసి, భక్తితో దేవతలను అర్చించింది. శవానికి అగ్నిసంస్కారం చేసింది. తర్వాత ముమ్మాటు చితికి ప్రదక్షిణ చేసి, చితిపైకెక్కి భర్తపాదాలను వడిలో పెట్టుకొని సహగమనం చేసింది. ఆ మహాసాధ్వి అలా చేయడం చూచి దేవాంగనలు భర్తలతో కలసి పూలవాన కురిపించారు. అప్సరసలు నాట్యం చేశారు. కిన్నరులు పాటలు పాడారు. సహగమనం చేసినందుకు దేవతలందరూ

మెచ్చుకొన్నారు. అర్చి ఆ విధంగా భర్తతోపాటు వైకుంఠానికి వెళ్ళింది. ఈ పృథుని పుణ్యకథ చదివినా, విన్నా, వ్రాసినా పాపం నశించి పుణ్యలోకాలకు వెళ్ళుతారని మైత్రేయుడు విదురునికి చెప్పాడు.

పృథుని అనంతరం ఆయన కుమారుడు విజితాశ్వుడు పృథివీపతి అయ్యాడు. అంతర్ధానుడనే పేరుతో ప్రసిద్ధుడయ్యాడు. తన తమ్ములు నలుగురికి నాలుగు దిక్కులను పంచి యిచ్చాడు. పృథువుతో సమానంగా శౌర్యధైర్యాలతో రాజ్యాన్ని పాలించిన విజితాశ్వునికి శిఖండిని అనే భార్యయందు పావకుడు, పవమానుడు, శుచి అని ముగ్గురు కొడుకులు పుట్టారు. వశిష్ఠుని శాపంవలన త్రేతాగ్నులే అలా జన్మించారు. తర్వాత ఆత్మప్రభావంవలన మరల అగ్నులై వెళ్ళిపోయారు. తదనంతరం అతడు నభస్వతి అనే రెండవభార్యవలన హవిర్ధానుడనే కుమారుని కన్నాడు. విజితాశ్వుడు దీర్ఘయాగం చేశాడు. ఆత్మదర్శనం చేశాడు. యోగసమాధిలో ముక్తిపొందాడు. అతని తర్వాత హవిర్ధానుడు హవిర్ధాని అను భార్యవలన ఆరుగురు కొడుకులను కన్నాడు. వారిలో పెద్దవాడు బర్హిష్మదుడు. అతడు ఎప్పుడూ యజ్ఞాలు చేస్తూ, భూమండలమంతా యజ్ఞశాలలు నిర్మించాడు. యజ్ఞాలకు అవసరమయ్యే దర్భలను విరివిగా పెంచాడు. భూమినంతా యజ్ఞవాటికగా చేశాడు. అందువలన అతనికి ప్రాచీనబర్హి అనే పేరు వచ్చింది. అతడు సౌందర్యఖని, సముద్రపుత్రి అయిన శతధృతి అనే కన్యను పెళ్ళిచేసుకొన్నాడు. వారిద్దరికీ ఐదుగురు కొడుకులు కలిగారు. వారే ధర్మశాస్త్రపారగులైన ప్రచేతసులు. ప్రజాసృష్టికోసం తపం చేయవలసిందని తండ్రి ఆజ్ఞాపించగా వారు వనానికి బయలుదేరారు. దారిలో రుద్రుడు ప్రత్యక్షమై ఏది ఉపదేశించాడో దాన్ని జప, ధ్యాన, పూజాదికాల ద్వారా సేవిస్తూ నారాయణుని పదివేల సంవత్సరాలు పూజించారు అని మైత్రేయుడు చెప్పగా విదురుడు ఇలా అడిగాడు.

ప్రచేతసులకు వనమార్గంలో శివుడెలా కలిశాడు? ప్రసన్నుడై ఆయన ఏమి వుపదేశించాడు? జీవరాశులకు శివునితో కలయిక దుర్లభం కదా! ప్రచేతసులకు అట్టి భాగ్యం ఎలా కలిగింది? అంతా నాకు సవిస్తరంగా చెప్పండి, అనగా మైత్రేయుడు మళ్ళీ చెబుతున్నాడు.

ప్రచేతసులు తండ్రిమాట శిరసావహించి తపస్సు చేయడానికి బయలుదేరి వెడుతుండగా సముద్రమంత విశాలమైన సరస్సు కనిపించింది. అది మనోహరంగా నిర్మలంగా వుంది. అందులో ఒక దివ్యపురుషుడు సాక్షాత్కరించాడు. మనోరంజకమైన గంధర్వగానం, వేణునాదం వినిపించింది. ప్రచేతసులు ఆశ్చర్యంతో చూస్తుండగా ఆ మహాపురుషుడు

సరోవరంనుంచి బయటికి వచ్చాడు. కాంచనవర్ణంతో, మూడు కళ్ళతో ప్రసన్న ముఖమండలంతో వున్న ఆ దివ్యపురుషుని రుద్రునిగా గుర్తించి ప్రచేతసులు ఆయన పాదకమలాలకు భక్తి వినయాలతో మ్రొక్కారు. భక్తవత్సలుడైన హరుడు ప్రీతిచెంది వారితో ఇలా అన్నాడు.

రాజకుమారులారా! మీ మనస్సులోని ఆలోచన నేను గ్రహించాను. మీకు శుభం అవుతుంది. మీపైవున్న అనుగ్రహంచేత నేను ప్రత్యక్షమయ్యాను. సూక్ష్మం, త్రిగుణాత్మకం అయిన నా ప్రకృతికంటె, భూమిపై నివసించే జీవులకంటె భిన్నమైనది వాసుదేవుని ప్రకృతి. ఆ దేవుని పాదాలు భక్తితో భజించేవారంటే నాకు చాలా ఇష్టం. వారికి నేనంటే ఇష్టం. స్వధర్మాన్ని నిష్ఠగా పాటించే పురుషుడు అనేక జన్మలలో చేసిన పుణ్యవిశేషంవలన బ్రహ్మపదవిని పొంది, తదనంతరం నన్ను పొంది మా అధికారం ముగిసినాక నేనూ, దేవతలూ ఏ హరిపదానికి చేరుతామో అట్టి పదాన్ని భాగవతుడైన పురుషుడు తనంతటతానే పొందుతాడు గాబట్టి భాగవతులైన మీరంటే నా కిష్టం. అందువలన పవిత్రమై, మంగళకరమూ, శ్రేయస్కరమూ అయిన నా ఉపదేశం శ్రద్ధగా వినండి. సృష్టి ప్రారంభంలో బ్రహ్మ తన పుత్రులకు చెప్పిన శ్రీహరిస్తోత్రం మీకు తెలియజేస్తాను.

ఈశ్వరా! నీవు పరిపూర్ణ ఆనందస్వరూపుడవు. సర్వాత్మకుడవు. ఆత్మవేదులకు నిన్ను స్తుతించడం ఆనందకరం. లాభదాయకం కాబట్టి మాకు ఆ ఆనందం కలిగేలా ఆశీర్వదించు. నీ కిదే నా నమస్కారం అని ముందుగా బ్రహ్మ హరిని ప్రార్థించాడు. తర్వాత ఈ స్తోత్రాన్ని సనకసనందనాదులైన తన కుమారులకు వినిపించాడు. ఈ స్తోత్రాన్ని గురువుద్వారా ఉపదేశం పొంది నిత్యం మనస్సులో జపించాలి. సర్వేశ్వరుని ధ్యానం చేయాలి. పూజించాలి. ఏకాగ్రచిత్తంతో వాసుదేవపరాయణుడై ఎవరైతే ఈ స్తోత్రాన్ని జపిస్తారో వారు ఈ సంసారసాగరాన్ని దాటుతారు. మీరు కూడా జపతపాల ద్వారా మీమనస్సులోని కోరికలను నెరవేర్చుకోండి అని ఆదేశించి సదాశివుడు అంతర్ధానమయ్యాడు. ప్రచేతసులు రుద్రుడు ఉపదేశించిన అచ్యుతస్తవం జపిస్తూ లెక్కలేనన్ని సంవత్సరాలు నీటిలో నిల్చుని ఉగ్రమైన తపస్సు చేశారు.

ఆ సమయంలో ప్రాచీనబర్హివద్దకు అధ్యాత్మవేది అయిన నారదుడు వచ్చి, రాజా, నీవుచేసే ఈ దీర్ఘకాల యజ్ఞంవలన నీవు కోరే శ్రేయస్సు లభించదని చెప్పగా రాజు ఇలా అన్నాడు. మునీంద్రా! నేనీ కర్మకాండలో మునిగి ఆత్మజ్ఞానానికి దూరమయ్యాను. మోక్షాన్ని విస్మరించాను. నాకిప్పుడు కర్మబంధాల్ని నాశనం చేసే జ్ఞానాన్ని ఉపదేశించాలని ప్రార్థిస్తున్నాను. భార్యాపిల్లలు, సిరిసంపదలు - ఇవే జీవితపరమార్థం అనుకునే

మతిహీనుడు సంసారచక్రంలో పడి తిరుగుతాడుగాని మోక్షాన్ని పొందలేడు గదా, అనగా నారదముని ఇలా అన్నాడు. ఈ యాగాలలో దయాదాక్షిణ్యాలు లేకుండా ఎన్నివేల పశువులను బలి ఇచ్చావో గమనించు. చచ్చిన ఆ పశువులు, నువ్వెప్పుడు చస్తావా, పరలోకంలో నిన్నెప్పుడు కొమ్ములతో కుమ్మి పొడుద్దామా అని ఎదురుచూస్తున్నాయి. అలాంటి సంకటాన్ని నివారించే పురంజన చరిత్ర చెబుతాను, శ్రద్ధగా విను.

పూర్వకాలంలో పురంజనుడనే ఒక రాజు వుండేవాడు. అతడు పురంకోసం వెదుకుతూ భూగోళమంతా కలయదిరిగాడు. తనకు అనుకూలమైన పురం ఎక్కడా కనిపించలేదు. ఒకనాడు హిమాలయపర్వత సానువులలో సంచరిస్తుండగా ఆయనకు ఒక పురం కనబడింది. నవద్వారాలు, పెద్దపెద్ద వీధులు, క్రీడామందిరాలు, ఉద్యానవనాలు, ఉన్నతభవనాలు, జలయంత్రాలు మొదలైన అలంకారాలతో ఆ పురం శోభిల్లుతున్నది. ఆ పురం వెలుపల తోటలో ఆయనకు ఒక ప్రౌఢస్త్రీ కనబడింది. ఆమెవెంట 10మంది సఖులున్నారు. ఐదుతలల సర్పం ఆమెకు కాపలా వున్నది. సర్వాభరణభూషిత అయిన ఆమె ముఖంలో లక్ష్మీకళ వుట్టిపడుతున్నది. ఆ యువతిని చూచి రాజు ఆకర్షితుడయ్యాడు. దగ్గరకొచ్చి పలుకరించాడు. నీపేరేమిటి? ఎవరి అమ్మాయివి? నీ ప్రక్కన వున్నవారెవరు? ఈ వనంలో ఎందుకున్నావు? అని ప్రశ్నించాడు. ఆ తర్వాత తన మనస్సులోని మాట చెప్పాడు. నీ రూపలావణ్యాలు చూచి సమ్మోహితుడినయ్యాను. నన్నునుగ్రహించి నా హృదయసింహాసనాన్ని అధిష్ఠించవలసిందని కోరాడు. ఆ యువతి రాజు మాటలకు సంతోషించింది. చిరునవ్వుతో సమాధానమిచ్చింది. నా పేరు, కులం, గోత్రం అడగవద్దు. అవి నాకు తెలియవు. ఈ పురంలో వుంటానుగాని దాన్ని నిర్మించినదెవరో తెలియదు. నా ప్రక్కనున్నవారు నా సఖులు. ఈ సర్పం నేను నిద్రించినపుడు మేల్కొని వుండి పురాన్ని కాపాడుతుంది. నా భాగ్యవశాన నీవిక్కడికి వచ్చావు. ఈ నవద్వారపురాన్ని నీవు ఏలుకో. అందుకు తగినవారు నీకంటె ఘనులు ఎవ్వరూ లేరు. ఇక్కడ నేనిచ్చే సుఖాలను అనుభవిస్తూ వుండిపో. నీకంటె ప్రేమించదగ్గవాళ్ళు నాకెవరూ లేరు. ఈ విధంగా ప్రేమగా మాట్లాడిన ఆ వనజాక్షిని పురంజనుడు వరించాడు. ఇద్దరూ పురంలో ప్రవేశించి సుఖంగా జీవించారు. ఆ పురానికి తొమ్మిది ద్వారాలున్నాయి. తూర్పున ఐదు, పడమట రెండు, ఉత్తరాన ఒకటి, దక్షిణాన ఒకటి కాగా వీటిలో ఏడు పైదిక్కున రెండు క్రిందిదిక్కున వున్నాయి. వాటిద్వారా వేర్వేరు విషయాలను గ్రహించడానికి ఈశ్వరుడొకడు వున్నాడు. ఆ పురాన్ని పాలించే పురంజనుడు విషయసుఖాలను అనుభవిస్తూ కర్మాసక్తుడు, కామప్రేరితుడు అయి బుద్ధి అనే పట్టపుదేవివల్ల వంచితుడయ్యాడు. ఆవిడ ఆడించినట్లల్లా

ఆడుతూ పారవశ్యం చెందాడు. చెప్పినట్లల్లా చేస్తూ, అనుకరిస్తూ పెంపుడుజంతువులా ప్రవర్తిస్తూ కాపురం చేస్తున్నాడు. ఒకనాడు ఐదుగుర్రాలు పూన్చిన రథంపై పురంనుంచి బయలుదేరాడు. పంచప్రస్థం అనే వనానికి వెళ్ళి, బుద్ధిని విడిచి ధనుర్బాణాలు ధరించి మృగాలను వేటాడడానికి అడవి అంతా గాలించాడు. దయలేకుండా రాక్షసుడిలా అనేక మృగాలను హతమార్చాడు. వేటాడడం రాజధర్మంగదా అది రాక్షసవర్తన ఎలా అయ్యింది అంటే అది కేవలం తన సంతోషం కోసం చేసే హింసగాబట్టి శాస్త్రసమ్మతం కాదు. రాజు యజ్ఞానికి తగిన పశువులను, శ్రాద్ధం పెట్టడానికి మాత్రం వధించవచ్చుననే నియమం వుంది. అందువలన జ్ఞానియైనవాడు హింసను ఆచరించడు. పురంజనుడు చంపదగిన, చంపగూడని మృగాలనెన్నిటినో చంపి వేట చాలించి రాజమందిరానికి తిరిగి వచ్చాడు. స్నానంచేసి భోజనం గావించి విశ్రాంతిగా పడుకొన్నాడు. భార్యపై మనస్సుపోయింది. శృంగారభావాలు రాగా భార్యకోసం వెదికాడు. అంతఃపురస్త్రీలను పిలిచి నా ప్రియమైన భార్య ఏమయ్యింది, ఎక్కడకు పోయింది చెప్పండని అడిగాడు. అప్పుడా స్త్రీలు, రాజా, అదిగో నీభార్య అక్కడ నేలపైన కొంగైనా పరచుకోకుండా పొరలుతున్నది అని చూపించారు. పురంజనుడు ప్రియురాలిని వళ్ళోకి తీసుకొని ప్రేమగా మాట్లాడి, ఇట్లా ఎందుకున్నావు, నాదేమైనా తప్పుంటే క్షమించు అని బ్రతిమాలాడు. నిన్ను విడిచి వేటకువెళ్ళడం పొరపాటే, నన్ను మన్నించు, కరుణించు అని ఆమె మనస్సును రంజింపజేసే విధంగా మృదుమధురంగా వేడుకొన్నాడు.

భర్త మాటలతో ఆమె కోపం మాయమయ్యింది. నవ్వుతూ లేచివెళ్ళి చక్కగా స్నానం చేసింది. మంచి వస్త్రాలు కట్టింది. భూషణాలు ధరించింది. మోహనాకారంతో అలంకరించుకొని పతి దగ్గరకు వచ్చింది. అతడు ప్రేమతో ఆమెను కౌగిలించుకొన్నాడు. ఇద్దరూ శృంగారకేళిలో ఓలలాడారు. ఆ విధంగా ఆ ఇద్దరూ పగలు, రేయి అనేది తెలియక రమించారు. భార్యతో శృంగారమే జీవితపరమార్ధంగా భావిస్తూ, కామవాంఛలతో చిత్తం కలుషితం కాగా, కాలగమనాన్ని మరిచిన పురంజనునికి యౌవనకాలం క్షణంలో సగంగా గడిచిపోయింది. అతనికి 111మంది కొడుకులు, 110 మంది కూతుళ్ళు పుట్టారు. అతనికి ఆయువు సగం అయిపోయింది. కొడుకులకు, కూతుళ్ళకు తగినవిధంగా వివాహాలు చేశాడు. ఒక్కొక్క కుమారునికి నూర్గురు కొడుకులు పుట్టారు.

పురంజనుడప్పుడు దీక్షపూని నీకు మాదిరిగానే పెక్కు యాగాలు చేశాడు. పశువులను విరివిగా ఆహుతి గావించాడు. కోరికలు తీరడానికి దేవతలను, పితరులను భజించాడు. ఇలా ఆత్మహిత కర్మలు వదిలి కుటుంబక్షేమమందే ఆసక్తి చూపుతూ జీవిస్తుండగా అతనికి

విరోధి అయిన గంధర్వరాజు దండెత్తివచ్చి పురాన్ని ముట్టడించాడు. పురాధ్యక్షుడైన ప్రజాగరుడు వారిని ఎదుర్కొని నూరేళ్ళు పోరాడాడు. అతని బలం క్రమంగా క్షీణించింది. పురంజనుడు చింతాక్రాంతుడయ్యాడు. ఇది ఇలా వుండగా కాలపుత్రిక అనే కామిని, దౌర్భాగ్యదేవతగా ప్రసిద్ధిపొందినది, భయుడనే యవనేశ్వరుడు, అతని అన్న ప్రజ్వారుడు అనేవారితో కలిసి పురంజనపురంపై దాడిచేశారు. యవనులు నవద్వారాలగుండా పురంలో ప్రవేశించి పీడించడం మొదలుపెట్టారు. ఒకవైపు గంధర్వులు, మరోవైపు యవనులు చేరి దోచుకోవడంతో పురంజనుడు తేజాన్ని కోల్పోయాడు. కాలకన్య అతని వీర్యాన్ని హరించివేసింది. పెళ్ళాం, పిల్లలను చూచుకొని అతడు దుఃఖించాడు. ప్రతీకారం చేసే శక్తిలేక పురాన్ని వదిలివేయాలని నిశ్చయించుకొన్నాడు. అప్పుడు ప్రజ్వారుడు వచ్చి పురాన్ని తగులబెట్టాడు. అతనికి మతిపోయింది. అవయవాలు శిథిలమయ్యాయి. అయినా చావని అహంకారమమకారాలచేత పీడితుడై ఇప్పుడు నేను చచ్చిపోతే నా భార్య అనాథ అవుతుంది. పిల్లలను ఎలా సాకుతుంది అని విచారించసాగాడు. కొడుకులనుగన్న తల్లిగాబట్టి ఇల్లాలుగా తన బాధ్యత నెరవేరుస్తుందో లేక సహగమనం చేస్తుందో? నిరాశ్రయులై కొడుకులు, కూతుళ్ళు ఎలా జీవిస్తారో? అని ఆలోచిస్తుంటే అతనికి ఆపుకోలేని దుఃఖం పొంగివచ్చింది. ఆ సమయంలో భయుడు వచ్చి అతడిని పశువును మాదిరిగా ఈడ్చుకొని పోయాడు. కాపలాగా వున్న సర్పం విడిచిపోవడంతో ఆ పురం పూర్తిగా నశించింది. ప్రకృతిలో కలిసిపోయింది. బలవంతుడైన యవనుడు పురంజనుడిని బరబరా పరలోకానికి ఈడ్చుకొనిపోయాడు. అక్కడ, పూర్వం అతనిచేత హింసింపబడిన యజ్ఞపశువులు కోపంతో అతడిని ఇనుపకొమ్ములతో తూట్లు పడేటట్లు పొడిచి బాధించాయి. గొడ్డళ్ళతో నరికి గాయపరిచాయి. ఇలా చాలాకాలం పరలోకంలో అతడు నానాబాధలు పడ్డాడు. భార్యనే ఎప్పుడూ మనస్సులో తలచుకోవడంవలన తర్వాత జన్మలో విదర్భరాజు గృహంలో ఆడపిల్లగా పుట్టాడు.

విదర్భరాజకుమారిని పాండ్యరాజైన మలయకేతనుడు పెళ్ళిచేసుకొన్నాడు. ఏడుగురు కొడుకులను, ఒక కూతురును కన్నాడు. ధృతవ్రత అనే పేరుగల ఆ కన్యను అగస్త్యుడు వరించాడు. వారికి దృఢచ్యుతుడు పుట్టి మునీంద్రుడయ్యాడు. మలయకేతనుడు కొడుకులకు కూడా పెళ్ళిళ్ళు చేశాడు. ఒక్కొక్కడికి పదికోట్లమంది కొడుకులు పుట్టారు. మలయకేతనుడు తన రాజ్యాన్ని కొడుకులకు పంచియిచ్చి శ్రీమన్నారాయణుని గురించి తపస్సు చేసుకోడానికి అడవులకు వెళ్ళాడు. అతనివెంట భార్య కూడా భోగభాగ్యాలన్నిటిని విడిచి వెళ్ళింది. పాండ్యరాజు చంద్రమసా, తామ్రపర్ణీ, నవోదకా అనే నదులలో స్నానం చేసి,

కందమూలాలు భక్షిస్తూ తపస్సు చేయడానికి కూర్చున్నాడు. ఆకలిదప్పులు, ఇష్టానిష్టాలు, శీతోష్ణాలు, సుఖదుఃఖాలను సమంగా చూస్తూ జయించాడు. శరీరాన్ని కృశింపజేశాడు. బ్రహ్మంలో చిత్తాన్ని నిలిపి, ఇంద్రియాలను జయించి, కదలకుండా నూరేళ్ళు తపస్సు చేశాడు. అతని భార్య సాధ్వియై భర్తకు పరిచర్యలు చేస్తున్నది. ఇలా వుండగా ఒకనాడు పతిపాదాలమీద చేయివేయగా చల్లగా తగిలింది. ఆయనలో ప్రాణం లేదు. అది చూచి ఆమె ఘొల్లుమన్నది. దగ్గరలో ఎవరూ లేరు. భర్త గతించాడు. అనాథ అయ్యింది. ఏమిచేయాలిరా దేవుడా అని ఆమె గుండెలు బ్రద్దలయ్యేలా ఏడ్చింది. తర్వాత ఏడుపు దిగమ్రింగి భర్త శవానికి చితిపేర్చింది. అగ్నిని రగిల్చింది. భర్తతోపాటు సహగమనం చేయడానికి ప్రయత్నిస్తుండగా అక్కడికొక బ్రాహ్మణుడు వచ్చాడు. ఆమెను అనునయపూర్వకంగా పలకరించాడు. తన పరిచయం చేసుకొంటూ, సృష్టికి పూర్వం నేను నీకు ముఖ్య స్నేహితుడనని చెబుతూ ఆ గత వృత్తాంతాన్ని వివరించాడు.

నీవూ, నేనూ పూర్వం మానససరోవరంలో హంసలజంటగా వుండేవాళ్ళం. వెయ్యేళ్ళ సహవాసం మనది. అయితే నీవు నన్ను వదిలిపెట్టి భూమండలంలో భోగాలను వెదుక్కుంటూ వెళ్ళిపోయావు. అలా తిరుగుతున్నప్పుడు ఒక కామిని నిర్మించిన పురాన్ని చూచావు. నవద్వారాలు, పంచారామాలు వున్న ఆ పురానికి నాయిక ఒక స్త్రీ. పంచారామాలంటే పంచేంద్రియవిషయాలు. నవద్వారాలంటే చెవులు, ముక్కులు, నోరు, మొదలైనవి. బుద్ధి అనే కామిని ఆ పురానికి నాయకురాలు. ఆ పురంలో ప్రవేశించిన పురుషుడివి నీవే. ఆ కామినితో కలిసి రమిస్తూ ఇంద్రియలోలుడవై ఆత్మజ్ఞానాన్ని మరచి దేహాభిమానంతో ఐహికసుఖాలకోసం, భోగభాగ్యాలకోసం కాలాన్ని వెచ్చిస్తూ ఇలాంటి దశకు వచ్చావు. నిరంతరం భార్యను స్మరిస్తూ చచ్చి, విదర్భరాజకుమారిగా జన్మించావు. నీవు రాజకుమారివి కావు. ఇతడు నీ భర్త కాదు. పూర్వజన్మలో పురంజనుడివి అని కూడా తలచవద్దు. నీవు పురుషుడవు గావు, స్త్రీవి గావు. ఇదంతా నా మాయవలన కల్పితమైన రూపాలు. మనం హంసలమనే దొక్కటే సత్యం. నీవే నేను, నేనే నీవు. విద్వాంసుల దృష్టిలో మనం ఒక్కటే. నన్ను విడిచిపోయినందున నీకీ జ్ఞానం కూడా నష్టమైపోయింది అని చెప్పగా ఆ సాధ్వికి పోయిన జ్ఞానం తిరిగివచ్చింది.

ఈ విధంగా అధ్యాత్మతత్త్వాన్ని రాజకథానెపంతో నీకు తెలియజేశాను అని నారదుడు ప్రాచీనబర్హికి ఎరుకపరిచాడు. అప్పుడా రాజు, అయ్యా, మీ వాక్యాలు పండితులకు దప్ప మాలాంటి సంసారబంధాల్లో చిక్కుకొన్నవారికి ఎలా అర్థమవుతాయన్నాడు. అయితే నేను అర్థమయ్యేటట్లు చెబుతాను వినుమని నారదుడు ఇలా వివరించాడు.

రాజేంద్రా! ఆత్మ అనేక రూపాలైన దేహాలను ధరిస్తున్నది. ఒంటికాలివి, రెండుకాళ్ళవి, మూడు కాళ్ళవి, నాల్గుకాళ్ళవి, బహుపాదాలుగలవి, పాదాలు లేనివి అయిన వివిధరకాల జీవరూపాల్లో ఆత్మ ఎందుకు ప్రకటితమవుతున్నదో అందుకే పురంజనుడనే పురుషుడిగా కూడా రూపం దాల్చింది. ఆ పురుషునికి సఖుడు ఈశ్వరుడు. పురుషుడికుండే గుణాలచేత ఆయనను తెలుసుకోలేడు గనుక ఆయన పేరు అవిజ్ఞాత అని చెప్పాను. పురుషుడు పురంలో ప్రవేశించడమంటే దేహాన్ని ధరించడమన్నమాట. ఇంద్రియాలద్వారా వచ్చే జ్ఞానాన్ని విశ్లేషించి సుఖానుభూతి కలిగించేది, అహంకార మమకారాలకు నెలవు అయిన బుద్ధిని స్త్రీగా చెప్పాను. కర్మేంద్రియ, జ్ఞానేంద్రియ గుణాలే దాని సఖులు. ఐదుతలల సర్పం అనగా ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన అనే ఐదురూపాలుగా వున్న ప్రాణశక్తి. పదకొండుమంది భటులనగా జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, వాటిని నడిపించే మనస్సు. ఇక నవద్వారాలనగా రెండు కళ్ళు, రెండు ముక్కురంధ్రాలు, రెండు చెవులు, నోరు, ముడ్డి, జననేంద్రియం. కళ్ళు, ముక్కులు, నోరు ఈ ఐదూ తూర్పుద్వారాలు. చెవులు దక్షిణ, ఉత్తర ద్వారాలు. ముడ్డి, జననేంద్రియం పడమటి ద్వారాలు. పురాన్ని చుట్టుముట్టిన గంధర్వులు అంటే రాత్రింబగళ్ళు. కాలకన్య అంటే ముసలితనం. యవనేశ్వరుడంటే మృత్యువు. అతని సైనికులు ఆధివ్యాధులు. ప్రజ్వారుడంటే ప్రాణులను హింసించే జ్వరం. భార్య చెప్పినట్లే నడవడం అంటే బుద్ధిని అనుసరించడం. పంచేంద్రియాలచేత హింసాదులుచేసి విషయసుఖాలను అనుభవించడమే మృగయావినోదమనే వేట.

ఈ దేహం రథం వంటిది. ఇంద్రియాలే దాన్ని నడిపించే గుర్రాలు. చక్రద్వయం అంటే పాపపుణ్యాలు. రథాన్ని నడిపే సారథి బుద్ధి. ప్రకృతిగుణాలచేత కర్మలు చేస్తూ, కర్మఫలాన్ని అనుభవించడానికి పురుషుడు పుడుతూ చస్తూ మళ్ళీ పుడుతూ వుంటాడు. ఆకలితో వున్న కుక్క ఇంటింటికి పోయి తిరుగుతూ ఒకచోట దెబ్బలు తింటుంది. మరొకచోట దొంగ తిండి తింటుంది. అలాగే ఈ జీవుడు కూడా లోకంలో కష్టసుఖాలను పొందుతుంటాడు. నెత్తిమీద వున్న బరువును వీపుమీద వేసుకుంటే మోసేవానికి కష్టం ఏమీ తగ్గనట్లు దుఃఖం కలిగిందని ప్రతీకారం చేస్తే ఆ దుఃఖభారం ఏ మాత్రం తగ్గదు. ఏ కారణంవలన ఆత్మ ఈ సంసారమనే పంజరంలో చిక్కుకుందో ఆ కారణాన్ని తొలగించుకొని ముక్తి పొందాలంటే వాసుదేవుని పాదాలను ఆశ్రయించడం మినహా మరో మార్గం లేదు. దైవభక్తి అలవడాలంటే దేవుని కథలు వినాలి, దేవుని గుణాలు పాడాలి. దైవనామాన్ని స్మరించాలి. వేదాలు కర్మలను బోధిస్తున్నాయని చెప్పేవారు

వేదజ్ఞులని చెప్పడానికి లేదు. వేదాలయొక్క సారాంశం ఆత్మజ్ఞానం. మనస్సుకు ఇంద్రియాలకు తృప్తినిచ్చే కర్మలు, ఫలాన్ని ఆశించి చేసే కర్మలు వదిలివేయి. భూమండలమంతా దర్భలు పెంచి, అహంకారంతో యజ్ఞాలు చేసి, జంతువులను అసంఖ్యాకంగా బలి యిచ్చావు గాని కర్మస్వరూపం, విద్యాస్వరూపం ఏమిటో తెలుసుకోలేదు. సర్వేశ్వరుడికి సంతుష్టి కలిగించేదే సరియైన కర్మ. ఆ సర్వేశ్వరునియందు మనస్సు నిలిచేటట్లు చేసేదే విద్య. అతడే సర్వజీవులలోను అంతరాత్మరూపంలో వున్నాడు. అందరికి ఆయనే ప్రభువు. కాబట్టి ఆయన పాదాలే పురుషులకు క్షేమకరమైన ఆశ్రయం. దైవాన్ని ప్రేమిస్తే, నమ్మి కొలిస్తే దుఃఖమనేది దరిదాపులకు రాదు. ప్రతిదినమూ ఆయువు తరిగిపోతున్నది. మృత్యువు వెన్నంటి తరుముతున్నది. అయినా జీవుడు విందులు, పొందులు గురించే ఆలోచిస్తూ వాటిని ప్రసాదించే కామ్యకర్మలలో నిమగ్నమవుతున్నాడు. ఇంతకంటె అజ్ఞానం ఇంకొకటి వుంటుందా? ముందు సుఖంగా పైకి కనిపించేవన్నీ తర్వాత దుఃఖాన్నే ఇస్తాయి. అందువలన అజ్ఞానపు నిద్రనుంచి మేలుకో. విరక్తుడవై, గృహాన్ని విడిచి, ఈశ్వరధ్యానం చేయి అని నారదుడు ఉపదేశించగా ప్రాచీనబర్హి ఇలా అన్నాడు. మహాత్మా! ఆత్మతత్త్వాన్ని చక్కగా వివరించావు. సంతోషం. కాని నాకొక ధర్మసందేహం వచ్చింది. పురుషుడు ఏ దేహంతో కర్మలు చేస్తున్నాడో ఆ దేహాన్ని ఈలోకంలోనే వదిలి, పరలోకంలో మరొక దేహాన్ని ధరించి తాను చేసిన కర్మల ఫలాన్ని అనుభవిస్తాడని గదా వేదవేత్తలు చెబుతున్నారు. అదెలా సాధ్యమవుతుంది? అదీగాక చేసిన కర్మ తక్షణమే నశిస్తున్నది గదా, దేహాన్ని, లోకాన్ని వదిలి ఎక్కడో ఎలా దాని ఫలం అనుభవిస్తాడు? అని అడిగాడు. దానికి నారదుడిలా సమాధానమిచ్చాడు.

నరేంద్రా! కలకంటున్నప్పుడు జీవుడికి దేహం గుర్తుండదు. అతని మనస్సులోని ఆలోచనలు, సంస్కారాన్ని బట్టి అదే దేహంతోగాని మరొక దేహంతో కాని కష్టసుఖాలు అనుభవిస్తాడు. అలాగే పైకి కనిపించే స్థూలదేహంలో వుండి కర్మలు చేస్తున్న సూక్ష్మదేహమే, పరలోకంలో ఆ శరీరంతోనే ఫలాన్ని అనుభవిస్తుంది. మనిషి మరణించినప్పుడు స్థూలదేహమే నశిస్తుంది గాని సూక్ష్మశరీరం నశించదు. జీవుడు దానితోనే వేరే లోకాలకు పోతాడు. మనస్సే ప్రధానమైన సూక్ష్మశరీరమే, మనిషి చేసే పనులన్నిటికి కర్త. మనస్సే దేహానికి కారణం. మనస్సు ఏ దేహాన్ని పరిగ్రహిస్తే ఆ దేహంతో జీవుడు కర్మను అనుభవిస్తాడు. అలా కాకపోతే కర్మవలనే పునర్జన్మ కలుగుతుందని చెప్పడానికి వీలుకాదు. పూర్వదేహంలో చేసిన కర్మలను అనుసరించే తదుపరి జన్మలో మనస్సు, బుద్ధి, ఆలోచనలు వుంటాయి. మనస్సే అన్నిటిని అనుభవిస్తుంది. జన్మకు కారణమవుతుంది.

దేహ, కర్మబంధాలు అవిద్యవల్ల కలుగుతున్నాయి. అవిద్య నశించాలంటే పరమాత్మను భజించాలి. ఆ విధంగా జీవేశ్వరుల గురించి చెప్పి నారదుడు తన దారిన పోయాడు. ప్రాచీనబర్హి నారదుడు ఉపదేశించినట్లుగా సంసారాన్ని త్యజించాడు. రాజ్యపాలనను కొడుకుల కప్పగించాడు. తపం చేయడానికి కపిలాశ్రమానికి వెళ్ళాడు. అన్నిబంధాలు విడిచి ఏకాగ్రచిత్తుడై భక్తియోగం ద్వారా గోవిందుని భజించాడు. ధ్యాననిష్ఠలో మునిగాడు. ఆ విధంగా బ్రహ్మలో లీనమైపోయాడు అని మైత్రేయుడు చెప్పగా విదురుడు, ప్రచేతసులు రుద్రుని ద్వారా శ్రీహరి స్తోత్రాన్ని పొందారుగదా, ఆ తర్వాత వారేమయ్యారో తెలియజేయవలసిందిగా కోరాడు. అప్పుడు మైత్రేయుడు వారి కదను వినిపించాడు.

## ప్రచేతసుల కథ

తండ్రి ఆదేశం ప్రకారం ప్రచేతసులు సముద్రమధ్యంలో పదివేల సంవత్సరాలు నిష్ఠగా తపమాచరించారు. వారి భక్తికి మెచ్చి శ్రీహరి ప్రత్యక్షమయ్యాడు. మీరు స్నేహభావంతో ఐక్యంగా తపస్సు చేయడం నాకెంతో సంతోషాన్ని కలిగించింది. మీ మనస్సులోని కోర్కెలు చెప్పండి, నెరవేరుస్తాను అన్నాడు. ఉత్తములైన మిమ్ములను అనుదినం పడుకునేవేళ ఎవరైతే తలుచుకుంటారో వారికి సోదరమైత్రి, భూతదయాగుణం, మంచిబుద్ధి లభిస్తాయి. రుద్రుడు మీకు ఉపదేశించిన స్తవాన్ని అనుదినం పఠించేవారికి కోరికలు నెరవేరుతాయి. మీరు సంతోషంతో తండ్రిమాట తలదాల్చినందున మీ కీర్తి లోకంలో విస్తరిస్తుంది. మీకు పరిపూర్ణగుణాకరుడైన కొడుకు పుడతాడు. కండుమహాముని తపస్సు చెడగొట్టడానికి ఇంద్రుడు ప్రమ్లోచ అనే అప్సరసను పంపగా ఆవిడ ఆ మునితో కాపురం చేసి ఆడుబిడ్డను గని చెట్లలో పెట్టి స్వర్గానికి వెళ్ళిపోయింది. ఆ బిడ్డను రాజైన సోముడు చూచి తన వ్రేలితో అమృతపానం చేయించి పెంచి పెద్దదాన్ని చేశాడు. ఆ కన్యను మీరు పెళ్ళిచేసుకోండి. మీ అందరికి ఆవిడ భార్య అవుతుంది. మీరు కొన్నివేల సంవత్సరాలు ఈ భూమిమీద సకలభోగాలు అనుభవిస్తారు. తర్వాత విరక్తులై భక్తితో నన్ను సేవించి పరమపదాన్ని పొందుతారు అని వారిని ఆశీర్వదించాడు.

శ్రీహరి దర్శనంవలన ప్రచేతసుల రజస్తమోగుణాలు నశించాయి. చేతులు జోడించి, దేవదేవా, కేశవా, సర్వభూతనివాసివి, సర్వసాక్షివి అయిన నీకు నమస్కారం అన్నారు. భక్తితో వాసుదేవుని స్తుతించారు. నీవు మాకు ప్రత్యక్షమవ్వడమే గొప్పవరం, ఇంక నిన్ను ఏ వరాలు అడగాలి? నీ ఐశ్వర్యాలు అనంతం. దప్పిగొన్న బాలుడు సముద్రమంత నీరు దొరికినా ఎన్ని నీళ్ళు త్రాగుతాడు? మాకు జన్మజన్మలకు నీపై భక్తి, నీ భక్తులతో మైత్రి

వుండేటట్లుగా అనుగ్రహించు. అంతేచాలని ప్రణమిల్లారు. పరమాత్మని నోరారా నుతించారు. హరి వారికి, వారు కోరిన వరమిచ్చి తిరిగి వెళ్ళిపోయాడు.

తదనంతరం ప్రచేతసులు సముద్రంనుంచి బయటకు వచ్చారు. ఆకాశమంత ఎత్తుకు పెరిగిన చెట్లతో దారి కనిపించనంత దట్టంగా అడవి పెరిగిపోయింది. నేల కనిపించడం లేదు. వారికి కోపం వచ్చింది. వారి కళ్ళనుంచి అగ్ని, వాయువు పుట్టి ఆ చెట్లను కాల్చనారంభించాయి. బ్రహ్మకు వార్త అందింది. వెంటనే అక్కడికి వచ్చి ప్రచేతసులను శాంతింపజేశాడు. మిగిలిన చెట్లు భయంతో బ్రహ్మ ఆదేశానుసారం తమ కూతురైన మారిషను ప్రచేతసులకు ఇచ్చి వివాహం చేశాయి. ఈశ్వరునితో వైరం వహించి తన తలను కోల్పోయిన దక్షుడు, పూర్వదేహం నశించగా ప్రచేతసులకు మారిషయందు మళ్ళీ జన్మించాడు.

ప్రచేతసులు కొడుకును భార్య దగ్గర వదిలేసి వనవాసానికి వెళ్ళారు. పడమటి సముద్రతీరంలో జాబాలి మునీశ్వరుడు తపస్సు చేసిన ఆశ్రమస్థానంలో నివసించసాగారు. అలా వుండగా ఒకనాడు నారదుడు అక్కడకు వచ్చాడు. రాజకుమారులు లేచి వినయంగా, సముచితమైన పూజలు చేసి, ఆత్మతత్త్వాన్ని బోధించవలసిందిగా ప్రార్థించారు. నారదుడు సరేనని ఇలా ఉపదేశించాడు.

గోవిందుని భక్తితో సేవించనివారి జన్మ, కర్మ, ఆయువు వ్యర్థం. ఉపనయనాలు, దీక్షలు, వేదశాస్త్రోక్త కర్మలు, జపతపాలు, పాండిత్యం, ఉపన్యాసాలు, భక్తి కలిసివున్నప్పుడే సార్థకమవుతాయి. భూమిపై పుట్టిన చరాచర జీవరాశులు భూమిలోనే కలిసిపోతున్నట్లుగా హరినుంచి ఉద్భవించిన విశ్వం హరియందే లయమవుతుంది. సమస్తదేహాలలోను ఆత్మరూపంలో వుండేది ఆ నారాయణుడే. ఆదిమధ్యాంతరహితుడు, నిత్యానంద స్వరూపుడు, సర్వజ్ఞుడు అయిన ఆ పరమేశ్వరుడిని నిరంతరం భజించడమే మానవజీవిత పరమావధి. లభించినదానితో తృప్తిచెంది, ఇంద్రియాలను శాంతింపజేసి, దయాదృష్టితో సర్వభూతాలనూ ప్రేమించేవారంటే ఆ భగవంతుడికి ఇష్టం. వేదాలు చదువుకొన్నామని, ధనం అధికారం వుందని, మాది గొప్పకులమని, వంశమని గర్వంతో విర్రవీగేవారు, సజ్జనులకు కష్టం కలిగించేవారు చేసే పూజలను భగవంతుడు స్వీకరించడు. మీ వంశంలోనే పుట్టిన ధ్రువుడు, సవతితల్లి మాటలచే అవమానితుడై, వ్యధచెంది తపోవనానికి వెళ్ళుతున్నప్పుడు మార్గంలో కనిపించి నేను ఉపదేశించిన క్రమంగా నారాయణుని ఆరాధించి ఇతరులెవ్వరికీ అలవికాని సర్వోన్నత పదవిని పొందాడు. కావున మీరు కూడా రుద్రుడు ఉపదేశించినట్లుగా ఆ పరమాత్మను పూజించి జన్మరాహిత్యాన్ని పొందండి అని హరిచరితామృతాన్ని వారిచే

ఆస్వాదింపజేసి నారదుడు బ్రహ్మలోకానికి వెళ్ళిపోయాడు. నారదుడు వెళ్ళిపోయాక ప్రచేతసులు భక్తితో విష్ణుని సేవించి పరమపదాన్ని పొందారు. నారదునివలన ఉత్తానపాదుని సోదరుడు ప్రియవ్రతుడు కూడా ఆత్మజ్ఞానం పొంది, భూమండలాన్ని పరిపాలించి, అనంతరం పుత్రులకు రాజ్యం పంచియిచ్చి పరలోకానికి పోయాడని మైత్రేయుడు చెప్పగా, విదురుడు ఆ మునినాథుని పాదాలకు మ్రొక్కి నీచేత భగవత్తత్త్వం తెలుసుకొన్నాను, ఇక సెలవిస్తే మావూరికి పోతానని చెప్పి బంధుమిత్రులను కలుసుకోవాలనే కోరికతో హస్తినాపురానికి తిరిగి వెళ్ళిపోయాడు అని శుకుడు పరీక్షిత్తుకు చెప్పినట్టు ఆ విషయాన్ని సూతుడు శౌనకాది మునులకు వివరించాడు.

# ఐదవస్కంధం

## ప్రియవ్రతుని చరిత్ర

మనుపుత్రుడైన ప్రియవ్రతుడిని గురించి మైత్రేయుడు ముక్తసరిగా మూడు మాటలు చెప్పి ముగించాడు. ఆయన చరిత్ర ఇంకా తెలుసుకోవాలని పరీక్షిత్తుకు కుతూహలం కలిగింది. అందుకని శుకమహర్షిని ఇలా అడిగాడు. పరమభాగవతుడైన ప్రియవ్రతుడు ఇంటివద్దే వుండి సంసారం చేస్తూ ఆత్మజ్ఞానాన్ని ఎలా పొందాడు? సంసారబంధాలు త్రెంచుకొన్నవారికి గృహస్థజీవితం సంతోషాన్నివ్వదు. మరి భార్యాపిల్లలతో కలిసివున్నవాడికి భక్తియోగం ఎలా సిద్ధించింది? శ్రీహరిమీదికి చిత్తమెట్లా పోయి నిలిచింది? నా సంశయాలను పోగొట్టి తేటతెల్లం చేయండి అని అడగ్గా శుకుడిలా చెప్పాడు.

ప్రియవ్రతుడు అధ్యాత్మవిషయాల్లో ఆసక్తి చూపిస్తూ ఒకసారి సత్రయాగం తలపెట్టాడు. దీక్షితుడై నారదుని పిలిచి అతని చరణాలను పూజించాడు. తండ్రి రాజ్యపాలనాభారాన్ని కుమారుడికి అప్పగించదలిచినా, ప్రియవ్రతుడు అందుకు అంగీకరించలేదు. బ్రహ్మకు ఈ విషయం తెలిసింది. అతనికి రాజ్యవ్యవహారాల్లో ఆసక్తి కలిగించాలని బయలుదేరి రాగా స్వాయంభువుడు, ప్రియవ్రతుడు, నారదుడు – పద్మసంభవునికి స్వాగతసత్కారాలు చేసి పూజించగా ఆయన సంతసించి ప్రియవ్రతుని వైపు చూచి ఇలా అన్నాడు.

శ్రీహరి పంపగా నేను వచ్చాను. ఆయన చెప్పమన్న మాటలే చెబుతున్నాను. శ్రద్ధగా విను. నేను, నీవు, నారదుడు, అందరూ ఈశ్వరుని ఆజ్ఞప్రకారం నడుచుకొనవలసినవాళ్ళమే. ఆయన ఆనతిని అతిక్రమించడం ఎవ్వరికీ సాధ్యం కాదు. జననమరణాలు, సుఖదుః ఖాలు ఈశ్వరాధీనమేగాని, జీవునికి ఏ మాత్రమూ స్వతంత్రం లేదు. మోక్షాన్ని కోరే

జ్ఞానవంతుడు సుఖంగాని, దుఃఖంగాని ఏది వస్తే అది అనుభవిస్తాడు. దేహంవల్ల వచ్చిన కర్మలను తప్పించుకోవాలని చూడడు. ఇంద్రియాలను జయించి వశపరచుకోనివాడు అడవులకు ఆశ్రమాలకు వెళ్ళినా సంసారబంధాలు తొలగిపోవు. అలాగాకుండా ఇంద్రియాలను, మనస్సును అదుపులో పెట్టుకొని ఆత్మజ్ఞానాన్ని పొందినవాడు గృహస్థాశ్రమంలో వున్నప్పటికి మోక్షం సిద్ధిస్తుంది. నీవు కూడా దేనితోనూ అనుబంధం పెట్టుకోకుండా, కామక్రోధాదులను జయించి ఈశ్వరుడిచ్చిన భోగాలు అనుభవిస్తూనే ఆత్మజ్ఞానివై ముక్తిపొందు అని చెప్పగా ప్రియవ్రతుడు బ్రహ్మకు తలవంచి ఆయన చెప్పిన మాటల్ని తలదాల్చాడు.

బ్రహ్మ స్వాయంభువ మనువు చేసిన పూజలందుకొని అందరినీ ఆశీర్వదించి తన లోకానికి వెళ్ళిపోయాడు. మనువు ప్రియవ్రతునికి రాజ్యాన్ని అప్పగించి వానప్రస్థాశ్రమాన్ని స్వీకరించాడు. ప్రియవ్రతుడు ఈశ్వరాజ్ఞను పాటించి రాజ్యపరిపాలనా బాధ్యతను స్వీకరించినా హరిభక్తి మరచిపోలేదు. ఆయన విశ్వకర్మ పుత్రిక అయిన బర్హిష్మతిని పెళ్ళిచేసుకొని పదిమంది కొడుకులను, ఒక కూతురును కన్నాడు. అందులో కవి, మహావీరుడు, సవనుడు అనే ముగ్గురు కొడుకులు బాల్యంలోనే బ్రహ్మవిద్యా నిష్ణాతులై, పరమహంసయోగాన్ని ఆశ్రయించి, వాసుదేవుని భక్తితో కొలిచి ఈశ్వరునిలో ఐక్యమయ్యారు. ప్రియవ్రతుడు మరొక స్త్రీని వివాహం చేసుకొని ఉత్తముడు, తామసుడు, రైవతుడు అనే ముగ్గురు కొడుకులను కన్నాడు. అతడు శత్రువులను జయించి రాజభోగాలను, కామసౌఖ్యాలను తనివితీర అనుభవించాడు. అలా కొన్ని కోట్ల సంవత్సరాలు రాజ్యం చేశాడు.

సూర్యుడు మేరునగ ప్రదక్షిణం చేస్తున్నప్పుడు ఆయన వెనకభాగంలో చీకటి రాత్రి ఏర్పడుతున్నది కాబట్టి ఆ భాగంలో అంధకారం లేకుండా వెలుగు నింపడానికి, అంటే రాత్రులను పగళ్ళుగా చేయడానికి ప్రియవ్రతుడు నిశ్చయించి తేజోమయమైన రథమెక్కి ఏడుదినాలు రథం నడపడం వలన, రథచక్రాలు నడిచిన మార్గాలు ఏడుసముద్రాలుగాను, ఆ మధ్యగల భూమి ఏడుదీవులుగాను విభజన అయ్యింది. జంబూ, ప్లక్ష, శాల్మలి, కుశ, క్రౌంచ, శాక, పుష్కరాలని ఆ దీవులకు పేర్లు ఏర్పడ్డాయి. జంబూద్వీపం లక్షయోజనాల పరిమాణం కాగా మిగిలినవి ఒకదానికంటె మరొకటి రెట్టింపు విస్తీర్ణంతో వున్నాయి. ఇక ఏడుసముద్రాలు - ఉప్పుసముద్రం, చెరకురసం సముద్రం, పాలసముద్రం, పెరుగు సముద్రం, నేతిసముద్రం, మద్యసముద్రం, నీటిసముద్రం ఏడుద్వీపాలంత పరిమాణం కలిగి వేర్వేరుగా వున్నాయి. మొదటిభార్యకు జన్మించిన పదిమంది కొడుకులలో ముగ్గురు

పోగా మిగిలిన ఏడుగురికి ప్రియవ్రతుడు తలా ఒక ద్వీపాన్ని యిచ్చి పట్టాభిషేకం చేశాడు. కూతురైన ఊర్జస్వతిని భార్గవుడికిచ్చి పెళ్ళిచేయగా వారికి దేవయాని అనే కూతురు పుట్టింది. తదనంతరం ప్రియవ్రతుడు ప్రపంచంపట్ల, సంసారంపట్ల విరక్తుడయ్యాడు. హరికృపచేత అతనికి ఆత్మజ్ఞానం కలిగింది. కొడుకులను, భార్యలను విడిచి నిరంతర భగవద్ధ్యానతత్పరుడై కైవల్యం పొందాడు.

హరిసేవనా ప్రియవ్రతు
దరయగ గైవల్యపదవి నందుటయరుదే
ధర జండాలుండైనను
హరినామస్మరణ జెందు నవ్యయపదమున్

ప్రియవ్రతుని కుమారుడైన యాగ్నీధ్రుడు జంబూద్వీపానికి రాజుగా తండ్రిచేత నియమించబడి, ప్రజలను కన్నబిడ్డల్లా చూచుకొంటూ పరిపాలన చేస్తున్నాడు. అయితే అతనికి సంతానం కలగలేదు. అందుకని మందరపర్వత సమీపంలో ఏకాగ్రచిత్తుడై తపస్సు చేశాడు. అతని తపోదీక్షకు సంతసించి బ్రహ్మ, పూర్వచిత్తి అనే అప్సరసను తపోవనానికి పంపగా, ఆవిడ అక్కడ ఆడుతూ పాడుతూ తపస్వి దృష్టిని ఆకర్షించింది. అతడా అప్సరసను చూచి మోహించాడు. నీవెవరివి, ఎందుకొచ్చావు, నీలాంటి సౌందర్యవతిని ఎక్కడా చూడలేదే, అని ఆమె అందాన్ని వర్ణించాడు తనలో గలిగిన భావావేశాన్ని వెల్లడించాడు. మనమిద్దరం కలిసి తపస్సు చేద్దాం. సంసారాన్ని వృద్ధిచేద్దాం అని ఆవిడని ప్రేమతో వశపరచుకొన్నాడు. పూర్వచిత్తి యాగ్నీధ్రుని మాటలకు సమ్మతించి అతనితోగూడి నూరువేల సంవత్సరాలు భూలోక, స్వర్గలోక సౌఖ్యాలను అనుభవించింది. వారిద్దరికీ ఏడాదికొకరు చొప్పున తొమ్మిదిమంది కొడుకులు పుట్టారు. అనంతరం పూర్వచిత్తి ఆ పిల్లలను ఇంట్లో వదిలి బ్రహ్మలోకానికి వెళ్ళిపోయింది. ఆ తొమ్మిదిమంది దృఢకాయులై తండ్రి ఆజ్ఞప్రకారం జంబూద్వీపంలో తొమ్మిది రాజ్యాలను పాలించారు. ఆ రాజ్యాలకు వారిపేర్లే వచ్చాయి. అవి నాభి, కింపురుష, హరివర్ష, ఇలావృత, రమ్యక, హిరణ్మయ, కురు, భద్రాశ్వ, కేతుమాల అనే దేశాలుగా ప్రసిద్ధిగాంచాయి. అగ్నీధ్రుడు పూర్వచిత్తిని మరువలేక, వేదోక్త కర్మలను చేసి ఆవిడ వుండే బ్రహ్మలోకానికి పోయాడు. తండ్రి పరలోకానికి వెళ్ళిన తర్వాత తొమ్మిదిమంది కొడుకులు మేరుపుత్రికలను పెళ్ళిచేసుకొన్నారు.

# రుషభావతారం

పెద్దకొడుకైన నాభి సంతానం కలగనందున భార్యతో కలిసి వాసుదేవుని పూజించాడు. వేదోక్తంగా యజ్ఞయాగాదులు చేశాడు. లక్ష్మీరమణుడైన ఆ నారాయణుడు సంతుష్టిచెంది చతుర్భుజుడై శంఖ, చక్ర, గదాయుధాలను ధరించి వివిధాభరణాలతో మెరిసిపోతూ ఆ దంపతుల ముందు ప్రత్యక్షమయ్యాడు. ఆనందంతో ఉప్పొంగిపోయిన నాభి బహువిధాలుగా పరమేశ్వరుని స్తుతించి, సంతానాన్ని ప్రసాదించవలసిందని ప్రార్థించాడు. పైగా నీలాంటి కొడుకే కావాలన్నాడు. సరేనన్నాడు శ్రీమన్నారాయణుడు. నాలాంటివాడు మరొకడు లేడు గనుక నేనే నీ భార్య అయిన మేరుదేవికి పుత్రుడనై జన్మిస్తానని చెప్పి హోమకుండంలో అదృశ్యమైపోయాడు. తర్వాత మేరుదేవి గర్భంలో ప్రవేశించాడు. ఆ విధంగా మేరుసమానధీరుడైన హరి, శమదమాది గుణ విశారదుడై, మెరిసే దేహంతో మేరుదేవికి పుత్రుడుగా జన్మించగా తండ్రి అతనికి రుషభుడనే పేరు పెట్టాడు. బ్రాహ్మణులు, మంత్రులు, ప్రజలు, పరివారమంతా ఆ బాలుడిని చూచి ప్రేమగా మా రాజు పుట్టాడంటూ పండుగ సంబరాలు చేసుకొన్నారు. అయితే అసూయాపరుడైన ఇంద్రునికి ఇది గిట్టలేదు. రుషభుడున్న రాజ్యంలో వానలు కురవకుండా చేశాడు. ఇంద్రుని ఇంగితాన్ని తెలుసుకున్న రుషభుడు యోగమాయాబలంతో సమృద్ధిగా వానలు కురిపించాడు. ఆయన వలన దేశం సుభిక్షమయ్యింది. తర్వాత నాభి తన కుమారునికి పట్టాభిషేకం చేసి రాజ్యాన్ని అప్పగించి భార్యతోగూడి బదరికాశ్రమం వెళ్ళిపోయాడు. అక్కడ పురుషోత్తముడైన వాసుదేవుని ఆరాధించి సమాధి స్థితి చెంది, శరీరాన్ని కృశింపజేసి హరిలో ఐక్యమైపోయాడు.

రుషభుడు కర్మభూమి అయిన తన రాజ్యంలో ప్రజలందరికి కర్మకాండను తెలియజేయడానికి గురువులవద్ద వేదాలను అభ్యసించి ఆదర్శప్రాయంగా కర్మలు చేస్తూ రాజ్యాన్ని పాలించాడు. గురువుల అనుమతితో శతమన్యుని కూతురైన జయంతిని పరిణయమాడాడు. ఆ పడతిద్వారా నూర్గురు కొడుకులను కన్నాడు. వారిలో పెద్దవాడైన భరతుని పేర ఆ రాజ్యానికి భారతవర్షం అనే పేరు వచ్చింది. తర్వాత తొమ్మిదిమంది కొడుకులను వారి పేర్లతో పిలవబడే భూములకు రాజులను చేశాడు. అవే కుశావర్త, ఇలావర్త, బ్రహ్మావర్త, ఆర్యావర్త, మలయకేతు, భద్రసేన, ఇంద్రస్పృక్, విదర్భ, కీకటదేశాలయ్యాయి. తర్వాత తొమ్మిదిమంది కవి, హరి, అంతరిక్ష, ప్రబుద్ధ, పిప్పలాయన, ఆవిర్హోత్ర, ద్రమీధ, చమస, కరభాజనులనువారు భాగవతధర్మ ప్రకాశకులయ్యారు.

తక్కిన 81మంది మహాశ్రోత్రియులు, కర్మనిష్ఠులు అయిన బ్రాహ్మణోత్తములయ్యారు. రుషభుడు స్వయంగా ఈశ్వరుడై వుండి కూడా సామాన్యమానవునివలె ఏ కాలంలో ఏ ధర్మాన్ని ఆచరించాలో దాన్ని ఆచరిస్తూ, గృహస్థాశ్రమధర్మాలను నిర్దేశిస్తూ నీతి, న్యాయం, ధర్మం తప్పక ప్రజలను పాలించాడు. వేదాల్లోని సకలధర్మాలను బ్రాహ్మణుల ద్వారా ఉపదేశం పొంది, విధిపూర్వకంగా క్రతువులను చేశాడు. రుషభుని రాజ్యంలో అందరూ అధ్యాత్మజ్ఞాన సంపన్నులయ్యారు. ఏ ఒక్కడూ ఐహికసుఖాలను కోరేవాడు కాదు.

ఇలా వుండగా ఒకనాడు రుషభుడు కొడుకులకు రాజ్యం అప్పగించి బ్రహ్మావర్తదేశంలో మహాత్ములైన మునిశేఖరులుండే ఆశ్రమప్రదేశానికి వెళ్ళాడు. కొడుకులు, మంత్రులు కూడా ఆయనకు తోడుగా వచ్చారు. అక్కడ తన కొడుకులందరిని దగ్గరకు పిలిచి రుషభుడు ఇలా ఉపదేశించాడు.

ఇంద్రియసుఖాలకోసం వెంపరలాడేవాడు వ్యర్థమైన పనులుచేసి అనర్థాలను కోరి తెచ్చుకొంటాడు. కామమే పాపానికి మూలం. కామంతో కళ్ళు కానక ప్రవర్తించేవాడు పడే పాట్లు కుక్కలుకూడా పడవు. స్త్రీ వ్యామోహం వలన లోకులు సంసారం అనే నరకంలో పడుతున్నారు. కామక్రోధాదులను జయించి సకలభూతాలను సమంగా ప్రేమించే సాధుచిత్తులను మహాత్ములంటారు. అలాంటివారు దేవుడినే ప్రేమిస్తారు గాని దేహాభిమానం వారికి వుండదు. భార్యాపిల్లలపైన, బంధుమిత్రులపైన, సిరిసంపదలపైన మమకారాన్ని పెంచుకోరు. సంసారంలో సౌఖ్యం లేదు. ఈశ్వరుని హృదయంలో నిలుపుకొని భక్తిశ్రద్ధలతో ధ్యానిస్తే అనంతసౌఖ్యం కలుగుతుంది. దీనులపట్ల వృద్ధులపట్ల దయజూపండి. కాముకుల స్నేహాన్ని త్యజించండి. సంసారంలో వున్నా దానిపైన వ్యామోహం లేకుండా ఈశ్వరధ్యానంలో మనస్సును లగ్నం చేయండి. అప్పుడు సంసారం మిమ్మల్ని బాధించదు. మోక్షం కావాలంటే మోహాన్ని వదలాలి. శివుడికంటె బ్రహ్మ, బ్రహ్మకంటె విష్ణువు అధికులు. అయితే విష్ణువు కూడా విప్రులను ఆదరిస్తాడు కాబట్టి విప్రుడే మానవులకు దైవం. ఈ భూమిమీద బ్రాహ్మణులకు సమానమైన దైవం వేరొకటి లేదు. మంగళస్వరూపులైన బ్రాహ్మణులను పూజిస్తే నన్ను పూజించినట్లే భావిస్తాను.

ఈ విధంగా కుమారులకు ఆచారవ్యవహారాలు ఉపదేశించి పెద్దవాడైన భరతునకు పట్టంకట్టి రుషభుడు సన్యసించాడు. తనను పూజించినట్లే అన్న అయిన భరతుని కూడా పూజ్యభావంతో సేవించాలని కొడుకులను ఆదేశించాడు. దిగంబరుడై, పిచ్చివాడిలా వ్యవహరిస్తూ రుషభుడు బ్రహ్మావర్తదేశాన్ని వదలి చెవిటి, మూగ, గ్రుడ్డివానివలె తిరుగుతూ ఎవరితోనూ మాట్లాడక మౌనవ్రతం పూని గ్రామాలు, పట్టణాలు, అడవులు,

ఆశ్రమాలు గడచివెళ్ళాడు. ఎవరు తిట్టినా, కొట్టినా మారు పలికేవాడు గాదు. ఏ విధంగా అవమానించినా లెక్కచేయక అవధూత వేషంలో ఏకాకి అయి సంచరించాడు. తల జడలు కట్టింది. వళ్ళు దుమ్ముతో నిండిపోయింది. ఎవరూ ఆయన్ని గుర్తించలేదు. నేలపైపడి పొర్లాడేవాడు. మలమూత్రాలలో దొరిలేవాడు. అయినా తనలో తాను మహానందాన్ని అనుభవించేవాడు. వాసుదేవుని సర్వభూతాలలో వెలుగుతున్న పరమాత్మగా ప్రత్యక్షంగా చూస్తూ సిద్ధుడయ్యాడు. పరకాయప్రవేశం, దూరగ్రహణం, దూరశ్రవణం, ఆకాశగమనం వంటి యోగసిద్ధులు వచ్చినా ఆయన వాటిని స్వీకరించలేదు అని శుకుడు చెప్పగా పరీక్షిత్తు ఆశ్చర్యపోయి, అంతటి ఐశ్వర్యాన్ని రుషభుడు ఎందుకు కాలదన్నాడు అని అడిగాడు.

శుకుడు సమాధానం చెబుతూ అలాంటి వాటివల్ల యోగి చిత్తం చెడుతుంది, మనస్సును నమ్మకూడదు, ఐశ్వర్యాలమూలంగా కామక్రోధాదులు మనస్సులో జొరబడి మనిషి పతనానికి హేతువులవుతాయి, అందుకనే రుషభుడు ఐశ్వర్యాలను తిరస్కరించాడని వివరించాడు. తర్వాత ఒక దినాన రుషభుడు కొంకణ, వంక, కుటకమనే దక్షిణ కర్ణాట దేశాలకు వెళ్ళి కుటకాచలంవద్ద వనాలలో సంచరిస్తుండగా అడవులలో మంటలు చెలరేగాయి. ఆ దావానలంలో ఆయన దేహం కూడా దగ్ధమయ్యింది.

కలియుగంలో శాస్త్రోక్తమైన ఆచారాలను విడిచిపెట్టి ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు ప్రవర్తిస్తారు. దేవతలను హేళన చేస్తారు. అపవిత్రమైన ధర్మవిరుద్ధమైన ప్రవర్తన కలిగివుంటారు. వేదాలను, బ్రాహ్మణులను, మహాత్ములను దూషిస్తూ ఎవరిమతం వారిదే అన్నట్లు వ్యవహరిస్తూ అజ్ఞానాంధకారంలో పడతారు. ఈ రుషభుని అవతారం రజోగుణంవల్ల అహంకారులైనవారికి మోక్షమార్గాన్ని ఉపదేశించడానికి వచ్చింది.

ఇప్పుడు రుషభుని కుమారుడైన భరతుని కథ చెబుతాను వినుమని శుకుడు చెప్పసాగాడు.

## భరతుని చరిత్ర

భరతుడు విశ్వరూపుడనే రాజచంద్రుని కూతురు పంచజనిని ఒక శుభలగ్నాన పెళ్ళిచేసుకొన్నాడు. వారికి ఐదుగురు కొడుకులు పుట్టారు. వారు సుమతి, రాష్ట్రభుక్, సుదర్శన, ఆచరణ, ధూమ్ర కేతువులు. భరతుడు అజనాభాన్ని పాలించాడు. భరతుడు పాలించడంవల్ల తర్వాత దానికి భారతవర్షం అనే పేరు వచ్చింది. భరతుడు తన పూర్వీకుల వలెనే ధర్మనిరతితో ప్రజలను పాలించాడు. అనేక యాగాలు చేశాడు.

కర్మలనన్నిటిని ఈశ్వరునికి అర్పించి, నిరంతరం శ్రీహరిని భక్తితో సేవించేవాడు. అలా 500 కోట్ల సంవత్సరాలు రాజ్యాన్ని పాలించి తదనంతరం పుత్రులకు పంచియిచ్చి, ఇల్లు వదిలి పులహాశ్రమానికి వెళ్ళాడు. గండకీనదీతీరాన వున్న ఆ ఆశ్రమంలో భరతుడు ఏకాకిగా జీవిస్తూ శ్రీహరిని ఏమరకుండా ధ్యానం చేశాడు.

ఇలా వుండగా భరతుడు ఒకనాడు గండకీనదిలో స్నానం చేసి నీటిలో నిలబడి ప్రణవోచ్చారణ చేస్తుండగా నిండుచూలుతో వున్న ఒక ఆడుజింక నీరు త్రాగడానికి వచ్చింది. ఆ సమయంలో ఒక సింహం గర్జించింది. జింక భయపడి ఎగిరి దూకింది. అలా దూకేటప్పుడు దాని కడుపులోని పిల్ల జారి నీళ్ళలో పడింది. జింక అక్కడున్న రాళ్ళమీద పడి చచ్చిపోయింది. జింకపిల్ల నీళ్ళలో పడి కొట్టుకోవడం భరతుడు చూచి జాలిపడ్డాడు. తల్లిలేని ఆ జింకపిల్లను తన ఆశ్రమానికి తీసుకొని వెళ్ళి ప్రేమగా సాకుతున్నాడు. ఆ జింకపిల్లకు ఆలనాపాలనా చేస్తూ క్రమంగా తన యోగాన్ని, పూజలను మరిచిపోసాగాడు. అది కనబడకపోతే క్షణం కూడా వుండలేకపోయేవాడు. కన్నబిడ్డ మాదిరిగా ప్రేమించేవాడు. అలా అలా మమకారబంధం ముదిరిపోయిన తర్వాత జింకపిల్ల పెద్దదై అడవిలోకి వెళ్ళిపోయింది. తిరిగి రాలేదు. భరతుడు పడిన బాధ అంతా ఇంతా గాదు. ఏ క్రూరమృగం తినివేసిందో అని ఆరాటపడ్డాడు. దానితో తను ఆనందించిన క్షణాల్ని నెమరువేసుకొంటూ మరింత బాధపడేవాడు. కన్నకొడుకు చనిపోయినట్లు శోకించాడు. పెళ్ళాం, పిల్లలు తన తపస్సుకు అవరోధమని వారిని విడిచి అడవిలో ఆశ్రమవాసం చేస్తూ జింకపిల్లమీది వ్యామోహంతో తపస్సునే చెడగొట్టుకొన్నాడు. భరతుడు బెంగతో కృశించాడు. మనస్థిమితాన్ని పోగొట్టుకొని నీరసించాడు. అలా అంత్యకాలం సమీపిస్తుండగా ఆ జింక తిరిగివచ్చింది. దాన్ని చూచి భరతుడు ఎంతో సంతోషించాడు. తన దగ్గర నిలబడి కొడుకులా తనవైపే చూస్తుండగా భరతుడు దాన్నే చూస్తూ ప్రాణాలు వదిలాడు. జింకతో ఏర్పడిన మమకారబంధంవలన, దాన్నే మనస్సులో నిలిపి దేహాన్ని వదలడంవలన భరతుడు జింక కడుపున పునర్జన్మ ఎత్తాడు. భరతుడు జింకగా పుట్టినా తానిలా ఎందుకు పుట్టిందీ, పూర్వజన్మలో తాను చేసిన తపస్సు అన్నీ గుర్తు వున్నాయి. అయ్యో నా బ్రతుకు ఇలా అయ్యిందే అని విచారించాడు. తల్లిని వదిలి మళ్ళీ పులహాశ్రమాన్ని చేరాడు. అక్కడ ఎండుటాకులు, గడ్డిపోచలు తింటూ నదిలో నీరు త్రాగుతూ ఒంటరిగా వుంటూ కొంతకాలానికి ప్రాణం విడిచాడు.

జింక జన్మ చాలించిన భరతుడు తర్వాత జన్మలో ఆంగిరసుడనే బ్రాహ్మణోత్తమునికి పుత్రుడయ్యాడు. ఆంగిరసుడు ఇద్దరు స్త్రీలను పెళ్ళిచేసుకోగా మొదటి భార్యకు 9మంది

కొడుకులు పుట్టారు. రెండవభార్యకు ఒక కూతురు, ఒక కొడుకు పుట్టారు. ఆ కుమారుడే పూర్వజన్మలలో రాజర్షి, జింక అయిన భరతుడు. శ్రీహరి కృపవలన అతనికి పూర్వజన్మలన్నీ గుర్తువున్నాయి. వాటిని నెమరువేసుకొంటూ పిచ్చివాడిలాగా, మూగ, చెవిటి, గ్రుడ్డివానిలాగా కనిపించేవాడు. ఆంగిరసుడు కొడుకుని సంస్కరించి శాస్త్రోక్తకర్మలు నేర్పాలని ప్రయత్నించాడు. కాని ఆ కుమారునికి నేర్చుకోవాలనే కోరిక వుండేది కాదు. తండ్రి నిర్బంధంవల్ల గాయత్రీమంత్రాన్ని ఉపదేశం పొంది వేదాలను చదువుతుండేవాడు. ఇంతలో తండ్రి దివంగతుడయ్యాడు. తల్లి సహగమనం చేసింది. సవతితల్లి కొడుకులు అతనిని చదువు మానిపించి ఇంట్లో పనులు చేయడానికి నియమించారు. అతడు ఏ పనిచెపితే అది చేసేవాడు. ఏది పెడితే అది తినేవాడు. అది ఇష్టం, ఇది ఇష్టంలేదు అనే భావన అతనికి వుండేది కాదు. ఎవరు ఏమన్నా తిట్టినా కొట్టినా ఎదురు తిరిగేవాడు కాదు. అతనికి వేడి అయినా చలి అయినా ఎండైనా వానైనా ఒకటిగానే వుండేది. నేలమీద పడి నిద్రపోయేవాడు. వట్టి మొద్దు, మందబుద్ధి, పిచ్చివాడు అని ఇతరులు అవమానించినా అతనికేమీ పట్టేది కాదు. సోదరులు అతడిని వ్యవసాయంలో పెట్టారు. పశువులకు పెట్టే ఆహారాన్నే అతనికి పెట్టినా తినేవాడు. చేలకు కాపలా కాసేవాడు.

ఆ ప్రాంతానికి అధిపతి అయిన వృషలునికి సంతానం లేదు. కాళికామాతకు ఒక పశువును బలి యిస్తే సంతానప్రాప్తి అవుతుందని భావించి, ఒక మగపశువును కాళికాలయానికి తోలుకొని రమ్మని సేవకులకు చెప్పాడు. వారు పశువును తెస్తుండగా దారిలో తప్పించుకొని పారిపోయింది. వెదికినా కానరాలేదు. చీకటిపడింది. చేలల్లో పడి వెదుకుతుంటే వారికి చేలో కాపలా కాస్తున్న బ్రాహ్మణుడు కనిపించాడు. పశువు మాదిరిగానే వున్నాడు, ఇతడినే తీసుకొనివెళ్ళి బలి యిద్దాం అని నిశ్చయించి అతడిని కాళికాలయానికి తెచ్చి స్నానం చేయించి, కొత్తబట్టలు కట్టబెట్టి, సుష్టుగా భోజనం పెట్టారు. పూలతో అలంకరించారు. వాద్యాలు మ్రోయించారు. కాళికాదేవి ముందు కూర్చోబెట్టారు. అప్పుడు వృషలపతి అతని తల ఖండించడానికి ఖడ్గం పైకెత్తాడు. ఎత్తిన చేయి క్రిందికి రాకముందే కాళికాదేవి ఆగ్రహోదగ్రురాలై హుంకరించింది. వికటాట్టహాసం చేస్తూ వృషలపతిని, అతని భటులను తలలు తెగి క్రింద పడేటట్లు నరికింది. వృషలుని శిరాన్ని చేతబూని ఆ దేవి ఆనందనృత్యం చేసింది. బ్రాహ్మణులకు కీడు చేయబోయినవారు తామే చెడిపోతారు. ఇది సత్యం. ఎందుకంటే హరి బ్రాహ్మణులలో వుంటాడు, వారంటే ఆయనకు ప్రియం గనుక. ఇక బలి యివ్వడానికి తేబడిన బ్రాహ్మణుడు తొణకలేదు, బెణకలేదు. తనను చంపబోయిన వారిలోను, ఖడ్గంలోను, తన్ను గాచిన కాళిలోను

ఆయనకు శ్రీహరే కనిపించాడు. నిర్భయంగా, దేహాభిమానం లేక, సాక్షిగా చూస్తున్న ఆయన మనస్సు దైవంపైనే సుస్థిరమై చెదరకుండా వుంది. రాజు, భటులు మరణించాక అతడు లేచి తత్తరపాటు లేకుండా తిరిగి తను వచ్చిన చోటికే వెళ్ళి చేనుకు కావలి వున్నాడు.

అలా కొంతకాలం గడిచాక, సింధుదేశాన్ని పాలించే రాజు, ఇక్షుమతీ తీరానవున్న కపిలమహామునివద్ద తత్త్వజ్ఞానాన్ని పొందాలనే కోరికతో పల్లకీపై బయలుదేరాడు. మార్గమధ్యంలో బ్రాహ్మణరూపంలో వున్న భరతుడిని చూచి బోయీలు, దుక్కలా వున్నాడు, పల్లకీ మోయడానికి బాగా పనికివస్తాడని తలచి అతడిని తీసుకొనివెళ్ళి పల్లకీ మానుని అతని భుజంపై పెట్టి నడిపించారు. కాని అతని నడక మిగతా ముగ్గురి నడకతో సమానంగా లేనందున పల్లకి అటూ ఇటూ వూగడం మొదలుపెట్టేసరికి రాజుగారికి కోపం వచ్చింది. ఎందుకిట్లా అయ్యింది. ఇప్పటివరకు బాగానే వుందే అని అడిగాడు. అప్పుడు వారు ఆ బ్రాహ్మణుని దెచ్చిపెట్టామని, అతడు సరిగ్గా నడవడం లేదని చెప్పారు. రాజు, మొద్దులా వున్నావు పల్లకీ మోయలేవా అని తిట్టాడు. బ్రాహ్మణుడు బదులు చెప్పలేదు. మౌనంగా నిష్ఠూరాన్ని సహించాడు. కాని అతని నడక మారలేదు. రాజుకు మరింత కోపం వచ్చి, మదమెక్కిందా, నా మాట లెక్కచేయక వంకరటింకరగా నడుస్తున్నావు. నాలుగు దెబ్బలు పడితే నీ నడక సరిఅవుతుంది, శరీరాన్ని ఇంత పెంచావుగాని బరువు మోయలేక కుంటుతున్నావు, ఏం మాయరోగం అంటూ తిడుతూ దండించాడు.

బ్రహ్మస్వరూపంగా వున్న ఆ బ్రాహ్మణుడు నవ్వుతూ, రాజా, మానావమానాలు, సుఖదుఃఖాలు శరీరానికేగాని ఆత్మను అంటవు, బరువు మోసేది, బాధపడేది ఈ దేహమే గాని నేను గాదు. చేసేపనులను బట్టి ఒకడు రాజు, మరొకడు భటుడు అవుతున్నారు గాని జీవులొక్కటే గదా! నీ స్వభావం నిన్ను నడిపిస్తున్నట్లే నా స్వభావం నన్ను నడిపిస్తున్నది కాబట్టి నీవు దూషించినా, శిక్షించినా ప్రయోజనం వుండదు, అని యథావిధిగా పల్లకిని మోస్తూ నడుస్తున్నాడు. ఈ మాటలు విన్నాక రాజు ఆశ్చర్యపోయాడు. తాను కోరి వెదుకుతున్న తత్త్వజ్ఞానాన్ని ఉపదేశించినవాడు సామాన్యుడు కాడని తలచి పల్లకి దిగి బ్రాహ్మణునకు సాష్టాంగప్రణామం చేశాడు. ఎవరు నువ్వు? అవధూతవేషంలో ఎందుకు తిరుగుతున్నావు? నీ గొప్పతనం తెలియక తప్పుచేశాను, నన్ను క్షమించు. నేను కపిలమహామునివద్ద బ్రహ్మవిద్య నేర్చుకోడానికి పోతున్నాను, అని చెప్పాడు. దానికి బ్రాహ్మణుడిలా అన్నాడు.

ఇంద్రియాలు విషయాలవైపు లాగుతుంటే చిత్తం గుణాల ప్రభావంవలన వికారం పొందుతుంది. కాలప్రభావం వలన వచ్చే సుఖదుఃఖాలను అనుభవిస్తుంది. అలాంటి అంతరంగం గుణరహితమైతే ముక్తికి మార్గం దొరుకుతుంది. దీపంలో నెయ్యి, వత్తులు వేస్తే పొగ, వెలుగు వస్తాయి. అవి రెండూ పూర్తిగా కాలిపోతే దీపం తన రూపంలో తానుంటుంది అలాగే మనస్సు కూడా. విషయవాసనలను, గుణవికారాలను నశింపజేస్తే నిర్మలమవుతుంది. ఆత్మస్వరూపం అవగతమవుతుంది. ఇంద్రియాలు, అహంకారంతో కూడిన మనస్సు జీవుని జన్మపరంపరకు కారణమవుతున్నది. ప్రపంచవిషయాలపైన సంసారసుఖాలపైన ఆసక్తి వున్నంతకాలం జననమరణ వలయంలో చిక్కుకొని జీవుడు పరిభ్రమిస్తుంటాడు. శ్రీహరిని భక్తితో సేవించి, చిత్తాన్ని జయించినవానికి ముక్తి సులభమవుతుంది.

అని బ్రాహ్మణుడు చెప్పగా రాజు ఆయనకు సాగిలపడ్డాడు. వేడిమిలో దాహంతో వున్నవానికి చల్లని నీరులా నీ ఉపదేశం నాకెంతో ఆహ్లాదం కలిగించిందని మెచ్చుకొన్నాడు. నా సంశయాలు తీర్చే సామర్థ్యం మీకే వున్నది. తత్త్వయోగాన్ని నాకు విశదపరచండని వేడుకొన్నాడు. అప్పుడా బ్రాహ్మణుడు ఇలా చెప్పాడు. మన అనుభవాలన్నీ పూర్వం చేసిన కర్మవల్ల కలుగుతున్నాయి. చిత్తం సంసార వ్యవహారాలలో మునిగి వున్నంతవరకు తత్త్వయోగం వంటబట్టదు. గర్వాన్ని, అహంకార మమకారాల్ని వదిలివేసి పరిశుద్ధమైన మనస్సుతో ఈ తత్త్వజ్ఞానాన్ని గ్రహించు. పరమాణువుల సముదాయమే ఈ భూమి. నామరూపాలతో కూడిన ఈ జగత్తు నిత్యమూ కాదు, సత్యమూ కాదు. అది మాయాకల్పితం. అవిద్య మాయకు ఆశ్రయం. అవిద్యతో నిండిన మనస్సుకు సత్యమైన బ్రహ్మం గోచరించదు. నేను పూర్వం భరతుడనే రాజును. సర్వసంగపరిత్యాగం చేసి ఆశ్రమవాసినై భగవంతుని కొలుస్తూ వున్నప్పటికి, జింకపిల్లపైన ఎనలేని మమకారం పెంచుకొని బంధాల్లో తగులుకొన్నాను. జింకనై పుట్టాను. అయినా హరినామస్మరణ మరువలేదు గనుక తర్వాత జన్మలో బ్రాహ్మణుని ఇంట పుట్టాను. సంసారవ్యామోహంలో పడకుండా ఏకాకినై ఇలా తిరుగుతున్నాను. నీవు కూడా ఇంద్రియాలను జయించి, దేహాభిమానాన్ని, సంసారంపైన వున్న భ్రమలని వదిలి, జీవకోటినంతా ప్రేమిస్తూ సమదృష్టితో చూస్తూ, అంతర్యామియైన పరమాత్మను ధ్యానించి జ్ఞానమార్గంలో పయనించుమని చెప్పగా రాజు హర్షించి, బ్రాహ్మణునితో, మీ పాదధూళి సోకడంవలన నా పాపాలన్నీ పటాపంచలయ్యాయి, హరిభక్తి అధికమైంది అంటూ నమస్కరించాడు. అవధూత రూపంలో వున్న భరతుడు రాజును ఆశీర్వదించి తన దారిన పోగా,

సింధుభూపతి తత్త్వజ్ఞాన సంపన్నుడై దేహాభిమానాన్ని విడిచిపెట్టాడు అని శుకుడు పరీక్షిత్తుకు చెప్పినట్లు సూతుడు మునులకు తెలియజేశాడు.

శుకుడు పరీక్షిత్తుకు చెప్పిన తదనంతర చరిత్రను సూతుడు మునులకు చెబుతున్నాడు.

భరతుని అనంతరం అతని కొడుకు సుమతి ధర్మవర్తనుడై రాజ్యాన్ని పాలిస్తుండగా పాషండులు అతని మతాన్ని మార్చారు. బుద్ధదేవుని కొలిచినట్లు నిన్ను కూడా కొలుస్తామని పొగడి అతనికి తమ మతాన్ని బోధించారు. సుమతికి దేవతాజిత్తు, అతనికి దేవద్యుమ్నుడు, అతనికి పరమేష్ఠి, అతనికి ప్రతీహుడు జన్మించారు. ప్రతీహుడు అందరికీ బ్రహ్మోపదేశం చేసిన శుద్ధాత్ముడు. హరిస్మరణలోనే జీవితం గడిపాడు. అతనికి ప్రతిహర్త, ప్రస్తోత, ఉద్గాత అనే ముగ్గురు కొడుకులు. యజ్ఞకర్మ నిపుణులుగా పేరుగాంచారు. ప్రతిహర్తకు వ్యోమ, భూమ అనే ఇద్దరు కొడుకులు కలిగారు. భూమునకు ఉద్గీథుడనే కొడుకు పుట్టాడు. అతనికి ప్రస్తోత పుట్టగా అతనికి విభుడు, విభునికి పృథుషేణుడు, అతనికి నక్తుడు జన్మించారు. నక్తునికి రాజర్షి అయిన గయుడు పుట్టి మహాకీర్తి గడించాడు. సత్త్వగుణ సంపన్నుడైన గయుడు ఆత్మజ్ఞాని. ధర్మమార్గాన ప్రజలను పాలించాడు. యజ్ఞయాగాది క్రతువులు చేసి దేవతలను తృప్తిపరిచాడు. దేహాభిమానాన్ని విడిచి శ్రీహరినే చిత్తంలో నిలిపి సకలప్రాణులు సంతసించేటట్లుగా రాజ్యపాలన చేశాడు. ఆ గయునికి చిత్రరథుడు, స్వాతి, అవరోధనుడు అనే ముగ్గురు కొడుకులు పుట్టారు. చిత్రరథునికి సమ్రాట్టు, వానికి మరీచి, అతనికి బిందుమంతుడు, అతనికి మధువు, అతనికి వీరవ్రతుడు, అతనికి మన్యు, ప్రమన్యులు పుట్టారు. మన్యువునకు భువనుడు, అతనికి త్వష్ట, త్వష్టకు విరజుడనేవారు జన్మించారు. విరజునకు నూర్గురు కొడుకులు, ఒక కూతురు కలిగారు. ప్రియవ్రతుని వంశం అంతటితో అంతమయ్యింది అని శుకుడు చెప్పగా పరీక్షిత్తు ఇలా ప్రశ్నించాడు.

మునీంద్రా! ప్రియవ్రతుని రథచక్రాలు సూర్యకిరణాలు, చంద్రకిరణాలు పడినంతమేర తిరగడంవలన సప్తద్వీపాలు, సప్తసముద్రాలు అయ్యాయని చెప్పావు. ఇప్పుడు వాటి పరిమాణాలు తెలుసుకోవాలని వుంది. సవిస్తరంగా చెప్పండి అని అడగ్గా శుకయోగి ఇలా చెప్పాడు.

## భూగోళ స్వరూపం

నరేంద్రా! భూమండలానికి మధ్యన జంబూద్వీపం వుంది. దాని పొడవు లక్ష యోజనాలు. వెడల్పు కూడా అంతే వుంటుంది. తామరాకులా గుండ్రంగా వున్న

జంబూద్వీపంలో 9 వర్షాలు, 8 మహాపర్వతశ్రేణులు వున్నాయి. అందులో ఇలావృతవర్షం మధ్యన వుంది. దాని మధ్యన వున్నది మేరువు అనే పర్వతరాజం. దాని ఎత్తు లక్ష యోజనాలు. దానికి ఉత్తరాన నీల, శ్వేత, శృంగవత్ పర్వతాలు రెండువేల యోజనాల దాకా విస్తరించాయి. వాటి మధ్యలో రమ్యక, హిరణ్మయ, కురువర్షాలున్నాయి. అవి 9 వేల యోజనాల విస్తారం కలిగినవి. ఇలావృత వర్షానికి దక్షిణాన నిషధ, హేమకూట, హిమవత్పర్వతాలున్నాయి. ఆ పర్వతశ్రేణులమధ్యన కింపురుష, హరివర్ష, భారత వర్షాలున్నాయి. ఇలావృతానికి పడమట మాల్యవత్పర్వతం, తూర్పున గంధమాదనం వున్నాయి. మాల్యవత్‌పర్వతంనుంచి సముద్రం వరకు వున్నదాన్ని కేతుమాలవర్షం అంటారు. గంధమాదన పర్వతానికి తూర్పున సముద్రం వరకు వ్యాపించింది భద్రాశ్వవర్షం. మేరువుకు తూర్పున మందరపర్వతం, దక్షిణాన మేరుమందర పర్వతం, పడమట, ఉత్తరాన కుముదపర్వతాలున్నాయి. మేరుశిఖరాన పదివేల యోజనాల పొడవు, అంతే వెడల్పుగల సువర్ణమయమైన బ్రహ్మపురం వుంది. దానికి ఎనిమిది దిక్కులా లోకపాలుర పురాలు వున్నాయి. బ్రహ్మపురిలో మునుపు హరి త్రివిక్రముడై ఒక పాదాన్ని భూమిమీద వుంచి రెండోపాదాన్ని అంతరిక్షంలో పెట్టినప్పుడు, బొటనవేలిగోరు గ్రుచ్చుకొని భూమి బ్రద్దలయ్యింది. బయటవున్న నీరు శ్రీహరి పాదాన్ని స్పర్శిస్తూ భూమిలో ఏర్పడిన గుంటలోనికి ప్రవహించగా అది భగవత్పాది అనే పేరుతో ప్రసిద్ధమయ్యింది. విష్ణుపదం చేరిన ధ్రువుడు ప్రతిదినమూ భక్తితో ఆ నీటిని నేటికీ తలపై చల్లుకొంటాడు. సప్తర్షులు కూడా ఆ [illegible]న్ని తలదాలుస్తారు. ఆ నీరు బ్రహ్మపురికిగల నాల్గు ద్వారాలనుంచి నలువైపులా ప్రవహించి సముద్రంలో కలుస్తుంది. తూర్పు ద్వారాన్నుంచి వెడలిన నదిని సీత అంటారు. ఆ నది కేసరావలయాన్ని తడుపుతూ గంధమాదనాద్రికి వెళ్ళి అక్కడనుంచి భద్రాశ్వవర్షాన్ని సస్యశ్యామలం చేస్తూ తూర్పు సముద్రంలో కలిసిపోతుంది. పడమటిద్వారంనుంచి చక్షువనే నది బయలుదేరి మాల్యవత్పర్వతంమీదుగా కేతుమాల వర్షాన్ని పవిత్రం చేస్తూ పడమటి సముద్రంలో పడుతుంది. ఉత్తరంవైపునుంచి భద్ర అనే నది వెడలి కుముద, నీల, శ్వేత పర్వతాల మీదుగా శృంగపర్వతానికి వెళ్ళి, మానసకు ఉత్తరాన వున్న కురుభూములకు ప్రాణదానం చేస్తూ ఉత్తరసముద్రంలో కలుస్తుంది. దక్షిణద్వారంనుంచి అలకనంద అనే మహానది బయలుదేరి హేమకూట, హిమాలయ పర్వతాలను దాటి, అతివేగంగా, కర్మక్షేత్రమైన భారతవర్షాన్ని పావనం చేస్తూ దక్షిణసముద్రంలో కలుస్తుంది.

మేరువు మొదలుకొని వున్న ఈ పర్వతాలలో వేలకొలది నదులు పుడుతున్నాయి.

జంబూద్వీపంలో భారతవర్షం కర్మభూమి. మిగతావర్షాల్లో దివినుంచి భువికి వచ్చినవారు తమ పుణ్యకర్మల ఫలంలో మిగిలినదాన్ని అనుభవిస్తారు. భూలోకస్వర్గం అనదగిన ఆ వర్షాల్లో మనుష్యులు దీర్ఘాయువులు, అమిత బలసంపన్నులు, దేవతాసమానులు, భోగలాలసులు. వారికి శృంగారమే జీవితపరమావధి. మోక్షం కూడా అక్కరలేదు. ఈ ఎనిమిది వర్షాలలోను దేవతాగణాలు సంచరిస్తూ వినోదిస్తూ వుంటాయి. ఇలావృత వర్షాధిపతి శివుడు. అక్కడ ఆయన ఒక్కడే పురుషుడు. పార్వతీదేవి శాపంవలన అక్కడికి ఏ మగవాడు వచ్చినా ఆడదిగా మారిపోతాడు కాబట్టి ఎవ్వరూ అక్కడికి పోరు. శంకరుడు హరిని మనస్సులో నిలిపి జపతపాలు చేస్తుంటాడు. 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అనే మంత్రాన్ని అనుదినం జపం చేస్తాడు.

భద్రాశ్వ వర్షాన్ని ఏలేవాడు భద్రశ్రవుడు. అక్కడి జనులు హయగ్రీవుడిని ఆరాధిస్తారు. 'ఓం నమో భగవతే ధర్మాయాత్మ విశోధనాయ నమః' అనే మంత్రాన్ని జపిస్తారు. ఆ మంత్రసిద్ధివలన ముక్తి పొందుతారు. హరివర్షానికి అధిపతి నరహరి. అక్కడి జనులు, దైత్య దానవకులోత్తములు, ప్రహ్లాదాది పెద్దలతో కలిసి ఆ నృసింహుని పూజిస్తారు. కేతుమాలవర్షంలో భగవంతుడు కామదేవుని రూపంలో వుంటాడు. శ్రీదేవి, ప్రజాపతి పుత్రులు, పుత్రికలు కామదేవుని స్తోత్రపాఠాలతో అర్చించి పూజిస్తారు. రమ్యకవర్షానికి మత్స్యరూపమైన హరి అధిదేవత. హిరణ్మయవర్షానికి కూర్మావతారియైన హరి అధిదేవత. ఉత్తర కురుభూములకు వరాహరూపుడైన హరి అధిపతి. కింపురుషవర్షానికి సీతాలక్ష్మణ సమేతుడైన శ్రీరామచంద్రుడు అధిదేవత. అంజనీసుతుడైన హనుమంతుడు, కింపురుషులు ఆయనను ఉపాసిస్తారు. భారతవర్షానికి అధిపతి బదరికాశ్రమంలో వుండే నారాయణుడు. భారతవర్షంలోని ప్రజలు, నారదాదులు ప్రేమతో ఆయన్ని కొలుస్తారు.

భారతవర్షంలో పవిత్రమైన పర్వతక్షేత్రాలు, పుణ్యతీర్థాలు చాలా వున్నాయి. పర్వతాలలో ముఖ్యమైనవి మలయపర్వతం, మంగళప్రస్థం, మైనాకం, త్రికూటం, రుషభపర్వతం, కూటరం, కోల్లం, సహ్యాపర్వతం, వేదగిరి, రుష్యమూకం, శ్రీశైలం, వేంకటాద్రి, మహేంద్రం, వారిధరం, వింధ్య, శుక్తిమత్పర్వతం, రుక్షగిరి, పారియాత్రం, ద్రోణం, చిత్రకూటం, గోవర్ధనగిరి, రైవతకం, కకుంభం, నీలగిరి, కాకముఖం, ఇంద్రకీలం, రామగిరి ఇత్యాదులు. ఆ పర్వతాలనుంచి పుట్టిన నదులు చంద్రపట, తామ్రపర్ణి, నవటోద, కృతమాల, వైహాయసి, కావేరి, వేణి, పయస్విని, పయోద, శర్కరావర్త, తుంగభద్ర, కృష్ణవేణి, భీమరథి, గోదావరి, నిర్వింధ్య, పయోష్ణ, తాపి, రేవా, శిలా, సురస, చర్మణ్వతి, వేదస్మృతి, రుషికుల్య, త్రిసమ, కౌశికి, మందాకిని, యమున,

సరస్వతి. దృషద్వతి, గోమతి, సరయు, భోగవతి, సుషమ, శతద్రువు, చంద్రభాగ, మరుద్వృధ, వితస్త, నసిక్నీ, విశ్వ మొదలైనవి. ఇవిగాక నర్మద, సింధువు, శోణ అనే నదాలు కూడా వున్నాయి. ఈ నదీనదాలలో స్నానం చేసిన మానవులు ముక్తిచెందుతారు. భారతవర్షంలో జన్మించిన పురుషులు నలుపు, తెలుపు, ఎరుపు రంగులలో వుంటారు. వాళ్ళు చేసే కర్మలనుబట్టి నరకలోకానికి, స్వర్గలోకానికి, మానవలోకానికి పోతారు. వాసుదేవుని భక్తియోగంద్వారా ఆరాధించేవారు ఉత్తమగతిని పొందుతారు. ఈ భారతవర్షంలో హరి పలుమార్లు పుట్టి జీవకోటికి తత్త్వం ఉపదేశించి బంధువులా, స్నేహితుడిలా, ప్రజలను కాపాడుతుంటాడు.

భారతవర్ష జంతువుల భాగ్యములేమని చెప్పవచ్చు, నీ
భారతవర్షమందు హరి పల్మఱు బుట్టుచు జీవకోటికిం
ధీరతతోడ దత్త్వముపదేశము సేయుచు జెల్మి సేయుచు
న్నారయ బాంధవాకృతి గృతార్థుల జేయుచునుండు నెంతయున్.

అందువలన ఇది పుణ్యభూమి. ఇక్కడి జనానికి అసాధ్యం లేదు. నారాయణుని స్మరించడంవలన సకలపాపాలు నశిస్తాయి. జంబూద్వీపంలో సగరుని కుమారులు అశ్వమేధాశ్వం వెదుకుతూ భూమిని తవ్వడంవల్ల స్వర్ణప్రస్థ, చంద్రశుక్ల, అవర్తన, రమణక, మందేహారుణ, పాంచజన్య, సింహళ, లంక అనే 8 ఉపద్వీపాలు ఏర్పడ్డాయి.

జంబూద్వీపం లక్షయోజనాల విస్తీర్ణం గలిగి లవణసముద్రంచేత చుట్టబడి వుంటుంది. ప్లక్షద్వీపం చెరకురస సముద్రంలో వుంది. దాని విస్తీర్ణం రెండులక్షల యోజనాలు. అక్కడ రావిచెట్లు అధికం. అక్కడివారికి అగ్నిదేవుడు అధిదేవత. ప్రియవ్రతుని కొడుకు ఇధ్మజిహ్వుడు దానికి రాజు. అతడు ఆ ద్వీపాన్ని ఏడు వర్షాలుగా విభజించాడు. తన ఏడుగురు కొడుకులను ఏడువర్షాలకు అధిపతులుగా జేసి ఆయన తపస్సు చేసుకోడానికి వెళ్ళాడు. ఆ ద్వీపంలో ఏడు కులపర్వతాలు, ఏడు మహానదులు వుండగా హంస, పతంగ, గోర్ధ్వాయన, సత్యాంగులనే నాలుగు వర్ణాల ప్రజలున్నారు. అందులో పురుషులు వెయ్యి సంవత్సరాలు జీవిస్తారు. వాళ్ళు కష్టంలేకుండా కంటిచూపుతోనే పిల్లల్ని కంటారు. సూర్యుని ఆరాధిస్తారు.

నాలుగు లక్షల యోజనాల విస్తీర్ణంగల శాల్మలీ ద్వీపం సురాసముద్రంలో వుంది. బూరుగచెట్లు వున్నందున ఆ ద్వీపానికి శాల్మలి అనే పేరువచ్చింది. ప్రియవ్రతుని కొడుకైన యజ్ఞబాహుడు దానికి రాజు. ఆయనకు ఏడుగురు కొడుకులు. ఆ ద్వీపాన్ని ఏడువర్షాలుగా

విభజించి ఏడుగురు కుమారులకు ఇచ్చాడు. అక్కడ కూడా ఏడు పర్వతాలు, ఏడు నదులు ఉన్నాయి. అక్కడివారు చంద్రుని అరాధిస్తారు.

కుశద్వీపం 8 లక్షల యోజనాల విస్తీర్ణంతో నేతిసముద్రంలో వుంది. అక్కడ దర్భలు జాస్తి. అందుకే కుశద్వీపమనే పేరు వచ్చింది. ప్రియవ్రతుని కుమారుడు హిరణ్యరేతసుడు దానికి రాజు. ఆ ద్వీపాన్ని ఏడువర్షాలుగా విభజించి తన ఏడుగురు కొడుకులకు పంచియిచ్చి తపం చేసుకోడానికి వెళ్ళిపోయాడు. అక్కడ కూడా ఏడుపర్వతాలు, ఏడునదులు వున్నాయి. అక్కడివారు యజ్ఞపురుషుని కొలుస్తారు.

దానితర్వాత పాలసముద్రంలో 16 లక్షల యోజనాల విస్తీర్ణం గల క్రౌంచద్వీపం వుంది. దానిమధ్య క్రౌంచాద్రి అనే పర్వతం వుంది. ఆ ద్వీపానికి అధిపతి ఘృతపృష్ఠుడు. ద్వీపాన్ని ఏడు వర్షాలు చేసి ఏడుగురు కొడుకులకు పట్టం కట్టి ఆయన తపం చేసుకోడానికి వెళ్ళిపోయాడు. ఏడు పర్వతాలు, ఏడు నదులు గల ఆ ద్వీపవాసులు వరుణదేవుని పూజిస్తారు.

క్రౌంచద్వీపానికి అవతల పెరుగు సముద్రంలో శాకద్వీపం వుంది. దాని విస్తీర్ణం 32 లక్షల యోజనాలు. అక్కడ శాకవృక్షాలు వున్నందున ఆ ద్వీపానికి ఆ పేరు వచ్చింది. ప్రియవ్రతుని మరో కుమారుడు మేధాతిథి ఆ ద్వీపాన్ని ఏడుభాగాలు చేసి తన పుత్రులకు అప్పజెప్పి తపస్సు చేసుకోడానికి వెళ్ళిపోయాడు. అక్కడి ప్రజలు వాయుదేవుని భక్తులు. రుతవ్రతులు, సత్యవ్రతులు, దానవ్రతులు, సువ్రతులనే నాలుగు వర్ణాల వాళ్ళుగా వున్నవారు, ప్రాణాయామం చేసి, రజస్తమోగుణాలను వదిలేసి నిశ్చల సమాధిలో ధ్యానం చేస్తారు.

64 లక్షల యోజనాల విస్తీర్ణంగల పుష్కరద్వీపం మంచినీటి సముద్ర మధ్యంలో వుంది. అక్కడ పదివేల బంగారురేకులుగల కమలం వుంటుంది. అది బ్రహ్మకు ఆసనం. ఆ ద్వీపం మధ్యలో మానసోత్తరమనే పర్వతం వుంది. దాని ఎత్తు, వెడల్పు 10 వేల యోజనాలు. దానికి నలుదిక్కులా నాలుగు లోకపాలుర పురాలున్నాయి. పుష్కరద్వీపాధిపతి వీతిహోత్రుడు. ఆయనకు రమణక, ధాతక అనే పేర్లుగల పుత్రులు ఇద్దరున్నారు. తన ద్వీపాన్ని రెండుభాగాలు చేసి వారికి అప్పగించి తపం చేసుకోడానికి వెళ్ళాడు. అక్కడి ప్రజలు బ్రహ్మను ఆరాధిస్తారు. అక్కడ నాలుగు వర్ణాలు లేవు. ఎక్కువ తక్కువలు లేవు. అందరూ సమానులే. పుష్కర ద్వీపానికి ఆవల లోకాలోక పర్వతం వుంటుంది. సముద్రానికి, పర్వతానికి మధ్య రెండుకోట్ల యోజనాల విస్తీర్ణంగల నిర్జనభూమి వుంది. అది దేవతలుండడానికి యోగ్యమైన స్థలం. లోకాలోకపర్వతం 8 కోట్ల యోజనాలు,

దానిమీద నాలుగు దిక్కులలోను రుషభ, పుష్కరచూడ, వామన, అపరాజిత అనే నాలుగు దిగ్గజాలు లోకరక్షణార్థం బ్రహ్మచేత ఏర్పాటుచేయబడ్డాయి. ఆదిదేవుడైన అచ్యుతుడు తన పార్షదుల (పరిజనం)తోగూడి ఆ పర్వతంపై కల్పపర్యంతం యోగమాయను కప్పుకొని వుంటాడు. భగవంతునికి తప్ప ఆ పర్వతం ఆవల సంచరించడం ఎవరికీ సాధ్యం కాదు. బ్రహ్మాండానికి సూర్యుడు మధ్యగా వుంటాడు. ఆ సూర్యునికి రెండువైపులా 25 కోట్ల యోజనాల పరిమాణంలో బ్రహ్మాండం యొక్క పైపెంకు వుంటుంది. ఆ సూర్యుడే సర్వజీవులకు ఆత్మ. ఇదీ భూమండలం యొక్క కూర్పు. ఇప్పుడు ఖగోళాన్ని గురించి చెబుతాను వినుమని శుకుడు పరీక్షిత్తుకు తెలిపాడు.

## ఖగోళ వర్ణన

సూర్యుడు మూడులోకాలకు వేడిని, వెలుగును ఇస్తాడు. ఉత్తరాయణంలో పగళ్ళను దీర్ఘంగాను, దక్షిణాయనంలో పొట్టిగాను, విషువత్తులలో రాత్రి పగలు సమానంగాను చేస్తాడు. మేషరాశిలోను, తులారాశిలోను సూర్యుడున్నప్పుడు పగలు, రాత్రి సమంగా వుంటాయి. సూర్యుడు వృషభాది పంచరాశులలో వున్నప్పుడు రాత్రిళ్ళు ఒక్కొక్క గడియ తగ్గుతుంటుంది. వృశ్చికాది పంచరాశులలో వున్నప్పుడు రాత్రి సమయం ఒక్కొక్క గడియ పెరుగుతుంటుంది. ఆ ప్రకారమే నెలకు ఒక గడియ చొప్పున పగటిసమయం తగ్గుతుంది. పగలు రాత్రి కలిసిన ఒక దినంలో 9 కోట్ల 51 లక్షల యోజనాల పరిమాణంగల మానసోత్తర పర్వతాన సూర్యరథం తిరుగుతుంటుంది. ఆ పర్వతానికి తూర్పున దేవధాని అనే ఇంద్రపురం, దక్షిణాన సంయమని అనే యమనగరం, పడమట నిమ్లోచని అనే వరుణపట్టణం, ఉత్తరాన విభావరి అనే సోముని పట్టణం వుంటాయి. సూర్యుడు ఇంద్రనగరం నుంచి బయలుదేరిన 15 గడియలలో 2,37,75,000 యోజనాలు నడుస్తాడు. ఈ విధంగా సూర్యుని రథం ఇంద్ర, యమ, వరుణ, సోమపురాలమీద చంద్రాది గ్రహనక్షత్రాలతో కలిసి సంచరిస్తూ 12 నెలలు, 6 రుతువులుగల, 1 సంవత్సరంలో చుట్టివస్తుంది. ఆ రథానికి గాయత్రీ ఛందం మొదలైన ఏడు ఛందాలు అశ్వాలై వుంటాయి. అరుణుడు రథసారథి బొటనవ్రేలంత శరీరాలుగల 60 వేలమంది, వాలఖిల్యులని పిలువబడే రుషివరులు సూర్యునిముందు సౌరసూక్తం చదివి స్తుతిస్తుండగా, మునులు, గంధర్వ కిన్నర కింపురుషులు, నాగులు, అప్సరసలు, పతంగులు నెలనెలా వరుసక్రమంలో సేవిస్తుండగా, 9,51,000,00 యోజనాల పరిమాణం గల భూమండలాన్ని ఒక్కదినంలో చుట్టివస్తాడు. మేరు, ధ్రువులకు ప్రదక్షిణం

చేసే సూర్యుడు రాశులలో ఎలా సంచరిస్తాడని పరీక్షిత్తు అడగ్గా శుకుడు ఇలా చెబుతున్నాడు.

కుమ్మరిచక్రం తిరుగుతున్నప్పుడు దానిమీదవున్న చీమకు తానెక్కడెక్కడికో వెళుతున్నట్లు తోస్తుంది. కాని యథార్థానికి అది చక్రంపైనే వుంది. అలాగే నక్షత్రరాసులతో కూడిన కాలచక్రం ధ్రువ, మేరువులకు ప్రదక్షిణం తిరిగేటప్పుడు ఆ కాలచక్రంతో సంచరించే సూర్యాది గ్రహాలు నక్షత్రాలలోకి, రాశులలోకి పోయినట్లు కనిపిస్తుంది. పైగా సూర్యాదులకు సొంతవేగం, కాలచక్రం యొక్క వేగం అని రెండు రకాల గమనాలుంటాయి. ఆ విధంగా సూర్యుడు ఒక ఏడాదిలో 12 రాశులలో సంచరిస్తాడు. సూర్యుని గమనకాలాన్ని అయనాలని, రుతువులు, మాసాలు, పక్షాలని, తిధులని వ్యవహరిస్తారు. చంద్రుడు సూర్యమండలంమీద లక్ష యోజనాలుండి శీఘ్రగతిన సూర్యునిలాగానే సంచరిస్తాడు. చంద్రునిమీద లక్ష యోజనాల దూరంలో తారలు మేరువు చుట్టూ ప్రదక్షిణం చేస్తాయి. తారలన్నిటిపైన రెండులక్షల యోజనాలలో శుక్రుడుంటాడు సూర్యుని మాదిరిగానే, ఆయనకు ముందు, వెనుక సంచరిస్తాడు భూమిపై వర్షాలు కురిపించి ప్రజలకు మేలు చేస్తాడు. ఆ మీద రెండులక్షల యోజనాల దూరంలో సౌమ్యుడు (బుధగ్రహం) తిరుగుతూ కరవులు, దోపిడీల భయాన్ని కలిగిస్తాడు. ఆపైన రెండులక్షల యెజనాల దూరంలో అంగారకుడు మూడు పక్షాలకు ఒకరాశి చొప్పున దాటుతూ 12 రాశులలో సంచరిస్తాడు. తరచుగా ప్రజలకు పీడలు కల్పిస్తాడు. ఆపైన 2 లక్షల యోజనాలలో దేవగురుడైన బృహస్పతి ఒక్కొక్క రాశిలో ఏడాది చొప్పున వుంటూ పరిభ్రమిస్తాడు. బ్రాహ్మణులకు శుభాలనిస్తాడు. బృహస్పతికి పైన రెండు లక్షల యోజనాలలో సూర్యుని పుత్రుడైన శని ఒక్కొక్క రాశిలో రెండున్నర యేళ్ళు వుంటాడు. జనులను పీడిస్తాడు. శనిపైన 11 లక్షల యోజనాలలో సప్తర్షులుంటారు. బ్రాహ్మణులకు, లోకులకు మేలు చేయగోరుతారు. ఈ ఏడుగురు మునులకు ఎగువన 30 లక్షల యోజనాలలో శింశుమారచక్రం వుంటుంది.

శింశుమార చక్రంలో ధ్రువుడు, ఇంద్రుడు, వరుణుడు కశ్యపప్రజాపతి అనే ప్రముఖులతో కలసి విష్ణుపదం చేరి ప్రదక్షిణంగా తిరుగుతుంటాడు. ఆ ధ్రువుని మహత్త్వం ఇంతకుముందే చెప్పాను. ఆ ధ్రువుని కట్టుగొయ్యగా జేసుకొని గ్రహనక్షత్రాలు నిర్విరామంగా తిరుగుతుంటాయి. శింశుమారచక్రం తలక్రిందుగా వట్రువ(6)లా వుంటుంది. దాని తోకచివర ధృవుడుంటాడు. ప్రజాపతి, అగ్ని, ఇంద్రుడు, యముడు కూడా అక్కడే వుంటారు. తోక మొదట బ్రహ్మ, నడుంవద్ద సప్తర్షులు, దక్షిణావర్త కుండలీభూత శరీరంలో ఉత్తరాయణ నక్షత్రాలు, దక్షిణపార్శ్వంలో దక్షిణాయన నక్షత్రాలు, వెనుకభాగంలో

దేవమార్గం, ఆకాశగంగ, ఉత్తరభాగాన పునర్వసు, పుష్యమి, దక్షిణాయనాన ఆర్ద్ర, ఆశ్లేష, కుడిపాదాన అభిజిత్తు, ఎడమ పాదాన ఉత్తరాషాఢ, కుడి ముక్కులో శ్రవణం, ఎడమముక్కులో పూర్వాషాఢ, కుడికంట్లో ధనిష్ఠ, ఎడమ కంట్లో మూల, కుడిచెవిలో, ఎడమచెవిలో మఖ మొదలైన 8 నక్షత్రాలు, ఎడమప్రక్క దక్షిణాయనం, కుడిప్రక్క కృత్తికాది మూడు నక్షత్రాలు, ఉత్తరాయణం, ఎడమ భుజాన శతభిషం, కుడి భుజాన జ్యేష్ఠ, దవడలో ఎడమవైపు అగస్త్యుడు, కుడివైపు యముడు, ముఖంలో అంగారకుడు, తర్వాత శని, బృహస్పతి, వక్షంలో ఆదిత్యుడు, బొడ్డున శుక్రుడు, మనస్సులో చంద్రుడు, రొమ్ముల్లో అశ్వినులు, ప్రాణాపానాలలో బుధుడు, సర్వాంగాలలో కేతుగ్రహాలు, వెంట్రుకలలో తారలు వున్నారు. అది సర్వదేవతామయమైన పుండరీకాక్షుని దివ్యదేహం. ఇట్టి దివ్యశరీరాన్ని ప్రతిదినం సంధ్యాకాలంలో భక్తితో మనస్సులో నిలిపి ధ్యానం చేస్తే సకలార్థాలు సిద్ధిస్తాయి.

సూర్యమండలానికి 10 వేల యోజనాల దిగువన రాహు మండలం వుంది. రాహుగ్రహం అపసవ్యగతిలో నడుస్తుంది. రాహువు అసురాధముడైనప్పటికి బ్రహ్మవరం పొంది అమరుల సరసన గ్రహవిహార పదవి పొందాడు. అతి విశాలమైన సూర్యమండలాన్ని, 12వేల యోజనాల విశాలమైన చంద్రమండలాన్ని, 13వేల యోజనాల విస్తీర్ణంగల రాహుగ్రహం పర్వదినాలలో కప్పివేయడాన్ని అందరూ గ్రహణం అంటారు. సూర్యచంద్రులను కాపాడ్డానికి హరి సుదర్శనచక్రాన్ని పంపిస్తాడనే భయంతో ఆరుగడియలలో రాహువు తొలగిపోతాడు. రాహువుకు క్రింద సిద్ధ, చారణ, విద్యాధరులు తిరుగుతుంటారు. వారికి పదివేల యోజనాల క్రింద యక్షులు, భూతప్రేతాలు, రాక్షసులు, పిశాచాలు సంచరిస్తారు. వారికి క్రింద మేఘమండలం వుంది. గాలికి కదిలే మేఘమండలం క్రింద భూమండలం వుంది. భూమండలానికి క్రింద యోజనం తేడాతో ఒకదానికొకటి క్రిందుగా అతల, వితల, సుతల, రసాతల, తలాతల, మహాతల, పాతాళలోకాలున్నాయి. వాటిలో కామభోగాలు, ఐశ్వర్యానందాలు అనుభవిస్తూ దైత్యులు, దానవులు, కద్రువ సంతతి అయిన నాగులు నివసిస్తారు. వారికి సుఖభోగాలకు కావలసిన భవనాలు, ఉద్యాన, క్రీడా, విహారస్థానాలు, దాసదాసీలు, దృఢకాయాలు వున్నాయి.

పాతాళంలో మయుడు నిర్మించిన పట్టణాలున్నాయి. వాటికి రత్నాలతో నిర్మించిన ప్రాకారాలు, లోపల భవనాలు, గోపురాలు, సభామందిరాలు మొదలైనవన్నీ వున్నాయి. పూలతోటలు, పండ్లతోటలు, చిలుకలు, గోరింకలు మొదలైన పక్షులతో నిండిన ఉద్యానవనాలు, వాటిలోజంటలు జంటలుగా విహరించే నాగులు, అసురులు కనిపిస్తారు.

సరోవరాలు కూడా నీటిపక్షులతో కనువిందు చేస్తుంటాయి. అక్కడ రాత్రి, పగలు అనే కాలవిభజన లేదు. ఆదిశేషుని తలపై వున్న రత్నాల కాంతివలన చీకటిలేక ఎల్లప్పుడూ పట్టపగలుగానే వుంటుంది. ఆ లోకంలోని జనులు ఔషధాలు, రసాయనాలు అనవరతం అన్నపానాలుగా సేవించడంవలన వారికి మనోవ్యాధులు, ముసలితనం, శారీరకబాధలు, జుట్టు తెల్లబడటం, వళ్ళు చెమటపట్టడం వంటివి ఏమీ వుండవు. హరి చక్రభయం తప్ప వారికి మృత్యుభయం కూడా లేదు.

అతలంలో మయుని కొడుకైన బలాసురుడు మాయలతో వినోదిస్తూ తిరుగుతుంటాడు. అక్కడ ఆ మాయల ప్రభావంవలన మతిభ్రమించి మోహంలో మునిగినవారు నేటికీ కనిపిస్తారు. ఆ బలుని ఆవలింతలనుంచి కామినులు, జారిణులు,స్వైరిణులు అనే స్త్రీ గణాలు పుట్టారు. వాళ్ళు పాతాళంలో ప్రవేశించిన పురుషునికి హాటకరసం అనే సిద్ధరసఘుటికను యిచ్చి అతనిని రససిద్ధుని చేసి అతనితో కామభోగాలు, శృంగారలీలలు అనుభవిస్తారు. రతిక్రీడలలో ఆనందం పొందుతూ, అతడు మదాంధుడవుతాడు.

వితలంలో శివుడు భూతసమూహాలతో వుంటాడు. బ్రహ్మసృష్టికి తోడ్పడుతూ పార్వతితో సంభోగించగా వారికి పుట్టిన హాటకి అగ్నిని భక్షించి ఉమ్మివేయగా అది హాటకమయ్యింది. అదే శుద్ధ మేలిమి బంగారం. దానితో అక్కడున్న జనులందరూ భూషణాలు చేయించుకొంటారు.

సుతలంలో బలిచక్రవర్తి వుంటాడు. ఆయన విరోచనుని పుత్రుడు. దానవవైరి అయిన దామోదరుడు అదితి గర్భాన వామనుడై పుట్టి త్రివిక్రముడై ముల్లోకాలను ఆక్రమించి బలిని సుతలానికి పంపాడు. పుణ్యకర్మలు చేస్తూ హరిని ఆరాధిస్తూ బలి ఆ లోకంలో ఇంద్రునిలా వుంటాడు. ఆ బలిచక్రవర్తి గృహద్వారంలో శ్రీమన్నారాయణుడు చక్రం, శంఖం, గద మొదలైన ఆయుధాలు ధరించి వుంటాడు. రావణుడు లోకాలన్నిటిని గెలవాలనే కాంక్షతో బలి వున్న చోటికి రాగా నారాయణుడు అతడిని కాలిబొటనవ్రేలితో తన్ని కొన్ని యోజనాల దూరాన పడేటట్లు చేశాడు.

తలాతలానికి ప్రభువు మయుడు. దేవ నగరిని నిర్మించినవాడు. శివుడు పురత్రయాన్ని నాశనం చేయగా మయుడు విష్ణుని శరణు కోరాడు. ఆయన దయతలచి మయుడిని కాపాడి తలాతలానికి అధిపతిని చేశాడు,.

మహాతలంలో కద్రువ సంతానమైన సర్పాలున్నాయి. వాటిలో ముఖ్యమైనవి గుహకుడు, తక్షకుడు, కాళీయుడు, సుషేణుడు. ఒకటి మించి తలలు కలిగిన ఆ సర్పాలు, గరుత్మంతునికి భయపడుతూ కాలం గడుపుతుంటాయి.

రసాతలంలో దైత్యులు, దానవులు అయిన నివాత, కవచ, కాలకేయులను దేవతాశత్రువులు వుంటారు. వాళ్ళు మహాసాహసవంతులు, కాని శ్రీహరి తేజానికి ముందు నిలవలేక పుట్టలో దూరిన పాముల్లా రసాతలంలో ఆశ్రయం పొందారు.

పాతాళంలో నాగులు క్రీడిస్తాయి. ఆనందంతో జీవిస్తాయి. వాసుకి, శంఖ, కుళిక, మహాశంఖ, శ్వేతధనంజయ, ధృతరాష్ట్ర, శంఖచూడ, దేవదత్త మొదలైన మహానాగులు, ఐదు, ఏడు, పది, నూరు, వేయి శిరాలతో తలలపై ప్రకాశించే మణులతో పాతాళాన్ని కాంతితో నింపుతాయి. అక్కడ 30 వేల యోజనాల వెడల్పున ఆదిశేషుడు చుట్టచుట్టుకొని వుంటాడు.

ఆదిశేషుని తలపై ఈ ధరణి నిలిచి వుంది. శేషునికి సంకర్షణుడనే మరో పేరుంది. ప్రళయకాలంలో లోకాలన్నిటిని నశింపజేయడానికి ఏకాదశరుద్రులను ఆయన సృష్టిస్తాడు. ఆదిశేషుని ఎవ్వరైనా ఆర్తితోగాని, అనుకోకుండాగాని స్మరిస్తే పాపాలు పోతాయి. ఆ అనంతుడు పాతాళంలో వుండి సకలలోకహితం కోసం భూమిని తలపై ధరిస్తాడు అని శుకుడు చెప్పగా పరీక్షిత్తు లోకచరిత్ర మహావిచిత్రంగా వుంది, చాలా చక్కగా వివరించి చెప్పారు, అని ధన్యవాదాలు తెలియజేశాడు.

శుకుడు మళ్ళా చెప్పనారంభించాడు. రాజా! జీవరాశులలో ప్రతి జీవికి ఏదో ఒకదానిపట్ల శ్రద్ధ వుంటుంది. ఆ శ్రద్ధ సాత్త్వికం కావచ్చు, రాజసప్రధానం కావచ్చు, లేక తమోగుణం వల్ల ఏర్పడినది కావచ్చు. అలా ఎందుకుంటుంది అంటే ఆ జీవి చేసే కర్మలను బట్టి ఈ తేడాలు వస్తున్నాయి. ఈ గుణాల కలయికవలన వేర్వేరు స్వభావాలు, శ్రద్ధలు ఏర్పడుతున్నాయి. అయితే చేయకూడని పని, ధర్మవిరుద్ధమైన పని చేసేవాడి శ్రద్ధ విపరీతంగా వుంటుంది. వాడి కర్మకు కలిగే ఫలం కూడా అంతే విపరీతంగా వుంటుంది. ధర్మవిరుద్ధమైన కార్యాచరణ అవిద్యవల్ల జరుగుతుంది. అవిద్యవల్లనే అనేక రకాల కోరికలు పుడుతుంటాయి. పైకి కనిపించే సుఖం వెనుక దుఃఖం పొంచి వుంటుందనే జ్ఞానం లేకపోవడమే అవిద్య. తన నిజస్వరూపం ఏమిటో తెలియకపోవడమే అవిద్య. అలాంటి అజ్ఞానంతో చేసే కర్మల ఫలితం తీవ్రంగా వుంటుంది అని శుకుడు చెప్పగా పరీక్షిత్తు ఇలా అడిగాడు.

మునీంద్రా! పాపకర్మల ఫలితం నరకమే అయితే ఈ నరకం ఎక్కడ వుంటుందో చెబుతారా? అది ముల్లోకాల్లో వుంటుందా? లోకానికి లోకానికి మధ్య వుంటుందా? లోకాలకు వెలుపల వుంటుందా? అలాగాక దేశంలో భూమిమీదే ఎక్కడైనా వుందా చెప్పండి? దానికి శుకుడు సమాధానం చెబుతూ ఇలా అన్నాడు.

# నరకలోక వర్ణన

ముల్లోకాలకు అవతల దక్షిణ దిక్కున అంతరాళంలో ఘోరమైన నరకాలున్నాయి. దక్షిణాన, పితృదేవతలు, వారికి అధిపతియైన యముడు వుంటారు. యముడు తన లోకానికి వచ్చే జీవులకు కర్మకు దగ్గ ఫలాన్నిచ్చి శిక్షిస్తాడు. ఆ శిక్షల అనుభవాలే నరకాలు. అవి 28. ఇతరుల భార్యలను, బిడ్డలను ఎగతాళి చేసే పాపాత్ములను యమభటులు త్రాళ్ళతో కట్టి, బాధిస్తారు. ఈ విధంగా బాధపడుతూ తామిస్రనరకాన బడి, ఆహారం లేకుండా అలమటిస్తున్న జీవుడిని కొట్టి తిట్టి అవమానించి బెదిరించి కొండపైనుంచి క్రిందికి త్రోసి నానాహింసలు పెడతారు. తట్టుకోలేక జీవుడు మూర్ఛలు పోతాడు. పరపురుషుని భార్యను కామించి మోసగించి అనుభవించినవాడు అంధతామిస్రమనే నరకానికి పోతాడు కుటుంబపోషణకోసం ఇతరులకు ద్రోహం చేసేవాడు రౌరవమనే నరకానికి పోతాడు. ఇతరులకు హానిచేయక, సాధువులై తిరిగే పశువులను, పక్షులను, మృగాలను బాధించేవాడిని ఆ జంతువులు, పక్షులు భయంకర రూపాలతో అక్కడ హింసిస్తాయి. అందుకనే ఆ నరకాన్ని రౌరవమని, మహారౌరవమని అంటారు. తన దేహపోషణకోసం ఎవడైనా ఇతర జీవులను చంపినట్లయితే అతడు కుంభీపాక నరకానికి వెళ్ళగా అక్కడ అతడిని మరిగిన నూనెలో వేయిస్తారు. తల్లిదండ్రులకు, బ్రాహ్మణులకు కీడుచేసినవాడు కాలసూత్రమనే భయంకర నరకానికి పోతాడు. అక్కడ పదివేల యోజనాల వెడల్పుగల ఇనుప, రాగి పాత్రలక్రింద మంట పెట్టి వాటిపైన ఆ జీవుడిని మండుటెండలో నడిపిస్తారు. తిండిపెట్టరు, నీళ్ళివ్వరు పశువు చర్మంపై ఎన్ని వెంట్రుకలుంటాయో అన్ని సంవత్సరాలు వాడిని అలా పరుగులు తీయిస్తారు. వేదమార్గాన్ని వదిలి ఇతర మతాల్ని అవలంబించేవారిని అసిపత్రమనే నరకానికి పంపుతారు. అక్కడ చెట్లకు ఆకులు కత్తుల్లా వుంటాయి. వత్తుగా వున్న ఆ చెట్ల మధ్యకు తోసి వారిని కొరడాలతో కొట్టి బాధిస్తారు. అపరాధం చేయనివారిని దండించినా, విప్రులకు దేహబాధ కలుగజేసినా సూకరముఖమనే నరకంలో పడి బాధలు పడతారు. యమకింకరులు వారిని చెరకు గడలు విరిచినట్లు విరగదీస్తారు.

జంతువులను, పక్షులను వినోదం కోసం వేటాడి చంపేవారు, హింసించేవారు అంధకూపమనే నరకానికి పోతారు. అంధకారమయమైన గోతిలో వారిని పక్షులు, మృగాలు నానాబాధలు పెడతాయి నిద్రపోనివ్వవు. సంపాదించిన దానిని బంధువులకు పెట్టక తానొక్కడే అనుభవించినవాడు క్రిమిభోజనమనే నరకంలో పడతాడు. లక్ష

యోజనాల విస్తీర్ణంగల పురుగుల గుంటలో క్రిములనే తింటూ క్రిమిలా బ్రతుకుతాడు. దొంగతనం వృత్తిగా చేసుకొని బంగారం, రత్నాలు మొదలైన విలువైన వస్తువులను కాజేసినవాడిని ఎర్రగా కాల్చిన ఇనుపగుండ్లతో కొడతారు. కాలిన శూలాలతో పొడుస్తారు. వావివరుసలు తప్పి కామంతో కళ్ళు మూసుకొని వ్యవహరించిన స్త్రీ పురుషులను కర్కశంగా కొరడాలతో కొట్టి ఎర్రగా కాలిన ఉక్కుబొమ్మలకు అతికిస్తారు. జంతువులతో కామసుఖం అనుభవించినవారిని బూరుగచెట్లకు గట్టి చితకగొడతారు. ఆ చెట్లకున్న వాడి మేకులు వారి శరీరాలను గుచ్చి చీలుస్తాయి. వేదవ్యతిరేక మతాన్ని స్వీకరించి ధర్మమార్గాన్ని అణచివేసిన వాడిని వైతరణీనదిలో పారలిస్తారు. ఆ నదిలో మొసళ్ళు మొదలైన జంతువులు వాడిని పీక్కుతింటాయి. మలమూత్రాలు, నెత్తురు, చీము, వెంట్రుకలు, ఎముకలు, మాంసం, క్రొవ్వు కలసివున్న నీటిలో వాడిని ఉడకబెడతారు. బ్రాహ్మణుడు శూద్రస్త్రీలతో కలిసి సిగ్గులేక, ఆచారాలు వదిలి జీవిస్తే వాడిని అలాంటి నీటిలో త్రోసి ఆ మలిన పదార్థాలనే తినిపిస్తారు.

కుక్కలను పెంచి వాటితో వేటాడి జంతువులను చంపి తినేవాడిని కత్తులతో బాణాలతో పొడిచి బాధిస్తారు. యజ్ఞాలపేరుతో పశువులను బలి యిచ్చినవారిని యమభటులు రంపాలతో కోస్తారు. తన భార్యచేత వీర్యాన్ని త్రాగించినవాడిని వీర్యపు గుంటలో వేసి దానినే త్రాగిస్తారు. ప్రభుత్వ అధికారులు, దోపిడీదొంగలు గ్రామాలపై పడి ధనికుల యిళ్ళను దోచుకొని తగులబెట్టితే, విషంపెట్టి ఎవరినైనా చంపితే వారిని నరకంలో కుక్కలు పీక్కుతింటాయి. వజ్రాలవంటి కోరలతో వున్న 720 శునకాలు చుట్టుముట్టి ప్రజాపీడకులను పీడిస్తాయి. లంచం పుచ్చుకొని దొంగసాక్ష్యాలు చెప్పేవాడు, అబద్ధాలు పలికేవారు వీచి అనే నరకంలో నూరు యోజనాల ఎత్తున్న కొండశిఖరంపైనుంచి తలక్రిందుగా త్రోయబడి కేకలుపెడుతూ క్రిందికి దొరులుతారు. రాళ్ళకు కొట్టుకొని శరీరం ముక్కలవుతూ అతుక్కొంటూ వుంటుంది. చావులేకుండా చాలాకాలం అలా బాధలు పడతారు. యజ్ఞం చేసినవాని భార్యతో వ్యభిచరించినా, సోమపానమని చెప్పి అనుదినం మద్యపానంచేసినా అటువంటి వైశ్యులను, క్షత్రియులను యమభటులు రొమ్ముపై తన్ని, కళ్ళు తిరిగిపడేటట్లు కొట్టి వేధిస్తారు. తర్వాత ఉక్కును కరిగించి వాళ్ళ నోళ్ళలో పోస్తారు. నీచవర్ణుడు తపం, జపం, ఆచారం, నిష్ఠ అంటూ వ్యవహరిస్తూ గర్వంతో పెద్దలను అవమానిస్తే వాడు క్షారకర్దమం అనే నరకానికి పోతాడు. అక్కడ వాడిని తలక్రిందుగా బురదలో దింపుతారు. స్వార్థంకోసం పశుబలి, నరబలి ఇచ్చినవారిని యమదూతలు కత్తులతో పొడిచి రక్తం త్రాగుతారు. జంతువులను హింసించి

ఆనందించేవారిని శూలప్రోతమనే నరకంలో శూలాలతో పొడిచి బాధిస్తారు. ఆకలిదప్పులతో అలమటిస్తున్న ఆ పాపులను రాబందులు, గ్రద్దలు పీక్కుతింటాయి. ఇంకను దయాదాక్షిణ్యాలు లేకుండా పలువిధాల జంతువులను పీడించే పాపాత్ములు దందసూకమనే నరకానికి పోతారు. అక్కడ ఐదుతలల సర్పాలు వారిని కరస్తూ భయబాధలకు గురిచేస్తాయి. దొడ్లలోను, ఇళ్ళలోను పశువులను, పక్షులను, జింకలను పెట్టి హింసించేవారు పొగ, మంట, విషం ద్వారా బాధలు అనుభవిస్తారు.

ఇంటికి వచ్చిన అతిథిని కోపంతో చూచినవారి కండ్లను రాబందులు, గ్రద్దలు పీకి తింటాయి. ధనవంతుడైన మానవుడు పరోపకారం, దానధర్మాలు చేయకపోతే సూచీముఖమనే నరకానికి పోతాడు. అక్కడ త్రాళ్ళతో కట్టి, కొట్టి చంపుతారు. రాజా! ఉదాహరణకు కొన్నిచెప్పాను. కాని యమలోకంలో ఇలాంటి నరకాలు వేలసంఖ్యలో వున్నాయి. ధర్మవిరుద్ధంగా ప్రవర్తించేవారిని యమదూతలు పాపానికి తగినట్లు శిక్షిస్తారు. ధర్మమార్గాన జీవించేవారు తప్పక స్వర్గానికి వెళ్ళి సకలభోగాలు అనుభవిస్తారు. పుణ్యపాపాల ఫలం మిగిలివున్నప్పుడు మళ్ళా భూలోకంలో పుడుతుంటారు. ఇదీ నరకలోకాల సంగతి. మోక్షమార్గాన్ని గురించి ముందే చెప్పాను. ఈ బ్రహ్మాండంలో 14 లోకాలు వున్నాయని పురాణాలు పలుకుతున్నాయి. ఈ 14 లోకాలతో కూడిన బ్రహ్మాండం మొత్తం నారాయణుని స్థూలశరీరం. ఈశ్వరుని స్థూలశరీరాన్ని తెలుసుకొన్నవారికి శ్రద్ధాభక్తులు కలిగి సూక్ష్మదేహం కూడా అవగతమవుతుంది.

# ఆరవస్కంధం

ఇన్ని నరకకూపాలు, అందులో పాపులకు ఇన్ని బాధలూ వున్నాయని శుకుడు చెప్పగా విన్న పరీక్షిత్తు ఆశ్చర్యపోయి, అయితే మునీంద్రా! నరకంలో పడకుండా నరుడు బ్రతికే మార్గమేమిటో చెప్పి పుణ్యం కట్టుకోండి, అని అడిగాడు. దానికి శుకుడిలా సమాధానం చెబుతున్నాడు.

నరేంద్రా! మనిషి మనస్సుద్వారా, నోటిమాటద్వారా, కాళ్ళు చేతులద్వారా ఎన్నో పాపాలు చేస్తాడు. ప్రాణం పోయాక నరకానికి పోయి నానాబాధలు పడతాడు. అందువలన యమదూతల పిలుపు వినకముందే, అవసానదశ వచ్చి చిత్తం చెడకముందే, వంట్లో చైతన్యం నిండుగా వున్నప్పుడే చిత్తాన్ని పవిత్రం చేసుకొని, పాపాలు పోయే విధానాలు తెలుసుకొని ఆచరించాలి. పాపాలను సమూలంగా పెరికివేయాలి అని శుకుడు చెప్పాడు.

ఒకొకడు పాపంచేసి పశ్చాత్తాపపడి, తర్వాత మళ్ళీ అదే పాపం చేస్తాడు గదా, అలాంటివాడికి విముక్తి ఎలా కలుగుతుంది? అని పరీక్షిత్తు ప్రశ్నించాడు. అప్పుడు శుకుడు, తెలియక ఒక కర్మచేస్తే దానికి ప్రతి కర్మ చేయాలి, సరియైన హితమైన ఆహారం తీసుకుంటే రోగాలు రావు గదా, అలాగే నిర్మలమైన మనస్సుతో సదాచారపరుడైనవాడు పాపాలను పోగొట్టుకొంటాడు అని చెప్పి ఇలా అన్నాడు. తపం, బ్రహ్మచర్యం, దానం, శమం, దమం, జపం, సత్యం, శౌచం, దయ, ధర్మం వంటి నియమాలతో జీవితం గడిపేవారు అగ్ని అడవులను దహించినట్లు పాపరాశిని నాశనం చేయగలరు.

హరిభక్తిచేత కొందరు పాపాలను కరిగించివేస్తారు. సూర్యరశ్మి సోకగానే మంచు విడిపోయినట్లు భక్తి తీవ్రతవల్ల పాపాలు పోతాయి. తన ధనాన్ని, ప్రాణాన్ని హరికి అర్పించినవారికి, హరిభక్తులను సేవించినవారికి హరికథలు విని ఆనందించేవాడికి, సాధువులకు, సజ్జనులకు, భక్తులకు ముక్తి సులభంగా లభిస్తుంది. భక్తిలేని పుణ్యాలు ఫలించవు. సతతం హరిని స్మరిస్తూ, హరినే మదిలో ధ్యానిస్తూ, హరినే శరణుజొచ్చిన జీవుని యమభటులు ఏమీ చేయలేరు. ఆ జీవుని ఏ పాపాలూ అంటవు. ఇందుకు తార్కాణంగా నీకు అజామిళుని కథను చెబుతాను విను అని శుకుడు పరీక్షిత్తుకు ఆ చరిత్రను వినిపించాడు.

## అజామిళుని కథ

కన్యాకుబ్జం అనే నగరంలో అజామిళుడు అనే బ్రాహ్మణుడు వుండేవాడు. అతనికి జూదమంటే ఆసక్తి. ధనంకోసం దొంగతనాలు కూడా చేసేవాడు. అలాంటివాడికి నియమనిష్ఠలు, సదాచారాలు ఏముంటాయి? యుక్తాయుక్త విచక్షణాజ్ఞానం నశించగా పాపకర్మలన్నీ చేసేవాడు. ఒక దాసీని వరించి పెళ్ళిచేసుకొన్నాడు. దానికి పదిమంది కొడుకులను కన్నాడు. పిల్లలను ముచ్చటగా లాలించి పాలించి పెంచాడు. సంసార వ్యామోహంలో పడి చాలాకాలం భార్యాపిల్లలతో సుఖించాడు. అయితే యవ్వనం ఎంతకాలం వుంటుంది? వయస్సు ముదిరేకొద్దీ శరీరంలో జవసత్త్వాలు తగ్గిపోయాయి. వెంట్రుకలు తెల్లబడ్డాయి. చూపు తగ్గిపోయింది. పళ్ళు వూడిపోయాయి. దగ్గు, ఆయాసం ఎక్కువయ్యాయి. 88 ఏళ్ళు వచ్చాయి. అయినా సంసారంపై భ్రాంతి పోలేదు. చిన్నకొడుకైన నారాయణుడిని చాలా గారాం చేసేవాడు. వాడంటే అజామిళుడికి ప్రాణం. వాడు కనబడకపోతే వుండలేడు ఒక్కక్షణం. మృత్యువు పొంచి వున్నదని ఎరుగడు, మోహబంధాల్ని విడువడు. కొడుకునే తలచుకొంటూ, కొడుకునే పిలుస్తూ గుటకలు

మ్రింగుతున్నాడు. అతని ఆయుర్దాయం ముగియడంతో యమకింకరులు అతడిని సమీపించారు. ముగ్గురు భయంకర రూపాలతో, చేతుల్లో పాశాలతో ఎదురుగా కనిపించగానే అజామిళుడు బెంబేలెత్తిపోయాడు. భయంతో వణుకుతూ, దూరంగా ఆడుకొంటున్న చిన్నకొడుకుని నారాయణా, నారాయణా అని పిలిచాడు. విష్ణువు పేరు వినబడగానే ఆయన సేవకులు, తమ ప్రభువును కష్టకాలంలో కాపాడేందుకు పిలిచిన వారెవరా అని పరుగెత్తుకు వచ్చారు. యమభటులను అడ్డుకొన్నారు.

యమదూతలు తమ ప్రయత్నానికి విఘ్నం కలిగించినవారిని తేరిపారజూచి ఎవరు మీరు? చూడ్డానికి చక్కగా వున్నారు, మీ రూపాలు, ధరించిన భూషణాలు, ఆయుధాలు అద్భుతంగా వున్నాయి, మా ధర్మాన్ని పాటించి మా పని మేము చేసుకొంటూవుంటే ఎందుకు అడ్డం పడ్డారు? అని అడిగారు. అప్పుడు విష్ణుదూతలు, మీరు యమభటులైతే మాకొక సంగతి చెప్పండి, పాపం అంటే ఏమిటి? పుణ్యం అంటే ఏమిటి? మీరు ఎవరిని ఎందుకు దండిస్తారో, ఇతడిని ఎక్కడికి తీసుకొని పోబోతున్నారో చెప్పండి అని అడిగారు. యమభటులు వారికిలా సమాధానం చెప్పారు.

వేదసమ్మతమైన కార్యం ధర్మం. వేదవిరుద్ధమైనది అధర్మం. హరిరూపమే వేదం కాబట్టి అది అనుసరణీయం. ప్రాణికోటికి ప్రకృతే ధర్మాధర్మాలను తెలియజేస్తుంది. కర్మచేసేవాడికి శుభమో, అశుభమో కలగకమానదు. బ్రతికివున్నప్పుడు పుణ్యం పాపం ఎంత చేస్తాడో అంతగా దాని ఫలాన్ని చనిపోయాక అనుభవిస్తాడు. యముడు అంతర్యామి. జీవులుచేసే మంచిపనులు, చెడుపనులు గమనిస్తాడు. వాటికి తగినవిధంగా ఫలాన్నిస్తాడు. ప్రాచీనకర్మలవల్ల వర్తమానదేహం ఏర్పడుతున్నది. కాని పూర్వజన్మ జ్ఞాపకం లేనందున కార్యకారణ సంబంధం తెలుసుకోలేరు. వర్తమాన వసంతకాలంలో పువ్వులు, పండ్లు చూసినవాడు, గత వసంతకాలంలో వున్నవి, రానున్న వసంతకాలంలో వుండేవి వూహించగలిగినట్లే గత జన్మ, భావిజన్మలలో జరిగినవి జరగబోయేవి ఈ జన్మలోని కర్మలను బట్టి వూహించుకోవచ్చు. పూర్వజన్మ సంస్కారబలం వలన గుణస్వభావాలు ఏర్పడి తదనుగుణమైన కర్మలు చేయడం జరుగుతుంది వాటినిబట్టే స్థూల సూక్ష్మ శరీరాలు కలుగుతాయి. ఇదంతా ప్రకృతిపురుషుల కలయిక ఫలితం. పరమేశ్వరుని సేవించితే ప్రకృతి దూరమవుతుంది.

ఈ అజామిళుడు పూర్వజన్మ పుణ్యాన బ్రాహ్మణుడై పుట్టాడు. వేదాలు చదివాడు. నిత్యనైమిత్తిక కర్మలు నిష్ఠతో ఆచరించాడు. ఇంతలో యౌవనం వచ్చింది. గర్వం తెచ్చింది. మీసం మొలిచింది. మనస్సులో ఉద్రేకం పెరిగింది. ఒకనాడు పూలు, పళ్ళు,

దర్భలు తేవడానికి అడవికి వెళ్ళి తిరిగివస్తుండగా ఒక పొదమాటున శృంగారకేళిలో వున్న ఒక జంటను చూశాడు. ఉధృతమైన రతిక్రీడలో వళ్ళుమరచి ఆనందిస్తున్న వారిని చూచిన అజామిళుడికి కామోద్రేకం కలిగింది అప్పటినుంచి అతని మనస్సు మనస్సులో లేదు. స్త్రీలు, శృంగారం, సంభోగవాంఛలతో మనస్సు నిండిపోయింది. దానితో ఆచారవ్యవహారాలు మందగించాయి. నియమనిష్ఠలు నీరుగారిపోయాయి. అక్కడ ఆ పొదరింట్లో చూచిన సుందరిని పొందాలనేదే ధ్యాస. కోరిక తీరకపోవడంతో కోపతాపాలు పెరిగాయి. భార్యను వదిలివేశాడు బంధువులను తిట్టాడు. ఎలాగైతేనేం ఆ సుందరిని పట్టాడు. ఆవిడకు సొమ్ము చాలకపోతే దారులు కొట్టాడు ఆ విధంగా పతనమయ్యాడు. ఆ పడతినే భార్యగా చేసుకొని ఆవిడ కుటుంబాన్ని పోషిస్తూ శుచికి స్వస్తిచెప్పి దుష్టుడయ్యాడు. అందువలన పాపాత్ముడైన ఈ ధూర్తుని మేము నరకానికి తీసుకువెళ్ళడానికి వచ్చాం. అక్కడ ఇతనికి తగిన శిక్ష వేస్తాం అన్నారు యమదూతలు.

మీరు ధర్మదూతలు, ధర్మం తప్పి మాట్లాడుతున్నారు అన్నారు విష్ణుదూతలు. తల్లిదండ్రులే బిడ్డలకు కీడుచేస్తే ఆ బిడ్డలు ఎవరితో మొరపెట్టుకొంటారు? అని అడిగారు. పైగా ఇతడు కోటికి మించి జన్మలెత్తి పాపాలన్నిటిని ప్రక్షాళనం చేసుకొన్నాడు. మరణసమయంలో నారాయణ అని భగవన్నామస్మరణ చేశాడు గదా! హరినామ మహిమ మీకు తెలియదా? బ్రహ్మహత్య, గురుపత్నీ సంగమం, దొంగతనం, మధుపానం వంటి మహాపాతకాలకు కూడా హరినామం విరుగుడు హరినామ స్మరణం ముక్తిదాయకం. పుణ్యకారకం. పుత్రుడిని మనస్సులో పెట్టుకొని పిలిచాడు, దైవాన్ని కాదుగా అంటారేమో! ఏ రకంగా పిలిచినా ఆ ప్రభువుకు సంతోషమే. బిడ్డ పేరుపెట్టి పిలిచినా, ఆటకాయతనంగా పలికినా, చదివినా, పాడినా పరమాత్మను స్మరిస్తే పాపాలు పోతాయి. ఎటువంటి కష్టాలు ఎదురైనా, సంకటాలు సతాయించినా శ్రీహరిని తలిస్తే యముని బాధలు వుండవు. తెలియక తీసుకొన్నా ఔషధం వల్ల రోగం నయమవుతుంది గదా! అలాగే పామరుడు తెలియక పలికినా హరినామం దాని మహిమ అది చూపుతుంది. కాబట్టి నారాయణుని స్మరించిన పుణ్యం ఇతనికి ఎలా వృధా అవుతుంది?

నిరతంబై నిరవద్యమై నిఖిల చిన్నిర్మాణమై నిత్యమై
నిరహంకార గుణాఢ్యమై నియమమై నిర్దోషమైనట్టి శ్రీ
హరి నామస్మరణామృతం బితడు ప్రత్యక్షంబు సేవించెదా
మరణాంతంబున నిట్టి సజ్జనుని ధర్మంబేల వ్యర్థంబగున్.

మేము చెప్పినదానిలో సందేహాలేమైనా వుంటే వెళ్ళి మీ రాజును అడగండి, పొండి అని పలికి విష్ణుదూతలు అజామిళుడి పాశాలను తొలగించి మృత్యువునుంచి రక్షించారు. యమదూతలు ఇక చేసేదిలేక యమలోకానికి తిరిగి వెళ్ళి యమరాజుకు జరిగినదంతా వివరించారు.

అజామిళుడికి యమదూతలు వెళ్ళిపోయినందున భయం పోయి ఆనందం కలిగింది. లేచి నిలబడి విష్ణుదేవుని సేవకులకు నమస్కరించాలని ప్రయత్నిస్తుండగా వారు వెంటనే అదృశ్యమై వైకుంఠానికి తిరిగిపోయారు. అజామిళుడు విష్ణుదూతల మాటలు విన్నాడు. వాటిని మననం చేసుకొని హరిభక్తుడయ్యాడు. తన పాపాలను తలచుకొని విచారించాడు. కులాచారాన్ని కూలద్రోసి శూద్రస్త్రీని చేరదీసి బంధువులలో పరువు పోగొట్టుకొన్నాను. చేయరాని పనులు చేసి పాపాలు మూటగట్టుకొన్నాను. చక్కని భార్యని విడిచి, తల్లిదండ్రులను మరచి స్త్రీ వ్యామోహంలో పడి సర్వం కోల్పోయాను. నరకానికి పోతున్న నన్ను రక్షించిన మహాపురుషులెవరో, ఎక్కడికిపోయారో అని చింతించాడు.

అజామిళునికి అజ్ఞానం తొలగింది. అతని మదిలో జ్ఞానదీపం వెలిగింది. సంసారమోహం నశించింది. హరిభక్తి అబ్బింది. తత్త్వం తెలిసింది. వైరాగ్యం కలిగింది. గంగాతీరానికి వెళ్ళి దైవసన్నిధిలో కూర్చుని యోగాభ్యాసం చేశాడు. సమాధిలో నిలిచి భగవద్ధ్యానంలో లీనమైపోయాడు. తనను మొదట మృత్యువు నుంచి రక్షించిన హరిదూతలను దర్శించి మ్రొక్కాడు. వారు అతనిని దివ్యమైన బంగారువిమానంలో ఎక్కించి వైకుంఠానికి తీసుకొనిపోయారు. కళేబరాన్ని గంగవొడ్డున వదిలి అజామిళుడు ఆ విధంగా ముక్తిపొందాడు అని శుకుడు చెప్పగా పరీక్షిత్తు, మునీంద్రా! తిరిగివచ్చిన దూతలచేత హరినామమహిమ విన్న యమధర్మరాజు వారితో ఏమన్నాడు, యముని ఆజ్ఞ ఇలా విఫలమైన సందర్భం మరేదైనా వుందా? దయచేసి చెప్పండని ప్రార్థించాడు. అప్పుడు శుకుడు ఇలా అన్నాడు.

యమదూతలు అజామిళుడిని తీసుకొనిరావడం ఎందుకు సాధ్యం కాలేదో యముడికి వివరించి, అయ్యా, జీవులకు కర్మఫలాలను పంచిపెట్టేవారు, వారు చేసిన తప్పులకు దండించేవారు ఎందరున్నారో చెప్పండి, మాకు అర్థం కావడంలేదు అన్నారు. ముల్లోకాల్లోను పాపులను శిక్షించే అధికారం నీవొక్కడికే గదా వుంది, నీ శాసనాన్ని ధిక్కరించడానికి ఎవరికైనా శక్తి వుందా? మరి ఇప్పుడిలా ఎందుకు జరిగింది? ఎవరో నలుగురు వచ్చి మమ్మల్ని అడ్డగించారు. మీ ఆజ్ఞప్రకారం క్రూరాత్ముడైన అజామిళుడిని పట్టి తీసుకొని రావడానికి ప్రయత్నిస్తుంటే, మీ పాశాలను పుటుక్కున త్రుంచి, మమ్మల్ని పారద్రోలారు.

మీ రాజుకు పోయి చెప్పుకోండన్నారు. వారెవరో మాకు చెప్పండి అని అడిగారు.

యముడు ఈశ్వరుని ధ్యానించి, మనస్సులోనే భక్తితో నమస్కరించి దూతలతో ఇలా అన్నాడు. నేను గాక నా కన్న ఘనుడైనవాడు మరొకడున్నాడు. కోకలో నూలులా విశ్వంలో లీనమై వుంటాడు. మనం కళ్ళతో చూడడం, కాళ్ళతో నడవడం, అంత ఎందుకు? మనం బ్రతకటమే ఆయన దయవల్ల అనుకోండి. బ్రహ్మ, శివుడు, సూర్యుడు, చంద్రుడు, ఇంద్రుడు, అగ్ని, వరుణుడు, వాయువు, నేను కూడా ఆ మహనీయుని మూర్తిని చూడలేము. అటువంటివాడు విష్ణుమూర్తి. ఆయన తత్త్వాన్ని తెలుసుకోవడం బ్రహ్మాతరం కాదు. హరినామ మహిమవల్లనే అజామిళుడు యమపాశాలను తప్పించుకోగలిగాడు. అందువలన మీరు విష్ణుభక్తుల జోలికి పోవద్దు. హరిపేరు చెబితే పెడమొఖం పెట్టేవారిని పట్టి గట్టిగా కట్టి తీసుకొనిరండి. అంతేగాని భక్తితో శ్రీహరి పాదాలను ఆశ్రయించినవారి వద్దకు వెళ్ళకండి అని యముడు తన భటులకు చెప్పాడు అది విన్న పరీక్షిత్తు ఆశ్చర్యపోయాడు. ఆనందించాడు. తర్వాత శుకుడిని ఇలా అడిగాడు. స్వాయంభువ మనువుకాలంలో సురులు, అసురులు, పక్షులు, పాములు, నరులు మొదలైన జీవరాసుల సృష్టిని గురించి చెప్పారు. దాన్ని ఇంకా విస్తరించి విపులంగా చెప్పండి అన్నాడు. శుకుడు చెప్పనారంభించాడు.

ప్రాచీనబర్హి పుత్రులైన ప్రచేతసులు తపస్సు చాలించి సముద్రంలోనుంచి బయటికి వచ్చి చూడగా భూమి చెట్లతో నిండిపోయి వుండటం చూచి కోపించి గాలిని, అగ్నిని సృష్టించి అడవులను తగులబెట్టుతుండగా చంద్రుడు, ఇదేమిటి వృక్షాలమీద ఇంత కోపమా అని వారితో ఇలా అన్నాడు. ప్రజలను సృష్టించడానికి వచ్చిన ప్రజాపతులు మీరు. వనాలను దహించడం మీకు ఉచితం కాదు. పచ్చని ఈ చెట్టుచేమలు ప్రజలకు, పశువులకు ఆహారాన్ని, ఔషధాలని ప్రసాదిస్తాయి. అందుకోసమే వాటిని పరమేశ్వరుడు సృష్టించాడు. కాబట్టి శాంతించండి. ఈ దహనకాండను ఆపండి. కరుణతో చూడండి. పిల్లలకు తల్లిదండ్రులు, భార్యకు భర్త, ప్రజలకు రాజు రక్షకులు. అలాగే కదలలేని ఈ చెట్లకు కాళ్ళుచేతులున్న వాళ్ళంతా రక్షకులు కావాలి. చెట్లు కూడా జీవకోటిలోనివే. జీవులన్నిటిలోను ఆత్మరూపంలో ఈశ్వరుడున్నాడు. అందువలన నా ప్రార్థన మన్నించి కాలగా మిగిలిన చెట్లనైనా కాపాడండి. వృక్షాలవల్ల పుట్టిన అప్సరసలను పెళ్ళాడి సుఖించండి అని చెప్పి చంద్రుడు వెళ్ళిపోయాడు. ప్రచేతసులు అలాగే అని మారిష అనే ఆ వృక్షకన్యను పెళ్ళాడి దక్షుడిని కన్నారు. ఆ దక్షుడివల్లే భూమి అంతా ప్రజలతో నిండిపోయింది. ఆకాశంలో, నీటిలో, భూమిపై, అడవులలోను తిరిగేవాటిని, అలాగే

పగలు తిరిగేవి రాత్రిపూట తిరిగేవి కూడా దక్షుడు సృజించాడు. నరులను, సురులను, గరుడులను, సర్పాలను, దానవులను, యక్షులను, కిన్నరులను, పక్షులను, పర్వతాలను, వృక్షాలను ఆయన సృష్టించాడు. బహువిధాల, బహుముఖాల, బహురూపాల జీవులను బహులోకాలలో నింపి కూడా దక్షప్రజాపతి సంతృప్తి చెందలేదు. ఇంకా ఏదో లేదనే భావంతో మనస్తాపం చెంది, పరమాత్మను సంప్రదించాలని వింధ్యపర్వతప్రాంతానికి వెళ్ళి అక్కడ అఘమర్షణమనే తీర్థంలో తపస్సు చేశాడు హరిని ప్రసన్నం చేసుకోడానికి హంసగుహ్యం అనే స్తవం చేశాడు. భక్తిపరవశుడై స్తుతిస్తున్న దక్షుడికి భక్తవత్సలుడైన శ్రీహరి ప్రత్యక్షమయ్యాడు. ఎనిమిది చేతులతో, ఎనిమిదిరకాల ఆయుధాలు ధరించి, కిరీటం, కుండలాలు మొదలైన ఆభరణాలు మెరుస్తుండగా నీలమేఘశ్యాముడైన నారాయణుడు గరుడవాహనంపై వచ్చి ఎదర నిలిచాడు.

అలా ప్రత్యక్షమైన పరమేశ్వరుని తేజోమయమైన దివ్యరూపాన్ని చూచి దక్షుడు ఆనందాశ్చర్యాలతో ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. తెప్పరిల్లి సాష్టాంగ దండప్రణామాలు చేశాడు. మనస్సులో మాట చెబుదామంటే నోరాడలేదు. సంతానం కావాలనే అతని కోరికను గ్రహించి, నీ తపస్సు ఫలించింది. ఇక చాలించు అని చెప్పి శ్రీహరి ఇలా అన్నాడు. జీవరాశులన్నింటికి క్షేమం కలుగుగాక. అదీ నా కోర్కె. నీవలన అది నెరవేరింది. బ్రహ్మ, భర్గుడు, ప్రజాపతులు, మనువులు, ఇంద్రులు సర్వజీవకోటి జన్మక్షేమాలకు కారకులు. వారంతా నా చైతన్యశక్తి యొక్క ప్రతిరూపాలే. నాకు తపస్సు హృదయం. విద్య శరీరం. క్రియ ఆకృతి. యజ్ఞయాగాది క్రతువులు అవయవాలు. ధర్మం ఆత్మ దేవతలు ప్రాణాలు. వేదం నా స్వరూపం. సృష్టికి పూర్వం నేనొక్కడనే వున్నాను. బయటా లోపలా వేరొకటి లేదు. సుషుప్తి అవస్థలో జీవుడి మాదిరిగా అవ్యక్తంగా వున్నాను. తర్వాత బ్రహ్మాండం, బ్రహ్మ ఉదయించారు. బ్రహ్మ మిమ్మల్ని సృజించాడు. పంచజనుడనే ప్రజాపతికి కూతురైన నసిక్ని అనే కన్యను నీకిస్తున్నాను. దాన్ని పెళ్ళాడి దానివల్ల ప్రజాసృష్టి చేయవలసింది. నీ తర్వాత ఇదే విధంగా ప్రజలందరు స్త్రీసంగమం ద్వారా బిడ్డల్ని కంటారు. అలా జనాభా పెరుగుతుంది అని చెప్పి హరి అంతర్ధానమయ్యాడు.

తన కోరిక తీరే విధంగా వరం పొందిన దక్షుడు ప్రజాపతి కూతురైన నసిక్నిని వివాహం చేసుకొన్నాడు. ఆమె ద్వారా హర్యశ్వులనే పేరుతో ప్రసిద్ధులైన పదివేలమంది కొడుకులను కన్నాడు. ధర్మశీలురైన దక్షుని పుత్రులు, సంతానాన్ని పొందడం కోసం తండ్రి చెప్పినట్లు తపం చేయడానికి బయలుదేరారు. పడమటి దిశగా సింధునది పోయి సముద్రంలో కలిసే సంగమస్థానంలో వున్న నారాయణ సరోవరానికి వెళ్ళి స్నానం

చేశారు. పవిత్రమైన ఆ సరస్సులో స్నానం చేసి నిర్మలమైన మనస్సుతో ప్రజాసృష్టికోసం తపమాచరించారు. ఒకనాడు నారదుడు వచ్చి, మీరు మూఢుల్లా వున్నారు, ప్రజలను పుట్టించడంవలన ప్రయోజనం ఏమిటి, ఆ తర్వాత మీగతి ఏమవుతుందో ఆలోచించారా? ఈ సంసారంలో వృధాగా ఎందుకు చిక్కుకుంటారు అని ఆత్మజ్ఞానంవల్లనే బుద్ధిమంతులు ముక్తి పొందుతారని ఉపదేశించాడు. హర్యశ్వులు నారదుని మాటలు విని ఆలోచనలో పడ్డారు. క్షేత్రజ్ఞుడనే పేరుతో సూక్ష్మరూపంలో లింగదేహంలో వుంటూ సంసారపాశాలలో చిక్కుకుంటున్న వాడెవడో తెలియకుండా కర్మలు చేస్తే మోక్షం రాదు. ముక్తి కావాలంటే భగవంతుడిని తెలుసుకోవాలి. సంసారంలో పడి సంతానాన్ని వృద్ధిచేసేవాడు జన్మమరణ వలయంనుంచి బయటపడడు. నారదముని చెప్పిందే నిజం అని ఆయనకు నమస్కరించి ముక్తిమార్గాన్ని వెదుక్కుంటూ పోయారు.

కుమారులు తన మాటదప్పి మోక్షపథంలో వెళ్ళిపోయారని, నారదునివలనే ఇదంతా జరిగిందని దక్షుడు తెలుసుకున్నాడు. తన ప్రయత్నం విఫలమైనందుకు చింతించాడు. ఏం చేయాలో పాలుబోక విచారంలో మునిగిన దక్షునివద్దకు బ్రహ్మ వచ్చి వూరడించాడు. మళ్ళీ కొడుకులను కనుమని హితవు చెప్పాడు. అప్పుడు దక్షుడు మళ్ళీ శబళాశ్వులనే పేరుతో వేయిమంది కొడుకులను కన్నాడు. ఆ పుత్రులు తండ్రి అభిమతం తెలుసుకొని సంతానోత్పత్తి కోసం వ్రతం చేపట్టి తపం చేయడానికి వెళ్ళారు. నారాయణ సరస్సులో స్నానం చేశారు. పరబ్రహ్మాన్ని ధ్యానిస్తూ ఉగ్రతపం చేశారు. ఒకే కాలి బొటనవ్రేలిపై నిలబడి కొంతకాలం, చేతులు పైకెత్తి పట్టుకొని కొంతకాలం, సూర్యుని కళ్ళార్పకుండా చూస్తూ కొంతకాలం, నిరాహారులై కఠోరమైన తపస్సు చేశారు. అలా వుండగా ఒకనాడు నారదుడు వచ్చాడు. ఇంతకుముందు చెప్పినట్లే వేదాంతసారాన్ని వినిపించి, నా మాటలు ఆదరించి మీ అన్నలు పోయిన మార్గాన వెళ్ళి ముక్తిని పొందండని ఉపదేశించాడు. దేవర్షి మాటలు వారి మనస్సులో గాఢంగా నాటుకొన్నాయి. శబళాశ్వులు కూడా తమ అన్నలైన హర్యశ్వులు పోయిన దారినే వెళ్ళారు. వెనక్కి తిరిగి రాలేదు.

జరిగినదంతా దక్షునికి తెలిసింది. చాలా మనోవ్యధ చెందాడు. నారదుని మూలాన ఈ అనర్థం జరిగిందని ఆ మునిపై తీవ్రమైన కోపం వచ్చింది. వెంటనే ఆవేశంతో ఆ ముని వద్దకు వెళ్ళి, ఏమయ్యా, అభం శుభం తెలియని పసివాళ్ళకు వేదాంతం నూరిపోసి నాకు దూరం చేస్తావా? నిన్నేం చేస్తానో చూడు, కాచుకో శాపం ఇస్తున్నా అని అరిచాడు. దేవతలకు, రుషులకు, పితరులకు జీవుడు రుణపడి వుంటాడు ఆ రుణాలు తీరకుండా కర్మలు వదిలి వెళ్ళిపోతే ఇహపరాలు రెండూ చెడతాయి. నా పిల్లలకు బుద్ధి చెడగొట్టి

వాళ్ళను ఉభయభ్రష్టులను చేశావు. ఈ పాతకానికిగాను భాగవతోత్తములలో సిగ్గులేనివాడివై, పరువూ ప్రతిష్ఠా పోగొట్టుకొని, ఎక్కడా స్థిరనివాసం లేకుండా తిరుగుతావు. నీ మూలాన స్నేహబంధాలు తెగి కలహాలు పెరుగుతాయి. ఇకనుంచి అనుభవించినవాడికే జ్ఞానోదయం అవుతుంది కాని ఇతరులు చెబితే రాదు. అని ఆగ్రహంతో శాపవర్షం కురిపించాడు. సరే, అలాగే కానివ్వు అన్నాడు నారదుడు. ఆయనకు కోపం రాలేదు. నారదమహర్షి శాంతస్వభావం అలాంటిది.

దక్షుడు తన సంకల్పం విఫలం కావడం, తన సంతానం ఇల్లు విడిచి వెళ్ళిపోవడంతో పరితాపం చెందాడు. విచారగ్రస్తుడైన దక్షుడిని ఓదార్చడానికి బ్రహ్మ దిగివచ్చాడు. నాయనా, విచారించకు. మళ్ళీ సంతానాన్ని పొందే ప్రయత్నం చేయవలసింది అని ఉద్బోధించాడు. దక్షుడు తన భార్యయందు ఈసారి 60మంది కూతుళ్ళను కన్నాడు. 10మందిని యమధర్మరాజుకు, 13మందిని కశ్యపునికి, 27మందిని చంద్రునికి, ఇద్దరిద్దరు చొప్పున భూతుడికి, ఆంగిరసుడికి, కృశాశ్వుడికి, మిగిలిన నలుగురిని తార్క్ష్యునికి ఇచ్చాడు. తార్క్ష్యుని భార్యలు వినత, కద్రువ, పతంగి, యామిని. వీరిలో పతంగికి పక్షులు, యామినికి మిడతలు, వినతకు గరుత్మంతుడు, అనూరుడు పుట్టగా కద్రువకు రకరకాల సర్పాలు పుట్టాయి. చంద్రునికి భార్యలు కృత్తికాది నక్షత్రాలు. చంద్రుడు భార్యలలో ఒక్క రోహిణియందు మాత్రమే మోహితుడైనందున దక్షుడు శాపం ఇచ్చాడు. అందువలన క్షయరోగగ్రస్తుడై సంతానం పొందలేకపోయాడు. తర్వాత దక్షుని దయవలన క్షయరోగం వల్ల పోయిన కళలను తిరిగి పొందాడు. దక్షుని కూతుళ్ళందరికి సంతానం కలిగింది. అలా పుట్టినవారిలో దేవతలున్నారు, రుద్రగణాలున్నాయి, భయంకరులైన ప్రేతలు, పితృగణాలు కూడా వున్నాయి. కశ్యపుని భార్యలలో తిమికి జలచరాలు, సరమకు క్రూరమృగాలు, సురభికి ఆవులు, గేదెలు, తామ్రకు గ్రద్దలు, డేగలు, మునికి అప్సరసలు, ఇళకు చెట్లు, క్రోధవశకు సర్పాలు, సురసకు రాక్షసులు, అరిష్టకు గంధర్వులు, దనువుకు దానవులు 18మంది పుట్టారు. అదితి గర్భాన శ్రీమన్నారాయణుడు గాక 12మంది ఆదిత్యులు పుట్టారు. వారిలో వివస్వంతునకు యముడు, యమి పుట్టారు. మరో ఆదిత్యుడైన త్వష్టకు రచన అనే కన్యకయందు అధికబలాఢ్యుడైన విశ్వరూపుడు జన్మించాడు. అప్పుడు బృహస్పతి దేవతలపై కోపించి వెళ్ళిపోగా వారు విశ్వరూపుని ఆచార్యుడిగా చేసుకొన్నారు అని శుకుడు చెప్పగా పరీక్షిత్తు ఇలా ప్రశ్నించాడు.

దేవతలపై బృహస్పతి ఎందుకు కోపించాడు? అతడు గురుభావంతో దేవతలకు ఏ

విధమైన సహాయం చేశాడు? అని అడగ్గా శుకుడిలా చెప్పాడు. ఒకనాడు ఇంద్రుడు వైభవంగా కొలువుదీరి వున్నాడు. ప్రక్కన భార్య శచీదేవి వుంది. అప్సరసలు నాట్యం చేస్తున్నారు. గంధర్వులు పాడుతున్నారు. దిక్పాలురు, దేవతలు, మునులు కొలువులో కూర్చుని ఆనందిస్తున్నారు. ఆ సమయంలో దేవతలకు గురువైన బృహస్పతి కొలువులో ప్రవేశించాడు. ఐశ్వర్యమదంతో వున్న ఇంద్రుడు లేచి స్వాగతం చెప్పలేదు. రండి కూర్చోండి అని మర్యాద చేయలేదు. తపోధనుడు, పుణ్యాత్ముడు అయిన బృహస్పతి మారుమాట్లాడక తిరిగిపోయాడు.

గురుదేవుడికి అపచారం జరిగింది. ఆయన బాధపడి తిరిగివెళ్ళాడని తెలుసుకొన్న ఇంద్రుడు, అయ్యో పొరపాటు జరిగిపోయిందే అని విచారించాడు. బ్రహ్మ ఇచ్చిన పదవిలో వుండి ముల్లోకాలను ఏలే మహేంద్రుడు ఎవ్వరికీ లేవనక్కరలేదని చెప్పే పండితులు ధర్మవేత్తలు కారు. కాబట్టి ఇప్పుడు ఆయన ఇంటికివెళ్ళి కాళ్ళమీద పడి క్షమాపణ అడుగుతాను అనుకొని గురువుండే గృహానికి వెళ్ళాడు. ఇంద్రుని రాక దూరాన్నుంచే చూచి బృహస్పతి అదృశ్యుడయ్యాడు. ఇంద్రుడు అంతా వెదికి, ఎందునా గురుడు కానరాక, చింతిస్తూ తిరిగిపోయాడు. ఈ వృత్తాంతం అంతా వేగుల ద్వారా తెలుసుకొన్న రాక్షసులు తమ గురువైన శుక్రాచార్యుని ఆశ్రయించి ఆయన దయవలన తమ శక్తిని పెంచుకొని దేవతలమీదికి దాడి చేయడానికి సిద్ధమయ్యారు. రథాలు, గుర్రాలు, ఏనుగులను తీసుకొని విల్లంబులు చేతబూని దానవసేనలు ఆర్భాటంగా దేవతలతో తలపడ్డారు. శుక్రాచార్యుడు నేర్పిన మంత్రాలతో అస్త్రాలు ప్రయోగించి సురసేనలను అదరగొట్టారు. దేవతలు వారి దెబ్బకు తాళలేక పారిపోయారు. సరాసరి బ్రహ్మదగ్గరకు పోయి మొరపెట్టుకొన్నారు. కాపాడు దేవా అని ఆయన కాళ్ళమీద పడ్డారు. బ్రహ్మదేవుడు దేవేంద్రాది ప్రముఖులైన దేవతలను అనునయించి దయతో అభయమిచ్చాడు. పుట్టిననాటినుండి బుద్ధులు చెప్పి లోకాలను ఏలడానికి పట్టంగట్టి పెంచిన గురుదేవుని అవమానించి పాపం చేశారు. సిరిసంపదలతో కళ్ళు మూసుకుపోయి ఆచార్యుడికే అవమానం చేశారు. ఇది గురుద్రోహం. ఆ పాపానికి ఫలితమే మీకిప్పుడు పట్టిన దుర్గతి అని బ్రహ్మ వివరించాడు. మీరు గురువును పోగొట్టుకోగా మీ శత్రువులు గురుకటాక్షంవలన బలవంతులయ్యారు. కాబట్టి మీకిప్పుడు గురు సహాయం కావాలంటే విశ్వరూపుని దగ్గరకు వెళ్ళండి. అతడు మీ కోర్కెలు తీర్చి మీ కష్టాలు పోగొడతాడని బ్రహ్మ ఉపాయం చెప్పగా వారంతా విశ్వరూపుని దగ్గరకు వెళ్ళి ఇలా అన్నారు. మేము నీకు తండ్రులవంటి వాళ్ళం. మాకిప్పుడు నీ సహాయం కావాలి. తండ్రులకు సేవచేస్తే కొడుకులకు పుణ్యం

లభిస్తుంది. మేం కష్టాల్లో వున్నాం. మాకు ఆచార్యుడు కావాలి. నిన్ను ఆచార్యునిగా చేసుకోవాలని నిశ్చయించాం. నీ సహాయంతో శత్రువులను మట్టుబెట్టగలం. చిన్నవాడివైనా నీకు నమస్కరిస్తున్నాం.

దేవతల ప్రార్ధనను మన్నించి విశ్వరూపుడు దేవతలకు పురోహితుడుగా వుండటానికి అంగీకరించాడు. తన సర్వశక్తులూ వొడ్డి సహాయపడతానని మాట యిచ్చాడు. శుక్రాచార్యుడు రాక్షసులకు బోధించినదానికంటె రెట్టింపు బలమైన విద్యను విశ్వరూపుడు ఇంద్రునికి ఇవ్వగా, దానిసాయంతో ఆయన రాక్షసులను ఓడించాడు. అని శుకుడు చెప్పగా, విశ్వరూపుడు దేవేంద్రునికి ఇచ్చిన విద్య ఏమిటో తెలియజేయవలసిందిగా పరీక్షిత్తు కోరాడు.

అప్పుడు శుకుడు, ఓ రాజా! విశ్వరూపుడు ఇంద్రునికి నారాయణకవచమనే మహా మహిమగలిగిన మంత్రాన్ని ఉపదేశించాడు, అది నీకిప్పుడు వివరిస్తానని ఇలా చెప్పాడు విశ్వరూపుడు కాళ్లూ, చేతులూ కడుక్కొని ఉత్తరముఖంగా ఉత్తమమైన ఆసనంపైన కూర్చొని అంగన్యాస, కరన్యాసాలు చేశాడు. తర్వాత పాదాలు, మోకాళ్ళు, తొడలు, పొట్ట, గుండె, రొమ్ము, నోరు, తల అనే ఎనిమిది అంగాల్లో అష్టాక్షరీమంత్రాన్ని న్యాసం చేసి, ద్వాదశాక్షర విద్యచేత కరన్యాసం చేసి మంత్రమూర్తి అయ్యాడు. పరమేశ్వరుని మనస్సులో నిలిపి నారాయణకవచమనే మంత్రాన్ని చదివాడు. గరుడుని మూపుపైన కూర్చొని ఎనిమిది చేతుల్లో రకరకాల ఆయుధాలను ధరించిన మహాపురుషుడు నన్ను దయజూడాలి. నీటిలో వరుణ, మకరపాశాల్లో చిక్కుకోకుండా మత్స్యరూపధారి నన్ను కాపాడాలి. భూమిపైన త్రివిక్రముడైన వామనుడు రక్షించాలి. అడవులలో, మంటలలో, యుద్ధాల్లో నరసింహస్వామే నాకు దిక్కుగుగాక. భూమిని ఉద్ధరించి నీటిపైకెత్తిన యజ్ఞవరాహుడు ప్రయాణపుదారులలో నాకు తోడుగా వుండాలి. కొండలపై తిరిగేటప్పుడు ఆ కోదండరాముడే నాకు కాపు అగుగాక. ప్రవాసంలో ఆ పట్టాభిరాముడే తోడునీడగా నన్ను బ్రోచుగాక. ఇంటాబయటా ఆ దేవదేవుడే నాకు రక్ష అగుగాక అని ఆ కవచాన్ని ఇంద్రునికి ఉపదేశించాడు. ఇంద్రుడు నారాయణ కవచాన్ని ధ్యానం చేసి దాని మహిమవలన దానవులను ఓడించాడు. కాబట్టి ఎవ్వరైనా నిర్మలహృదయంతో నారాయణకవచాన్ని అనుదినం పఠిస్తే, ఎక్కడా అపజయం అనేది వుండదు. రోగాలేవీ రావు సుఖంగా వుంటారు.

ఈ కవచమహిమ ఎలాంటిదంటే, కౌశికుడనే బ్రాహ్మణుడు పూర్వం ఈ మంత్రాన్ని అనుష్ఠానం చేసి స్మశానంలో యోగసమాధిచెంది తనువు విడిచాడు ఒక గంధర్వుడు

గగనమార్గాన వెళుతుంటే అతని నీడ స్మశానంలో వున్న కౌశికుని అస్థిపంజరంపై పడింది అంతే అతడు ఒక అడుగు కూడా ముందుకు వెళ్ళలేక దభాలున భూమిపై పడ్డాడు. ఇక లేవలేక దీనావస్థలో వుండగా వాలఖిల్యుడనే ముని చూచి నారాయణ కవచాన్ని ధరించిన ఎముకలివి, ఆ మంత్రబలంవల్ల నీ కీళ్ళన్నీ బిగిసిపోయాయి. ఈ అస్థులను భక్తితో తీసుకొనిపోయి సరస్వతీనదీజలాలలో కలుపు. శుభ్రంగా స్నానం చేయి. అప్పుడు ఈ బంధాలన్నీ తొలగిపోతాయి అని హితవు చెప్పాడు. గంధర్వుడు ముని చెప్పినట్లు చేసి బంధవిముక్తుడై తన స్థానానికి వెళ్ళిపోయాడు అలాంటిది ఈ నారాయణ కవచం. విశ్వరూపునివల్ల ఇంద్రుడు దీన్ని పొంది సర్వసుఖాలు అనుభవించాడు.

విశ్వరూపునికి మూడు తలలున్నాయి. ఒకదానితో సురాపానం, మరొకదానితో సోమపానం చేస్తాడు. మూడవతలతో అన్నం తింటాడు. దేవతలతో కలిసి యజ్ఞభాగం తీసుకొంటూ దాన్ని దేవతలకు తెలియకుండా, రాక్షసవంశానికి చెందిన తల్లిపై అభిమానంతో రాక్షసులకు పంచిపెట్టేవాడు. ఇంద్రుడికీ విషయం తెలిసింది. కోపం వచ్చింది. తన శత్రువులకు రహస్యంగా యజ్ఞభాగాన్ని చేరవేస్తున్నాడనే కోపంతో విశ్వరూపుని తలలను తెగనరికాడు. సోమపానం చేసే శిరస్సు కపింజలం, సురాపానం చేసే శిరస్సు కలవింకం, అన్నం తినే శిరం తిత్తిరి అయ్యాయి. బ్రహ్మ హత్యాపాపం మూడురకాల పక్షుల రూపం దాల్చి ఇంద్రుని చుట్టుకొనగా ముల్లోకాధిపతి కూడా దాన్ని తప్పించుకోజాలక తలవొగ్గి స్వీకరించాడు. ఆ పాపఫలాన్ని ఒక సంవత్సరం అనుభవించాడు. తర్వాత దాన్ని వదిలించుకోవాలని భూమిని, జలాన్ని, వృక్షాల్ని, స్త్రీలను ప్రార్థించి తన పాపాన్ని తలాకాస్త పంచుకోండని కోరాడు. తమకు వరాలిస్తే అలాగే పంచుకొంటామని చెప్పి తలా ఒక వరం అడిగారు. భూమి తనను ఎవరైనా త్రవ్వి గుంటచేస్తే దానంతట అదే పూడిపోవాలనే వరాన్ని, జలం తనయందు స్నానం చేస్తే పవిత్రులయ్యే వరాన్ని, వృక్షాలు తమను నరికినా మళ్ళీ మొలిచే వరాన్ని, స్త్రీలు తమకు ఎల్లప్పుడు కామసుఖం కలగాలనే వరాన్ని కోరారు. ఇంద్రుడు అందుకు అంగీకరించి వారు కోరిన వరాలు ఇచ్చి తన పాపాన్ని వదిలించుకొన్నాడు. ఆ పాపాన్ని పంచుకొన్నందున భూమిలో కొంతభాగం చవిటినేల అయ్యింది. జలం నురుగు అయ్యింది. చెట్లకు బంక పట్టింది. స్త్రీలకు రుతుస్రావం అయ్యింది.

# వృత్రాసురుని కథ

తన కుమారుడైన విశ్వరూపుని ఇంద్రుడు చంపిన విషయం తెలిసి త్వష్ట దుః ఖించాడు. కోపంతో వుడికిపోయాడు. ప్రతీకారవాంఛ అతనిలో భగ్గుమన్నది. ఇంద్రుడు సామాన్యుడు కాడు. అతనిని సాధించాలంటే అతనికంటె బలశాలి కావాలనే ఉద్దేశంతో త్వష్ట ఒక క్రతువు చేశాడు. ఆ హోమగుండంనుంచి మహాకాయుడొకడు ఆవిర్భవించాడు. పర్వతంలా వున్న అతని దేహం సంజకాంతిలా మెరుస్తున్నది. మీసాలు రాగివర్ణంలో వున్నాయి. తలలోనుంచి అగ్నిజ్వాలలు ఎగిసిపడుతున్నాయి. అతని కళ్ళు మధ్యాహ్న సూర్యుడిలా మండుతున్నాయి. అతడు నోరుదెరిస్తే ఆకాశం అందులోకి వెళ్ళిపోతున్నది. నాలుక చాపి గ్రహ, నక్షత్రాలను నాకి వదులుతున్నాడు. అతని కోరలు దిగ్గజాల దంతాలను చెక్కివేస్తున్నవి. లోకాలను మ్రింగివేసేటట్లు అట్టహాసం చేస్తున్నాడు. వాడి పేరు వృత్రాసురుడు. మహాబలుడు, భయంకరుడు. దేవతలు తమకు రానున్న ముప్పును గ్రహించి వృత్రుని చుట్టుముట్టారు. అస్త్రాలు ప్రయోగించారు. శస్త్రాలు విసిరారు. ఆ రాక్షసుడు వాటినన్నిటిని పట్టుకొని పరపర నమిలి మ్రింగాడు. దేవతల ఆయుధాలేవీ అతడిపై ప్రభావం చూపలేదు. వాళ్ళు భయపడి పారిపోయారు. శ్రీహరే మనకిక శరణమనుకొంటూ దేవేంద్రాది ప్రముఖులు శ్రీమన్నారాయణుని వద్దకు పోయి మొరపెట్టుకొన్నారు. పాలకడలిలో శేషతల్పాన పవ్వళించిన ఆ జగన్నాథుని బహువిధాల స్తుతించారు. తమకు రాక్షసునివల్ల కలిగిన ఆపదను చెప్పి రక్షించుమని వేడుకొన్నారు. వారి భక్తికి హరి సంతసించాడు. భక్తితో నన్ను సేవించేవారి కోరికలు తీర్చడం నా కర్తవ్యం. మీకు శుభం అవుతుంది అంటూ దేవదేవుడైన నారాయణుడు దేవతలకు వృత్రాసురుని ఎలా వధించాలో చెప్పాడు. దధీచి అనే రుషిపుంగవుడున్నాడు. అతని వద్దకు వెళ్ళి ఆయన శరీరాన్ని అడిగి పుచ్చుకోండి. దానిలో అపూర్వమైన తేజస్సు, మహత్త్వం వున్నాయి. పూర్వం అశ్వనీదేవతలకు అశ్వశిరోనామమనే బ్రహ్మవిద్యను ఉపదేశించగా వారు జీవన్ముక్తులయ్యారు. విశ్వరూపునికి నారాయణకవచం ఉపదేశించింది కూడా అతడే. అతడు అతివదాన్యుడు. అడిగింది లేదనడు. మీరు యాచిస్తే తన దేహాన్నిస్తాడు. అతని ఎముకలు నూరు కత్తుల పదునుగల ఆయుధాలు. విశ్వకర్మ వాటిని రూపొందించాడు వాటిలో నా తేజం ప్రకాశిస్తుంది. అవి వృత్రాసురుని శిరస్సును ఛేదిస్తాయి. మీకు మళ్ళీ పోయిన వైభవం తిరిగి వస్తుంది అని చెప్పి హరి అదృశ్యుడయ్యాడు. దేవతలు దధీచి మునివద్దకు వెళ్ళారు.

మునీంద్రా! ఏ లోకంలోను ఎవ్వరూ ఎప్పుడూ కోరని కోర్కె కోరుతున్నాం. ప్రతి ప్రాణీ దేహంతోనే సుఖాలను పొందుతుంది. కాబట్టి ఎవరూ తమ దేహాన్ని వదలడానికి ఇష్టపడరు. కాని మేము మా దేహరక్షణార్థం మీ దేహాన్నిమ్మని అడుగుతున్నాం. అడగగూడనిది అడిగేవాడు నీచుడని అంటారు. కాని ఏం చేస్తాం. మా కర్మ ఇట్లా కాలింది. ఇదంతా దైవకృతం, అని ఇంద్రాదులు వేడుకొన్నారు. అప్పుడు దధీచి నవ్వి, బ్రతకాలనుకొనేవారికి ప్రాణం తీపి గదా! అచ్యుతుడు వచ్చి అర్థించినా తన దేహాన్ని ఇచ్చే దాత వుంటాడా? అని ప్రశ్నించాడు. అదీగాక ఎవరైనా ధనాన్ని అడుగుతారు గాని దేహాన్ని అడుగుతారా? అలా అడిగినా దేహాన్నిచ్చే దాత ఎక్కడైనా వుంటాడా? ఇస్తానన్నా చంపి, ఎముకలు ఏరుకొని పోయే యాచకుడు వుంటాడా? మీరు దేవతలు, లోకాన్ని రక్షించేవాళ్ళు; మీకీ బుద్ధి ఎలా పుట్టింది? మీ ప్రాణం మీకెంత తీపో ఎదుటివారికి వారి ప్రాణం కూడా అంతేనని తోచలేదా? అని అడిగాడు. అప్పుడు దేవతలు, అయ్యా మీరు అందరివంటివారు కాదు. సర్వభూతదయాపరులు. పుణ్యమూర్తులు. దొడ్డబుద్ధిగల దానశీలురు. మీలాంటి వదాన్యులకు ఇయ్యరాని పదార్థాలు వుంటాయా? అని సవినయంగా ప్రార్థించారు. దధీచి అప్పుడు, లోకధర్మం ప్రకారం కొద్దిసేపు అలా ప్రతికూలంగా మాట్లాడాను, మీరు మరోలా అనుకోవద్దు, ఈ శరీరం ఎప్పటికైనా వదిలివేయవలసిందే గదా! ఇప్పుడది మీకు ఉపయోగపడితే అంతకంటె కావాల్సిందేముంది? ఇదేమంత భాగ్యం, తీసుకోండి అన్నాడు. శాశ్వతంకాని ఈ శరీరంతో పుణ్యాన్ని, కీర్తిని ఆర్జించనివాడు పాషాణం కంటె కఠినుడు. ఇతరులకు బాధ కలిగించి చచ్చి కాకులకు, కుక్కలకు ఆహారం కావడం కంటె మీవంటి పుణ్యాత్ముల సేవకు ఉపయోగపడటమే మేలుగదా అంటూ దధీచి యోగమార్గాన శరీరాన్ని విడిచిపెట్టాడు. అప్పుడు ఇంద్రుడు విశ్వకర్మ నిర్మించిన అతని ఎముకలలో నూరు కత్తులతో సమానమై వెలుగుతున్న వజ్రాయుధాన్ని తీసుకొన్నాడు. ఐరావతం ఎక్కి దేవతలందరూ తోడు రాగా వృత్రాసురునిపై దండెత్తాడు. దైత్యులు, దానవులు, యక్షులు, రాక్షసులు కలిసి వృత్రుని నాయకత్వాన దేవతలను ఎదుర్కొన్నారు. దేవతలకు, దానవులకు సంకుల సమరం జరిగింది.

ఈ విధంగా దేవ, దానవులు నర్మదాతీరాన కృతయుగంలో ఆరంభించినపోరు త్రేతాయుగం వచ్చినా ఆగలేదు. వృత్రాసురుని శౌర్యం, భుజబలం, పరాక్రమం అండగా వున్నందున రెట్టించిన ఉత్సాహంతో రక్కసులు మహావృక్షాలని, పాషాణాలని, గిరిశిఖరాలని దేవతలపై వర్షించి ముప్పుతిప్పలు పెట్టారు. దేవతలు తమ బాణాలతో బదులు చెబుతూ దానవులు వేసేవాటిని చూర్ణం చేస్తున్నారు. క్రమంగా రాక్షసుల ప్రతాపం తగ్గిపోయింది.

సురుల ధాటికి అసురులు నిలవలేకపోయారు. పరాజయాన్ని అంగీకరించి పలాయనం చిత్తగించారు. అప్పుడు వృత్రాసురుడు రాక్షస నాయకులను చూచి నవ్వి, విజయమో వీరస్వర్గమో అన్నట్లు పోరాడాలిగాని ఇలా వెన్నుజూపి పిరికిపందల్లా పారిపోవడం పాడిగాదు, నా బలపరాక్రమాలు మీకు తెలియవా, రక్షించడానికి నేనుండగా భయపడి పారిపోవడమెందుకు? అని ధైర్యం చెప్పాడు. ప్రతి ప్రాణికీ చావు తప్పదు. అది రణరంగంలోగాని, యోగసమాధిలోగాని కావాలి. ఈ రెండూగాకపోతే ఆ చావు వ్యర్థమే అని అసురసేనలకు నచ్చచెప్పాడు. ఆ తర్వాత సురవీరులను చూచి హుంకరించాడు. బ్రహ్మాండం బ్రద్దలయ్యేటట్లు గర్జించాడు. ఆ గర్జనకు సూర్యచంద్రులు అస్తమించారు. జగాలన్నీ కలిసిపోయాయి. పర్వతాలు బ్రద్దలయ్యాయి. సముద్రాలు ఇంకిపోయాయి. భూమి కృంగింది. బ్రహ్మ కంపించాడు. సురలు మూర్ఛపోయారు. పిడుగు పడితే ప్రాణులు ఎలా వుంటాయో వృత్రుని పెడబొబ్బకు సురసేనలు అలా వున్నాయి. వృత్రుడు విజృంభించి దేవతలను చెల్లాచెదురు చేయసాగాడు. అప్పుడు ఇంద్రుడు గదాదండాన్ని గుండ్రంగా త్రిప్పివేయగా అది మంటలను చిమ్ముతూ రాగా వృత్రుడు దాన్ని ఎడమచేతితో పట్టుకొని ఇంద్రుని ఏనుగు తలపై కొట్టాడు. తల పగిలి రక్తం కారగా ఐరావతం భయపడి పరుగెత్తసాగింది. ఇంద్రుడు అంకుశంతో దానిని అదుపులో పెట్టి అమృతం త్రాగడంలో తడిసిన చేతితో దాన్ని నిమిరాడు. ఏనుగు గాయం నయమయింది.

ఐరావతాన్ని సేదతీర్చుతూ ఎదురుగా నిలబడిన మహేంద్రుడిని వృత్రాసురుడు చూచి దగ్గరకు వచ్చి తన సోదరుడైన విశ్వరూపుని చంపినందుకు ఇంద్రునిపై పగ తీర్చుకోడానికి ఇదే అదను అనుకొని, పెద్దగా వికటాట్టహాసం చేసి ఇలా అన్నాడు. మా అన్న విశ్వరూపుడు నీకు సద్గురువు. ఆపదలో సహాయం చేసిన పరోపకారి అలాంటి పుణ్యాత్ముడిని లోభబుద్ధితో చంపి పాపం చేశావు. నా ప్రతాపానికి తట్టుకోలేక నవ్వులపాలయ్యావు. ఇప్పుడు నిన్ను శూలానికి గ్రుచ్చి నా పగ తీర్చుకుంటాను. ఎంత నీచుడైనా నీవలె గురువును చంపేవాడుండడు. దయ, ధర్మం, సత్యం లేకుండా బ్రతికే నీలాంటివాడు చస్తే సజ్జనులెవరూ చింతించరు. నీ శవాన్ని కుక్కలు, నక్కలు కూడా ముట్టవు. నిన్నిప్పుడు నా శూలంతో పొడిచి చంపి నీ మాంసాన్ని కుక్కలకు, నక్కలకు తినిపిస్తాను లేదు, నువ్వే నన్ను చంపగలిగితే శూరుల పాదధూళిలో భాగమైపోతాను. సందేహమెందుకు? సమరానికి రా వజ్రాయుధాన్ని ప్రయోగించు. లోభిలా దాన్ని దాచిపెట్టావెందుకు? దధీచి బలం, శ్రీహరితేజం కలిసిన ఆ వజ్రాయుధంతో శత్రువులను గెలువు. విష్ణుతేజం ఎక్కడుంటే విజయం అక్కడ వుంటుంది. భక్తవరదుడైన ఆ సర్వేశ్వరునికి నా నమోవాకాలు.

వజ్రాయుధం నన్ను ఖండిస్తే శరీరాన్ని విడిచి వైకుంఠానికి పోతాను. నేను శ్రీమన్నారాయణుని పాదసేవకుడను. భూమిపైన, స్వర్గపాతాళాలలోను వున్న సంపదలు, భోగాలపై నాకు మక్కువ లేదు. భగవంతుని ప్రసాదమే నాకు పరమానందం అంటూ వృత్రాసురుడు వైకుంఠధాముడిని ప్రార్థించాడు. శూలం తీసుకొని ఇంద్రునిపైకి వురికాడు. ఇంద్రుడు తన వజ్రాయుధంతో ఆ శూలాన్ని ఖండించాడు. దానితోబాటు వృత్రుని భుజాన్ని కూడా నరికాడు. వృత్రుడు ఒంటిచేతితో ఇనుపగుదియతో ఇంద్రుని దవడలు పగులగొట్టాడు. తర్వాత ఏనుగు తలపై కొట్టగా అది బాధతో అటు యిటు పరుగెత్తింది. ఆ తత్తరపాటులో ఇంద్రుని వజ్రాయుధం కూడా చేజారి క్రిందపడింది. ఏనుగుకు తలపగిలింది. నిస్సహాయస్థితిలో వున్న ఇంద్రుడు, యుద్ధధర్మాన్ని పాటిస్తున్న వృత్రాసురుని చూచి సిగ్గుతో తలవంచుకొన్నాడు.

అప్పుడు వృత్రుడు, తొందరలో చేతి ఆయుధాన్ని జారవిడిచినవాడిని, శరణన్నవాడిని చంపడం ధర్మం కాదు, కనుక నువ్విప్పుడు నిర్భయంగా ఆయుధాన్ని తీసుకో అన్నాడు. ఏమిటి చూస్తున్నావు? ఆ వజ్రాయుధంతో నీ శత్రువునైన నన్ను కొట్టు, ఎందుకు సందేహం? చావు పుట్టుకలు దైవాధీనం. మనమంతా ఆ దేవుని చేతిలో కీలుబొమ్మలం. ఆయువు వున్నంతవరకే అన్నీ అనుభవిస్తాం. ఆయువు తీరగానే అన్నిటిని విడిచిపోతాం. జీవుడు స్వతంత్రుడు కాడు. కర్తకాడు, భోక్తకాడు, సుఖం, దుఃఖం, జయం, అపజయం అన్నీ దైవసంకల్పాలే. చంపేదెవరు? చచ్చేదెవరు? జగమంతా ఆ పరమేశ్వరుడితోనే నిండివుంది కాని మరొక వస్తువేదీ లేదు. ఇప్పుడు నన్ను జూడు. ఒక చెయ్యి పోయినా నీ ప్రాణాలు తీయడానికి ఇక్కడ నిలబడ్డాను. జయాపజయాలు ఎవరికి తెలుసు? అందువలన నీ కర్తవ్యం నిర్వహించు అని వృత్రుడు చెబుతుంటే ఇంద్రుడు ఆశ్చర్యపోయాడు. వీడు సామాన్యుడు కాడు భగవత్స్వరూపుడే అని అనుకొన్నాడు. క్రిందబడిన వజ్రాయుధాన్ని చేతికి తీసుకొన్నాడు. అతని ముఖంలో మళ్ళీ పోయిన కళ తిరిగి వచ్చింది. చిరునవ్వు నవ్వుతూ, దానవేంద్రా! నీ మనస్సు తత్త్వజ్ఞానంతో నిండిపోయింది. నీ హృదయం భక్తితో పరిపూర్ణమయ్యింది. విష్ణుమాయ గురించి ఇప్పుడెందుకు చెబుతున్నావు? ఈ రాక్షసరూపం వదలి, పురుషోత్తముని పావనమూర్తిని ధరించు. ఏ తపం చేశావో, ఏ వ్రతం ఆచరించావో, ఇంత శాంతం, ఇంత భక్తి నీకు అలవడ్డాయి అన్నాడు.

ఇంద్రునికి యుద్ధం చేసే ఆలోచన వుందా లేదా? ఇలా మాట్లాడుతున్నాడేమిటి? అనుకొని వృత్రుడు శత్రువుపై విరుచుకుపడ్డాడు. ఎడమచేత్తో ఇనుపగుదియను త్రిప్పుతూ పొలికేక పెట్టాడు. ఎగిరి. గంతేశాడు. దేవేంద్రుని ఎదురురొమ్ముపై కొట్టాడు. ఇంద్రుడు

తన ఆయుధంతో ఆ గుదియను ఛిన్నాభిన్నం చేశాడు. తర్వాత వృత్రుని ఎడమచెయ్యిని నరికాడు. రెండుచేతులూ పోయిన వృత్రుడు ఆకాశంనుంచి జారిపడుతున్న మహాపర్వతంలా కనిపించాడు. వికృతంగా నోరు తెరిచి, ఇంద్రుడిని, అతని ఆయుధాన్ని, వాహనమైన ఐరావతం అనే ఏనుగుని కూడా ఒకేసారి మ్రింగి ఆశ్చర్యపరిచాడు. లోకాలన్నీ చీకటిమయమయ్యాయి. సూర్యచంద్రులు, అగ్ని కూడా కాంతివిహీనమయ్యారు. కడుపులో వున్న సంక్రందనుడు నిబ్బరంగా వున్నాడు. భయపడకుండా నారాయణ కవచాన్ని పఠించాడు. శ్రీహరి కరుణవల్ల ఇంద్రుడు వజ్రాయుధంతో వృత్రాసురుని ఉదరాన్ని పగులగొట్టి, వాహనసహితంగా బయటకు వచ్చాడు. వజ్రాన్ని ప్రయోగించి వృత్రుని శిరచ్ఛేదనం చేశాడు. ఆకాశంలో దుందుభులు మ్రోగాయి. పువ్వులవాన కురిసింది. గంధర్వులు పాటలు పాడారు. అప్సరసలు నాట్యం ఆడారు. మునులు స్తోత్రాలు చదివారు. అప్పుడు వృత్రుని శరీరంనుంచి ఒక దివ్యతేజం బయటికి వచ్చి లోకమంతా చూస్తుండగా, లోకులు చూడని లోకానికి వెళ్ళి విష్ణువులో లీనమయ్యింది. అఖిలలోకాలు ఆనందించాయి. దేవతలు, ఋషులు, పితరులు ఇంద్రునికి చెప్పకుండా తమ తమ స్థానాలకు వెళ్ళారు అని శుకుడు చెప్పగా, అలా ఎందుకు జరిగింది? ఇంద్రునికి చెప్పకుండా దేవతలు ఎలా వెళ్ళారు, అన్నాడు పరీక్షిత్తు. శుక్రుడు సమాధానం చెబుతూ ఇలా అన్నాడు.

ఇంద్రుడు వృత్రాసురుని చంపడంవల్ల అతనికి బ్రహ్మహత్యాపాతకం పట్టుకుంది. ఆ పాతకం రూపం చండాలంగా వుంది. ప్రేగులు బయటికొచ్చేటంత కంపుగొడుతున్నది. క్షయ, కుష్ఠురోగాలతో రక్తం కారుతూ, నెరిసిన తలతో ముడుతలుబడ్డ ముదుసలి దేహంతో అది ఇంద్రుని వెంటబడింది. ఇంద్రుడు పారిపోయాడు. ఆ కారణంగా అక్కడున్నవారంతా ఇంద్రునికి చెప్పకుండా తిరిగి వెళ్ళిపోయారు. వికృతరూపంలో పాపం వెంటబడి తరుముతుంటే తప్పించుకోవాలని ఇంద్రుడు వెళ్ళని ప్రదేశం లేదు. ఆకాశం, భూమి, నాలుగు దిక్కులా తిరిగాడు. ఎక్కడా దాక్కోడానికి చోటు దొరకలేదు. ముసలిది వదలలేదు. అప్పుడు ఈశాన్యభాగానికి పరుగెత్తాడు. అక్కడ పవిత్రమైన మానససరోవరం కనిపిస్తే అందులో ప్రవేశించి ఒక తామరతూడులో దొరబడి, రూపాన్ని కోల్పోయి, భోగాలు వదిలి, బ్రహ్మహత్యాపాతకం ఎలా వదులుతుందా అని చింతిస్తూ వెయ్యేళ్ళు వుండిపోయాడు. పుణ్యప్రదం, పావనం అయిన సరస్సు గాబట్టి చండాలరూపంలో వున్న పాపం అందులో ప్రవేశించలేక ఒడ్డునే కూర్చుంది.

అక్కడ స్వర్గంలో ఇంద్రుడు లేనందున నహుషుడు పాలనాబాధ్యత చేపట్టాడు.

విద్యాబలం, తపోబలం, యోగబలంతో స్వర్గాన్ని పాలిస్తున్న నహుషునికి కొంతకాలానికి అధికారం, ఐశ్వర్యం మదమెక్కించాయి. ఆ మత్తులో యుక్తాయుక్త విచక్షణాజ్ఞానాన్ని కోల్పోయాడు. ఇంద్రుడు లేడుగదా, ఆయన రాజ్యానికి నేనేగదా అధిపతిని, ఆయన ధర్మపత్ని అయిన శచీదేవిని కూడా ఆయన వచ్చేవరకు ఏలుకొంటే తప్పేముంది? అని భావించాడు. శచీదేవిని పిలిచి నాకు భార్యగా వుండు అన్నాడు. పాపం ఆవిడకు ఏం పాలుపోలేదు. నిస్సహాయస్థితిలో వుంది ఆ సాధ్వి. దేవగురువైన బృహస్పతిని సంప్రదించింది. ఆయన ఒక ఉపాయం చెప్పాడు. అప్పుడు ఆవిడ నహుషునితో నీ కోర్కె తీరుస్తాను గాని నువ్వు బ్రహ్మర్షి పల్లకీ ఎక్కి రమ్మంది. అతడు అలా చేయబోగా బ్రహ్మర్షి శపించాడు. కొండచిలువై పుట్టమన్నాడు. ఆ విధంగా నహుషుడు పోగా, బ్రహ్మర్షులు ఆహ్వానించగా ఇంద్రుడు తిరిగి వచ్చాడు. అంతకాలం నారాయణుని పాదపద్మాలను ధ్యానించడంవలన, ఈశాన్యదిశాధినాయకుడైన శంకరుని రక్షణ పొందడంవలన ఇంద్రుని పాపం తరిగిపోయింది అప్పుడు ఇంద్రుడు బ్రహ్మర్షులతో కలిసి పరమపురుషుని ఆరాధించి, అశ్వమేధయాగాన్ని ప్రారంభించాడు. నారాయణుని యజ్ఞంద్వారా తృప్తిపరిచాడు. దానితో అతడు చేసిన పాపం పూర్తిగా నశించింది. యథావిధిగా ముల్లోకాధిపత్యాన్ని స్వీకరించి, భోగభాగ్యాలతో సుఖంగా వున్నాడు అని చెప్పి శుకుడు వృత్రాసురుని కథ ముగించాడు.

పరీక్షిత్తుకు ఇంకొక సంశయం కలిగింది. మునీంద్రా! ఈ వృత్రాసురుని కథ వింటుంటే చాలా అద్భుతంగా వుంది. రజస్తమోగుణాలు నిండిన ఆ వృత్రునికి హరిభక్తి ఎలా కలిగింది? సత్త్వస్వభావులు, నిర్మలాత్ములు, ధర్మపరులు, నిష్ఠగా తపమాచరించేవారు, అమరులు, మునులకు కూడా ఇతనిలో వున్నంత భక్తిలేదే! సకల లోకాలకు హానిచేస్తూ దుష్టుడని పేరుదెచ్చుకొన్నవానికి ఇంతటి భక్తియోగం ఎలా పట్టుబడింది? అంతా నాకు వివరంగా చెప్పండని శుకుడిని అడిగాడు.

## చిత్రకేతుని కథ

అది అర్థం కావాలంటే అతని పూర్వజన్మ కథ తెలియాలి. ఆ చరిత్రను వ్యాస, నారద, దేవల మహర్షులవల్ల నేను తెలుసుకొన్నాను. నీకిప్పుడు చెబుతాను విను అని శుకముని పరీక్షిత్తుకు ఇలా చెప్పాడు. పూర్వం చిత్రకేతుడనేవాడు శూరసేనదేశాన్ని పాలించేవాడు. అతనికి వేలకువేలు భార్యలున్నా సంతానం కలగలేదు. అన్నీ వున్నా ముంగిట చిన్నారులు లేరే అన్న బాధ అతనిని సతాయించసాగింది. అలా పరితపిస్తున్న చిత్రకేతుడి వద్దకు ఒకనాడు అంగిరసుడనే మహాముని వచ్చాడు. రాజు అతనికి అతిథి సత్కారాలు చేశాడు.

అనంతరం అంగిరసుడు రాజుగారి మనస్సు ఎందుకో బాగున్నట్టు లేదని గ్రహించి ఇలా అడిగాడు. రాజా! పంచభూతాలు, మహత్తు, అహంకారం అనే ఏడు, జీవుడిని రక్షిస్తున్నట్లుగా, మంత్రులు, జనపదాలు, దుర్గాలు, కోశం, సైన్యం, మిత్రులు, పరాక్రమం అనే ఏడు ప్రకృతులు నిన్ను రక్షిస్తుండగా, భోగభాగ్యాలతో, భార్యలతో సర్వసుఖాలు నీ సొంతం చేసుకొన్నావు. అందరూ నీకు అడుగులకు మడుగులొత్తుతున్నారు. సర్వమూ చేజిక్కించుకొన్న సార్వభౌముడి ముఖంలో ఎందుకో తేజస్సు లేదు. నీ మనోవ్యధకు కారణం ఏమిటి అన్నాడు. తపస్వులయిన తమకు తెలియనిదేముంది మునివరా? అని రాజు సిగ్గుతో తలదించుకొన్నాడు. అతని మనస్సులోని కోరికను అంగిరసుడు గ్రహించాడు. ఆయనకు రాజుగారిపై దయగలిగింది. రాజుచేత పుత్రకామేష్టి చేయించి, యజ్ఞశేషాన్ని రాజుగారి పెద్దభార్య కృతద్యుతికిచ్చి, నీకు పుత్రుడు పుడతాడు, అతనివలన సుఖదుః ఖాలు అనుభవిస్తావు అని చెప్పి తన దారిన తాను వెళ్ళాడు

కృతద్యుతి గర్భం ధరించి నవమాసాలు నిండినాక ఒక కుమారుని కన్నది. రాజు, మంత్రులు, పరివారం, ప్రజలు పరమానందం పొందారు. చిత్రకేతుడు కొడుక్కి జాతకర్మ చేయించి బ్రాహ్మణులకు భూరిగా దానాలు చేశాడు. బంగారం, వెండి, వస్త్రాలు, ఏనుగులు, ఆవులు, వాహనాలు, గ్రామాలు, భూములు మొదలైనవి విరివిగా ఇచ్చాడు. పుత్రుడిని కన్న కృతద్యుతిపై రాజుగారికి అనురాగం అతిశయించింది. అందువలన మిగతా భార్యలకు .అసూయ కలిగింది. ఈ పిల్లవాడిని కన్నందుకే గదా దీన్ని ఇంతగా ప్రేమిస్తున్నాడు, అని పిల్లవాడిపై ద్వేషం పెంచుకొని వాడికి విషం పెట్టి చంపారు. దాది పిల్లవాడి శవాన్ని చూచి పెద్దకేక పెట్టి, పడి పడి ఏడ్వడం మొదలుపెట్టింది. ఆ రోదన విని తల్లి వచ్చి చూచింది. అమె గుండెలు బాదుకొని పెద్దపెట్టున ఏడ్వసాగింది. ఆ మీదట రాజు కూడా వచ్చి వళ్లూ పైనా తెలియకుండా పొరిలి పొరిలి ఏడ్చాడు. మంత్రులు, సేవకులు, బంధువులు వచ్చి వారు కూడా శోకించారు. అప్పుడు అంగిరసుడు, నారదునితో కలిసి అక్కడకు వచ్చి పిల్లవాడి కాళ్ళదగ్గర పడి వున్న రాజును చూచి ఇలా అన్నాడు.

ఓ రాజా! ఎవరికోసం ఎందుకు ఏడుస్తున్నావు? నీకు ఈ పిల్లవాడు ఏమవుతాడు? భార్యాపిల్లలు పూర్వజన్మలో ఎవరో, ఏ కుటుంబమో ఎవరికి తెలుసు? నదిలో నీటివేగాన ఇసుక ఒకచోట కూడుతుంది, తర్వాత చెల్లాచెదరవుతుంది. అలాగే ప్రాణులు ఎక్కడో పుట్టుతుంటారు. చచ్చి మరెక్కడకో పోయి వేరెవరి యింటనో మళ్ళీ పుడతారు. ఎవరికి ఎవరు ఈ లోకంలో. అంతా విష్ణుమాయగా గ్రహించు. విచారించక స్థిమితంగా కూర్చుని

ఆలోచించు. ఈశ్వరుడు తన మాయచేత జీవులను సృష్టి చేస్తాడు, కాపాడుతాడు, తీసుకెళ్ళిపోతాడు. ఈ కలయికలు విడిపోవడాలు కలలవంటివి. వాటిని నిజమని నమ్మకు. నిత్యమైన, శాశ్వతమైన సత్యం భగవంతుడొక్కడే. ఆ వాసుదేవుని నీ మనస్సులో నిలుపుకో. ఆయన కృపవల్ల నీకు శాంతి లభిస్తుంది అని హితవు చెప్పగా, చిత్రకేతుడు కళ్ళు తుడుచుకొని, ఎవరయ్యా మీరు? దేవతలా, రుషులా? నాకు దివ్యజ్ఞానం బోధించిన మహానుభావులెవరో తెలియజేయండి అని వేడుకొన్నాడు. అప్పుడు అంగిరసుడు నీకు పుత్రుడిని ప్రసాదించింది నేనే, నా పేరు అంగిరసుడు, నాతో వున్న రుషి నారదుడు. పుత్రశోకంలో వున్న నిన్ను అనుగ్రహించి జ్ఞానోపదేశం చేయడానికి వచ్చాం అన్నాడు. పెళ్ళాం, పిల్లలు, ఇళ్ళువాకిళ్ళు, సిరిసంపదలు, రాజ్యవైభవం ఇవన్నీ వస్తూ పోతుండేవిగాని శాశ్వతంగా వుండేవి కావు ఇవన్నీ శోకాన్ని, మోహాన్ని, భయాన్ని ఇస్తాయేగాని సుఖాలనివ్వవు. నిర్మలమైన మనస్సుతో ఆత్మను అన్వేషించు. అదొక్కటే సత్యం, నిత్యం ఆత్మగానిది సృష్టిలో మరొకటి లేనేలేదు. అనేకం వున్నట్లు కనిపిస్తుంది కాని అది వట్టి భ్రాంతి అని తెలుసుకొని మసలుకో అన్నాడు. నారదుడు కూడా హితవు చెప్పాడు. వాసుదేవుడు ప్రత్యక్షమయ్యే మంత్రం చెబుతాను ఏడురాత్రులు పఠించావంటే నీ కోరిక నెరవేరుతుంది అని చెప్పి ఇంకా ఇలా అన్నాడు.

ఇప్పుడీ కుమారుని బ్రతికిస్తాను. దానివల్ల నీకుగాని, ఆ పిల్లవాడికి గాని ప్రయోజనం వుంటుందేమో చూడు అని పిల్లవాడి శవాన్ని చూస్తూ, ఓ జీవుడా! నీవు వెనక్కిరా. ఈ శరీరంలో ప్రవేశించి నీ తల్లిదండ్రుల, బంధుజనుల దుఃఖాన్ని పోగొట్టు. సింహాసనమెక్కి రాజ్యాన్ని పాలించు అన్నాడు. అప్పుడా బాలుడు మేల్కొని ఇలా అన్నాడు. కర్మవశాన పశుపక్షిజాతులలోను, నరజాతి, దేవజాతులలోను పుడుతూ చస్తూ సుఖంలేక తిరుగుతున్న నాకు ఎవరు ఏ జన్మలో తల్లిదండ్రులో ఎలా చెబుతారు? ఒకజన్మలో బంధువులు, మిత్రులు, శత్రువులు, భార్యాపుత్రులు మరొకజన్మలో ఆ సంబంధాలు మారి వావివరసలు వేరవుతాయి. అనేక దేహాలు ధరించే జీవుడికి ఏ దేహమూ నిత్యం కాదు. ఆ దేహంతో వచ్చే సంబంధాలూ అలాంటివే. ఈ బాంధవ్యాలన్నీ నీటిమీద రాతలే. మీకూ, నాకూ ఏ సంబంధమూ లేదు. దుఃఖించవలసిన పనిలేదు అని పలికి ఆ జీవుడు బాలుడిని విడిచిపోయాడు. చిత్రకేతుడు, బంధువులు ఆ మాటలు విని ఆశ్చర్యపోయారు. వాళ్ళకు మోహం పోయింది. శోకం తీరింది. కుర్రవాడికి యమునాతీరంలో అంత్యక్రియలు చేశారు. చిత్రకేతుడు స్నానంచేసి నారదునికి నమస్కరించాడు. నారదముని అతనికి మంత్రోపదేశం చేసి, అంగిరసునితో కలసి బ్రహ్మలోకానికి వెళ్ళిపోయాడు.

చిత్రకేతుడు నారదుడు చెప్పినట్లేచేశాడు. ఆహారం మానివేశాడు సమాధిలో కూర్చున్నాడు. నారాయణరూపమైన విద్యను ఆరాధించాడు. ఏడు రాత్రులు పూర్తి అయ్యేసరికి అతనికి అధికారం, వాహనం రెండూ లభించాయి విద్యాధరులకు అధిపతిగా పదవి, సంచరించడానికి దివ్యవిమానం సమకూరగా మనోవేగంతో ముల్లోకాలు తిరుగసాగాడు. కొంతకాలానికి ఒకచోట పన్నగేశ్వరుడైన అనంతుని దర్శనమయ్యింది ఆనందంతో నమస్కరించాడు. ఆనందబాష్పాలతో అనంతునికి అభిషేకం చేశాడు. తర్వాత బహువిధాల స్తుతించాడు. మూర్ఖులు నిన్ను విడిచి ఐశ్వర్యంకోసం అన్యదేవతలను భజిస్తారు వారిచ్చే సంపదలు ఎల్లకాలం వుండవు. ఏదైనా కోరి, నిన్ను భజిస్తే ముక్తినే పొందుతారు. నారదుడిచ్చిన మంత్రఫలం నేడు నీ దర్శనంవల్ల నాకు చేకూరింది. ఉత్పత్తి, స్థితి, లయకారుడవైన నీకు నమస్కరిస్తున్నాను. ఈ భూగోళం నీ తలమీద ఒక ఆవగింజతో సమానం. వెయ్యితలలుగల నిన్ను బ్రహ్మాదులు గూడా ప్రస్తుతిస్తారు అని చిత్రకేతుడు అనంతుని వినుతించాడు. అప్పుడా అనంతుడు చిత్రకేతుని వివేకాన్ని ప్రశంసించాడు. నారదుడు, అంగిరసుడు నీకు తత్త్వబోధ చేశారు దానివల్లనే నీవు నన్ను చూడగలిగావు. నాపై భక్తి గలిగింది. మనిషి నిత్యం మేల్కొన్న స్థితి, కలలుగనే స్థితి, కలలు కూడా లేకుండా నిద్రించే సుషుప్తి అనే మూడింటిని అనుభవిస్తుంటాడు. ఈ మూడు స్థితులకు విలక్షణమైన నాల్గవస్థితిలో సూక్ష్మమైన ఆత్మను తెలుసుకొంటాడు. వివేకబలంవలన ఇహలోక పరలోక విషయాలపై శ్రద్ధాసక్తులు లేనివాడై ఆత్మజ్ఞానంతో తృప్తిచెందిన మనిషి నాకు భక్తుడవుతాడు. నీవు అలాంటివాడివి కావడంచేత భక్తితో నన్ను స్తుతించి ముక్తుడవయ్యావు అని చెప్పి ఆదిశేషుడు, అనంతస్వరూపుడు అయిన భగవంతుడు అంతర్ధానమయ్యాడు. అనంతుడు వెళ్ళిన దిక్కుకు తిరిగి నమస్కరించి చిత్రకేతుడు తన విమానంలో లోకసంచారానికి వెళ్ళాడు. కొన్ని లక్షల సంవత్సరాలు విమానంలో తిరుగుతూ యోగులను, మునులను, సిద్ధులను, గంధర్వులను, ప్రసిద్ధమైన పర్వతశ్రేణులను, కమనీయ ప్రదేశాలను దరించి ఆనందించాడు. ఏ ప్రొద్దూ భగవంతుడిని మరువకుండా అర్చించాడు.

హరిని భజిస్తూ పరమానందంగా ప్రపంచమంతా తిరుగుతూ కైలాసప్రాంతానికి వెళ్ళి అక్కడ శివుడిని చూశాడు. వెండికొండపై కొలువై వున్నాడు ఆ పరమేశ్వరుడు. ప్రక్కన గౌరీదేవి వుంది. చుట్టూ బ్రహ్మాది దేవతలు సేవిస్తున్నారు. భృంగి నాట్యం చేస్తున్నాడు. డమరు, మృదంగాది వాద్యాలు మ్రోగుతున్నాయి. ప్రమథగణాలు అటూఇటూ తిరుగుతూ ఆర్భాటం చేస్తున్నారు. కొలువంతా సందడిగా, కనులపండువుగా వుంది. పరమశివుడు

భవానిని తన వొళ్ళో కూర్చోబెట్టుకొని కౌగిలించుకొనడం చూచి చిత్రకేతుడు పకపక నవ్వి, బ్రహ్మాది దేవతలు, యోగిపుంగవులు, ప్రమధులు వున్న ఈ సభలో సిగ్గులేకుండా సతీదేవిని కౌగలించుకొని లాలించడమా, ఇది కూడని పనికాదా అని ఆక్షేపించాడు. అది విన్న శివుడు అతనిని ఏమీ అనక నవ్వి వూరుకొన్నాడు. సభలో వున్నవారు కూడా మాట్లాడలేదు. తాను ఇంద్రియాలను జయించాననే అహంకారంతో చిన్నాపెద్దా తెలియకుండా శివుని నిందించిన చిత్రకేతుని జూచి భవాని ఇలా అన్నది.

సిగ్గులేనివారికి, మతిమాలినవారికి కోపించి బుద్ధిచెప్పడానికి వచ్చిన ధర్మమూర్తీ! ఇక్కడ భృగు, నారద, కపిలాది మహర్షులు, వేదవేదాంతపారగులు ఇంతమంది వున్నారు వాళ్ళకు ధర్మం తెలియదనుకొన్నావా? వాళ్ళెప్పుడూ నీలాగు మహేశ్వరుని పరిహాసం చేయలేదే? పాపసంహారుడు, ఆత్మసంసారుడు అయిన ఈశ్వరునికి దోషం ఆపాదించిన పాపికి శిక్ష పడవలసిందే. ఈ పాపానికిగాను నీవు రాక్షసుడవు అవుతావు. ఇంకెప్పుడూ మహాత్ములను నిందించి అవమానించకు అని శపించింది. అప్పుడు చిత్రకేతుడు దిగివచ్చి జగదంబకు దండప్రణామాలు చేసి, చేతులు జోడించి ఇలా అన్నాడు. తల్లీ నీ శాపాన్ని స్వీకరిస్తున్నాను. ప్రాచీనకర్మవల్ల అజ్ఞానంలో పడి సంసారచక్రంలో పరిభ్రమించే జీవులకు సుఖదుఃఖాలు సహజం. జీవునికి స్వతంత్రం లేదు. శాపమైనా, వరమైనా, స్వర్గమైనా, నరకమైనా, కష్టమైనా, సుఖమైనా సమంగా చూచి అనుభవించవలసిందే. అవి అన్నీ కర్మవశాన వస్తుంటాయి, పోతుంటాయి. నాకు శాపభయం లేదు. నా పొరపాటు మన్నించి నన్ను అనుగ్రహించు అని పార్వతీపరమేశ్వరులకు క్షమాపణ చెప్పి వారిని ప్రసన్నులను చేసుకొని చిత్రకేతుడు తన విమానం ఎక్కి వెళ్ళిపోయాడు.

అప్పుడు పరమేశ్వరుడు అందరూ వింటుండగా పార్వతితో ఇలా అన్నాడు. చూశావా పార్వతీ, నారాయణభక్తుల మహిమ. నువ్వు శాపమిచ్చినా అతడు లెక్కచేయలేదు. హరిభక్తులకు స్వర్గం, నరకం సమానమే. నేను, కుమారస్వామి, నారదుడు, బ్రహ్మ, దేవగణాలు, యోగులు, మునులు కూడా ఆ వాసుదేవుని తత్త్వాన్ని తెలుసుకోలేము. చిత్రకేతుడు అతిశాంతుడు పరమభక్తుడు. భక్తులు దేనికీ చింతించరు. నేను కూడా ఆ అచ్యుతుని ఆరాధిస్తాను అని చెప్పగా శైలజ శాంతించింది. కావాలంటే చిత్రకేతుడు ప్రతిశాపం ఇవ్వగల సమర్థుడు. అయినా కోపం తెచ్చుకోక తనకిచ్చిన శాపాన్ని శాంతంగా స్వీకరించాడు. ఇలాటి సాధులక్షణాలు నారాయణుని పాదాలకు నిత్యనీరాజనా లిచ్చే భక్తులకు గాక మరెవరికి వుంటాయి?

శాపహతుడైన చిత్రకేతుడు త్వష్ట చేస్తున్న యజ్ఞంలో దక్షిణాగ్నియందు దానవయోనినుంచి ఉద్భవించి వృత్రాసురుడయ్యాడు పూర్వజన్మ సంస్కారంవల్ల తత్త్వజ్ఞాని అయ్యాడు. ఇంద్రుని చేతిలో మరణించి విష్ణుపదం పొందాడు అని శుకుడు పరీక్షిత్తుకు చెప్పాడు.

యోగీంద్రుడైన శుకమహర్షి నరేంద్రుడైన పరీక్షిత్తుతో ఇంకా ఇలా అన్నాడు. ద్వాదశాదిత్యులలో ఒకడైన త్వష్టవంశాన్ని గురించి చెప్పాను. అతని కొడుకులైన విశ్వరూపుడు, వృత్రాసురుల వృత్తాంతం విన్నావు. ఇప్పుడు త్వష్ట తమ్ముల సంగతి చెబుతాను విను.

సవిత్రుడు ముగ్గురిని పెండ్లాడాడు. పృశ్ని, సావిత్రి, వ్యాహృతి అతని భార్యలు. వారికి అగ్నిహోత్రాలు, పశు, సోమ పంచయజ్ఞాలు పుట్టాయి. భగుడు సిద్ధికయందు మహిమానుడు, విభుడు, ప్రభుడు అనే ముగ్గురు కొడుకులను గన్నాడు. తర్వాత ఒక కూతురు ఆశిష పుట్టింది. ధాతకు నల్గురు భార్యలు - కుహూ, సినీవాలీ, రాక, అనుమతి వాళ్ళు తలా ఒక కొడుకును గన్నారు. విధాతకు క్రియ భార్య. వారికి అగ్ని, పురీష్యాదులు పుట్టారు. వరుణునకు జర్షణియనే భార్యయందు భృగువు, వాల్మీకి జన్మించారు. మిత్రునికి, వరుణునికి ఊర్వశిని చూడగా కామోద్రేకం కలిగి వీర్యపతనం అయ్యింది దానిని కుండలో పెట్టగా దానినుంచి అగస్త్యుడు, వశిష్ఠుడు పుట్టారు. ప్రత్యేకించి మిత్రునికి రేవతియందు మలద్వారాన అరిష్ట, పిప్పలుడు జన్మించారు. శక్రుడికి పౌలోమియందు జయంతుడు, రుషభుడు, విదుషుడు పుట్టారు ఉరుక్రమునికి కీర్తి అనే భార్యయందు బృహచ్ఛ్లోకుడు, అతనికి సౌభగాదులు పుట్టారు. కశ్యప ప్రజాపతికి అదితియందు శ్రీమన్నారాయణుడు అవతరించాడు. ఆ కథ తర్వాత చెబుతాను.

## దైత్యుల జననం

ఇప్పుడు దితి కుమారులైన దైతేయుల వంశాన్ని వివరిస్తాను. దైతేయులలో ప్రహ్లాదుడు, బలి పరమభాగవతులై అందరి మన్ననలు పొందారు దితి కొడుకులు హిరణ్యకశిపుడు, హిరణ్యాక్షుడు అని ప్రసిద్ధిపొందారు. అందులో హిరణ్యకశిపుడికి జంభాసురుని కూతురైన దత్తకు వివాహం కాగా వారికి ప్రహ్లాదుడు, అనుహ్లాదుడు, సంహ్లాదుడు, హ్లాదుడు అనే నలుగురు కొడుకులు పుట్టారు. సింహిక అనే కూతురు కూడా పుట్టింది. ఆ సింహికకు రాహువు జన్మించాడు. రాహువు అమృతం త్రాగినందుకు హరి వాడి శిరస్సును ఖండించాడు. సంహ్లాదుడికి గతి అనే భార్యవల్ల పంచజసుడు పుట్టాడు. హ్లాదుడికి దమని భార్య. వారికి వాతాపి, ఇల్వలుడు పుట్టారు వారిద్దరినీ అగస్త్యుడు

భక్షించాడు. అనుహ్లాదుడికి ఊర్మి అనే భార్యద్వారా పాష్కలుడు, మహిషుడు పుట్టారు. ప్రహ్లాదునికి దేవియనే భార్యయందు విరోచనుడు, అతనికి బలి జన్మించారు. ఆ బలికి నశన భార్య కాగా బాణుడు మొదలైన నూర్గురు కొడుకులు పుట్టారు. ఆ బలి కథ తర్వాత విస్తారంగా చెబుతాను. బాణాసురుడు పరమేశ్వరుని ఆరాధించి ప్రమథగణాలకు నాయకుడయ్యాడు. దితి సంతానంలో మరుత్తులకు బిడ్డలు లేరు వాళ్ళు ఇంద్రుడితో కలిసి దేవత్వం పొందారు అని శుకుడు చెబుతుంటే ఆపి పరీక్షిత్తు ఒక ప్రశ్న వేశాడు. ఇంద్రునికి మరుత్తులు ఆప్తులెందుకయ్యారు? అది కాస్త చెప్పండి అనగా శుకుడు ఇలా అన్నాడు.

దితి కొడుకులందరిని ఇంద్రుడు చంపుతుంటే ఆవిడకు ద్వేషం, రోషం పెల్లుబికి వచ్చాయి. ఏడ్చింది, మొత్తుకొన్నది. ఈ పాతకుడైన ఇంద్రుడిని చంపకపోతే నాకు మనశ్శాంతి లేదు. అందుకోసం సమర్థుడైన ఒక కొడుకుని కంటాను అని నిర్ణయించుకొని భర్తని పలురకాలుగా సంతోషపెట్టింది. భర్త మనస్సును వశం చేసుకొన్నది. కశ్యపప్రజాపతి భార్య ప్రవర్తనకు సంతుష్టుడై, నీకేం కావాలి కోరుకో అన్నాడు. ఇంద్రుడిని మట్టుబెట్టగల శక్తిగల తనయుడిని ఇవ్వవలసిందిగా ఆవిడ తన కోరికను తెలిపింది. కశ్యపుడు ఆమె కోరిక విని ఆశ్చర్యపోయాడు. వరమిచ్చినందుకు విచారించాడు. ఆడవాళ్ళ ఆకర్షణలో పడిన మగవాడి గతి ఇంతే అని బాధపడ్డాడు. ముల్లోకాలను పాలించే ఇంద్రుడిని చంపడం న్యాయమా అని వితర్కించాడు. ఇచ్చిన మాట తప్పకుండా ఏదో ఒక ఉపాయంద్వారా తప్పించుకోవాలని ఆలోచించి, దితిని పిలిచి, సరే నీవు కోరినట్లే ఇంద్రుడిని చంపే కొడుకు నీకు పుడతాడు గాని అందుకోసం నువ్వు ఒక ఏడాదిపాటు నేను చెప్పిన విధంగా వ్రతం చేయాలి. అదెలాగో చెబుతాను విను అన్నాడు. జీవహింస చేయగూడదు. గొంతు పెంచి మాట్లాడకూడదు. కోపం వుండగూడదు అబద్ధం ఆడగూడదు. గోళ్ళు, వెంట్రుకలు కత్తిరించగూడదు. ఎముకలను, అమంగళకరమైన వస్తువులను తాకరాదు. నదుల్లోను. చెరువుల్లోను మాత్రమే స్నానం చేయాలి చెడ్డవారితో సంభాషణ చేయగూడదు. ఒకసారి కట్టిన కోక, పెట్టిన పూలు మళ్ళీ ధరించగూధదు. ఎంగిలిగాని, చండికకు నివేదించిన అన్నంగాని, కుక్కలు, పిల్లులు, చీమలు, కోతులు, పిట్టలు, క్రిములు మూతిపెట్టిన ఆహారంగాని, మాంసాహారంగాని, శూద్రస్త్రీచేతి అన్నంగాని తినగూడదు. దోసిలితో నీళ్ళు త్రాగగూడదు మైలపడగూడదు. సాయంవేళ జుట్టు విరబోసుకోగూడదు. ఎక్కువ మాట్లాడగూడదు. అలంకారం లేకుండా వుండగూడదు. వెలుపల తిరగగూడదు. పడుకొనేముందు కాళ్ళు కడగాలి. తడికాళ్ళతో పడుకోగూడదు.

పడమరవైపు తలపెట్టుకొని, నగ్నంగా, సంధ్యాసమయంలో నిద్రపోగూడదు. ప్రతిదినం తెల్లబట్టలే కట్టాలి. శుచిగా, మంగళకరంగా తూర్పువైపు తిరిగి ఉదయం లక్ష్మీ నారాయణులను ఆరాధించాలి. షోడశోపచారాలతో అర్చన చేయాలి. అగ్నిలో 12 ఆహుతులను అర్పించాలి పదిదినాలు మంత్రానుష్ఠానం చేసి, గంధం, పుష్పం, అక్షతలతో ముత్తయిదువులను పూజించాలి. పతిని సేవించాలి. పుత్రుడు కడుపులో వున్నట్టు భావన చేయాలి. ఈ విధంగా మార్గశీర్ష శుద్ధపాడ్యమినుంచి ఒక ఏడాదిపాటు ఆచరించాలి. పూర్తిఅయ్యాక చివరిదినాన ఉద్యాపనం చేయాలి. పుంసవనం అనే ఈ వ్రతాన్ని ఏమరుపాటులేక చేసినట్లయితే నీవు కోరిన కుమారుడు పుడతాడు అని కశ్యపుడు భార్యకు ఉపదేశించాడు.

దితి భర్త చెప్పినట్లు వ్రతమాచరించడం మొదలుపెట్టింది. ఇంద్రుడు అమె మనస్సులోని కోరికను తెలుసుకొన్నాడు. రహస్యంగా ఆమెను అహరహం సేవిస్తున్నాడు. వ్రతానికి కావలసిన పువ్వులు, పండ్లు, సమిధలు, దర్భలు, ఆకులు మొదలైన సామగ్రిని తెచ్చి యిస్తున్నాడు. పులి లేడికోసం పొంచి వున్నట్లు, వ్రతభంగం చేయాలని ఇంద్రుడు కాచుకొని వున్నాడు. ఆ అమ్మ గర్భంలో పెరుగుతున్న తన పాలిటి మృత్యువును తలచుకొని దిగులు పడుతున్నాడు. ఈ పీడ వదిలించుకోవడం ఎలా అని మధనపడుతున్నాడు. ఇలా వుండగా ఒకనాడు దితి వ్రతనియమాచారాలను చేసి అలసిపోయి ఆదమరచి నిద్రపోయింది. అది సంధ్యాసమయం. కాళ్ళు కడగలేదు. మైలపడివుంది. నియమాలన్నీ మంటగలిపి కర్మవశాన కళ్ళు మూతపడగా నిద్రపోయిన దితిని చూచి ఇంద్రుడు యోగమాయద్వారా ఆమె కడుపులో చొరబడి దేదీప్యమానంగా వెలుగుతున్న పసివాడిని వజ్రాయుధంతో ఏడు తునకలయ్యేటట్లు ఖండించాడు. ఏడుతునకలు ఏడుగురు బాలురై ఏడ్వసాగారు. ఏడవకండిరా అంటూ ఇంద్రుడు మళ్ళీ వాళ్ళను ఒక్కొక్కడిని ఏడుముక్కలుగా చేశాడు. అయినా వాళ్ళు చావలేదు చేతులు జోడించి ఇంద్రునితో, అన్నా, మమ్మల్ని బాధించకు, మేమునీకు తోడబుట్టినవాళ్ళం గదా! మేము నీకు అనుచరులుగా, మరుద్గణమై సేవిస్తాం. మమ్మల్ని కాపాడు. దయచూడు, అని వినయపూర్వకంగా ప్రార్థించారు వారి మాటలకు సంతోషించి ఇంద్రుడు వారిని వదిలి వెళ్ళాడు.

సంవత్సరం లోపలే 49 మంది పిల్లలు దితి గర్భంనుంచి వెలుపలికి వచ్చారు. దితి కళ్ళు దెరిచి చూచింది. ఇంద్రునితో కూడి అగ్నిలా ప్రకాశిస్తున్న కొడుకులను చూచి ఆమె సంతోషించలేదు. ఇంద్రునివైపు దిరిగి, నీకు మృత్యురూపమైన పుత్రుడిని కనాలని

వ్రతం చేశాను నేను సంకల్పించింది ఒక్క కొడుకైతే 49మంది పుట్టడానికి కారణమేమిటి? నిజం దాచకుండా నీకు తెలిసింది చెప్పు, అని అడిగింది. అప్పుడు ఇంద్రుడు వున్నదున్నట్లు జరిగిందంతా చెప్పాడు. అమె వ్రతభంగం చేయడం, తాను వజ్రాయుధంతో కడుపులో బిడ్డను ఖండించడం, అయినా వాళ్ళు చావక పుట్టడం అన్నీ వివరంగా చెప్పాడు. అమ్మా, నువ్వు చేసిన భగవదారాధన మహిమవల్ల ఇలా జరిగింది. నేను చేసిన దోషాన్ని క్షమించు. నన్ను కాపాడు తల్లీ అని ప్రార్థించాడు. దితి ఇంద్రుడిని క్షమించింది. కోపాన్ని వదిలింది. ఇంద్రుడు, దితిపుత్రులైన మరుద్గణాలతో కలసి స్వర్గలోకానికి వెళ్ళిపోయాడు. వాళ్ళకు హవిర్భాగాలు పంచిపెట్టి సుఖంగా వున్నాడు. హరిపేరిట చేసిన వ్రతం, హరివంశాన అమరుల జననం మొదలైన విశేషాలుగల ఈ కథ పఠించినవారికి కర్మ నశించిపోతుంది అని శుకుడు పరీక్షిత్తుకు చెప్పాడని సూతుడు శౌనకాది మహామునులకు వివరించాడు.

## మొదటిభాగం సమాప్తం

# పీకాక్ క్లాసిక్స్ ప్రచురణలు

1. ఐదు సుప్రసిద్ధ ప్లేటో రచనలు

తెలుగు: ఎ. గాంధి • రూ.100

2. ఫెడరలిస్టు పత్రాలు-1 (హామిల్టన్, మాడిసన్, జే)

తెలుగు: ఎ. గాంధి • రూ.75

3. ఫెడరలిస్టు పత్రాలు - 2

తెలుగు: ఆర్వీయార్ • రూ.60

4. అమ్మ (మక్సీం గోర్కి)

తెలుగు: సహవాసి • రూ.50

5. స్వేచ్ఛ (మిల్టన్, పేయిన్, జె ఎస్ మిల్, మార్క్స్, ఆర్వెల్)

సంపాదకుడు: ఎ.గాంధి • రూ.100

6. కాలం కథ (స్టీఫెన్ హాకింగ్)

తెలుగు: ఎ. గాంధి • రూ. 90

7. కాలబిలాలూ పిల్లవిశ్వాలూ (స్టీఫెన్ హాకింగ్)

తెలుగు: ఎం. విజయకుమార్ • రూ.60

8. పోలీసులు (స్లోవోమిర్ రోజెక్)

తెలుగు: ముక్తవరం పార్థసారథి • రూ.15

9. మార్క్స్ ఏంగెల్స్ తొలి ఆర్థిక వ్యాసాలు

తెలుగు: ఎ. గాంధి • రూ.24

10. బంగారం ధర (డేవిడ్ రికార్డో)

తెలుగు: పి ఎస్ ఎం రావు • రూ.20








11. Timeless Poems of Vemana (ద్విభాషా శతకం)

English: P Kameswara Rao • Rs.24

12. Liberty (Milton, Paine, J S Mill, Marx, Orwell)

Editor: A. Gandhi • Rs.100

13. అడవి పిలిచింది (జాక్ లండన్)

తెలుగు: ఎ. గాంధి • రూ.30

14. పోతన భాగవతం-1

తెలుగు: ముసునూరు శివరావుకృష్ణారావు • రూ.75

15. పోతన భాగవతం -2

తెలుగు: ముసునూరు శివరావుకృష్ణారావు • రూ.75

16. ముల్లా నస్రుద్దీన్ కథలు

తెలుగు: కె.బి.గోపాలం • రూ.60

17. జర్మన్ జానపద కథలు (గ్రిమ్ సోదరులు)

తెలుగు: పి.శ్రీనివాసరెడ్డి • రూ.40

18. డాక్టర్ జెకిల్ మిస్టర్ హైడ్ (రాబర్ట్ లూయీ స్టీవెన్సన్)

తెలుగు: కె బి గోపాలం • రూ.25

19. ఆస్కార్‌వైల్డ్ కథలు

తెలుగు: స నా మ • రూ.50

20. ఈసపు కథలు -1

తెలుగు: బి. శాంతారాం • రూ.50

21. కాలయంత్రం (హెచ్ జి వెల్స్)

తెలుగు: కె.బి.గోపాలం • రూ.33

22. సీగల్ (రిచర్డ్ బాక్)

తెలుగు: ఎం. పార్థసారథి • రూ.20

23. జంగిల్ బుక్

తెలుగు: సుబ్బు • రూ.50

24. పంచతంత్రం -1 (విష్ణుశర్మ)

తెలుగు: సహవాసి • రూ.75










25. పంచతంత్రం -2 (విష్ణుశర్మ)

తెలుగు: సహవాసి • రూ.75

30. మృతజీవులు (గొగోల్)

తెలుగు: ఎ. గాంధి • రూ.60

26. వాల్మీకి రామాయణం-1

తెలుగు: ఎం. శివరామకృష్ణారావు • రూ.75



27. వాల్మీకి రామాయణం-2

తెలుగు: ఎం. శివరామకృష్ణారావు • రూ.75

28. ఉత్తర రామాయణం

తెలుగు: ఎం. శివరామకృష్ణారావు • రూ.25

29. రాజశేఖర చరిత్ర (కందుకూరి వీరేశలింగం)

నవీకరణ: సహవాసి • రూ.50



31. రాబిన్‌సన్ క్రూసో (డేనియల్ డెఫో)

తెలుగు: సొదుం రామ్మోహన్ • రూ.55

32. ముగ్గురు బొండాంగాళ్లు (యూరి అల్యోషు)

తెలుగు: టి.పద్మిని • రూ.60

33. షేక్స్‌పియర్ కథలు

తెలుగు: ముక్తవరం పార్థసారథి • రూ.55

34. సేవాసదనం (ప్రేమచంద్)



తెలుగు: కె.వి.రెడ్డి • రూ.60

35. జానపద కథామృతం

తెలుగు: సొదుం రామ్మోహన్ • రూ.60

36. ఈసపు కథలు -2

తెలుగు: సొదుం రామ్మోహన్ • రూ.50

37. డాక్టర్ జెకిల్ మిస్టర్ హైడ్ (బాలల కోసం)

తెలుగు: పురూరవ చక్రవర్తి • రూ.50



పీకాక్ బుక్స్: తెనాలి రామకృష్ణ కవి, రచన: ముత్తేవి రవీంద్రనాథ్, వెల: రూ.500




గ్రంథాలయ
90640
500 044

POTHANA BHAGAVATHAM 1
Rs.75/-

భాగవతాన్ని వేదాలసారం అంటారు. సంస్కృతమూలం వ్యాసమహర్షి రచించగా దాన్ని తెలుగులోకి తెచ్చినవారు పోతన్న, గంగన్న, సింగన్న, నారయ్యలు. భారతాన్ని కవిత్రయం పూరించినట్లే భాగవతాన్ని నలుగురు కవులు సమీకరించారు. అయితే ఇది పోతన్న కృతిగానే ప్రసిద్ధి చెందింది. పోతన భాగవతమే ఈ గ్రంథానికి ఆధారం. పోతన 15వ శతాబ్దికి చెందినవాడంటారు.

నాటి భాగవతాన్ని నేటి భాషలో ఈ తరంవారికి అందించడమే ఈ పుస్తకం ప్రధాన లక్ష్యం. వర్ణనలు వదిలేసి, అచ్చులో 1440 పుటలున్న పోతన్న భాగవతాన్ని కుదించి, దాని సారాన్ని రెండు చిన్నపుస్తకాల రూపంలో పాఠకుల సౌకర్యార్థం వెలువరిస్తున్నాం. ఇందులో చదవడానికీ తేలిగ్గా అర్థంచేసుకొనడానికీ వీలుగా విసంధి పాటించడం జరిగింది. గ్రాంథికాన్ని వదిలి వ్యావహారికాన్ని ఆశ్రయించడం కూడా అందుకే. ఆసక్తి ఉండి కూడా పోతన్న భాగవతాన్ని చదవలేనివారికి సులభంగా విషయం బోధపడేటట్లు వివరించడానికి చేసిన ప్రయత్నమే ఈ ఆధునిక వచన భాగవతం.

PEACOCK CLASSICS